# సాహితీ స్రవంతి

జూలై-సెప్టెంబర్, 2010 సి.పి. బ్రౌన్ అకాడమి రూ॥ 20



**ఈ సంచికలో...**


- అన్నమయ్య కీర్తనలలోని ... జి. శ్రీనివాస్‌రెడ్డి, రవికృష్ణ
- భారతీయ రాశిచక్ర పురాతనత్వం ... సర్ విలియం జోన్స్
- తిరుపతి వేంకటకవుల ... డా॥ రాపాక ఏకంబరాచార్యులు
- కొత్త తెలుగు ఉద్యమంలో ... ఆచార్య ఎస్.ఎస్. ప్రభాకరరావు
- 'నాగబు' ... డా॥ ఈమని శివనాగిరెడ్డి, కె జితేంద్రబాబు
- మా మేస్టారు:భమిడిపాటి ... డా॥ పోరంకి దక్షిణామూర్తి

# సి.పి. బ్రౌన్ అకాడమి

తెలుగుభాష మరియు సంస్కృతీ వికాసాన్ని ప్రోత్సహించాలనే సంకల్పంతో సి.పి. బ్రౌన్ అకాడమి అనే ప్రజాహిత సంస్థ స్థాపించబడింది. అకాడమి ముఖ్య కార్యక్రమాలు :

- తెలుగు వారి పిల్లలకు తమ భాషా, సాహిత్య, సాంస్కృతిక వారసత్వ వైభవాన్ని తెలియజెప్పి, వారు తెలుగు భాషాజ్ఞానం పెంచుకొనేందుకు సులభమయిన సరళమయిన బోధనా ప్రణాళికలు ఏర్పరచడం.
- తెలుగులో మంచి సాహిత్యాన్ని అందించగల రచయితలను ప్రోత్సహించటం; మంచి పుస్తకాలను ప్రచురించడం.
- తెలుగు భాషలో ఉన్న పుస్తకాలను, పత్రికలనూ, పరిశోధన గ్రంథాలనూ సేకరించి 'డిజిటైజ్' చేయటం.
- తెలుగు భాషను వాడుకలో ఉన్న పరభాషా పదాలతో సుసంపన్నం చేసే 'కొత్త తెలుగు' ఉద్యమాన్ని ప్రారంభించి, ప్రోత్సహించడం.
- 'సాహితీ స్రవంతి' అనే త్రైమాసిక సాహిత్య పత్రికను ప్రచురించడం.
- తెలుగు సాహిత్యం లేక భాషకు తమ జీవిత కాలంలో ఎనలేని సేవ చేసిన ప్రముఖులని "తెలుగు భారతి పురస్కారం" (రెండున్నర లక్షల రూపాయల నగదు బహుమతి, బంగారు పతకం మరియు సన్మాన పత్రం) తో సత్కరించడం.

అకాడమి ఆశయ సాధనలో సహకరించేందుకు, ప్రముఖ సాహితీవేత్తలు సభ్యులుగా ఒక సలహా మండలి కూడా ఏర్పరచటమయినది.

C.P. Brown ACADEMY

53, నాగార్జున హిల్స్, పంజగుట్ట,
హైదరాబాద్ – 500 082. ఫోన్ : 040–23423188
email : info@cpbrownacademy.org website :www. cpbrownacademy.org

# సాహితీ స్రవంతి

**సాహిత్య పత్రిక**

సంపుటి : 2 సంచిక : 3

**జూలై - సెప్టెంబర్, 2010**

*గౌరవసంపాదకులు*

**శ్రీరమణ**



## సలహా మండలి

ఆచార్య చేకూరి రామారావు

ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య

డా॥ అక్కిరాజు రమాపతిరావు

ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి

శ్రీమతి అబ్బూరి ఛాయాదేవి

ఆచార్య జొన్నలగడ్డ వేంకటేశ్వరశాస్త్రి

శ్రీ మల్లాది హనుమంతరావు



## చందా

❖ విడి ప్రతి :రూ. 20 / US $ 6

❖ సంవత్సర చందా (కొరియర్ చార్జీలతో) 1 సం॥ :రూ. 120 / US $ 20

2 సం॥ :రూ. 230 / US $ 38

3 సం॥ :రూ. 330 / US $ 55

చందా చెక్/డిడి ద్వారా పంపవచ్చు. చిరునామా:
సి.పి. బ్రౌన్ అకాడమి, 53, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్ - 500 082.
ఫోన్ : 040-23423188

Edited, Printed and Published by
H. Sitaram on behalf of
C.P. Brown Academy,
53, Nagarjuna Hills, Punjagutta,
Hyderabad-500 082, India.
Printed at ICIT Software Centre Private Ltd.
Plot No. 165 & 166(P), Phase-V, IDA,
Jeedimetla, Hyderabad - 500055, India.


# పత్రం పుష్పం

కొన్నాళ్లుగా, కొన్నేళ్ళుగా ఎక్కడ చూసినా ఒకే మాట - "తెలుగు, మన తెలుగు, మాతృభాష తెలుగు ఎక్కడా వినిపించడంలేదు. తెలుగు చదవనూ రాయనూ రాకుండానే రెండోతరం జనజీవన స్రవంతిలోకి వచ్చేసింది. ఇలాగే ఉపేక్షించి, ఊరుకుంటే తెలుగు మృత భాష అయిపోతుంది" అని...తమిళ, కన్నడ ఇతర లోకల్ లాంగ్వేజిల గురించి కూడా ఇలాంటి వ్యాఖ్యలే వినిపిస్తున్నాయి. మాతృభాషలు మృతభాషల అంచుల్లో ఎందుకు ఉన్నాయో అందరికీ తెలుసు. బహుకృత వేషాలన్నీ పొట్టనింపుకోడానికే. ఈ సత్యాన్ని ధైర్యంగా అందరం అంగీకరించాలి.

పిట్స్‌మన్ రూపొందించిన షార్ట్‌హాండ్ అందరూ ఎందుకు నేర్చుకోలేదు? ఆనాడు టైపు చేయడం విద్యావంతులంతా ఎందుకు నేర్వలేదు? అవసరం లేకపోతే చివరికి సైకిల్ తొక్కడం కూడా మనకి వద్దనుకుంటాం. దొరల పాలనలో అందరి నెత్తినా ఇంగ్లీషు రుద్దేస్తున్నారని అలజడి చేశారు. మెకాలే చదువులన్నారు. చాకిరీ చేయించుకోడానికి ముఖ్యంగా గుమస్తా గిరికి అనువైన సిలబస్‌ని ప్రవేశపెట్టారని గతంగురించి అనుకుంటూ ఉంటారు. ఆ మాటకొస్తే బ్రిటిష్‌వాళ్లు కూడా తెలుగు నేర్చుకున్నారు. గ్రామస్థాయిలో "లోకల్" అని ఒక చిరుద్యోగి ఉండేవాడు. అతను కంపెనీకి నమ్మినబంటు. వాళ్లు అధికంగా తెల్లతోలువారే ఉండేవారు. ఆ లోకల్స్ కోసం మొట్టమొదటగా కేవలం పదహారు పేజీలతో తయారుచేసిన పుస్తకమే బాలశిక్ష. అదే క్రమక్రమంగా పెరిగి సూక్ష్మవివరాలు పెంచుకుంటూ స్థూలమైంది.

న్యూస్‌పేపర్స్‌లో, టివి ఛానెల్స్‌లో వస్తున్న భాషని సంకర తెలుగు అంటున్నారు. అంకుల్, ఆంటీ సంస్కృతిని ప్రతివారూ గేలి చేస్తున్నారు. ఆటో అంకుల్, వెజిటబుల్ అంకుల్, చెత్తంకుల్ లాంటి పిల్లల మాటల్ని ఎగతాళి చేస్తున్నాం. గ్రాంథికం నుంచి వ్యవహారికానికి రావడం ఒక దశ. నిజానికి తెలుగు భాషకది మహర్దశ. ఇప్పుడు మళ్లీ కొత్త జనరేషన్లు దిగాయి. దేశాలు దగ్గరైనాయి. టెక్నాలజీ ఉపయోగంలోకి వచ్చి, సామాన్యుడి చేతికి అందింది. పూర్వంలా ఏ గూటి చిలక ఆ గూటి పలుకు పలికే స్థితి ఇప్పుడు లేదు. చిలకలు గూళ్లు మారుతున్నాయి. వందలాది ఉపగ్రహాలు రాత్రింపగళ్లు దేశాలమధ్య వారధులై, మనిషికి వెట్టిచాకిరీ చేస్తున్నాయి. ఫ్రెంచ్, లాటిన్, జాపనీస్ భాషలు వస్తే నెలకి అరవైవేలు జీతం ఇస్తామంటారు అంతర్జాతీయ బాంకింగ్ సౌకర్యం కల్పించేవారు. అప్పుడు మనం మన పిల్లలకి ఆ భాషలు నేర్పించాలని తహతహలాడతాం. త్రాచుపాముల్ని పట్టుకోవడం, వాటిని ఆడించడం తెలిస్తే- అమెరికాలో మంచి డిమాండ్ ఉందని కచ్చితంగా తెలిస్తే పిల్లల్ని స్నేక్స్ అండ్ స్నేక్‌సైకాలజీ కోర్సుంటే తక్షణం చేర్పించేస్తాం.

వృత్తి విద్యలు ఎందుకుపోయాయి? ప్రతివృత్తి ఒక భాష అనే సత్యాన్ని మనం మరువకూడదు. కేవలం మాట్లాడేదే భాషకాదు. కుండ చేయడం ఒక వృత్తిపరమైన భాష. దానికి వ్యాకరణం ఉంటుంది, లిపి ఉంటుంది, దస్తూరిప్రాముఖ్యత ఉంటుంది, పింగాణి, ప్లాస్టిక్ లాంటివి వచ్చి మట్టికుండని దెబ్బతీశాయి. అలా ఎన్నో భాషలు కనుమరుగైనాయి. భాష అనేది భావ వ్యక్తీరణకేనని గుర్తు చేసుకోవాలి. పాండితి ప్రకర్ష జోలికి పోకుండా, నవతరం హాయిగా మాట్లాడే అవకాశం యిద్దాం. అప్పుడు తెలుగు కొత్త చిగుళ్ళు వేస్తుంది. ఒకే చేలో రెండుమూడు పంటలు కలిపి పండిస్తారు. అప్పుడు ధాన్యాలు కొంచెం కలగలుస్తాయి. కందులు మినుములు సజ్జలు రాగులు కలిస్తే పర్వాలేదు. పేలుడు సంభవించదు. కలిపి తిన్నా ఏమీ ముంచుకుపోదు. మరీ అంతగా వైద్యానికి కావాలనుకుంటే కాసిని జాగ్రత్తగా వేరు చేసుకుంటారు.

కొత్త తెలుగుకి సి.పి. బ్రౌన్ అకాడమి శ్రీకారం చుట్టింది. పరభాషా పదాలను కలిపి మాట్లాడితే పర్వానై-వడ్లగింజలో బియ్యపు గింజ!

**శ్రీరమణ**

సాహితీ స్రవంతి

## వచ్చే సంచికలో ......

- రాయలమ్మ (నవపారిజాతం) ... ఎస్. మునిసుందరం
- కవిబ్రహ్మ తిక్కన ... నాగళ్ల గురుప్రసాదరావు
- పంజరం (కథాకస్తూరి) ... అమరేంద్ర

ఇంకా యితర శీర్షికలు.



C.P. Brown ACADEMY

# తరంగాలు ................


| | |
|---|---|
| ❖ పత్రం పుష్పం | |
| ❖ లేఖాస్రవంతి | 5 |
| ❖ ఆచార్య దేవోభవ | 6 |
| ❖ అన్నమయ్య కీర్తనలలోని కలశాపురం ఎక్కడ?... జి శ్రీనివాసరెడ్డి, రవికృష్ణ | 7 |
| ❖ భారతీయ రాశిచక్ర పురాతనత్వం ... సర్ విలియం జోన్స్ | 12 |
| ❖ తిరుపతి వేంకటకవుల సమస్యాపూరణ చమత్కారము... డా॥ రాపాక ఏకాంబరాచార్యులు | 15 |
| ❖ ఆరుద్రకి నచ్చిన పద్యాలు ... సం॥ | 19 |
| ❖ కవిత్రయ భారతం-శ్రీకృష్ణుని రాజకీయ పాత్ర ఒక అధ్యయనం .... ఆచార్య కాత్యాయనీ విద్మహే, డా॥ జి. కిషన్‌ప్రసాద్ | 20 |
| ❖ ముసలితనపు అనుభవం ... చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి | 25 |
| ❖ చిలకరంగు విమానం (కథా కస్తూరి) ... తాతా కృష్ణమూర్తి | 27 |
| ❖ సహధర్మచారిణి (నవపారిజాతం) ... టి. శ్రీవల్లీ రాధిక | 33 |
| ❖ ఆచార్య కొలకలూరి ఇనాక్ గారితో 'ముఖాముఖి' ... డి. సుజాతాదేవి | 40 |
| ❖ గోపీచంద్ నవలలు-కథనశిల్పం ... ఆచార్య పర్వతనేని సుబ్బారావు | 47 |
| ❖ కొత్త తెలుగు ఉద్యమంలో మనమూ పాలుపంచుకొందాం! ... ఆచార్య ఎస్.ఎస్. ప్రభాకర రావు | 52 |
| ❖ 'నాగబు' తొలి తెలుగు పదం కాదు! ... డా॥ ఈమని శివనాగిరెడ్డి | 54 |
| ❖ జాతీయోద్యమకవిత్వం-ప్రారంభదశ ... డా॥ మద్దాళి సుబ్బారెడ్డి | 56 |
| ❖ మా మేస్టారు : భమిడిపాటి కామేశ్వరరావుగారు ... డా॥ పోరంకి దక్షిణామూర్తి | 62 |
| ❖ చెల్లీ (అలనాటి కవిత) ... తుమ్మల వెంకట్రామయ్య | 67 |
| ❖ స్థిత ప్రజ్ఞత వైపుకు (కొత్త కవిత) ... మహమ్మద్ ఖాన్ | 68 |
| ❖ విశ్వనాథ సంగీత సాధన... జి.కృష్ణ | 69 |
| ❖ సమీక్షా స్రవంతి | 71 |
| ❖ పుంభావ సరస్వతికి సరిజోతలు ... కొంపెల్ల వెంకట్రావు | 74 |
| ❖ పద్య స్రవంతి | 75 |



'సాహితీ స్రవంతి'లో ప్రచురించిన రచనలు ఆయా రచయితల అభిప్రాయాలు మాత్రమే. సి.పి. బ్రౌన్ అకాడమి వాటితో ఏకీభవించనవసరం లేదు.



సాహితీ స్రవంతి
సి.పి. బ్రౌన్ అకాడమి,
53, నాగార్జున హిల్స్, పంజగుట్ట,
హైదరాబాద్ - 500 082. (ఇండియా)

## లేఖా స్రవంతి

'సాహితీ స్రవంతి' విశ్లేషనాత్మకమైన, విమర్శనాత్మకమైన వ్యాసాలు కలిగి సాహితీ శోధకులకు మార్గం చూపేదిగా ఉంది. మీ సాహిత్య పత్రిక విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను.

బి. జగన్నాథ్,

భువనగిరి

* * * * *

మొన్నొకచోట చదివాను 2050లో మనదేశంలో ఒక అయిదు భాషలే మిగుల్తాయని, అందులో తెలుగు ఉండదని! ఆ దౌర్భాగ్యం మనకి రాకుండా మీలాంటి వారు ఇటువంటి సాహితీసేవ, తెలుగు భాషకి ముఖ్యంగా చెయ్యడం ఎంతో ఆనందం కలిగిస్తోంది. మానాన్న గారివల్ల నాకింత కొంచెమైనా తెలుగు వచ్చును.

బి. బాలాదేవి,

భువనేశ్వర్

* * * * *

పత్రిక ఏప్రిల్-జూన్ 2010 సంచికలో "బహుమతి పద్యాలు" బావున్నాయి. అయితే, "మునిసుందరం" గారి రచన పద్యచ్ఛందస్సులో లేదు. రచయిత కూడా ఏ ఛందస్సులో రాసినారో సూచించలేదు.

అది నాలుగు లైన్లలో గ్రాంథిక భాషలో ఉండి, పద్యంలాగా భ్రమింపచేసే వచన కవిత -గమనించగలరు.

పి. రమణి,

చెన్నై

* * * * *

'సాహితీ స్రవంతి' క్వార్టర్లీ చదివాను. భాష, పరిశోధన మొదలైన అంశాలపై విలువైన వ్యాసాలను ప్రచురిస్తున్నారు. ప్రస్తుతం యిటువంటి పత్రికలు మచ్చుకికూడా కనిపించడంలేదు. సి.పి. బ్రౌన్ అకాడమి ప్రచురిస్తున్న పుస్తకాలు కూడా అమూల్యమైనవే. వివిధ రంగాలలో కృషిచేసిన ఎందరో మహానుభావుల గురించి యీ తరంవారికి తెలియదు. మా తరం వారికి తెలిసినా, వారిని మరొక్కసారి సంస్మరించుకోవడానికి మీరు అవకాశం కల్పించారు. అందుకు ధన్యవాదాలు. సాహితీ స్రవంతిలో వీలైనంతవరకు సరికొత్త రచనలను ప్రచురిస్తే మరింత సమకాలీనత వుంటుంది. అమలు చేయ ప్రార్థన.

కుందుర్తి విజయలక్ష్మి,

ఒంగోలు

* * * * *

'సాహితీ స్రవంతి' ఏప్రిల్-జూన్ 2010 సంచిక చూడగానే చాలా సంతోషం కలిగింది. తెలుగువారు గర్వింపదగ్గ పత్రికను తెస్తున్న సి.పి. బ్రౌన్ అకాడమి వారికి నా హృదయపూర్వక అభినందనలు.

చోడిశెట్టి శ్రీనివాసరావు,

కాకినాడ

* * * * *

సి.పి. బ్రౌన్ అకాడమి వారు సాహితీ స్రవంతి వాహికగా కొత్తతెలుగు పుద్యమానికి పూనుకోవడం బావుంది. కాని యిప్పటికే ఒక సంకర తెలుగు వంకర తెలుగు రాజ్యమేలుతోంది. మీరు దానికి ఆమోద ముద్ర వేసి, యిదే తెలుగు భాష అని గుర్తించనున్నారా?

ఔను, గుడ్డికన్నా మెల్ల మేలు. సొంతం మోడువారి చచ్చిపోయేకన్నా, కొత్త రెమ్మలు వేయకున్నా పచ్చగా వుంటే పదివేలు. మీ ప్రయత్నాన్ని అనివార్య పరిస్థితుల్లో అందరూ ఆమోదించక తప్పదనిపిస్తోంది. "వేషభాషలు" అంటాం. వేషం మారింది. భాష మారింది. ప్రభుత్వాలు అక్రమ పనులను అరికట్టలేనప్పుడు "రెగ్యులరైజ్" చేసేస్తూ వుంటారు. ఇది కూడా అలాంటిదే. కోట్లాది రూపాయల స్టాంప్ పేపర్లు నకిలీవి దేశం మీదికి వదిలినప్పుడు ప్రభుత్వం ఏమి చేసింది. నిజానికి వాటిపై రాసిన డాక్యుమెంట్లు చెల్లవు. కాని కదిలిస్తే దారికొచ్చే దారి లేదు. అందుకే వదిలేసింది. కనీసం మీ కొత్తతెలుగు అయినా వర్ధిల్లాలని ఆశిస్తున్నా.

కోటగిరి రామనాథం,

మచిలీపట్నం

* * *

'సాహితీ స్రవంతి' పత్రిక చాలా బాగున్నది. మొదటి నుంచీ చివరివరకూ ఆసక్తిగా, స్ఫూర్తిదాయకంగా ఉంది. పూర్వపు సాహిత్య విలువలనూ, కవులను, పండితులనూ, రచయిత(త్రు)లను ఇప్పటి పాఠకులకి పరిచయం చేస్తున్నారు. బాగుంది, ఆనందంగా ఉంది. అభినందనలు.

సి. జయా బాలకృష్ణ,

హైదరాబాద్

●



# ఆచార్య దేవోభవ

**గొప్ప తాత్త్విక చింత, తత్త్వచేతన నిండిన మహామనీషి సర్వేపల్లి రాధాకృష్ణయ్య. ప్రపంచమంతా సర్వేపల్లిని సన్నిహితంగా గమనించింది. గుర్తించి, గౌరవించింది. మన వేదభూమిలో రకరకాల తాత్త్విక సిద్ధాంతాలు అంకురించి, విస్తరించాయి. కొన్నాళ్లు బౌద్ధం రాజ్యమేలింది. తరువాత శంకరుని అద్వైత వాదం ఈ నేలను ఆవరించి, హిందూదేశంగా ప్రసిద్ధిచెందింది. ఒకనాడు దమ్మపదాలతో ప్రతిధ్వనించిన ఆరామాలు మట్టిదిబ్బలుగా, చరిత్రకు సాక్ష్యాలుగా మిగిలాయి.**

ఆధునిక భారతీయ వేదాంత ధోరణులకువస్తే – తిలక్, మాలావ్యా లాంటి ప్రముఖులు ప్రాచీన ప్రతిపాదనలకు భాష్యకారులుగా తమ రచనలతో ప్రజని ప్రభావితం చేశారు. అరవిందఘోష్, జిడ్డుకృష్ణమూర్తి శంకరుని వాదాలకు నవ్యత జోడించి ముందుకు నడిపించారు. రవీంద్రనాథఠాగోర్‌కి విశ్వకవిగా ముద్రపడింది. కాని ఆయన మార్మిక భావాలు నిండిన హృదయవాది. ఎమెన్ రాయ్ లాంటివారు సంస్కరణ వాదులుగా తమ పద్ధతిని రూపొందించుకున్నారు. వీరికి ఆద్యుడు రాజారామమోహన్‌రాయ్. సతీసహగమనంలాంటి అమానుష ఆచారాన్ని రూపుమాపడానికి వారు నాస్తికత్వాన్ని ప్రచారం చేయాల్సివచ్చింది. స్త్రీని ఒక మనిషిగా కూడా యీ సొసైటీ గమనించని రోజుల్లో, వారు మూఢ భావాలపై తిరగబడ్డారు. విజయాన్ని సాధించారు. సహగమనాలు, బాల్యవివాహాలు, విడోమ్యారేజ్‌లు–వీటిలో పరిహరించాల్సినవాటిని హరించారు. ప్రోత్సహించాల్సినవాటిని స్వాగతించారు. తర్వాత వేదాంతిగా కాకుండా దేశాభిమానిగా వచ్చిన మహాత్ముడు మోహన్‌లాల్ కరమ్‌చంద్‌గాంధి. సత్యాహింసలు ఆయనకు రెండుకళ్లు. సత్యాగ్రహాలతో రక్తం చిందకుండా, ఒక పెద్దదేశంతో పోరాడి, భారత్‌కి స్వాతంత్ర్యం రావడానికి పోరి నిలిచాడు. గాంధి తత్త్వం ఇప్పటికీ ఒక చిత్రం. ఒక నమ్మలేని నిజం. "ఇటువంటి వ్యక్తి రక్తమాంసాలతో ఈ భూమిపై నడయాడినాడా అని భావితరాలు విస్తుపోతా"యని ఐన్‌స్టెయిన్ అన్నమాట సత్యం. గాంధియిజమ్ అన్నది విశ్వవ్యాప్తమైంది. "గాంధికి నోబెల్ శాంతిబహుమతి ఇవ్వకపోవడం పొరబాటే''నని నోబెల్ కమిటీ పశ్చాత్తాపపడింది. ఇది బహుమతి కంటె గొప్ప వ్యాఖ్య!

ఈ పరంపరలో మరెందరో ఉన్నారు. శంకరుని అద్వైత వాదాన్ని నవీకరించిన దేశభక్తుడు వివేకానంద. వీరంతా దేవుణ్ణి పట్టుకుని ఊరేగించకుండా, మానవీయకోణంపై దృష్టినిలిపినవారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ తనవిగా చెప్పుకునే కొత్త ప్రతిపాదనలు చేయలేదు. కాని యావత్ భారతీయచింతనని తన పద్ధతిలో వివరించి తాత్త్విక చేతనకు దోహదపడ్డారు.

1888, సెప్టెంబరు 5న సర్వేపల్లి తిరుత్తణిలో పుట్టారు. మధ్యతరగతి కుటుంబం. తండ్రి రెవిన్యూ శాఖలో చిన్న అధికారి–ఒక జమిందారీలో. ప్రాథమిక విద్య తిరుత్తణిలో హైస్కూల్ చదువు లూథరన్ మిషన్ స్కూల్ తిరుపతిలో పూర్తి చేశారు. మద్రాస్ క్రిస్టియన్ కళాశాలలో ఫిలాసఫీలో డిగ్రీ తీసుకున్నారు. వేదాంత సిద్ధాంతాలపై సిద్ధాంతగ్రంథాన్ని సమర్పించారు.

1918లో మైసూర్ యూనివర్సిటీ సర్వేపల్లిని ప్రొఫెసర్‌గా తీసుకుంది. క్వెస్ట్, జర్నల్ ఆఫ్ ఫిలాసఫీ లాంటి పత్రికలకు ఆయన విస్తృతంగా రచనలు చేశారు. సర్వేపల్లి తొలిపుస్తకం "టాగోర్ వేదాంతవైఖరి." భారతీయ ఆత్మకి ఠాగోర్ రచనలు ప్రతిబింబాలని రాధాకృష్ణ నమ్మకం. రాధాకృష్ణ పండితుడు 1918 నుంచి ఆచార్య పదవిలోనే అనేక విశ్వవిద్యాలయాలలో తమ అపూర్వసేవలు అందించారు. అందుకు ఆ మహానుభావుని పుట్టిన రోజుని ఉపాధ్యాయ దినోత్సవంగా పాటించి వారిని గౌరవిస్తున్నారు. డాక్టర్ సర్వేపల్లి భారతదేశపాలనా వ్యవస్థలో కూడా శిఖరాగ్రాన్ని అధిరోహించారు. ఆయన 1952–62 మధ్యకాలంలో భారతదేశ తొలి ఉపాధ్యక్షపదవిని నిర్వహించారు. 1962–67లో రెండవ భారతదేశాధ్యక్ష పీఠాన్ని అలంకరించారు. నైట్‌హుడ్ అంటే సర్ బిరుదాన్ని 1931లో అందుకున్నారు. 1954లో భారతరత్నగా రాధాకృష్ణ పండితుని గౌరవించారు. ప్రాక్ పశ్చిమ తాత్త్విక ఆలోచనలను తులనాత్మకంగా పరిశీలిస్తూ సర్వేపల్లి రచించిన ఆంగ్లగ్రంథాన్ని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రచురించింది. మతం–సమాజం; హైందవ దృష్టిలో జీవితం; ఉపనిషత్ సూత్రాలు వారి రచనల్లో కొన్ని. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ తూర్పు పడమరలకి తాత్త్విక వారధిగా నిలిచారు. ఆచార్యవర్యునిగా ఎందరో ఉత్తమ శిష్య ప్రశిష్యులను జాతికి అందించారు. 1975, ఏప్రిల్ 17న తన 87వ ఏట ఆ మహాపండితుడు కాలధర్మం చెందారు.

**(టీచర్స్‌డే సందర్భంగా)**

# అన్నమయ్య కీర్తనలలోని కలశాపురం ఎక్కడ?

❖ జి. శ్రీనివాసరెడ్డి, రవికృష్ణ

**"ఏ ఒక్కచోటి నుండి నగరం మొత్తం కనిపించదు. అయితే నేను ఒక కొండ ఎక్కి చూసాను. అనేక పర్వతశ్రేణుల మధ్య ఉండే ఆ నగరంలో కొంత భాగాన్ని మాత్రమే చూడగలిగాను. అక్కడినుండి నాకు కనిపించిన భాగం 'రోమ్' అంత పెద్దగా ఉంది. చాలా అందంగా ఉంది. అనేక చెట్ల తోటలు, పెరటితోటలు, నగరం మధ్యలో ప్రవహించే అనేక నీటి ప్రవాహాలు, అక్కడక్కడా చెరువులు, ఇంకా నానావిధ ఫల,పుష్ప వనాలున్నాయి. తెల్లద్రాక్ష కూడా ఉంది. నగర జనాభా అసంఖ్యం. దీని గురించి రాయడం నాకిష్టం లేదు. ఎందుకంటే అతిశయోక్తులు రాస్తున్నామనుకుంటారు".**

శ్రీకృష్ణదేవరాయల కాలంలో హంపీ విజయనగరాన్ని దర్శించిన పోర్చుగీసు యాత్రికుడు డోమింగో పెయిస్ కథనం ఇది.

హంపీలోని విరూపాక్షాలయానికి ఉత్తర ప్రాకారానికి వెలుపల మన్మథకుండం అనే ఒక పుష్కరిణి ఉంది. ఆ పుష్కరిణికి పడమటి దిక్కున ఎర్రని ఇసుక రాతితో నిర్మించిన మహిషాసురమర్దని ఆలయానికి వాడిన శిలలను హంపీకి సుదూర ప్రాంతాలనుంచి తెప్పించి నిర్మించారు. ఆ ఆలయ వాస్తురీతి, అదే విధంగా విరూపాక్షాలయం దక్షిణ దిక్కులో ఉన్న హేమకూట ఆలయాల వాస్తురీతులు రాష్ట్రకూట, కళ్యాణి చాళుక్యుల కాలం నాటివని తెలుస్తుంది. విజయనగర సామ్రాజ్య స్థాపనకు పూర్వమే హంపీని ఒక పవిత్ర తీర్థంగా నాటి ప్రజలు దర్శించేవారని తెలుస్తుంది. ఆ తర్వాత విద్యారణ్య స్వామి ప్రేరణతో హరిహర బుక్కరాయలు విద్యానగరం లేక విజయ నగరాన్ని ఈ హంపీ తీర్థానికి ఆగ్నేయ దిశలో సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది.

ఈ విజయనగర నిర్మాణం నేటి నగరాల వలె అస్తవ్యస్తంగా కాకుండా ప్రణాళికా బద్ధంగా ఉండేది. ఆధునిక కాలంలోని టౌన్‌షిప్పుల్లాగా వేర్వేరు చోట్ల జనావాస ప్రాంతాలు **పురాలు** అనే పేరుతో ఉండేవి. ఆ పురాల మధ్య నేటి గ్రీన్‌బెల్ట్ ఏరియాల్లాగా మధ్యలో రకరకాల తోటలు ఉండేవి. ఎంతో ప్రణాళికాబద్ధమైన తాగునీటి, మురుగునీటి కాల్వలుండేవి.

ప్రతి **పురం** లోనూ ఒక పెద్ద ఆలయాన్ని నిర్మించారు. ఆ ఆలయం ఎదురుగా బజార్లు, చుట్టూ నివాస గృహాలుండేవి. ఈ బజార్లలో ప్రధాన రహదారిని పేటగా వ్యవహరించేవారు. ఈ పేటలు, బజార్లలో గ్రానైట్ శిలలను పరచేవారు. ఇక్కడి నివాసితుల కోసం పుష్కరిణులను నిర్మించారు. ఈ పురాల్లో ప్రధానమైనవి ఇవి.

**విరూపాక్షపురం :** ప్రధాన రహదారి లేక పేట 750 మీటర్ల పొడవైంది. ఈ దారికి ఇరువైపులా వరుసగా మంటపాలను నిర్మించారు.



పంపారథ వీధి

కొన్ని మంటపాలు బహుళ అంతస్తులుగా ఉండేవి. ఈ మంటపాలు ఉత్సవ సమయాల్లో యాత్రికుల బసకు, మిగతా సమయంలో దుకాణాలుగా ఉండేవి. ఈ మంటపాల్లో ఒక శైవ మఠం కూడా ఉండేది. ఈ వీధిని ఆరోజుల్లో పంపారథ వీధి, విరూపాక్ష బజార్, తేరువీధిగా వ్యవహరించేవారు.

**కృష్ణాపురం :** శ్రీకృష్ణదేవరాయలు కళింగ విజయానంతరం తిరిగి వస్తూ ఉదయగిరిలోని బాలకృష్ణ విగ్రహాన్ని తెచ్చి శ్రీకృష్ణాలయం నిర్మించి అందులో ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడి ప్రధాన రహదారికి



కృష్ణాపుర పుష్కరిణి

500 మీటర్ల పొడవున మంటపాలున్నాయి. ప్రతి సోమవారం సంత జరిగే ఈ పురంలో చైనా వస్తువులు కూడా అమ్మేవారని తెలుస్తుంది. ఈ మంటపాల్లో ఒక వైష్ణవమఠం కూడా ఉండేదట. ఆలయం ఎదురుగా మంటపాలకు ప్రక్కగా పుష్కరిణి ఉంది.

**అచ్యుతపురం :** దీన్నే తిరువేంగళనాథపురం అని కూడా అనేవారు. మతంగపర్వతం పాదాలవద్ద ఉన్న ఈ ఆలయంలో దైవం వేంకటేశ్వరుడు. ఈ ఆలయం వెలుపల ఉన్న 400 మీటర్ల పొడవున్న బజారును 'సూళెయ బజార్' అని కూడా వ్యవహరించేవారు. ప్రతి


అచ్యుతాపురం ప్రధానవీధి

మంగళవారం సంత జరిగే ఈ పేటలో నాటి సమాజంలో గౌరవాన్ని పొందిన, పన్నులు కూడా చెల్లిస్తూ ఉండిన వేశ్యలుండేవారు కాబట్టే దీనికి సూళెయ (వేశ్య) బజార్ అనే పేరు వచ్చిందంటారు. ఇక్కడ కూడా ఒక పుష్కరిణి ఉంది. ఈ అచ్యుతాపురాన్ని తిరువీధి, అచ్యుతపేట అని కూడా వ్యవహరించేవారు.

**విఠలాపురం :** విజయనగర ప్రభువుల అత్యున్నత స్థాయి శిల్పకళ కలిగిన ఈ ఆలయం ఎదుట ఒక కిలోమీటరు పొడవున మంటపాలుండేవి. అనేక ఇతర చిన్న చిన్న ఆలయాలు, తులాభారం మొదలైనవన్నీ ఈ ఆలయం చుట్టుప్రక్కల ఉన్నాయి. ఆలయ ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం ఈ ప్రధాన మార్గం గుండా సమీపంలోని గజ్జల మంటపం వరకూ వెళ్లి తిరిగి వచ్చేది. ఈ మంటపాల వెనుకగా పుష్కరిణి ఉంది.


విఠలాపురం ప్రధానవీధి

ఈ పురాలతోపాటు రాచమందిరాలకు సమీపంలో ఉన్న హజారా రామాలయం ఎదురుగా ఉండే బజారు కిలోమీటరు దూరంలో ఉన్న శృంగార హెబ్బాగిలు (శృంగార ద్వారం) వరకు సాగుతుంది. ఈ రహదారికి ఇరువైపుల శైవ, వైష్ణవ మందిరాలే కాక జైనాలయం కూడా కనిపిస్తుంది. ఈ దారిని ఆ రోజుల్లో పాన్-సుపారి బజార్‌గా వ్యవహరించేవారు. పురావస్తు శాఖవారి త్రవ్వకాల్లో వక్కలు కూడా దొరికాయట. తెలుగువారు ఈ వీధిని పెద్దంగడి వీధిగా, కన్నడిగులు దొడ్డంగడి వీధిగా వ్యవహరించేవారు. నిత్యం జనసమ్మర్దంతో ఉండే ఈ బజార్లో శుక్రవారపు సంతనాడు విపరీతమైన రద్దీ ఉండేదని, ఇక్కడ దొరకని వస్తువంటూ ఉండేది కాదని తెలుస్తుంది.

ఈ బజార్లు, పురాలే కాకుండా ఏడు ప్రాకార వలయాలు ఉన్న ఈ నగరంలో కమలాపురం, మద్దలాపురం, వరదరాజమ్మ బజార్లుండేవి.

విరూపాక్ష, కృష్ణ, హజారరామ, అచ్యుతరాయ (తిరువేంగళనాథ) ఆలయాలేకాకుండా వీరభద్ర, చండికేశ్వర, మాల్యవంత రఘునాథ, విష్ణు, రామ, వరాహ, కోదండరామ, పట్టాభిరామ, యంత్రోద్ధారక ఆంజనేయ, ప్రసన్న విరూపాక్ష (అండర్‌గ్రౌండ్ టెంపుల్)తో పాటు జైన ఆలయాలూ ఉండేవి.

ఈ పురాలన్నింటి గురించి ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే కలశాపురం కూడా హంపీ విజయనగరంలోనిదే కాబట్టి. ఈ కలశాపురంలో వెలసి ఉన్న హనుమంతునిపై అనేక కీర్తనలు అమిత భక్త్యావేశంతో అన్నమయ్య పలికి ఉన్నాడు.

హంపీ విజయనగరం రాజధానిగానే కాకుండా పురాణ ప్రాశస్త్యం కూడా కలిగి ఉన్నందున హంపీని తాళ్లపాక కవులు దర్శించి కీర్తనలు చెప్పి ఉంటారు. రామాయణ కాలం నాటి కిష్కింధ ఈ ప్రాంతమే కదా! రామాయణంలో వర్ణించిన మాల్యవంత, మతంగ పర్వతాలు తుంగభద్రానదికి దక్షిణానున్న హంపిలో ఉంటే అంజనాదేవి తపమాచరించి హనుమంతుడికి జన్మనిచ్చిన అంజనాద్రి తుంగభద్రకు ఉత్తరానున్న ఆనెగొందిలో ఉంది.

తాళ్లపాక కవుల రామాంకిత సంకీర్తనలు హంపీలో ఉన్న అనేక రామాలయాల్లోని ఏ స్వామి పైనైనా అయి ఉండవచ్చును. కానీ కలశాపురం అనేది ఎక్కడ వుంది? అక్కడి హనుమంతుడు ఇప్పుడు ఎక్కడ? అనే ప్రశ్నలకు సమాధానం దొరకదు. దొరికిన కొద్ది ఆధారాలను బట్టి కలశాపురం ఎక్కడ ఉందో గురికి బెత్తెడు ఎడంగానైనా నిర్ధారించుకోవచ్చు.

పరిశోధకులు కలశాపురం అనంతపురం జిల్లాలో ఉందని కొందరు, చిత్తూరు జిల్లాలో ఉండొచ్చని కొందరు, ఈ ఊరే కలశాపురం అని నిర్ధారణగా దేనిని చెప్పలేమని కొందరు భావిస్తున్నారు. మరికొందరు అనంతపురం జిల్లాలోని గుంతకల్లు సమీపంలోని కసాపురమే కలశాపురం అయి ఉండకూడదా అని కూడా అన్నారు. ముందు కసాపురం కలశాపురం ఎందుకు కాదో చూసి తరువాత కలశాపురం ఎక్కడో వెదుకుదాము.

కసాపురంలోని హనుమంతుని పేరు నెట్టెకంటి ఆంజనేయస్వామి. అంటే కసాపురానికి పాతపేరు నెట్టెకల్లు అయి ఉంటుంది.

నెట్టన (తెలుగు) : తిన్నగా, ఒప్పుగా, చక్కగా

నెట్టగె (కన్నడ) : తిన్నగా, నిలువుగా, సరిగా, బాగా, స్పష్టంగా

నెట్టమ్ (తమిళం) : నిలువు, తిన్నగా

అని తెలుగు దేశ్య వ్యుత్పత్తి నిఘంటువు చెప్తున్నది. నిలువుగా, ప్రత్యేకంగా వుండే ఏదో ఒక పెద్ద శిలాఖండం వలన నెట్టెకల్లు అనే పేరు వచ్చి వుంటుంది ఓరుగల్లు లాగా. గుంతకల్లు, నెట్టెకల్లు ఊళ్లలోని శిలా విశేషాల వలన ఆ పేర్లు వచ్చి ఉంటాయి.

నెట్టెకంటి ఆంజనేయుడు పట్టిన గాలిని వదిలించడంలో ప్రసిద్ధుడు. ఆ ప్రక్రియలో భాగంగా బాధితులను కశాఘాతాలకు గురి చేస్తారు. **కశ** ద్వారా కశాపురం, కసాపురం అయ్యిందని ఒక సమర్థన. అదీగాక కలశాపురం హనుమంతుని వర్ణిస్తూ అన్నమయ్య చెప్పిన వర్ణనలు నెట్టెకంటి హనుమంతునికి సరిపోవడం లేదు. అందుకని కసాపురం కలశాపురం కాదు.

దాదాపు హంపీలోని అన్ని ఆలయ కుడ్యాలపైన, ప్రాంగణాలలోనూ వివిధ భంగిమలలోని హనుమంతుని విగ్రహాలు కనిపించినా నిత్యపూజలు జరిగేది మాత్రం **యంత్రోద్ధారక ఆంజనేయునికే.** వ్యాస రాయల వారు ఒకసారి తుంగభద్రా తీరంలో ధ్యానం చేస్తుంటే హనుమంతుడు దర్శనమిచ్చాడట. ఆ రూపాన్ని రాయిపై చెక్కితే, ఆ రూపం నుంచి స్వామివారు మర్కటరూపంలో వచ్చి బయటకు వెళుతుంటే, వ్యాసతీర్థులు స్వామి రూపాన్ని యంత్రంలో బంధించారట. మరి ఈ స్వామినే కలశాపుర హనుమంతుడు అనుకొందామంటే ఈ ప్రాంతానికి **చక్రతీర్థం** అని పేరు.

హంపీలో జనానా ఎన్‌క్లోజర్స్‌గా పిలుచుకొనే అంతఃపురానికి వెలుపల ఆగ్నేయ దిశలో ఒక ఆలయం ఉంది. దీనిని మాధవ లేక రంగనాథాలయం అంటున్నారు. ఇది ఒక అసంపూర్ణ నిర్మాణం. గర్భాలయం వెలుపల సుమారు 10 అడుగుల ఎత్తైన హనుమంతుని విగ్రహం ఉంది. బహుశా ఎక్కడినుంచో తెచ్చి ఇక్కడ నిలబెట్టినట్లున్నారు. ఈ విగ్రహాన్ని చూస్తే తాళ్లపాక కవుల కలశాపుర వర్ణనలు సరిగ్గా సరిపోయినందున ఇదే కలశాపుర హనుమంతుడని ఊహ కలుగుతున్నది.

అన్నమయ్య పదసాహిత్య సంపుటాలలో కలశాపుర హనుమంతునిపై ఎన్నో కీర్తనలు ఉన్నాయి. మచ్చుకు కొన్ని :

సంపుటం 1లో 279; సంపుటం 2లో 216, 347, సంపుటం 3లో 148, 232, 503, 519; సంపుటం 4లో 141, 155, 167, 272, 467, 470, 483, 490, 493, 499, 506, 525; సంపుటం 28లో 491, సంఖ్యల సంకీర్తనలు కలశాపురం హనుమంతునిపై చెప్పబడినవే.



**కలశాపుర హనుమంతుడున్న రంగనాథ (మాధవ?) ఆలయం**

పల్లవి : **కలశాపురము** కాడ గాచుకున్నాడు
వలసిన వరాలిచ్చే వాయునందనుడు

చర.3 : కడలి దరినుండిన కపులతో గూడుకొని
వడదీరగా మధువనము చొచ్చి
బడి రామునికి సీతా పరిణామమెల్ల జెప్పి
వడిగల వాడితడు వాయునందనుడు (2-216)

రామాయణంలో చెప్పిన మధువనం కూడా విజయనగరంలోనే ఉన్నది. హంపీ సమీపంలోని కమలాపురం అనే ఊరినుండి కంప్లి అనే ఊరు పోయే మార్గమధ్యంలో మధువనం ఉన్నది. ప్రస్తుతం అక్కడ ఆంజనేయుని దేవళం కూడా ఉంది.

పల్లవి : కొలిచిన వారికి గొమ్మని వరాలిచ్చీ
వెలయ **గలశాపుర వీధి హనుమంతుడు**

చర.1 : బెట్టుగా నొక చేత జూపెడి ప్రతాపము
పట్టుకున్నాడొక **చేత పండ్లగొల**

మెట్టుకొన్నవి రాకాసి మెదడు తోడి తలలు
రట్టడి **కలశాపుర దిట్ట హనుమంతుడు** (3-232)

విజయనగరంలోని పురాలలో ఒక ప్రధాన వీధి ఉండటంకూడా గమనిస్తున్నాం గనుక, కలశాపురంలో కూడా అదే మాదిరిగా ఉండవచ్చు. అందుకే **కలశాపుర వీధి హనుమంతుడు** అయ్యాడు.

పల్లవి : పంతగాడు మిక్కిలి బంటతనమునను
అంతటా **గలశాపుర హనుమంతరాయుడు**

చర.1 : నీరధి చంగనదాట నెట్టన లంకచొచ్చి
శ్రీరాము నుంగరము సీతకిచ్చి
మేరమీరి **యక్షుగొట్టి** మేటివనము వెఱికె
అరయ గలశాపుర హనుమంతరాయుడు (3-503)

పల్లవి : ఆతడా యీతడు **పెద్ద హనుమంతుడు**
చేతులారా **నక్షుని** జెండి వేసినాడట

చర.3 : గక్కన రావణు గొట్ట కాంతను రాముని గూర్చి



**ఈయనేనా కలశాపుర హనుమంతుడు!**

అక్కడ నయోధ్య బట్టమటుగట్టి
నిక్కి **కలశాపురి**ని నిండి శ్రీవేంకటాద్రిని
వుక్కుమీరి హరి గొల్చి వున్నాడు వేడుకలు (4-141)

పల్లవి : పదియారు వన్నెల బంగారు కాంతులతోడ
పొదలిన కలశాపుర హనుమంతుడు

చర. 1 : **ఎడమ చేతబట్టె ఇదివో పండ్లగొల**
కుడిచేత రాకాసి గుంపుగొట్టె
తొడిబడ నూరుపులతో దూరుపు మొగమైనాడు
పొడవైన కలశాపుర హనుమంతుడు

చర. 2 : తొక్కి **అక్షకుమారుని** తుంచి యడగాళ్ల సంది
నిక్కించెను తోక యెత్తి నింగి మోవను
చుక్కలు మోవ పెరిగి సూర్యునొద్ద వేదాలు
పుక్కిటబట్టె **కలశాపుర హనుమంతరాయడు** (4 : 167)

పల్లవి : అంజనీదేవి కొడుకు హనుమంతుడు
సంజీవిని తెచ్చినాడు సారె హనుమంతుడు

చర. 1 : **కలశాపురము కాడ కదలీవనాలనీడ**
అలవాడే ఉన్నవాడు హనుమంతుడు
కలదు కొండల కోనలందలి గుహలలోన
కొలువు సేయించుకొని కోరి హనుమంతుడు

చర. 2 : పసలుగా జంగవెట్టి **పండ్లగుత్తి చేతబట్టి**
అసురులనెల్లాగొట్టి హనుమంతుడు
వసుధ ప్రతాపించి వడి దోక గదలించి
దెసలెల్లా పాలించి దివ్య హనుమంతుడు. (4 : 272)

పల్లవి : ఎంతని పొగడవచ్చు నీతని సేవించరో
పొంతనిదే **కలశాపుర హనుమంతుడు**

చర. 1 : పిడికిట బట్టినవి **పెద్దపండుల గొలలు**
అదరి యెత్తినది మహావాలము

గుడిగొన **రాకాసుల గొట్టినది వలకేలు**
పొడజూపీ గలశాపుర హనుమంతరాయడు (4-506)

పల్లవి : **కలశాపురము కాడ కందువ తోటల నీడ**
వెలయుచు నున్నవాడు వీడె హనుమంతుడు.

చర. 1 : తాటించి **పండ్లగొల దాపలి చేత పట్టుక**
వాటమై **దైత్యుల గొట్ట వల చెయ్యెత్తి**
గాటాన శిరసు పైకి గక్కన దోక నిక్కించి
మేటియై నిలుచున్నాడు మించి హనుమంతుడు(28-491)

ఈ కీర్తనలను బట్టి స్వామివారి ఆకార విశేషాలు తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. కలశాపురం అంతా అరటి తోటలమయం. ఆ కలశాపుర వీధిలో ఉంటాడు పెద్ద హనుమంతుడు. అంటే బాగా పెద్దదైన విగ్రహం. స్వామి విగ్రహం తూర్పు ముఖంగా ఉంటుంది. పెద్ద తోకను నిక్కించి తలమీద అర్ధచంద్రాకారంగా తిప్పుకొని ఉంటాడు. జంగ (జంఘ) చాచి ఉంటాడు. చాచిన రెండు కాళ్లమధ్య అక్షకుమారుడు మర్దించ బడుతున్నాడు. ఈ అక్షుడెవరో కాదు. రావణాసురుని కొడుకు. వల చెయ్యెత్తి (కుడిచెయ్యి) రాక్షసులను తరుముతుంటాడు. దాపలి చేత (ఎడమచేత) పండ్లగెల గట్టిగా పట్టుకొని ఉంటాడు. ఈ లక్షణాలన్నీ రంగనాథ ఆలయంలో నిలబెట్టివున్న స్వామి విగ్రహంలో స్పష్టంగా కానవస్తున్నాయి. ఈ విగ్రహం ప్రస్తుతం ఉన్నది కలశాపురంలో కాకపోయినా ఎక్కడో శిథిలావస్థలో ఉంటేనో, తవ్వకాలలో బయటపడితేనో తెచ్చి యిక్కడ నిలిపి ఉంటారు. విగ్రహాన్ని ఏ ప్రాంతం నుండి తెచ్చారో ఆ ప్రాంతం కలశాపురం అయి ఉండే అవకాశం ఉంది కానీ, ఆ వైనం చెప్పగల వారెవ్వరు? ఎందువల్లనంటే ఆ విగ్రహాన్ని నిన్నమొన్న అక్కడికి చేర్చలేదు. 1958లో నూతలపాటి పేరిరాజుగారు హంపీ గురించి రాస్తూ ఈ ఆంజనేయస్వామి గురించి చెప్పారు. అప్పటికి ఎన్నాళ్లయిందో ఆ శిలామూర్తి అక్కడికి చేరి?

విఠలాలయంలో ఇవే లక్షణాలు ఉన్న హనుమంతుని విగ్రహాలు రెండు కనబడతాయి. కానీ అవి **పెద్ద హనుమంతుడు** కావు. 3 అడుగులులోపే ఉంటాయి.

కలశాపుర హనుమంతుడు చేతిలో పట్టుకొన్న పండ్లగుత్తి ద్రాక్షపండ్లగుత్తి కాదు కదా! డోమింగో పేయిస్ విజయనగరంలో తెల్లద్రాక్ష విస్తారంగా పండుతున్నది అని రాశాడు. అసలు ఈ పట్టణాన్ని దర్శించిన పాశ్చాత్య యాత్రికులు అందరూ నగరంలోని పచ్చదనాన్ని వేనోళ్ల పొగిడారు.

కవిసార్వభౌముడు శ్రీనాథుడు కూడా కలశాపురం విజయనగరం లోనిదని, అందులో అరటి తోటలు, ద్రాక్ష తోటలు ఉన్నాయని ఒక పద్యపాదంలో కంఠోక్తిగా చెబుతున్నాడు.

అరుణగిరినాథుని జయించడానికో, రాజదర్శనకాంక్షతోనో, రాజకీయావసరాల నిమిత్తమో శ్రీనాథుడు ప్రౌఢ దేవరాయల కాలంలో (1426 - 1446) విజయనగరం వచ్చాడు. రాజనముఖం లభించలేదు. ఆస్థాన కవి పండితశ్రేణిలోని ముమ్మకవిని ప్రభుదర్శనం చేయించమని కోరుతూ చెప్పిన సీసం ఇది.

పంపావిరూపాక్ష బహుజటా జూటికా
    రగ్వధ ప్రసవ సౌరభ్యములకు
తుంగభద్రా సముత్తుంగ వీచీ ఘటా
    గంభీర ఘుమ ఘుమారంభములకు
కళసాపుర ప్రాంత కదళీ వనాంతార
    ద్రాక్షాలతా ఫలస్తబకములకు
కర్ణాటకామినీ కర్ణహాటక రత్న
    తాటంక యుగ ధాళ ధళ్యములకు

నిర్నిబంధ నిబంధమై నెనయు కవిత
తెలుగునను సంస్కృతంబున బలుక నేర్తు
ప్రౌఢ దేవేంద్రరాయ భూపాల వరుని
సమ్ముఖమ్మున దయజూడు ముమ్మసుకవి!

పై పద్యంలోని కళసాపురమే కలశాపురం. ఆ పురంలో కదళీ వనాలున్నాయని, ఆ అరటితోటల మధ్య ద్రాక్ష తోటలు ఉన్నాయని చెప్తున్నాడు కవిరాజు.

**ఒక సందర్భంలో విజయనగరంపై తన దాడిలో మొదట గోడ దాటి రెండవ గోడలోకి ముజాహిద్ చొచ్చుకుపోయాడు. ఇక్కడ ఒక ప్రసిద్ధ హనుమంతుని విగ్రహం ఉంది. దాన్ని రక్షించుకొనే ప్రయత్నం చేస్తున్న బ్రాహ్మణులను సుల్తాను చెదరగొట్టి విగ్రహం ముఖంమీద, దాని ఆకారాన్ని చెడగొడుతూ దెబ్బకొట్టాడు. విగ్రహం పాదాల చెంత పడి చనిపోతూ ఒక బ్రాహ్మణుడు సుల్తానును శపించాడు. "ఈ దుష్కార్యానికి నీవు నీ రాజ్యానికి చేరకముందే మరణిస్తావు" అని. ఈ శాపం సార్థకమయింది. ఒక పెద్ద బండరాతితో మలచిన ఈ విగ్రహం ఇప్పటికీ ఉంది".** అని రాబర్ట్ స్యూయల్ "విస్మృత నగరం విజయనగరం" లో ఒక పాదసూచిక ఇచ్చాడు. (అనువాద ప్రచురణ ఎమెస్కో - పుట సంఖ్య 67).



విఠలాలయంలోని హనుమద్విగ్రహాలు

అయితే ఈ దాడి జరిపిన ముజాహిద్ బ్రాహ్మణ శాపం ఫలించి క్రీ.శ. 1378 ఏప్రిల్ 16 తన సేనాని చేతిలోనే నిహతుడయ్యాడు. అందువలన ముజాహిద్ పాడుచేసింది. కలశాపుర హనుమవిగ్రహాన్ని కాదు. పైగా అతను విగ్రహం ముఖం మీద దెబ్బ కొట్టాడు. రంగనాథాలయంలో కలశాపుర హనుమంతుని విగ్రహం కాళ్లు మాత్రమే దెబ్బతిన్నాయి.

పల్లవి : వీడిగో నిలుచున్నాడు విజయనగరములోన
    వేడుకొన ప్రతాపాన **పెద్ద హనుమంతుడు**

అనే కీర్తనలో కలశాపుర ప్రస్తావన లేదు. విజయనగరమనే ఉంది. పెద్ద హనుమంతుడు, పుట్టు కొపీనము, హేమకుండలములు అనే మాటలు, ఇల నసురుల మీద వల చెయ్యెత్తినవాడు, పెక్కు పండ్లగొలలు పిడికిలించినవాడు అని కలశాపుర హనుమంతుని కీర్తనలతో చెప్పిన వర్ణనలే ఉండటం వలన ఇది కూడా కలశాపురం పేరెత్తకుండా ఆ స్వామిపై చెప్పినదే. 4-470, 493లలో కూడా ఇదే లక్షణాన్ని గమనిస్తాము. మాటవరసకు ఒక సామ్యం చూద్దాము. గుంటూరులోని కొత్తపేట ఆంజనేయస్వామి ప్రసిద్ధుడు. కొత్తపేట ఆంజనేయస్వామి; గుంటూరులోని కొత్తపేట ఆంజనేయస్వామి; గుంటూరులోని ఆంజనేయస్వామి అన్నట్లుగా అన్నమయ్య కూడ కలశాపురం హనుమంతుడు; ఆ కలశాపురం ఉన్నది విజయనగరంలోనే కనుక విజయనగరపు హనుమంతుడు అని కీర్తనలలో ప్రస్తావించి వుండవచ్చు కదా!

కలశాపురం ఎక్కడో ఉండే ఊరు కాదు. విజయనగరంలో ఒక భాగం. రంగనాథాలయంలో నిలబెట్టి ఉన్న విగ్రహం అన్నమయ్య కీర్తనలలోని కలశాపుర హనుమంతుడు అయి వుండవచ్చు అని సూక్ష్మంగా సారాంశం.

●

**చిరునామా : జి. శ్రీనివాసరెడ్డి, అభిరామ్ థియేటర్, నంద్యాల, కర్నూలు జిల్లా, సెల్ నెం.: 99492 21122**
**రవికృష్ణ, తెలుగు లెక్చరర్, ఆర్.వి.ఆర్.ఆర్. విద్యా కళాశాల, జే.కే.సి. కళాశాల రోడ్, గుంటూరు-522 006. సెల్ నెం. : 9440 320 580**

# భారతీయ రాశిచక్ర పురాతనత్వం

❖ సర్ విలియం జోన్స్

**భారతీయ రాశిచక్ర విభజన గ్రీకులు, లేక అరబ్బుల నుండి అరువు తెచ్చామన్నది కాదనీ, అనాది కాలంగా ఈ దేశంలో పరిచితమేననీ, పాతహిందూజాతికి చెందిన ఇతరదేశాల వారు ఉపయోగించే రాశిచక్ర విభజనలో ఇది కొంతమేరకు సరిపోలుతుందనీ, దీన్ని బహుశ ఆ జాతి తొలికాలపు మూలపురుషులు తమ విక్షేపనానికి ముందు ఆవిష్కరించి వుంటారన్న అభిప్రాయాన్ని (దీన్ని పండితుడు, శ్రమించే వ్యక్తి అయిన యం.మాటెక్యులా మహాధిక్కారస్వరంతో నిరసించాడు) నేనిక్కడ బలపరచ ప్రయత్నిస్తాను.**

"భారతీయులు రెండు విధాలుగా రాశిచక్రాలను విభజించారు. మొదటిది అరబ్బుల విభాగంలాగ వుంటుంది; చంద్రమానమది. అందులో ఇరవైయ్యేడు సమభాగాలుంటాయి; తొలిప్రకారం వాళ్ళు సుమారుగా రాత్రి ఎన్నిగంటలయిందో చెప్పగలరు; మరొకటి సౌరమానం; మనకులాగా పన్నెండు చిహ్నాలుంటాయి. నాటికి మన "గ్రీకులనుండి అరువుతెచ్చుకున్న వాటికి సమానంగా పేర్లను పెట్టారు." ఇదంతా నిజమే. అయితే, ఈ మాటకూడా చెప్పాడు. "ఎప్పుడో అరబ్బుల జోక్యంతో బహుశః వాటిని వారు గ్రహించి వుండవచ్చు; ఇది రాశిచక్ర పురాతన విభాగమనీ, కొంతమంది రచయితలు చెప్పినట్లు మానవజాతి పూర్వీకులు దీన్ని తయారుచేశారనీ, దీన్నింకా హిందువులు పరిరక్షిస్తున్నారనీ నిర్ధారణగా చెప్పుకోలేం."

అయితే, భారతీయ రాశిచక్రాన్ని అరబ్బులు లేక గ్రీకుల మాధ్యస్థం ద్వారాకానీ, ప్రత్యక్షంగానీ అరువు తెచ్చుకున్నది కాదని నేను రుజువు పర్చేప్రయత్నం చేస్తాను; గ్రీకులుపయోగించిన సౌరవిభాగం మొత్తం మీద భారతదేశంలోని వంటిదే కనుక గ్రీకులు, హిందువులూ–ఇద్దరూ–దీన్ని మరో ప్రాచీన జాతి నుండి గ్రహించుకున్నారనీ, వాళ్ళే మొదటగా ఆకాశంలోని వెలుగు గోళాలకు పేర్లు పెట్టారనీ, గ్రీకులు హిందువుల ఇద్దరి భాష, మతాలుమార్చేటట్లు, వీరిద్దరూ ఒకే సంతతివారనీ మనం సహేతుకంగా నిర్ధారించుకోవచ్చు.

ఈ రచయితే ఆ తర్వాత మనకుచెప్తారు : "భారతీయ ఖగోళశాస్త్రం గొప్పపురోగతి సాధించిన సమయం, పర్షియా నాగ్దియానలలో అరబ్బులు స్థిరపడి హిందువులతో ఘనసంపర్కం పెట్టుకున్న సమయమో, లేక చంఘిజ్ వారసుల అరబ్బులు హిందువులను ఓ పెద్ద సామ్రాజ్యంగా ఐక్యం చేసినప్పుడో అయివుండాలి." అతని అభిప్రాయంతో అప్పటినుండి భారత ఖగోళశాస్త్రాభివృద్ధి నిలిచిపోయింది. ఈపై చెప్పిన మాటల్లోని చారిత్రక పొరపాట్లను సరిచెయ్యటం ఈవ్యాస లక్ష్యంకాదు; లేక భూమి, తదితర గ్రహాల దూరాల విషయంలో భారతీయ ఖగోళశాస్త్రజ్ఞులు మహా అజ్ఞానులన్న ఆరోపణ విషయంలో వారిని సమర్ధించే లక్ష్యమూ కాదు. ఫాదర్ సుసీ చెప్పిన ప్రమాణాలపై ఆధారపడి మాంట్యుక్లా ఆ ఆరోపణ చేశాడని నా విశ్వాసం. ఒక్కమాట మాత్రం చెప్తాను. జ్యాంతిషుకుల (గణిత, ఖగోళజ్ఞులు) విధానాన్ని పౌరాణికుల మాటలలో పోల్చి మనం అయోమయంలో పడకూడదు. భారతీయ విజ్ఞానశాస్త్రం విషయంలో యూరోపియన్లు చేసిన ఎన్నో పొరపాట్లకు కారణం ఆ అయోమయమే. ఈ ప్రాంతంలో గౌరవనీయుడైన రామచంద్రుడనే గణితశాస్త్రజ్ఞుడు ఎనభై ఏళ్ళవాడు. ఈ మధ్యే నన్ను కృష్ణనగర్‌లో కలిశాడు. అతను చెప్పిన మాటలు నేనప్పుడు పరిశీలిస్తున్న విషయాలకు సరిపోయేటట్లుండటంతో అతనలా వెళ్ళగానే నేను వాటిని కాగితంమీద పెట్టాను. అతను చెప్పాడు. "మా పౌరాణికులు మీకు చెప్తారు–భూమి బల్లపరువుగా ఉందనీ, దానిమీద ఎనిమిది మహాపర్వతాలున్నాయని, అది పాలు, తేనే, తదితర ద్రవాలలో చుట్టి ఉందని; మనం నివసించే ఈ భూభాగం ఏడు ద్వీపాల్లో ఒకటనీ, దీనికి పదకొండు చిన్న ద్వీపాలు గౌణంగా ఉన్నాయనీ చెప్తారు. దేవుడు ఓ పెద్ద ఏనుగుపై విహరిస్తూ ఈ ఎనిమిది ప్రాంతాలనూ కాపాడుతుంటాడనీ, మధ్యలో ఓ బంగారుపర్వతం ఉద్భవించి వెలుగుతూ ఉంటుందనీ చెప్తారు; అయితే మేం విశ్వసించేదేమంటే భూమి కాదంబ ఫలంలా. గుండ్రంగా ఉంటుందనీ, నాలుగు ఉప్పునీటి సముద్రాలు–వాటికి నాలుగుదిక్కుల పేర్లు పెట్టాం–తో అది పరివృతమై ఉందనీ, అందులో ఎన్నో ద్వీపకల్పాలూ, అసంఖ్యాకమైన ద్వీపాలూ ఉన్నాయని. చంద్రుడిని రక్కసి తల గ్రహిస్తే గ్రహణాలు వస్తాయని వాళ్ళు చెప్తారు; రాక్షసుడి తలా, తోకా అని వాళ్ళు చెప్పేవి కణుపులు లేక జ్యోతిచక్ర, చంద్ర ఆయనాల కూడళ్ళతో ఏర్పడిన బిందువులని మాకు తెల్సు. క్లుప్తంగా చెప్పాలంటే, తమ ఊహల్లో మాత్రమే ఉండే ఓ విధానాన్ని వాళ్ళు ఊహించరు; తిరుగులేని సాక్ష్యం లేనప్పుడు మేం దేన్నీ సత్యమని నమ్మం." ఒక జైన దిగంబరస్వామి రాశిచక్రం ధుస్తూర పుష్పంలా వుంటుందని చెప్పినప్పుడు నేను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను. ధుస్తూరమంటే ఉమ్మెత్త పుష్పమే. శంకురూపంలో, గరాటులా వుండే పువ్వే. ధృవాల్లో ఒకదాన్నొకటి ఖండించుకునే ఆకాశగోళాల రెండు

మహావలయాల్లో ఓ చిన్నదాని సమతలంపైనో అర్ధభూగోళపు విక్షేపాన్ని గురించీ, జ్యోతిశ్చక్ర- భూమధ్య రేఖలవల్ల ఏర్పడిన కోణాన్ని గురించీ అతడు సూచిస్తున్నారేమోనని నేను మొదటగా అనుకున్నాను; అయితే, నన్ను చూడటానికి వచ్చిన ఓ యువ ఖగోళ శాస్త్రజ్ఞుడు, వినాయకుడు, వాటి అర్థం గరాటు వలయముఖాన్ని గురించి లేక మూలాధార హృదయం గురించేనని చెప్పాడు; ఎన్నో సమతల, ఘన రూపాలను గురించి చెప్పేటప్పుడు ప్రాచీన రచయితలకు పండ్లు, పూవులనుండి పేర్లను గ్రహించటం అలవాటేననీ చెప్పాడు.

నేను ఇంతకు ముందు చెప్పిన ఇద్దరు పండితుల నుండి నేనీ క్రింది కుతూహల పూర్ణమయిన విషయాలను తెలుసుకున్నాను. వాళ్ళు వాటిని పూర్తిగా ఉచ్చరించేంతవరకూ ఉండి వారిముందే నేను రాసుకున్నాను కనుక వాటిని నేను పునరుచ్చరించటంతో పొరపాటుందని మీరు నమ్మాలి. మనం చేసినట్లే వాళ్ళూ మహావలయాన్ని మూడువందల అరవైడిగ్రీలుగా విభజిస్తారు, వాటిని అంశలు అంటారు; వాళ్ళూ, మనలాగానే, ప్రతి పన్నెండు రాసులకు ముప్ఫయి డిగ్రీల చొప్పున కేటాయిస్తారు.

| | |
|---|---|
| మేషం (పొటేలు) | తుల (త్రాసు) |
| వృషభం (ఎద్దు) | 8 వృశ్చికం (తేలు) |
| మిథునం (జంట) | ధనుస్సు (బాణం) |
| 4 కర్కాటకం (ఎండ్రకాయ) | మకరం ( మొసలి) |
| సింహం (సింహం) | కుంభం (కుండ) |
| కన్య (పెళ్ళికాని అమ్మాయి) | మీనం (చేప) |

ఈ పన్నెండు రాశులకు, సూర్యుడికి సంబంధించిన పేర్లు ఇవ్వటం జరిగింది. రత్నమాల రచయిత శ్రీపతి వీటిని పేర్కొన్న సంస్కృత శ్లోకాలను, నేను అనువాదంతో మూలంగా రాసుకున్న కాగితాలనుండి ఇక్కడ చెప్తాను.

మేషాదయో నామ, సామ్యరూపీ,
వృన్సగదద్యమ్ మిథునమ్ నృయుగ్నమ్
ప్రదిపసస్యే దధాది కరభ్యామ్
నవిష్ఠిహిత వారిని కన్యాచైవ
తులాభృత్ ప్రేతిమనసనీర్
ధనుర్ ధనుష్మాన్ హయవత్ పరంగా:
మృగనాన : శ్యాన్ మకరోథ కుంభశ్చ
స్కంధే హేరే రిక్తఘటం దధానా:
అన్యన్య ప్రచ్చ హాభిముఖోహి మీన:
మత్స్యద్వయం స్వస్థలచరినోమి

"మేషం, వృషభం, కర్కాటకం, సింహం, వృశ్చికాలకు వరుసగా ఆయా జంతువుల బొమ్మలున్నాయి; మిథునానికి వీణమీటుతున్న ఓ అమ్మాయి, గదను తిప్పుతున్న యువకుడు చిహ్నం; కన్య ఒక పడవలో నిలబడి వుంటుంది, ఒక చేతితో దీపం, మరోచేతిలో వరికంకిపట్టుకుని; ఓ చేతితో బరువుపట్టుకుని తూచే వ్యక్తి చేతిలో త్రాసు; వెనుక భాగాలు గుర్రానివనిపించే విలుకాడు ధనుస్సును పట్టుకుని ఉంటారు; మకరం ముఖం జింకముఖంలాగుంటుంది. భుజం మీద కుండను పట్టుకుని దానిలోని నీళ్ళనుపోస్తున్న మనిషి కుంభానికి చిహ్నం. మీనాలు రెండు - ఒకదాని ముఖం మరొకదానివైపు తిరిగివుంది; ఇవన్నీ తమ ప్రకృతులకు సరిపోయే స్థలాల్లో ఉండేటట్లు భావించటం జరిగింది.

ఈ ఇరవైయ్యేడు నక్షత్రమండలాలకు వాళ్ళు $33^1/_3$ అంశాలను, లేక పదమూడు డిగ్రీలు ఇరవై నిమిషాలను కేటాయిస్తారు. వాటి చిహ్నాల క్రమంలో, సంఖ్యలకేం సంబంధం లేకుండా వాటిపేర్లు కన్పిస్తాయి.

| | | |
|---|---|---|
| అశ్వని | మాఘ | మూల |
| భరణి | పూర్వఫల్గుణి | పూర్వాషాఢ |
| కృత్తిక | ఉత్తరఫల్గుణి | ఉత్తరాషాఢ |
| రోహిణి | హస్త | శ్రావణ |
| మృగశిరస్ | చిత్ర | ధనిష్ట |
| ఆర్ద్ర | స్వాతి | శతభిష |
| పునర్వసు | విశాఖ | పూర్వాభాద్రపద |
| పుష్య | అనూరాధ | ఉత్తరాభాద్రపద |
| ఆశ్లేష | జ్యేష్ఠ | రేవతి |

ఇరవై ఒకటి - ఇరవైరెండు నక్షత్ర మండలాలమధ్య 'అభిజిత్' అనే మూడు నక్షత్రాలున్నాయి; అయితే, అవి భారము లేక ముందున్న చివరి పావుభాగం. నక్షత్రాలకు సంబంధించి పూర్తి చంద్ర భ్రమణానికి ఇరవై-ఏడు రోజుల, కొన్నిగంటలు, నిమిషాలు, సెకండ్లు పడ్తుంది. కచ్చితమైన లెక్కను హిందువులు పూర్తిగా సాధించనూలేదు, పొందనూలేదు. ఇరవై-ఏడు సంఖ్యను నిశ్చయించుకున్నారు; తమ వైవాహికాదికార్యక్రమంలో కొన్ని జ్యోతిష ప్రయోజనాలకోసం 'అభిజిత్'ను చొప్పించుకున్నారు.

ఈ ఇరవై-ఏడు నక్షత్రాలను, 'అభిజిత్' నక్షత్రాలతో సహా రత్నమాల రచయిత మూడుశ్లోకాల్లో అభివర్ణించాడు.

1. తురగ ముఖసదృక్షమ్ యోనిరూపమ్ ఎసరభామ్
   శకటి సమమ్ అథిన శ్యోత్తమంగేన తుల్యమ్
   మణి గృహసార చరభాని సలోపమమ్ భామ్
   సయనసదృశ మన్యాచ్ఛత్ర పరాయణచరూపమ్

2. హస్తకరయు తమ్ చ మోక్తి కసరుమ్ భవ్యత్ ప్రవళోపమమ్
   దృశ్యమ్ తోరణ సన్నిభం బలిమిభం, సద్కుండలహం పరమ్;
   క్రోధ్యాత్సరలి క్రమణ సదృశమ్ శత్యుసమానామ్ పరమ్;
   అన్యద్ దెంతి విలావ వత్ స్థితమత: శృంగాటకవ్యక్తి భామ్.

3. త్రివిక్రమభం చ మృదంగరూహామ్
   వృత్తం తదోన్యద్యమాలాభ్యేభామ్,
   పర్యాంకరూపం మురజానుచారమ్
   ఇతియేవం ఆశ్వాది భ చక్రరూపం

"గుర్రపుతల, యోని లేక భాగం, కత్తి, చక్రాలబండి, జింకతల, మణి, ఇల్లు, బాణం, చక్రం, మరోఇల్లు, ఓ పడక, మరింకోపడక, చెయ్యి, ముత్యం, ప్రవాళం, పత్రతోరణం, బలి, చక్కటి చెవికమ్మ,

భయంకర సింహపుతోక, శయ్య, మదించిన శతదంతం, దానిపక్కనే శృంగాటక కాయ, విష్ణువు మూడడుగులు, మృదంగం, గుండ్రటి హారం, రెండు ముఖాలబొమ్మ, మరోపడక, ఓచిన్నమద్దెల; ఇవీ అశ్వినీ ఇత్యాది చంద్రనక్షత్ర చక్రం"

మరో సంస్కృతగ్రంథంలో, ఈవే నక్షత్రాల బొమ్మలు వేరే విధంగా పేర్కొనబడినాయి. అవి ఇవి:

| | | | |
|---|---|---|---|
| | గుర్రపుతల | | ముత్యం |
| | యోని లేక భాగం | | రక్తసింధూరం |
| | మంట | | తోరణం |
| | బండి | | పాము |
| | పిల్లిపంజా | **18.** | పడవ ముందుభాగం |
| | ఓ మెరిసే నక్షత్రం | | పడక |
| | విల్లు | | తూర్పారబట్టేబాట |
| | పిల్లవాడి బలపం | | మరింకోటి |
| **9.** | కుక్కతోక | | బాణం |
| | సేదగా ఉన్న ఓ తోక | | మద్దెల |
| | దక్షిణం నుండి ఉత్తరానికి రెండు నక్షత్రాలు | | నక్షత్రవలయం |
| | ఉత్తరం నుండి దక్షిణానికి రెండు నక్షత్రాలు | | బరువులు మోసేకఱ్ఱ |
| | చెయ్యి | | త్రాసునడికఱ్ఱ |
| | | **27.** | చేప |

ఇంతకుముందే చెప్పిన నక్షత్రమండలాలలో పన్నెండింటి నుండి భారతీయుల పన్నెండు నెలలు నిష్పన్నమయ్యాయి. మొత్తం ప్రకృతికీ పౌరాణికులు లాంఛిత పౌరాణిక రూపాలుగా మలుస్తారు కనుక ఇవన్నీ మామూలు పైతృకరూపాలలోనే ఉన్నాయి. ఓ దేవత ప్రతినక్షత్ర మండలానికీ ఆధిపత్యం వహిస్తోందనుకోండి; సోముడు (చంద్రుడు) వీరిలో పన్నెండుమంది ఉద్వాహమాడారనుకోండి. అప్పుడతను పన్నెండు శక్తులు లేక నెలలకు తండ్రవ్వతాడు. వాటిపేర్లు వాటి వాటి తల్లుల నుండి సంక్రమిస్తాయి. పొస్టికాస్ అభిప్రాయంలో వీరి చంద్రమానాన్ని పాత ఖగోళశాస్త్రజ్ఞులు ఏర్పరచినప్పుడు, నక్షత్రంలో చంద్రుడు ప్రవేశించేరోజు ప్రతినెలలో పూర్ణిమ. అలా ఆ నక్షత్రం నుండి ఆ నెల పేరు వచ్చింది. ఇలా ఈ నెలల పేర్లు ఉత్పన్నమవుతామయాయో, వాటి నక్షత్రాలతో పోలిస్తే మనకర్థమవుతుంది.

| | |
|---|---|
| అశ్విన | చైత్ర |
| కార్తీక | వైశాఖ |
| మార్గశీర్ష | జ్యేష్ఠ |
| పౌష | అపర |
| మాఘ | శ్రావణ |
| పాల్గుణ | భాద్ర |

మూడో నెలను అగ్రహాయన ('అగ్రన్' అని చెప్పుకొనేమాట) అన్నది మృగశీర్షకున్న మరోపేరు.

హిందువులు కనుక్కున్న స్మరణ శ్లోకాలవద్ధతి ఎంతో కుశలమయింది. వేరే విధంగా సంబంధం వున్నా భిన్నభిన్న భావాలను జోడించే పద్ధతి ఇది: ఓ క్రమప్రమాణంలో గుర్తించుకోటానికి కోసం శృంఘలాచర్ధం చేయడం; అంటే ముప్పయి-రెండని చెప్పటానికి 'పళ్ళు' సూచించటం; పదకొండుకు రుద్రుడు, ఆరుకు రుతువు, ఐదు బాణం లేక భూతం, నాలుగు సూచించటానికి సముద్రం, వేదం లేక యుగాలు, మూడుకు రాముడు, అగ్ని లేక గుణం; ఇరవయ్యేడు నక్షత్ర మండలాలలోని నక్షత్రాల సంఖ్యను చెప్పే శ్లోకం ఇది:

వాకీని త్రి బుద్విషు గుణీందు క్రిలగ్నిభూతా,<br>
బనన్విన్నేత్ర సార భూచ యుగాబ్ధి రకు:<br>
రుద్రాబ్ధి రామగుణ వేదశత ద్వియుగ్మ<br>
దెంత బూద్లైర్భికీతః క్రమశోభతరః

అంటే "మూడు, మూడు ఆరు, ఐదు, మూడు, ఒకటి, నాలుగు, మూడు, ఐదు, ఐదు, రెండు, రెండు; ఐదు, ఒకటి, ఒకటి; నాలుగు, నాలుగు మూడు; పదకొండు, నాలుగు మూడు; మూడు, నాలుగు, ఒకవంద; రెండు, రెండు ముప్పయిరెండు. ఇలా పండితులు చంద్రనక్షత్రమండలాల నక్షత్రాల సంఖ్యను ఈ క్రమంలో తెలియపరుస్తారు.

ఏ నిరూపించాలనుకుని ప్రారంభించానో, అది నిరూపించాను కనుక నా వ్యాసాన్ని ఓ సాధారణ పరిశీలనతో ముగిస్తాను. అనాది గోళపు చరిత్రను గురించిన న్యూటన్ పరిశోధనల ఫలితాలు 'అమ్మాక కాలపు ఈజిప్టులో నక్షత్రాలను వీక్షించే అభ్యాసంతో ప్రారంభమయ్యాయి; అతని కొడుకు శిశాక్ కాలంతో సాధించిన విజయాల కారణంగా ఆఫ్రికా, యూరప్, ఆసియాలలో ప్రాచుర్యం పొందాయి; అప్పటినుండి లిబియన్లకు అట్లాస్, గ్రీకులకు షిరాన్, బెల్జియన్లకు తమ స్వంత గోళం ఏర్పడ్డాయి.' నేను సంపూర్ణంగా తృప్తి పొందినటువంటి విషయాన్ని ప్రజలకు సంతృప్తి కలిగించేటట్లు చెప్పేందుకు మరో సమయాన్ని, సందర్భాన్ని ఉపయోగించుకుంటాను. అదేమంటే, "నక్షత్రాలను గమనించే అభ్యాసం మనం ఛాడియన్లని పిల్చేవారి దేశపు పౌరసమాజ మూలాంగాలనుండి ప్రారంభమైందనీ, అక్కడి నుండి అది శిశాక లేశావ్య పాలనకంటే ముందే ఈజిప్టు, ఇండియా, గ్రీస్, ఇటలీ, స్కాండినేవియాలకు వ్యాపించిందనీ శిశాక లేక శాక్యుడు తన విజయాల ద్వారా నైలు నుండి గంగానది వరకు క్రీస్తుకు వెయ్యి సంవత్సరాల ముందు ఓకొత్త మత, తాత్విక విధానాన్ని వ్యాపింపచేశారనీ" నాకు తెలిసింది. "అయితే, షిరాన్, అట్లాస్‌లు అలంకారిక, పౌరాణికవ్యక్తులు. మన మనోజాతి చరిత్రలో వారికీ జాగానూలేదు."

**(ఏషియాటిక్ రిసెర్చెస్, వాల్యూం-2 (పుట163-169) నుండి)**

**అనువాదం : కాకానిచక్రపాణి**

**చిరునామా : కాకానిచక్రపాణి, ఇం.నెం. 6-1-149/10, ఫ్లాట్ నెం. 101, విశ్వంబర అపార్ట్‌మెంట్, పద్మారావ్‌నగర్, సికింద్రాబాద్ - 500 025.**

# తిరుపతి వేంకటకవుల సమస్యాపూరణ చమత్కారము

❖ డా॥ రాపాక ఏకాంబరాచార్యులు

**జగదాశ్చర్యకరావధాన కవితా సంపన్నులై మూడు దశాబ్దముల కాలము (1890-1920) ఆంధ్రకవితా సామ్రాజ్యమును పాలించిన కవిచక్రవర్తులు శ్రీ తిరుపతి వేంకటకవులు. రాజాస్థానములలో నర్తించు కవితాలతాంగిని తమ అవధాన, ఆశుకవితా ప్రదర్శనల ద్వారా ప్రజా మధ్యమమునకు తీసికొని వచ్చి ప్రజలలో కవితపై మక్కువ కలిగించిన కవితా ప్రజాస్వామ్య వ్యవస్థాపకులు వారు.**

వారి అవధానాశుకవితాప్రదర్శనలు తిలకించిన నిరక్షరాస్యులు అక్షరాస్యులయ్యారు, అక్షరాస్యులు కవిత్వం చెప్పడం మొదలుపెట్టారు, కవులు అవధానాలు ఆశుకవితల ప్రదర్శనం మొదలుపెట్టారు. ఆనాడాంధ్రదేశ సాహితీపరులపై తిరుపతి వేంకటకవుల కవితా ప్రభావమెట్లున్నదో వారి శిష్యులైన శతావధాని శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారి ఈ క్రింది పద్యమువల్ల వెల్లడౌతుంది.

*ఉ॥ ఎక్కడ జూచినన్ కవులె యెక్కడ జూడ శతావధానులే*
*యెక్కడ జూడ నాశుకవు లెక్కడ జూడ ప్రబంధ కర్తలే*
*దిక్కరులంచు బేర్వడిన తిర్పతి వేంకట సూరువేగు నా*
*ప్రక్కల నెల్ల నీ కడుపు పండినదమ్మ ! తెలుంగు దేశమా!*

(శ్రీ తిరుపతి వేంకటేశ్వరకృతులు. షష్టిపూర్తి మహోత్సవ సంఘముద్రణ. సంపుటము-6. ఉత్తరార్థము పుట 161)

తిరుపతి వేంకటకవులు గొప్ప ప్రబంధ కర్తలు. వారు రచించిన బుద్ధచరిత్రము, శ్రీనివాస విలాసము, ఏలా మాహాత్మ్యము, శ్రవణానందము, పాణిగృహీత మున్నగు ప్రబంధాలు ప్రఖ్యాతిగాంచాయి. వారు రచించిన ఆరు భారతనాటకాలు-అందునా పాండవోద్యోగము, పాండవ విజయములలోని పద్యాలు ఈనాటికీ ఆబాలగోపాలం నోట వింటూనే ఉంటాము. వారి గీరతము, గుంటూరు సీమ, నానారాజ సందర్శనము, శతావధానసారము, దేవీభాగవతము మున్నగు గ్రంథాలు ప్రఖ్యాతములు.

వారు గద్వాల, చెన్నపట్టణము, శ్రీకాకుళము మధ్యనున్న పలు పట్టణాలలోను, పల్లెలలోను, రాజాస్థానాలలోను నహిప్రతి అన్నట్లు అవధాన, ఆశుప్రదర్శనలు చేశారు.

తిరుపతి వేంకటకవులలో నొకరగు శ్రీ దివాకర్ల తిరుపతి శాస్త్రిగారు 1901 నుండి 1918 వరకు కాకినాడలోని పోలవరం జమీందారు శ్రీ కొచ్చెర్లకోట వేంకట రామచంద్ర కృష్ణారావుగారి ఆస్థానకవిగా విలసిల్లి, 1918 నుండి 1920 వరకు కోలంక జమీందారిణి ఆస్థానకవిగా నుండి 1920లో దివంగతులయ్యారు. రెండవ కవి శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు 1903 నుండి 1916 వరకు 13 సంవత్సరాలు బందరు హిందూ హైస్కూలులో తెలుగు పండితులుగా ఉద్యోగించారు. వేలూరి, వేటూరి, అవ్వారి, పింగళి-కాటూరి, విశ్వనాథ మొదలైన యువకవులను విద్వత్కవులుగా తీర్చిదిద్దిన ఖ్యాతి వెంకటశాస్త్రిగారికే దక్కింది. 1949లో అవిభక్త మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం వెంకటశాస్త్రిగారిని తెలుగులో ఆస్థానకవిగా నియమించింది. ఆస్థానకవియైన కొన్ని మాసాలకే శాస్త్రిగారు 1950లో శివరాత్రి పర్వదినాన శివైక్యమందారు.

తిరుపతి వేంకటకవులు రాజాస్థానములను దర్శించిన సందర్భాలలో అచ్చటి పరీక్షాధికారులు కాని, ప్రభువులు కాని వారి విద్వత్తును, ప్రజ్ఞాపాటవాలను పరీక్షింపదలచి కొన్ని సమస్యలనిచ్చి పూరింపుడని కోరగా వారా సమస్యలను అవలీలగా, సరసముగా పూరించారు. ఇవన్నీ వారి నానారాజుసందర్శనములో నిక్షిప్తమైయున్నాయి. వారు పట్టణాలలోను, గ్రామాలలోను ప్రదర్శించిన అవధానాలలో పృచ్ఛకులిచ్చిన సమస్యలను పూరించారు. ఈ పూరణములన్నీ వారి సమయస్ఫూర్తి అనల్పకల్పనాశక్తి, ప్రతిభలను తెలియజేస్తున్నాయి. ఈ పూరణలు ప్రబంధకవితారీతిలో సాగి శ్రోతల, పాఠకుల హృదయములను రంజింపజేస్తున్నాయి.

తిరుపతి వేంకటకవులు వేంకటగిరి సంస్థానమును దర్శించినప్పుడు రాజావారు రెండు సమస్యలనిచ్చి పూరింపుమన్నారు. అవి "గానము వంటి విద్యనికగానము" అనీ, "రాగములలోన మేఘ మల్లారనంగ" అనునవి. తిరుపతి వేంకటకవుల పూరణములిట్లు సాగినవి :

*ఉ॥ జ్ఞాన విహీనులందనుపు జ్ఞానులఁదన్నును, రాగశూన్యులౌ*
*మౌనులదన్ను గ్రూర ఫణి మండలిఁదన్నును సర్వపక్షి సం*
*తానము ఁ దన్ను ఁ గుబ్జలను దన్ను, మృగమ్ములదన్ను, నెన్ననీ*
*గానము వంటి విద్య నికగానము వేంకట కృష్ణభూవరా!*

(శ్రీ తిరుపతి వేంకటకవులకృతులు-సంపుటము-6 (1934) నానారాజసందర్శనము పుట 10)

(**భావము:** జ్ఞానము లేని వారిని, జ్ఞానులను, రాగశూన్యులైన మునులను, క్రూరమైన పాములను, పక్షులను, శిశువులను గోవు వంటి సాధుజంతువులను (పశువులను) గానము ఆనందపరచును. ఓ కృష్ణ భూవరా ! అందువలన గానము వంటి విద్యనిక చూడము, అని సరసముగా పూరించారు. శ్లో॥ "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగాన రసం ఫణీ" అను శ్లోకభాగము నందలి భావము పై పూరణలో ద్యోతకమగుచున్నది.)

రెండవ సమస్యాపూరణము:

*తే॥గీ॥ "శ్రేష్ఠములు మూడు వేంకట కృష్ణభూప*
*నాగములలోన నైరావణంబనంగ*
*యోగములలోన లంబికా యోగమనగ*
*రాగములలోన మేఘ మల్లారనంగ ॥*

(శ్రీ తిరుపతి వేంకటకవుల కృతులు-సంపుటము-6. నానారాజ సందర్శనము పుట 11.)

(**భావము :** ఓ వేంకట కృష్ణప్రభువా ! శ్రేష్ఠములైనవి మూడు కలవు. అవి ఏనుగులలో ఐరావణమనియు, యోగములలో లంబికాయోగమని, రాగములలో మేఘ మల్లారరాగమని చెప్పాలి.) ఈ రెండు సమస్యా పూరణములలో తిరుపతి వేంకటకవుల శాస్త్రజ్ఞానము, కావ్యజ్ఞానము, ప్రతిభ పాండిత్యములు విశదమగుచున్నవి.

తిరుపతి వేంకటకవులు గద్వాల సంస్థానమును దర్శించినప్పుడు వారి ప్రతిభను పరీక్షించుటకు ఒక ప్రవేశపరీక్ష పెట్టారు. ఆ సందర్భములో పృచ్ఛకులు "రామాయ రామభద్రాయ" అని ఒకరు, "తపస్స్వాధ్యాయనిరతం" అని మరొకరు, "వేణీ సంహారనాటకం" అని మూడవవారు వాక్యాలిచ్చి పూరింపుమనగా తిరుపతి వేంకటకవులు "గురుం నత్వాకరోత్కృతిః" అను వాక్యమును చేర్చి త్రిపాద సమస్యను అర్థవంతముగా పూరించారు. ఆ పూరణము ఇట్లు సాగినది:-

*శ్లో॥ తపస్స్వాధ్యాయ నిరతం । గురుం నత్వా కరోత్కృతిః*
*రామాయ రామభద్రాయ । వేణీ సంహారనాటకమ్*

(నానారాజసందర్శనమ-పూర్వార్థము-పుట23.)

(**భావము :** తపస్స్వాధాయ నిరతుడైన గురువునకు నమస్కరించి కవి శ్రీరామచంద్రునకు అంకితముగా వేణీ సంహారనాటకమును రచించెను.)

ఆత్మకూరు సంస్థానాధీశులైన శ్రీ సీతారామ భూపాలుని యెదుట తిరుపతి వేంకటకవులు పూరించిన సమస్య :

" అఱ విరిపాన్పు చేరఁ జనరా విటరాయడ ! నేను వచ్చెదన్" అను దానిని వారిట్లు సరసముగా పూరించారు.

*చం॥ "మఱదియు బావయున్ మగఁడు మామయు నత్తయు నింటిలోనఁజి*
*చ్చుఱ పిడుగుల్ సుఖమ్ము గొన సాఁగ దటంచుఁదలంచి, పానుపే*
*ర్పఱచితి ఁ దోటలో, సగము రాతిరి పోయిన మీద నీవు గ్ర*
*చ్చుఱ విరిపాన్పు చేరఁజనరా, విటరాయడ నేను వచ్చెదన్"*

(నానారాజసందర్శనము-పూర్వార్థము-పుట 43)

(**భావము:** ఒక విటునితో విటురాలు అన్న మాటలుగా పూరణము జరిగినది. మఱది, బావ, మగడు, మామ, అత్త ఇంటిలో చిచ్చుఱ పిడుగులుగా ఉండుట వలన సుఖముండదు, తోటలో పాన్పు ఏర్పరచినాను, అర్ధరాత్రి దాటిన తరువాత పూలపాన్పు చేరరమ్మని, అక్కడకు నేను వచ్చెదనని విటురాలు విటునితో చెప్పిన మాటలుగా పూరణము గావింపబడినది.)

తిరుపతి వేంకటకవులు కాకినాడలో ప్రదర్శించిన తొలి శతావధానంలో ఒక పృచ్ఛకుడు "అంధుండర్ధ నిశీథమందుఁగనె నయ్యర్కేందు బింబమ్ములన్" అను సమస్యనీయగా దానిని వారిట్లు అర్థవంతంగా పూరించారు.

*శా॥ పుంధర్మేత సరస్వతీకవులతో భూపాలకుం "డాదితే*
*యాంధస్సీక్ష్ణ గభస్తిబింబముల దివ్యద్వృత్తి వర్ణించి స*
*ద్గ్రంథమ్ముల్ రచియింపుఁడీ" యనినఁ దద్గ్రంథానుసంధానని*
*ద్రాంధుం డర్ధ నిశీథమందుఁ గనె నయ్యర్కేందు బింబమ్ములన్*

(శతావధానసారము (1956) పూర్వార్థము పుట 8.)

(**భావము :** ఒక భూపాలకుడు పుంభావ సరస్వతులైన తన సంస్థాన కవులను సూర్య, చంద్రుల వర్ణనలతో కావ్యరచన చేయుడని కోరినాడు. ఆ గ్రంథ రచనా దీక్షలో ఉంటూ కవి నిద్రలోనికి జారుకొన్నాడు. కలలో ఆ కవి అర్ధరాత్రి సమయమున సూర్యచంద్రబింబములను చూచినాడు.)

ఈ సమస్యలో రెండు అసంబద్ధ విషయములున్నవి. ఒకటి అంధుడు సూర్యచంద్రులను చూచుట, రెండవది అంధుడు సగము రాత్రి సమయమున సూర్యచంద్రులను చూచుట. తిరుపతి వేంకటకవులు ఈ రెండు విరుద్ధములను పోవునట్లు అంధుని నిద్రాంధుని చేసి పై విధముగా సరసముగా పూరించారు.

అమలాపురంలో ప్రదర్శించిన శతావధానంలో ఒక పృచ్ఛకుడు వారికి "మానవతీ లలామకభిమానమె చాలును జీర యేటికిన్" అను సమస్యనిచ్చి పూరింపుడని కోరగా వారు కృష్ణుడు గోపికావస్త్రాపహరణ సన్నివేశమును దృష్టిలో ఉంచుకొని ఇట్లు పూరించిరి :

*ఉ. "ఓనవనీతచోర ! కృపయుంచి పటమ్ముల నిచ్చి వేగ మా*
*మానము గావుమన్న వ్రజమానిని పల్కులకెంతొ వింతన*
*వ్వాననసీమఁదోఁప గమలాక్షుడు దా నిటు పల్కె, మానినీ!*
*మానవతీలలామ కభిమానమె చాలును జీరయేటికిన్"*

(శతావధానసారము ! పూర్వార్థము-పుట 12.)

(**భావము :** ఓ వెన్న దొంగా! (గోపాలకృష్ణా!) దయతో బట్టలనిచ్చి త్వరగా మా మానము కాపాడుమని ఒక గోపిక కోరగా, గోపికమాటలకు వింతనవ్వు ముఖములో కనిపించునట్లు కృష్ణుడిట్లు పలికెను. ఓ మానినీ! మానవతియైన స్త్రీకి అభిమానమె చాలును (చీరలేకుండుటయే) చీర యెందులకు?)

నెల్లూరులో నిర్వహింపబడిన అష్టావధానములో ఒక పృచ్ఛకుడు "సంధ్యావందన మాచరింపవలదా? చౌశీతి బంధమ్ములన్" అను సమస్యనిచ్చి పూరింపుడని తిరుపతి వేంకటకవులను కోరారు. ఇది అసంబద్ధమైన సమస్య. 84 బంధములతో సంధ్యావందనమాచరింపడ మేమిటి? 84 బంధాలు వాత్స్యాయనుని కామసూత్రాలకు సంబంధించినవి. ఇవి రెండు ఎట్లు పొసగుతాయి. కాని ప్రతిభా సమున్మేష విరాజితులైన తిరుపతి వేంకటకవులు ఎట్లు సరసముగా పూరించిరో పరికింపుడు :

శా *"వింధ్యాద్రి ప్రభనొప్పు బల్ కుచములన్ వే పట్టి పెంపొందు కా*
*మాంధ్యంబార్ప గ లేక వెఱ్ఱివలె నేలా మంచి యీరాతిరిన్*
*వంధ్యంజేసెదు? కాము కేళియనఁగాఁ బాండిత్యమా? లేక నీ*
*సంధ్యావందనమా? చరింపవలదా? చౌశీతిబంధమ్ములన్"*

(శతావధానసారము–నెల్లూరు అవధానము–పుట24).

(**భావము :** సనాతనుడు, నిష్ఠాగరిష్ఠుడైన భర్తతో కామాంధురాలైన భార్య అన్న మాటలుగా సమస్య పూరింపబడినది. పెద్ద పరిమాణములో నున్న స్తనములను పట్టి వృద్ధిచెందే కామోద్రేకమును ఆర్పలేక వెఱ్ఱివానివలె ఈ మంచి రాత్రిని పాడు చేసెదవెందులకు? కామక్రీడ యనగా పాండిత్యమనుకొంటివా? లేక నీ సంధ్యావందనమనుకొంటివా? 84 కామశాస్త్ర బంధములతో నన్ను కూడ కూడదా?" అని భార్య భర్తను ప్రశ్నించెను.

కాకినాడలో జరిగిన అవధానములో ఒక పృచ్ఛకుడు "మా కులదాసయెంత యభిమానము లేదుర చంద్రశేఖరా" అను సమస్యనిచ్చి పూరింపుమని కోరాడు. ఇది వెంకటశాస్త్రిగారే స్వయముగా సమస్య రూపొందించి ఒక పృచ్ఛకునిచేత పృచ్ఛింపజేశారని వినికిడి. దీనికొక ఐతిహ్యము కలదని ప్రతీతి. ఈ సమస్యను వారీవిధంగా హృద్యంగా పూరించారు.

ఉ. *"నాకు విభూతిరాయఁ డొకనాయకుఁడా"యని నీదు భార్య ర*
*త్నాకరుచెట్టవట్టు టది యారసి యుండియు, సిగ్గు లేక ర*
*త్నాకరుఁ జంకఁ బెట్టికొని యక్కులటన్ దలఁదాల్చితౌరా! భా*
*మాకులదాస ! యెంత యభిమానము లేదుర ! చంద్రశేఖరా!"*

(శతావధానసారము – కాకినాడ అవధానము–పుట 58)

(**భావము:** నాకు విభూతిరాయడు (శివుడు) ఒకభర్తా! అని నీదు భార్య (గంగ) రత్నాకరుని (సముద్రుని) వలచి చేపట్టినప్పుడు సిగ్గులేక నీవు రత్నాకరుని చంకలో ఉంచుకొని ఆ కులటను (గంగను) తలపై దాల్చినావు. భామాకులదాసుడవైన ఓ చంద్రశేఖరా! నీకు ఎంతమాత్రము అభిమానములేదు.)

ఈ పూరణలో సరసమైన అర్థమున్నది. గంగ శివుని శిరస్సుపై ఉంటుంది. గంగానది తూర్పుదిశగా పాటి సముద్రములో కలుస్తుంది. శివుడు విభూతిరాయడు (ధనహీనుడు), రత్నాకరుడు రత్నములకు ఆకరమైనవాడు, డబ్బు కలవాడు సముద్రుడు. సహజముగా స్త్రీ తనభర్త ధనవంతుడు కావలెనని కోరుకుంటుంది. డబ్బులేని వానిని విడిచి ధనవంతుని వరిస్తుంది. ఈ పూరణమున శివుని తలపైనున్న గంగాదేవి తన భర్త విభూతి రాయడని (ధనహీనుడని) రత్నాకరుని చేపట్టినప్పుడు భర్తయైన శివుడు సిగ్గులేకుండా రత్నాకరుని (సముద్రుని) చంకలో నుంచుకొని గంగను తలదాల్చినాడట.

ఈ పూరణలో ఒక నిగూఢమైన కథ ఉన్నది. చంద్రశేఖరుడను ఒక వ్యక్తి భార్య సంపన్నుడైన వైశ్యునితో (రత్నాకరునితో) అక్రమ సంబంధము పెట్టుకొనగా అది తెలుసుకొనిన భర్త చంద్రశేఖరుడు చూచి చూడనట్లుగా ఉంటూ రత్నాకరుని ఆదరించుచూ భార్యను ఏలుకొనుచుండెను. అనగా ఈ చంద్రశేఖరుడు ఆ రత్నాకరుని వద్ద ఉద్యోగము చేయుచున్న కారణమున రత్నాకరుని వదలక భార్య కులటత్వమును సహించుచున్నాడు.

కిర్లంపూడి జమీందారులు శ్రీ ఇనుగంటి చిన్నారావుగారు నిర్వహింపజేసిన అష్టావధానములో ఒక పృచ్ఛకుడు "గణ చతుర్థినాఁడు ఫణిచతుర్థి" అను సమస్యనిచ్చి వారిని పూరింపుమనగా వారీ సమస్యను సరసంగా పూరించారు. ఈ పూరణలో సమయస్ఫూర్తి, కల్పన ప్రదర్శించి సహృదయచిత్తులైన సభాసదులను రంజింపజేశారు.

**పూరణము :**

ఆ.వె. *"ఎన్నిదినములాయె నిట నన్ను డించి నీ*
*వరిగి" యనినఁ బత్నికనియె భర్త*
*"నేఁటి కెన్నఁగఁ బదినెల లాయెఁగా! నేడు*
*గణచతుర్థి; నాఁడు ఫణిచతుర్థి"*

(శతావధానసారము–ఉత్తరార్థము.కిర్లంపూడి అష్టావధానము. పుట 64.)

(**భావము:** గణచతుర్థి అనగా వినాయక చవితి. ఫణిచతుర్థి అనగా నాగులచవితి. వినాయక చతుర్థినాడు నాగుల చవితి ఎట్లవుతుంది? ఈ రెండింటికి మధ్య పదినెలల ఎడమ కలదు. అందువలన వారీ పూరణలో అపూర్వ కల్పన చేశారు. భార్య తన భర్తతో యిట్లన్నది.

"నన్ను ఇచ్చట దించి నీవువెళ్ళి ఈనాటికి ఎన్ని రోజులైనది? అని అనగా భర్త భార్యతో యిట్లన్నాడు:–" ఈ రోజుకు పది నెలలయినది. ఇక్కడ దించి వెళ్ళినరోజు (నాడు) నాగుల చవితి, నేడు వినాయక చవితి, అని సరసమగు కల్పనతో చక్కగా పూరించారు.)

వీరవరం గ్రామంలో (తూ॥గో॥ జిల్లా పెద్దాపురం తాలూకాలోని గ్రామము) తిరుపతి వేంకటకవులు అష్టావధానం చేయగా ఒక పృచ్ఛకుడు "సరసుని వైపు వీపు నలచాన మొగంబటు గోడవైపు" అను సమస్యనిచ్చి ఆ పాదమునందలి భావమును కొనసాగించుచు దానిని మొదటి పాదముగా నుంచి మిగతా మూడుపాదములను చెప్పవలసినదిగా శతావధానులను కోరగా వారిట్లు సమస్యను పూరించారు.

చం *"సరసునివైపు వీపు నలచానమొగం బటుగోడవైపు, నా*
*సరసుఁడు కేలుచాపు నలచానయుఁ జన్నులఁజేయిమోపు, నా*
*సరసుఁడు కోర్కెఁజూపు నలచాన దొడంబొడలోనఁ దోపు నీ*
*వరుసనె తెల్లవారె నొకవైఖరి నొక్కని కొక్కవేశ్యతోన్"*

(శతావధానసారము–ఉత్తరార్థము–వీరవర అష్టావధానము–పుట 66.)

ఈ పూరణము తిరుపతివేంకటకవుల అపూర్వకల్పనా వైచిత్ర్యమునకు మచ్చుతునక అని చెప్పవచ్చును. ఇందు ఒక వేశ్యతో సరసునితో కలిగిన అనుభవాన్ని కవులు సరసంగా చిత్రించారు.

(**భావము :** వేశ్య వీపు భాగము సరసునివైపు, ఆమె ముఖము భాగము గోడవైపు పెట్టింది. సరసుడు చేయి చాపి రమ్ము అని కోరగా ఆమె రాకుండా స్తనములపై చేయిపెట్టి మూసుకుంది, అతడు ఆమెయందు కోరిక వ్యక్తం చేయగా ఆమె తన తొడతొడలో పెట్టుకొన్నది. ఈ విధంగా ఒక సరసునికి ఒక వేశ్యతో తెల్లవారింది.)

తిరుపతి వేంకటకవులు విశాఖపట్టణంలో ప్రదర్శించిన అష్టావధానములో ఒక పృచ్ఛకుడు "సతి సతిఁగవియంగఁబుత్ర సంతతి కలిగెన్" అను సమస్యనిచ్చి పూరింపుమనగా వారిట్లు సరసముగా పూరించారు.

*కం "అతికుతుకం బలరారఁగఁ*
*జతురత మెఱయంగ మదనశాస్త్రవిధమునన్*
*వితతంబగు తనసౌధవ*
*సతి సతిఁ గవియంగఁ బుత్రసంతతి కలిగెన్"*

(శతావధానసారము. ఉత్తరార్ధము. విశాఖపట్టణము అష్టావధానము, పుట 73.)

సతి-సతితో కూడుట యేమిటి? పుత్రసంతతి కలగడం ఏమిటి? ఇది లోక విరుద్ధంకదా! అసంబద్ధం కదా! దానిని వారు సౌధవసతిని సతిని కూడినట్లు సరసముగా పూరించారు.

(**భావము :** ఎక్కువ తమితో, చతురతతో రతిశాస్త్రములో చెప్పిన విధంగా విరివిగా సౌఖ్యమగు గృహంలో తన భార్యను కూడగా పుత్రసంతానము కలిగెను.)

బందరు శతావధానములో ఒక పృచ్ఛకుడు "సూర్యుఁడుదయ శిఖరినెక్కెఁ జుక్కలు వొడిచెన్" అను కందపద్య పాదమునిచ్చి దానిని కందపద్యములో కాక మరే ఇతర ఛందస్సులోనైనా పూరింపుడని కోరగా వారు ప్రతిభా సంపన్నులు కనుక తేటగీత పద్యములో సరసముగా పూరించారు. ఇక్కడ విరుద్ధమైన విషయము సూర్యుడు తూర్పుకొండపై నున్నపుడు చుక్కలు పొడుచుట. కాని వాస్తవములో సూర్యుడు పశ్చిమాద్రికి వెళ్ళినప్పుడు అస్తమించుట, చుక్కలు పొడుచుట సహజము. కాని తూర్పు కొండపై నుండగనే చుక్కలు పొడుచుట లోకవిరుద్ధము. కాని తిరుపతి వేంకటకవులు గ్రహణ కారణము పెట్టి సూర్యుడుదయ శిఖరినెక్కినపుడే చుక్కలు పొడిపించిరి. రెండవ విరోధము ఛందస్సుకు సంబంధించినది. కందములో పద్యపాదమునిచ్చి మరేయితర ఛందస్సులోనైనా సమస్యాపూరణము గావింపుమనుట. ఇది చాలా కష్టముతో కూడుకొన్నది. కారణము కంద పద్యముయొక్క గణములు ఇతర ఛందస్సుల గణములకు విరుద్ధముగా నుండును. అంతేకాక ప్రాస స్థానమునందు చిక్కు ఏర్పడును. యాదృచ్ఛికముగా ఈ పద్యపాదములోని "శిఖరినెక్కె" అను పదములోని "శి" అను అక్షరమునకును "వొడిచెన్" అను పదములోని "చెన్" అను అక్షరమునకును యతి కుదిర్చి సమస్యను చక్కగా పూరించి వారి ప్రతిభను వెల్లడించారు.

*తే॥గీ॥ గ్రహణదినమైనకతమున గబళనంబు*
*సలిపె రాహువొ కేతువో గిలితుఁ డయ్యెఁ*
*గార్యభరమున నట్టులే "సూర్యుఁడుదయ*
*శిఖరి నెక్కెఁ జుక్కలు వొడిచెన్" దళముగ*

(శతావధానసారము - ఉత్తరార్ధము బందరు సంపూర్ణ శతావధాము పుట 118.)

(**భావము :** గ్రహణ దినమగుట వలన రాహువో, కేతువో సూర్యుని కబళించెను. భయము పొందిన వాడయ్యు కార్యభారము చేత సూర్యుడు తూర్పుకొండ ఎక్కాడు. చుక్కలు దట్టముగా పొడిచాయి. గ్రహణ సమయము కనుక సూర్యుడు కనిపించకపోవుట వలన అంధకారము వ్యాపించినది. అందువలన చుక్కలు కనిపించినవి. ఈ సమస్య సహజముగా పూరింపబడినది.)

తిరుపతి వేంకటకవులు లక్ష్మీనరసాపురంలో (తూ॥గో॥జిల్లా పెద్దాపురం తాలూకాలోని గ్రామము). శతావధానం ప్రదర్శించినపుడు ఒక పృచ్ఛకుడు "నెలఁజూపించి లతాంగి యేడ్చెనట కన్నీరొత్తుచున్" అను సమస్యనిచ్చాడు. ఈ సమస్యను రావణుడు రంభను కామమోహితుడై బలాత్కరించిన ఉదంతముతో పూరింపబడినది.

*మ॥ కలికిన్ రంబను రావణాసురుఁడు దుష్కామంబుమైఁ బట్టి వ*
*న్నెలుమీఱం దమకించి యా పిదప వానిం గోరులం గ్రుచ్చఁగన్*
*బొలుపుం బాయుచు నామె యాధనదసూనుంగాంచి యచ్చోటి క్రొ*
*న్నెల c జూపించి లతాంగి యేడ్చెనcట !కన్నీరొత్తుచుం బయ్యెదన్"*

(శతావధానము-ఉత్తరార్ధము-లక్ష్మీనరసాపురంశతావధానము-పుట145.)

(**భావము:** మనోజ్ఞయగు రంభను తమకంతో రావణాసురుడు అనుభవించగా ఆమె సొగసు కోల్పోయి నలకూబరుని దగ్గరకు వెళ్ళి రోదిస్తూ పయ్యెదతో కన్నీరు ఒత్తుకొంటూ తన శరీరంపై నున్న నఖక్షతములను (కొన్ని నెలలు) చూపినది. ఇచ్చట నెల-క్రొన్నెలగా మార్చి అర్థవంతముగాను, సరసంగాను సమస్యను పూరించారు.)

సహజ ప్రతిభా సమున్మేష విరాజితులైన శ్రీ తిరుపతి వేంకటకవులు ఈ విధముగా సరసముగా అసంఖ్యాకముగా సమస్యలను పూరించారు. వారి ప్రతిభకు, అనల్పకల్పనా వైచిత్ర్యమునకు, చమత్కార రచనకు పై నుదాహరింపబడిన పూరణములు కొన్ని మాత్రమే. వారికివే నా హృదయాంజలులు.

**జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః**

●

**చిరునామా : ఎం.ఐ.జి.-2, నెం. 56, మన్కమహల్ కాంప్లెక్స్, (హుడాకాలనీ), బహుదూర్‌పురా పోస్ట్, హైదరాబాద్-500 064. సెల్ నెం. 9440494752**

# ఆరుద్రకి నచ్చిన పద్యాలు



ప్రముఖ కవి, విమర్శకులు తనకు యిష్టమైన పద్యాలను రాసి పెట్టుకున్నారు. వారి సెలక్షన్స్‌ని వారి దస్తూరిలోనే అందిస్తున్నాం. ఈ శీర్షికలో గత సంచికలో కొన్నింటిని యీ సేకరణలోంచి యిచ్చాం. ఇప్పుడు మరికొన్ని -

– సం॥





మిరియములేని కూరయును
    మెచ్చునెరుంగని వారి యీవియున్
గరగర గాని భోజనము
    కన్నుల పండువుగాని రూపమున్
మురిపెము లేని యౌవనము
    మోహములేని లతాంగి కూటమున్
సరసులకింపుగావు సుగుణాకర
    పెన్మయ సింగధీమణీ!

ఈ పద్యం పెద్ద పదాలు, వ్యర్థ పదాలు లేకుండా, సరసంగానే వుంది. "యీవి" అంటే దాతృత్వం. భోజనానికి ఆకలి ముఖ్యం. ఆకలికి "కరకర" విశేషణంగా వాడడం రివాజు. ముద్దు మురిపెం అనడం పరిపాటి. ముద్దు బాల్యంలో, మురిపెం యౌవనంలో వుంటేనే యింపు అంటాడు కవి.

కరగిన, నరకిన, ఒరపిన
పొరయదు దుఃఖమ్ము మేలిపుత్తడి తన్నున్
గురిగింజకు వరిగింజకు
సరిగా తులతూతురను విషాదము తక్కన్

ఇందులో మంచి భావుకత వుంది. బంగారం తనని కరిగించినా, రుద్దినా బాధపడదట. ఎందుకూ కొరగాని గురిగింజతో వరిగింజతో తూచినపుడు మాత్రం దుఃఖిస్తుందిట! దీనికి మూలం సంస్కృత శ్లోకం.

పసరంబు ఓగైన బసుల కాపరి తప్పు
    ప్రజలు దుర్నాయులైన ప్రభువు తప్పు
భార్య గయ్యాళైన ప్రాణనాథుని తప్పు
    తనయుండు ధూర్తైన తండ్రి తప్పు
అశ్వంబు ఓగైన ఆరోహకుని తప్పు
    దంతి దుష్టయిన మావంతు తప్పు
సైన్యంబు చెదిరిన సైన్యనాథుని తప్పు
    కూతురు చెడుగైన మాత తప్పు.

ఇలాంటి తప్పుల్ని సరి చూసుకోవాలని ఎత్తుగీతిలో హెచ్చరించాడు కవి. ఇది అడిదము సూరకవి (1720–85) రామలింగేశ్వర శతకంలోని పద్యం. ఓగైన అంటే మొండి, మాటవినని అని అర్థం. దంతి, మావంతు అంటే ఏనుగు, మావటి. లీగల్ టెర్మినాలజీలో వైకేరియస్ లయబిలిటీ అంటారు. కుక్క కరిస్తే దాని యజమానిని శిక్షిస్తారు. ఇవన్నీ ఆనాటి నీతి నియమాల ఆధారంగా రాసినవి. ఈ కాలానికి వీలుగా అప్‌డేట్ చేసుకోవచ్చు. రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ల నడిచిందని సామెత వుండనే వుంది. యధారాజా తథాప్రజ కూడా సామెతే. సత్యమే.

(వచ్చే సంచికలో మరికొన్ని పద్యాలను అందిస్తాం)

# కవిత్రయ భారతం-శ్రీకృష్ణుని రాజకీయ పాత్ర
## ఒక అధ్యయనం

❖ ఆచార్య కాత్యాయనీ విద్మహే
డా॥ జి. కిషన్‌ప్రసాద్

**భాగవతంలో శ్రీకృష్ణుడు భక్తులకు సాన్నిధ్యాన్ని, సాయుజ్యాన్ని ఇచ్చేవాడు. అతని బాల్యక్రీడలు, రాసలీలలు, పెళ్ళిళ్ళు మొదలైన వ్యక్తిగత అంశాలు భాగవతంలో ఉన్నప్పటికి అవి కూడా ఆ పరిధికి లోబడినవే. భాగవత కృష్ణుడు లీలామానుష విగ్రహుడు-లీలలేమి లేని కేవల మనుష్యుడుగా కనిపించేది భారతంలోనే.**

శ్రీకృష్ణుడు భగవత్ స్వరూపుడన్న జ్ఞాన చైతన్యాలు భారతంలో కూడా అక్కడక్కడ వివిధ సందర్భాలలోను, భీష్మాదిపాత్రల ముఖంగానూ వ్యక్తమైనప్పటికి ప్రధానంగా అతనిది ఇందులో మానవ చైతన్యం, ధర్మరాజాదుల రాజ్యప్రయోజనాలకే కృష్ణుడి జీవితం, శక్తి సామర్థ్యాలు పూర్తిగా ఉపయోగించబడ్డాయి. కృష్ణుడి వ్యక్తిగత జీవిత వైభవానికి, భారతంలో స్థానంలేకపోయింది. దానిని పూరించటానికే ఎఱ్ఱాప్రెగడ హరివంశం వ్రాశాడు.

భారతానికి నాయకుడు ధర్మరాజు. ధర్మరాజు రాజ్యలాభాన్ని పొందడం, భారతంలో సాధించబడిన నాయకాభ్యుదయం, ధర్మరాజుకు అభ్యుదయాన్ని చేకూర్చటం కోసమే. అతని తమ్ముళ్ళు నలుగురు తమ భుజబలాన్ని, ఆయుధబలాన్ని ఉపయోగించారు. దానికి సంకల్పబలాన్ని, బుద్ధిబలాన్ని జోడించినవాడు శ్రీకృష్ణుడు. అందువలన కవిత్రయ భారతంలో శ్రీకృష్ణ ధర్మరాజుల సంబంధాన్ని అధ్యయనం చేయటం భారతంలోని రాజకీయాల స్వభావాన్ని అంచనా వేయటానికి ఉపయోగపడుతుంది.

భారతం కథాప్రధానమైన కావ్యేతిహాసం మాత్రమే కాదు. నిర్దిష్టంగా రూపొందుతూ వచ్చిన సామాజిక సంబంధాల పరిణామక్రమాన్ని అర్థం చేసుకోవటానికి ఒక విలువైన చారిత్రక వనరు కూడా[1]. ఈ కోణం నుంచి చూసినపుడు గణవ్యవస్థను ఛేదించుకొని అప్పుడప్పుడే ఏర్పడుతున్న రాచరికానికి తొలిప్రతినిధులు కౌరవ పాండవులు. పాండవులకు శ్రీకృష్ణునితో సంబంధము తల్లివైపుది. యాదవ వంశ రాజైన శూరుడి కూతురు పృథ. కుంతీభోజకుడికి (కుంతీరాజుకు) దత్తపుత్రిక అయి "కుంతి"గా ప్రసిద్ధికెక్కింది. వసుదేవుడు శూరుడికి కొడుకు. కుంతికి అన్న. వసుదేవుని కొడుకు శ్రీకృష్ణుడు. కుంతి సుతులు పాండవులు. అది వాళ్ళ బంధుత్వం.

కం. ఆపదఁగడవం బెట్టఁగ ! నోపి శుభంబైన దాని నొందఁ గూర్పను మా
కీ పుట్టువునకుఁ బాందు ! క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా !
(ఉ.ప.తృ.ఆ. 06)

కష్టాలు గట్టెక్కించి శుభాలు సమకూర్చటానికి ఈ జన్మకు తమకు సమర్థుడైన శ్రీకృష్ణుడిని దిక్కుగా తండ్రి చూపించిపోయాడు అని ధర్మరాజు అన్న ఈ మాటల తాత్పర్యమే భారతకథ పూర్వపరాల యందు వ్యాపించి ఉన్నది.

కృష్ణుడి పాత్ర భారతంలో మొదటిసారిగా ఆదిపర్వం సప్తమాశ్వాసంలో ప్రవేశిస్తుంది. అక్కడి నుండి పది ఘట్టాలుగా సాగిన పాండవుల అభ్యుదయ పరంపర క్రమమంతా శ్రీకృష్ణుడి ప్రమేయం కనిపిస్తుంది. పాండవ కార్యార్థియై కౌరవుల వద్దకు రాయబారం నడుపుట మరొక ముఖ్యఘట్టం. ఆ తరువాత యుద్ధపంచకంలో అనుక్షణం శ్రీకృష్ణుడు పాండవులతోనే ఉన్నాడు. పాండవుల విజయానికి వ్యూహరచన చేస్తూ వచ్చాడు.

లక్కాగృహం దహనం తరువాత పాండవులు కుంతీ సమేతులై ధౌమ్యమహర్షిని పురోహితునిగా పొంది మహీరాజ్యమంతా సంక్రమించేటట్లు తలచి మహదానందపడినారు. కాంపిల్యనగరానికి చేరి బ్రాహ్మణవృత్తితో జీవితం గడపసాగారు. ఆ సమయంలోనే ద్రౌపదీ స్వయంవర పరీక్షకు హాజరయ్యారు. పందెంలో గెలిచి ద్రౌపదిని పొంది కుంతీదేవి దగ్గర అందరూ సంతోషంగా ఉన్న తరుణంలో శ్రీకృష్ణుడు మొదటిసారి పాండవుల దగ్గరికి బలరాముడితో కలిసి వచ్చాడు. అక్కడ నన్నయ "నృపలోకారాధ్యుడు" "ఉద్యత్‌గుణ భ్రాజిష్ణుడు" (ఆ.ప.స.ఆ. 217) అయిన ధర్మరాజును బలరామకృష్ణులు చూచినట్లుగా పేర్కొన్నాడు.

1. డి.డి. కోశాంబి - ప్రాచీన భారతదేశచరిత్ర (అనువాదం కె. బాలగోపాల్), హైదరాబాద్ బుక్ ట్రస్టు, సెప్టెంబర్ 1986 పుట-72.

కౌరవులకు దూరంగా విప్రవేషంలో ఉన్న తమగురించి కృష్ణుడికి ఎలా తెలిసిందా అని ధర్మరాజు ఆశ్చర్యంగా అడిగాడు. మేఘ సంచన్నుడయిన సూర్యుడి తేజం వలనే పాండవుల తేజస్సు కూడా విప్రవేషంలో ఉన్నంత మాత్రాన అడ్డగింపసాధ్యం కానిదని కృష్ణుడు బదులిచ్చాడు. మీ పరాక్రమమే మిమ్ములను తెలియపరచింది. ఇక మీకు మేలు కలుగుతుందని కృష్ణుడు అన్నాడు. ఈ సందర్భంలో ధర్మరాజును గురించి నన్నయ ప్రయోగించిన "నృపలోకారాధ్యుడు" అన్న విశేషణం సాభిప్రాయం. సార్థకం, రాజలోకానికి ఆరాధ్యుడు అని దానికి అర్థం. అప్పటికింకా అతనికి ఆ హోదా రాలేదు. శ్రీకృష్ణుడి రాక అతని దీవెన ధర్మరాజును "నృపలోకారాధ్యుడిగా" చేస్తుందన్న సూచన అందులో ఉంది.

పాండవులు ద్రౌపదిని పెండ్లాడి వైభవంగా ఉన్నారన్న విషయం తెలిసి ధృతరాష్ట్రుడు వారిని తీసుకొని రమ్మని విదురుణ్ణి పంపించాడు. ఆ సందర్భంలో ద్రుపదుడికి, విదురుడికి, మధ్య జరుగుతున్న సంభాషణలలో జోక్యం చేసుకొని శ్రీకృష్ణుడు "ఇవ్వీరులకగు నభీష్టమిది మొదలుంగాన్" (ఆది - అష్టమ-59) అని భవిష్యత్ "పాండవ విజయగీతికకు[2]" పల్లవి వ్రాసినట్లయింది.

ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు అర్థరాజ్యమిచ్చి అభిషిక్తుణ్ణి చేశాడు. ఖాండవప్రస్థం నివాసంగా చేసుకొని రాజ్యపాలన చేసుకోమని చెప్పాడు. ఊరూ, పేరూ, లేని ఖాండవప్రస్థంలో ఇంద్రుణ్ణి పిలిపించి విశ్వకర్మ చేత పాండవులకు ఇంద్రప్రస్థపురం నిర్మింపజేసిన తరువాత[3] కాని శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళలేదు.

ద్రౌపది విషయంలో జరిగిన సమయభంగం కారణంగా ఏడాదిపాటు తీర్థయాత్రలు చేస్తూ గడిపిన అర్జునుడికి తుది ఘట్టంలో సుభద్రతో వివాహం జరిపించింది శ్రీకృష్ణుడు. ఇంద్రప్రస్థం చేరిన సుభద్రార్జునులకు కట్నకానుకలు అనేకం పట్టుకొని అన్నదమ్ములతో పాటు వెళ్ళిన శ్రీకృష్ణుడు అందరూ ద్వారకకు తిరిగి వెళ్ళినా తాను అక్కడే ఉండిపోయాడు.

అర్జునుడితో వినోదిస్తూ కాలక్షేపం చేశాడు. ఆ క్రమంలోనే అర్జునుడితో కలిసి ఖాండవవనవిహారానికి వెళ్ళాడు. అక్కడ ఇంద్రుణ్ణి నిరోధించి, ఖాండవవన భక్షణకు తనకు తోడ్పడవలసిందిగా అగ్నిహోత్రుడు అభ్యర్థించాడు. ఇంద్రాది దేవతలను యుద్ధంలో ఎదిరించే శక్తి ఉంది. కాని అందుకు అవసరమయిన సాధనాలే లేవని, వాటిని సమకూరుస్తే అగ్నిహోత్రునికి సహాయ పడటానికి తాము సిద్ధమేనని అర్జునుడు చెప్పాడు. అర్జునుడికి గాండీవం, అక్షయమైన అంబుల పొది, కపిధ్వజంతో కూడిన దివ్యరథం ఈ రకంగా లభించినవి. కృష్ణునికి కూడా సుదర్శనాయుధం, కౌమోదకి అనే 'గద' అప్పుడే లభించాయి.

అర్జునుడు వాసుదేవుని సహాయంతో ఖాండవవనదహనం పూర్తి చేయించాడు. తద్వారా రాచరికానికి అడ్డంకిగా ఉన్న ఆటవిక జాతుల నిర్మూలన, పాండవుల రాచరిక ప్రతిష్ఠాపన సాధించబడ్డాయి. ఖాండవవన దహన కాండలో బ్రతికి బయటపడ్డ వాళ్ళలో 'మయుడు' ఒకడు. అతడు నిర్మించి ఇచ్చిన మయసభ ధర్మరాజుకు రాజహోదాను తెచ్చింది. రాజ్యాన్ని కాపాడుకోవటానికి, వ్యాపింపజేసుకోవడానికి, అవసరమైన ఆయుధాల సమీకరణ కూడా ఇక్కడ నుండే ప్రారంభమైంది. ఆ రకంగా కృష్ణుడు ఈ సందర్భంలో అర్జునుడి వెంట ఉండి ధర్మరాజును రాజుగా స్థిరీకరింపజేసే పనిని చాపక్రింద నీరులా చేసుకుపోయాడు. ఆ తరువాత ధర్మరాజు రాచరికపు హోదా పెంపొందించడానికి సాధనమైంది రాజసూయయాగం. అందుకు తొలి ప్రేరకుడు 'నారదుడే' అయినా అందుకు అనుమతి ఇచ్చింది, వ్యూహరచన చేసింది శ్రీకృష్ణుడే.

శ్రీకృష్ణుడు రాజసూయ యాగ ప్రయత్నాన్ని హర్షిస్తూనే జరాసంధుడి వంటి అజేయుడైన చక్రవర్తి ఒకడుండగా అది అసాధ్యమని ధర్మరాజును హెచ్చరించాడు. జరాసంధుడి ధాటికి తట్టుకోలేక మూడేళ్ళ పోరాటం తరువాత మధుర నుండి ద్వారకకు వెళ్ళిన తమ యాదవ వంశ చరిత్రను గుర్తు చేసుకొన్నాడు. అనేక రాజ్యాలను జయించి రాజులను చెరశాలలో ఉంచిన జరాసంధుణ్ణి వధిస్తే కాని "ధర్మరాజుకు సామంత రాజ్యవ్యవస్థ విస్తరించదు" అప్పుడు కాని రాజసూయయాగం సాధ్యం కాదు. అందుకనే శ్రీకృష్ణుడు భీమార్జునులను వెంటబెట్టుకొని జరాసంధవధకు స్వయంగా వెళ్ళాడు. యుక్తితో భీముడి ద్వారా జరాసంధుణ్ణి చంపించాడు[4]. తద్వారా ధర్మరాజు రాజసూయయాగ సంకల్పానికి బలం సమకూర్చాడు.

ధర్మరాజు నలుగురు తమ్ములను నాలుగు దిక్కులకు జైత్రయాత్రకు పంపించి తన రాజరికానికి ఎదురులేకుండా చేసుకొన్నాడు. ఆ రకంగా

2. డి.డి. కోశాంబి - ప్రాచీన భారతదేశచరిత్ర (అనువాదం కె. బాలగోపాల్), హైదరాబాద్ బుక్ ట్రస్టు, సెప్టెంబర్ 1986 పుట-73.

3. ధృతరాష్ట్రుడు కనికరించి వాళ్ళను చేరదీసి "ఏలుకొనడానికి" ఖాండవప్రస్థమనే ఊరు, పేరు లేని గ్రామాన్ని ఇచ్చాడు. దాన్ని ఒక నగరంగా పాండవులే నిర్మించుకొన్నారు.
కొడవటిగంటి కుటుంబరావు-చరిత్ర వ్యాసాలు-వ్యాస ప్రపంచ-2. విరసం అక్టోబరు - 1999 పుట -151

4. "ధర్మరాజు ఒక స్వతంత్ర రాజు కావడంతో శ్రీకృష్ణుడు తృప్తిపడలేదు. ఆ కాలంలో రాజుల సమాఖ్యలుండేవి. జరాసంధుడు అలాంటి ఒక బలమైన సమాఖ్యకు నాయకుడు. అతడు వందల కొద్ది రాజులను, వారి సైన్యాలను వెంటబెట్టుకొని, మధుర మీద దండయాత్రలు చేశాడు. ఆ రాజులందరూ స్వతంత్రులే. జరాసంధుడు చక్రవర్తికాడు. కాని, ధర్మరాజును చక్రవర్తిని చేయాలని కృష్ణుని యత్నం. అందుకు జరాసంధుడు పెద్ద అడ్డంకి. కృష్ణుడు యుక్తితో భీముని చేత అతన్ని చంపించాడు. ఆ తరువాత 'రారాజు' బిరుదు దుర్యోధనుడికి వచ్చింది. నిజానికి అతడు రాజు కూడా కాదు. రాజు ధృతరాష్ట్రుడే. ధర్మరాజు చక్రవర్తికావాలంటే దుర్యోధనుడు కూడా చావక తప్పదు. ఈ లోపుగా జరాసంధుణ్ణి చంపించడం అలా ఉండగా ఇతిహాసకారులు మీద పెద్ద అభాండం వేశారు. జరాసంధుడు నాయకత్వం నుంచి తొలగించి ధర్మరాజుకు గులాములు చెయ్యటం అసలు ఎత్తుకావచ్చు".
కొడవటిగంటి కుటుంబరావు-చరిత్ర వ్యాసాలు-వ్యాస ప్రపంచ-2. విరసం అక్టోబరు - 1999 పుట -152

ధర్మరాజు సార్వభౌమాధికార ప్రతిష్ఠాపనకు రాజసూయయాగం మరొక మెట్టు అయింది.

జూదం నిమిత్తంగా పాండవులు అరణ్యవాసం చేస్తూ మునివృత్తితో బాధపడుతున్నారని తెలిసి దుఃఖపడ్డ పాంచాల యాదవ వంశస్తులంతా కృష్ణుడి నాయకత్వంలో వాళ్ళను చూచిపోవడానికి వచ్చారు. (అ.ప.ప్ర.ఆ-122). అప్పుడు ద్రౌపది సభలో తనకు జరిగిన పరాభవం గురించి కృష్ణునితో చెప్పుకొని దుఃఖపడింది. కృష్ణుడు ఆమెను ఓదార్చాడు.

*తనుకుచు నున్న నీ హృదయతాప నిమిత్తమునన్ సురేంద్రనం*
*దను పటుబాణ పాతహతిఁ దద్ధృతరాష్ట్రబలంబు మృత్యుసా*
*దనమున కేఁగుఁజు; మ్మిదియ తథ్యము; నావచనంబు దప్ప ది*
*వ్యనిధులేదు నింకిన దివంబును రాత్రియు సంచలించినన్*

(అ.ప.ప్ర.ఆ - 141)

నీ హృదయతాప నిమిత్తంగా అర్జునుడు వేసే కఠోరబాణపాతం వలన ధృతరాష్ట్రబలం మృత్యుసదనానికి చేరక తప్పదని అత్యంత విశ్వాసంతో ప్రకటిస్తాడు. ధర్మరాజును మహారాజుగా స్థాపించటానికి తాను చేసిన ప్రయత్నాలు దుర్యోధనాదుల దుష్టబుద్ధివల్ల, వైఫల్యం చెందడం కారణంగా కృష్ణుడికి కలిగిన కోపతీవ్రతను సూచిస్తాయి ఈ మాటలు. కౌరవులను చంపి పాండవులకు ఎదురులేకుండా చేయడం పట్ల కృష్ణుడెంత పూనికతో ఉన్నాడో, ఏ విధంగా పునరంకితం అయ్యాడో ఈ సందర్భం సూచిస్తుంది.

దుర్యోధనాదులు చేసిన అన్యాయానికి, అవమానానికి, ప్రతీకారం తీర్చుకోవాలనే కోరిక పాండవులలోను తీవ్రంగానే ఉంది. "ఉధిత క్రోధుడగు కమ్ము ఒకించుక" నీ తమ్ములు యుద్ధం చేస్తారు అని ద్రౌపది చెప్పటమైన, భీముడు దానిని సమర్థించుతూ మాట్లాడటమైనా దానికి ప్రతిస్పందిసన్తూ ధర్మరాజు వారిని ఎదుర్కోవటం ఎట్లో అని విచారించటమైనా, అదే సమయంలో వ్యాసుడు అక్కడికి వచ్చి యుద్ధానికి కావలసిన ఏర్పాట్లను గురించి చెప్పటమైనా, ధర్మరాజు "ప్రతిస్మృతి" విద్యను అర్జునునికి చెప్పి దివ్యాస్త్ర సంపాదనకు పంపటమైనా వారి యుద్ధ ఆకాంక్షనే వ్యక్తం చేస్తాయి.

కృష్ణుడు మళ్ళీ పాండవుల వద్దకు వచ్చింది భవిష్యత్తులో సంభవించపోయే యుద్ధానికి అవసరమైన 'పాశుపతం' మొదలైన దివ్యాస్త్రాలను అర్జునుడు సాధించుకొని వచ్చిన తరువాతనే.

అప్పుడతను చేసిన సంభాషణంతా ధర్మరాజులో యుద్ధకాంక్షను ప్రజ్వలింపచేసేదే. భూమండలాన్నంతటినీ పరిపాలించగల రాజధర్మం ధర్మరాజులో ప్రకాశిస్తున్నదని అంటాడు శ్రీకృష్ణుడు. దుర్యోధనాదులు జూదం మిషతో అన్ని దురంతాలు చేసినా సహించిన ధర్మరాజు క్షమాగుణాన్ని ప్రశంసించాడు. 'నీవే కాస్త కోపిస్తే కౌరవుల దర్పం అలా సాగి ఉండేది కాదని' అన్నాడు. నీ తమ్ముళ్ళు శత్రువులను నాశనం జేయటానికి సిద్ధంగా ఉన్నారని, అంధక, వృష్ణి, భోజ, కుకుర వంశాలకు చెందిన ప్రభువులందరూ ధర్మరాజు కష్టాన్ని పోగొట్టటానికి సన్నద్ధమై ఉన్నారని చెప్పటం ద్వారా యుద్ధానికి సన్నద్ధం కమ్మన్న పిలుపు నిచ్చాడు." యుద్ధం చేసే "చతురంభోధి పరీత క్షితి తల సామ్రాజ్యలక్ష్మికిం బతివి" (అ.ప.చ.ఆ 160) నీవే అని నొక్కి చెప్పాడు. ధర్మరాజు సార్వభౌమాధికారాన్ని దర్శించాడు.

కృష్ణుడు మాట్లాడిన ఈ మాటలన్నీ యుద్ధోన్ముఖమైన ధర్మరాజు చిత్తవృత్తిని చెదరనీయక ప్రోది చేసేవే. కృష్ణుడిచ్చిన ఈ ప్రోత్సాహానికి ప్రశంసకు ఫలితంగానే ధర్మరాజు ఆకాస్త మిగిలివున్న వనవాస కాలాన్ని అజ్ఞాతవాసకాలాన్ని పూర్తి చేసి "లోకనింద్యంబు గాని విక్రమంబునం బగఱ జయింపఁ గోరెదము" (అరణ్య.ప.చ.ఆ.-161) అని ప్రకటించి తన యుద్ధాభిలాషను వాచ్యం చేశాడు. దీనినంతయు నిర్వహించు భారంబు "నీ యదీయ" అని కృష్ణుడికి యుద్ధ నిర్వహణలో పెద్దరికాన్ని అప్పుచెప్పాడు. యుద్ధనిర్ణయ ప్రకటనా ఘట్టాన్నీరకంగా నిర్వహించిన కృష్ణుడి చాతుర్యమే చాతుర్యం.

అజ్ఞాతవాస కాలం ముగిసిన తరువాత శ్రీకృష్ణుడు ఉత్తరాభిమన్యుల వివాహ వేడుకలకై సుభద్రను వెంటబెట్టుకొని పాండవుల వద్దకు వచ్చాడు. పెండ్లై నాలుగు రోజుల తరువాత జరిగిన బంధుమిత్రుల సభ రాజకీయ సభ. అర్ధరాజ్యాన్ని ఆశించటం పాండవుల హక్కుగా కృష్ణుడు ప్రతిపాదించాడు. సాత్యకి సమర్థించాడు. హక్కు అయిన అర్ధరాజ్యాన్ని తిరిగి పొందటానికి రాయబారం పంపాలని ఆ సభలో నిర్ణయమైంది. "శాంతిదౌత్యం విఫలమైతే ద్వారకకు కబురు పంపండి" అని చెప్పి వెళ్ళాడు శ్రీకృష్ణుడు.

ఈ రాయబారాలతో నిమిత్తం లేకుండా "యుద్ధ సన్నద్ధులౌతున్న" కౌరవ పాండవ పక్షాల వారు ఉభయులు ఎవరి ప్రయత్నాలలో వారు ఉన్నారు. ఆ క్రమంలోనే కృష్ణుడి సహాయం ఆపేక్షించటానికి అనుకోకుండా దుర్యోధనుడు, అర్జునుడు ఒకేసారి ద్వారకకు వెళ్ళారు. ఆ సందర్భంలో శ్రీకృష్ణుడు దుర్యోధనుడితో గాని, అర్జునుడితో గాని యుద్ధం ఎందుకు అన్నమాట అనలేదు. తన చతురంగ సైనిక బలాలను, ఆయుధం పట్టనని ప్రతిజ్ఞ చేసిన తనను రెండు వాటాలుగా వేసి ఎవరు ఎవర్ని కోరుకుంటారో కోరుకోండి అన్న కృష్ణుడి మాటలు యుద్ధానికి సిద్ధం కండి అన్న సూచననే ఇస్తున్నాయి. అర్జునుడికి రథసారథిగా ఉండటానికి ఒప్పుకున్నాడే తప్ప యుద్ధనివారణ గురించి శ్రీకృష్ణుడు అసలు తలపెట్టనే లేదు.

సంజయరాయబార ఘట్టంలో సంజయుడి మాటలకు జవాబుగా ధర్మరాజు తాను చెప్పవలసినవన్నీ చెప్పి "సంగ్రామము" రాజులకు ధర్మమగునా ! కాదా ! అని సవాలు చేశాడు. యుద్ధం చేయతగినదో, చేయకూడనిదో ఆజ్ఞాపించడానికి కృష్ణుడున్నాడు. అతని మాట అలంఘనీయము అని చెప్పాడు. అతని మాటను అందిపుచ్చుకొని కృష్ణుడు, ధర్మరాజు మాటలను బట్టి చూస్తే సంధి కుదిరేటట్లు కనబడలేదని యుద్ధ సూచన చేయనే చేసాడు. ధర్మరాజాదులు యుద్ధానికి పూనుకోవడం సకారణమేనని వాళ్ళకు జరిగిన అన్యాయాన్ని అవమానాన్ని

ప్రస్తావించటం ద్వారా స్పష్టం చేశాడు. ఆ విషయమేదో తేల్చటానికి తానే వస్తానని నిర్ణయం ప్రకటించాడు. శాంతియుతంగా పాండవులకు రాజ్యం ఇవ్వడమా లేక యుద్ధానికి సిద్ధం కావటమా ! అది నిర్ణయించుకోవలసింది ధృతరాష్ట్రుడేనని సూచించాడు.

శ్రీకృష్ణుడు రాయబారానికైతే బయలుదేరాడు. సాధ్యమైనంత వరకు సంధి అయ్యేట్లు చేస్తానన్నాడు కానీ అనాయసంగా లభించిన, రాజ్యం రుచి మరిగిన దుర్యోధనాదులు పాండవులకు అర్ధభాగం ఇవ్వటానికి అంగీకరించరని అతను సులభంగానే ఊహించాడు. దుర్యోధనుడు ఊపిరి వుండగా "పుడమి" నియ్యడు అని స్పష్టం చేశాడు. కనుక యుద్ధం అనివార్యం. కనుకనే "చతురంగ బలంబుల నాయితంబు గావించుచు దొరలంబురిగొల్పి కొనుచు నాలస్యంబు లేక సమరంబునకు సన్నాహంబు సేయు చుండవలయునని" (ఉ.ప.తృ.ఆ - 42) అని ధర్మరాజుకు చెప్పాడు. తన ఈ అభిప్రాయానికి భీముడు అనుకూలంగా ఉన్నాడో లేదోనని ఒకసారి రెచ్చగొట్టి చూశాడు. గాండీవానికి, పాశుపతాస్త్రానికి పని 'తగలాలన్న' అర్జునుడి ఆకాంక్షను అతని నోటనే అత్యంత తిరస్కృతవాచ్యధ్వనితో వ్యక్తీకరింప చేశాడు.

కృష్ణుడి యుద్ధ సంకల్పానికి ప్రత్యక్షంగా, వాచ్యంగా మద్దతు ప్రకటించింది ద్రౌపది. 'రాజరాజుపీనుంగుఁగన్నారఁ' (ఉపతృతీయ-117) కాంచవలెనన్నది ద్రౌపది ఆకాంక్ష. అందుకనుకూలంగానే కృష్ణుడు రాయబారం నడపాలన్నది ఆమె సూచన.

*యమ మహిష ఘంటికా నా । దము వినఁగౌతుహలంబు దళుకొత్తెదు చి*
*త్తములు గల కౌరవులకి । ష్టము లగునే సంధి కార్య శాంతవచనముల్ ?*

(ఉ.ప.తృ.ఆ - 122)

అని సంధి జరిగేది కాదు అన్న నమ్మకాన్ని ద్రౌపదికి కలిగించి మరి కృష్ణుడు రాయబారానికి బయలుదేరాడు. కృష్ణుడు ఆశించినట్లుగానే, ఊహించినట్లుగానే దుర్యోధనుడు పాండవులకు భూమిపాలు ఇవ్వడానికి అంగీకరించలేదు. రాయబారం విఫలమవడం సంగతి అలా ఉంచి ఆ సమయంలో కూడా కృష్ణుడు పాండవుల వైపు బలాన్ని సమీకరించడానికి ప్రయత్నాలు చేయటం గమనించదగింది. దుర్యోధనుడు ఏ కర్ణుని అండ చూసుకొని పాండవులను గెలవగలనన్న ధీమాలో ఉన్నాడో, ఆ కర్ణుడిని అతని నుండి చీలదీసే భేదోపాయానికి పూనుకొన్నాడు కృష్ణుడు. కర్ణుడి జన్మవృత్తాంతాన్ని చెప్పి పాండవులతో కలసిపోతే వచ్చే రాజ్యలాభాన్ని స్త్రీ లాభాన్ని కూడా అతనికి ఆశ చూపటంలో కనబడేది ఇదే. దానితో కౌరవ పాండవుల మధ్య యుద్ధం జరగాలన్న కృష్ణుని సంకల్పానికి ఆచరణాత్మక వ్యూహనిర్మాణం పూర్తయింది.

కృష్ణుడి యుద్ధ పిపాసను అతని అన్న బలరాముడే గుర్తించాడు. అతనికి కౌరవ పాండవుల మధ్య యుద్ధం ఇష్టం లేదు. కాని అది తప్పనిసరి అయింది. దానిలో తాను భాగస్వామి కాలేక, సాక్షిగా నిలబడలేక తీర్థయాత్రలకు వెళ్ళటానికి నిర్ణయించుకున్నాడు. వీడ్కోలు తీసుకోవటానికి పాండవుల వద్దకు వచ్చినప్పుడు ఇరుతెరంగుల వారికి నచ్చజెప్పి సంధి చేయమని చెప్పిన మాటలను కృష్ణుడు పట్టించుకోలేదని నిష్ఠురస్వరంతోనే చెప్పాడు.

*ఇట్టి దానికి నోర్వక యెన్నఁడేనిఁ । గృష్ణుతోడ నేఁ జెప్పితిఁ గినిసి యిరుదె*
*అంగువారికిఁ దగఁ జెప్పి సంగతంబు । సేయుమని యెంత సెప్పినన్ జేయఁడయ్యె*

(ఉ.ప.చ.ఆ. 168)

యుద్ధపంచకంలో కృష్ణుడు తన శక్తియుక్తులనన్నింటిని మనసావాచాకర్మణా పాండవుల విజయానికే వినియోగించాడు. యుద్ధరంగంలో ప్రతిపక్షంలో ఉన్న బంధువులను, గురువులను, పెద్దలను చూచి అర్జునుడు యుద్ధ విముఖుడైనప్పుడు, కృష్ణుడు క్షత్రియులకు ముఖ్యకర్తవ్యం యుద్ధమని, దానివల్ల స్వర్గం లభిస్తుందని, ఫలితాల యెడ మమకారం విడిచి కర్తవ్యాలు నిర్వహించటమే తత్త్వమని అర్జునుడిని యుద్ధానికి ప్రేరేపించిన తీరు గమనించదగింది. ఆరంభించిన కార్యం తుది ఫలితం వరకు సక్రమంగా సాగేట్లు శ్రీకృష్ణుడు జాగ్రత్తలు తీసుకొనటంలో భాగమిది. భీష్ముడి ప్రతాపానికి తట్టుకోలేక పాండు సైన్యం అతలాకుతలం అవుతుంటే యుద్ధరంగంలో ఆయుధం పట్టనని చెప్పిన శ్రీకృష్ణుడు ఆ విషయం మరిచి తాను స్వయంగా చక్రాయుధ ప్రయోగానికి పూనుకొనటం రాజ్యాన్ని పాండవులకు కట్టబెట్టాలన్నది తాపత్రయం వల్ల కలిగిన ఉద్వేగం నుండే.

అభిమన్యుడు మరణం తండ్రిగా అర్జునుడికి, యుద్ధం ద్వారా రాజ్యాన్ని పొందవలసిన ధర్మరాజుకి తట్టుకోలేని దుఃఖం కలిగించే విషయం. ఆ దుఃఖోద్వేగం నుండే మరునాడు సూర్యాస్తమయంలోగా సైంధవుణ్ణి చంపటానికి అర్జునుడు ప్రతిజ్ఞ చేశాడు. మరుక్షణం నుంచి బాధంతా శ్రీకృష్ణుడిదే. అర్జునుడు సైంధవుణ్ణి చంపాలి. చంపలేకపోతే అర్జునుడు అగ్ని ప్రవేశం చేస్తాడు. అర్జునుడు లేకపోతే పాండవులను విజయంవైపు నడిపించే ఛోదకశక్తి కరువవుతుంది. కనుక అర్జునుడు సైంధవుణ్ణి చంపే తీరాలి. ఈ పరిస్థితి కృష్ణుడి మీద ఎంత వత్తిడి తెచ్చిందంటే అర్జునుడికి బదులు తానే యుద్ధం చేయాలి అనుకునేంతగా.

కృష్ణుడు సైంధవుని మరణంతో సంతృప్తి పడలేదు. సైంధవుణ్ణి చంపినందుకు అర్జునుడిని ప్రశంసిస్తూనే ఇక నీవు జయించవలసినవాడు కర్ణుడున్నాడు అని, అర్జునుడి తక్షణ కర్తవ్యాన్ని నిర్దేశించాడు.

ధర్మరాజును యుద్ధరంగంలో ఓడించి, నిలిచిన కర్ణుణ్ని ఓడించటానికి అర్జునుడు అన్నగారి పాదాలసాక్షిగా నిర్ణయం తీసుకొన్నాడు. మరుక్షణమే కృష్ణుడివైపు చూసి "నీ మనంబునం గర్ణుండు దెగటాఱవలయునని ఇంచుక దలంపుము దాన నేనతని వధియింతు" (క.ప.తృ.ఆ - 112) అని కోరటం కృష్ణుడి సంకల్పానికున్న బలాన్ని సూచించేదే.

కృష్ణుడి సంకల్పం ఎంత ప్రధానమైందో ధర్మరాజు కోపం కూడా అంతప్రధానమైంది. సంకల్పం భావరూపమైంది. కోపానికి భౌతిక చర్య ఉంటుంది. కృష్ణుడు సంకల్పించాలి. దుర్యోధనుడు కోపించాలి.

భీమార్జునులు సాధించాలి. ఇది భారత యుద్ధవ్యూహం. కర్ణుడు యుద్ధరంగంలో చేసిన పరాభవం నుండి ధర్మరాజుకు కలిగిన కోపం, కర్ణుడు చావాలి అన్న కృష్ణుడి సంకల్పం రెండూ కలసి అర్జునుడి ముఖంగా భౌతిక వాస్తవ చర్యగా పరిణమించింది. కర్ణుడి మరణానంతరం కృష్ణుడు ధర్మరాజును అభినందిస్తూ మాట్లాడాడు. అందుకు సమాధానంగా ధర్మరాజు కృష్ణుడి దయవల్లనే బలవంతుడైన శత్రువు చచ్చాడని "సకల ధరణి వలయ సామ్రాజ్యమునకు....భర్త" (క.ప.తృ.ఆ.94) కావటానికి తనకున్న అవరోధాలు అంతటితో అంతరించాయని తన సార్వభౌమాధికారాన్ని తిరుగులేకుండా స్థాపించిన కృష్ణుడి పట్ల కృతజ్ఞతభావాన్ని ప్రకటించాడు.

కౌరవుల పక్షాన ఇక మిగిలింది దుర్యోధనుడు. అతనిని జయిస్తే కాని ధర్మరాజును సింహాసనం ఎక్కించడం సాధ్యం కాదు. ఆ పనిని కూడా కృష్ణుడు దగ్గరుండి జరిపించాడు. 'మడుగు'లో దాగిన దుర్యోధనుణ్ణి బైటకు రప్పించటంలో కాని, గదా యుద్ధానికి రెచ్చగొట్టడంలో కాని, భీముడిని అతనికి ప్రతియోధుడిగా యుద్ధంలోకి దింపటం కాని, దుర్యోధనునికి ఊరుభంగం చేయించటంలో గాని భీముడు చేసిన దాన్ని ధర్మయుద్ధమేనని సమర్థించడంలో కాని కృష్ణుడిదే చొరవ. ధర్మరాజును "నృపలోకారాధ్యుని"గా చేయటం అన్న శ్రీకృష్ణుని లక్ష్యం దీనితో పూర్తి అయింది.

ధర్మరాజుకు రాజ్యాధికారం లభించిందంటే వారసత్వంగా అది అతని కొడుకులకు సంక్రమిస్తుంది. అభిమన్యుడు, ఘటోత్కచుడు మొదలైన పాండవ సంతానం యుద్ధంలో మరణించింది. నిద్రలో ఉన్న ఉపపాండవులను అశ్వత్థామ చంపేశాడు. అశ్వత్థామ మీద పగదీర్చుకోవాలని ద్రౌపది భీమసేనుణ్ణి నియోగించింది. అతని వెనువెంట ధర్మరాజును, ధనుంజయుణ్ణి తీసుకొని శ్రీకృష్ణుడు వెళ్ళాడు.

అశ్వత్థామ పాండవ వంశం నిర్మూలనం కావాలని సంకల్పించి 'బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని' ప్రయోగించాడు. అప్పుడు దానిని ఎదుర్కొనటానికి 'బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించి తనను తన అన్నదమ్ములను కాపాడుకొనమని అర్జునుణ్ణి ప్రేరేపించింది శ్రీకృష్ణుడే. అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రం వలన ఉత్తర గర్భం విధ్వంసం కాకుండా కాపాడింది శ్రీకృష్ణుడే. ఆ రకంగా పాండవ వంశ వారసత్వాన్ని రాజ్యాధికారం కొరకు నిలపటం శ్రీకృష్ణుడు పాండవుల ప్రయోజనాలు కాపాడడంలో నిర్వర్తించిన అంతిమకార్యం. ఆ సందర్భంలోనే అశ్వత్థామ తన శిరోమణిని భీముడికి ఇవ్వవలసి వచ్చింది. అశ్వత్థామ తన తలలో మణిని తీసి భీమునికి అప్పజెప్పటం కౌరవుల ఓటమిలో అంతిమ ఘట్టం. అప్పుడు గాని పాండవులకు రాజ్యం సంక్రమించదు.[5]

శ్రీకృష్ణుడు వ్యాసాది మునుల సమక్షంలో తాను సాక్షిగా భీముడికి అశ్వత్థామ చేత మణిని అప్పజెప్పించటం ద్వారా ధర్మరాజును "నృపలోకారాద్యుడిగా" స్థాపించే పనిని విజయవంతంగా పూర్తిచేశాడు.

ఈ విధంగా గణ వ్యవస్థను రాచరికపు వ్యవస్థగా రూపొందించటంలో, పశుపాలక వ్యవస్థ ప్రతినిధిగా కృష్ణుడు నిర్వహించిన పాత్ర, మహాభారతంలో విశ్వరూపంతో కనిపిస్తుంది. ●

5. డిడి. కోశాంబి-ప్రాచీన భారతదేశ చరిత్ర (అనువాదం కె.బాలగోపాల్) హైదరాబాద్ బుక్ ట్రస్టు సెప్టెంబరు 1986 పుట-79

**చిరునామా : ఆచార్య కాత్యాయనీ విద్మహే,నం. 5-11-667, కాకతీయ యూనివర్సిటీ రోడ్డు, విద్యారణ్యపురి, వరంగల్లు - 506 009 ఫోన్ నం. 0870 - 2439161**
**డా॥ జి. కిషన్‌ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు & తెలుగు విభాగం, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్-506 009.**

## అన్నమయ్య లోకజ్ఞత

అన్నమయ్య కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రత్యక్షం చేసుకొని తరించిన ధన్యాత్ముడు. శ్రీ వేంకటేశ్వరస్వామిపై రోజుకొక్కటికి తక్కువ కాకుండా మొత్తం ముప్ఫైరెండువేల సంకీర్తనలు చెప్పి పదకవితా పితామహుడుగా, సంకీర్తనాచర్యుడుగా ప్రసిద్ధికెక్కినాడు. ఈ కీర్తనల్లో భక్తి, ఆధ్యాత్మికత, భక్తిపర్యవసాయియైన శృంగారం ప్రధానాంశాలుగా కనిపిస్తాయి. ఐనా 'రామాదివత్ ప్రవర్తితవ్యమ్, న రావణాదివత్' అని లోకానికి ఉపదేశిస్తూ మానవులను సన్మార్గవర్తులను చేయడం ఏ రచనకైనా ప్రధానలక్ష్యం. కనుక అన్నమయ్య సందర్భాను గుణంగా మానవజీవితసంబంధమైన ఎన్నో అంశాలను, బలహీనతలను పేర్కొని కర్తవ్యోపదేశం చేయడం పెక్కుచోట్ల కనిపిస్తుంది. వాటిని కొన్నింటిని పరిశీలిద్దాం.

అన్నమయ్యకు ఎందుకోగాని సంసారమంటే ఎంతో హేయమైన విషయం. సంసారహేయతను గూర్చి రాసిన సంకీర్తనల్లో ఆతడు వాడిన పదబంధాలు అతనికి సంసారమంటే ఎంత విరక్తతాభావమో వ్యక్తం చేస్తాయి.

సడిఁబెట్టెఁ గటగటా సంసారము చూడ
జడధిలోపలి యాఁత సంసారము
జమునోరిలో బ్రదుకు సంసారము చూడ
చమురు దీసిన దివ్వె సంసారము
సమయించుఁ బెనుదెవులు సంసారము చూడ
సమరంబులోనునికి సంసారము
సందిగట్టిన తాడు సంసారము చూడ
సందికంతల తోవ సంసారము
చందురుని జీవనము సంసారము చూడ
చందమే వలె నుండు సంసారము
చలువలోపలివేఁడి సంసారము చూడ
జలపూత బంగారు సంసారము
యిలలోనఁ దిరువేంకటేశ నీ దాసులకు
చలువలకు గడుచలువ సంసారము

సంసారమెంత కష్టపూరితమో, నిస్సారమో అన్నమయ్య పై సంకీర్తనలో ఎంతో శక్తిమంతంగా వివరించినాడు. మరోచోట సంసారాన్ని 'రంపపు సంసార'మని అంటాడు.

**(ఆచార్య రవ్వా శ్రీహరిగారి 'అన్నమయ్య భాషావైభవం' నుంచి)**

# ముసలితనపు అనుభవం

❖ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి

[వేంకటశాస్త్రిగారు, కొనప్రాణం ఉన్నంతవరకూ సాహితీ వ్యాసంగంలోనే, కాలం గడుపుకొన్నారనటానికి–ఈ తుదివ్యాసమే సాక్ష్యం. ఈ వ్యాసం కూడా, ఆయన స్వదస్తూరిలోనే, వ్రాసి వుంది. అక్షరాలలో కొద్ది వృద్ధాప్యపువణకు కనబడుతున్నా, పోల్చుకోటానికి స్పష్టంగా ముత్యాల రీతినే ఉన్నాయి. మనస్థైర్యము చెక్కు చెదరటం వ్రాతలోనే కనబడదు. ఈ తుదివ్యాసం, మాకు లభించింది. ఇక్కడ ప్రచురిస్తున్నాము. ఈ క్రింది వేంకటశాస్త్రిగారి చేవ్రాలు నమూనా ఈ వ్యాసంలోనిదే–సం॥ భారతి.]

తరంగాలని సర్వసాధారణంగా లోకంలో వాడఁబడే–శ్రీ కృష్ణలీలా తరంగిణి పేరు (కవి పెట్టిన పేరు) యెవరికో కాని తెలియనే తెలియదు. ఆ గ్రంథాన్ని గుఱించి నాలుగు మాటలు వ్రాయడం కొంత యీ ముసలితనానికి అలంకారంగా వుంటుందని లేఖిని చేత పుచ్చుకున్నాను, నాతోవ నాదీ దాని తోవ దానిదీ అవుతుందో?–

**(1) "తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతం బూనితిన్"**
**(2) "కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు,"**

ఈ వయస్సులో కూడా యేదో శబ్దాన్ని గూర్చియ్యేవే కైకురుబొాయికురు లాడుతూ శేష జీవితాన్ని కర్చు పెట్టదానికి కాలజ్ఞులు నొప్పుకోరు–"నహి నహి రక్షతి డుకృఞ్‌కరణే," (చూ), శ్రీ తీర్థులవారు సంస్కృతంలో రచించినా, యీ గేయాలు సర్వేసర్వత్ర గ్రంథకర్తకు ఆంధ్రకవిత్వమర్మజ్ఞత తెలుపుడు చేస్తూనే వుంటుంది. (రక్ష రక్ష అసురశిక్ష రాజీవదళాయతాక్ష, ఆక్షీణకృపాకటాక్ష, ఆశ్రితపక్ష సంరక్ష). అయితే తెలుగుఁలో యేదీ రచించినట్లు శ్రుతం కావడం లేదు. భవతు. శ్లోక కవి మాత్రమే కారనిన్నీ చంపు (గద్యపద్యాత్మకం కావ్యం) రచనలో ఆఱితేఱిన మహాకవి మాత్రమే కాక జయదేవాది గేయరచనాదక్షులలో నొకరుగా పరిగణింపబడతారని విజ్ఞులు విశ్వసిస్తారు. తెలుగుఁలో గేయ కవులకు కొన్ని నియమాలను వుల్లంఘించడానికి అభ్యనుజ్ఞ వున్నట్లే సంస్కృతంలో కూడా క్వాచిత్కంగా (కిమపభ్రంశేన భవతి గీతస్య, గోవర్ధన–చూ.) కనపడుతుంది. అనవసరంగా గ్రంథం పెరుగుతూ వుంది. తీర్థులు గేయమహాకవి. యీయన రచించిన గ్రంథం –

## శ్రీకృష్ణలీలాతరంగిణి

ఇది ప్రధానంగా గేయాత్మకం. శ్లోకములు కూడా కొన్ని లేకపోలేదు.

**"ప్రహ్లాద నారద పరాశరపుండరీక**
**వ్యాసాంబరీష శుక శౌనక భీష్మదాల్భ్యాన్,**
**రుక్మాంగదార్జున వశిష్ఠవిభీషణాదీన్**
**పుణ్యాని మాన్ పరమభాగవతాన్ స్మరామి"**

ఇత్యాది శ్లోకరచనవలన యీయనకు చంపూ రచయితలలో యెట్టి స్థానము వస్తుందో వ్యాకరించనక్కఱ లేదు. యీయన రచించిన తరంగిణిలో వచ్చే గాథ – శ్రీ కృష్ణజన్మదారభ్య రుక్మిణీకల్యాణం వఱకున్నూ –

అయితే యీ సందర్భం కూడా తీర్థులవారు కొంత గూఢంగా వ్యాకరించే వున్నారు గాని ఆ యీ రహస్యం తెలిసిన వారెందఱో నేను చెప్పడానికి సాహసించలేను. ఆ యీ రహస్యం యీ మధ్య నాకు తుట్టతుది మంగళహారతి గేయం –

**"మంగళం రుక్మిణీ రమణాయ శ్రీమతే,**
**మంగళం, రమణీయ మూర్తయేతే !**
**మంగళం, శ్రీ వత్సభూషాయ, శారిణేం**
**మంగళం, నందగోపాత్మజాయ !**
**జయమంగళం నిత్యశుభమంగళమ్"**

ఈ ప్రథమచరణంలో తుట్టతుది విశేషణం వల్ల శ్రీకృష్ణుఁడు నందయశోదలచే పెంచఁబడినవాఁడు అనే రహస్యం గోచరిస్తూ వుంది, పరిశీలించండి.

**యిఁక రెండోచరణం –**

**పూతనా కంసాది, పుణ్యజనహారిణే**
**పురుహూతముఖదేవ హితకరాయ,**
**సూతాయ విజయస్య సుందరముఖాబ్జాయ,**
**శీతకిరణాదికుల భూషణాయ ॥ జయ ॥**

యీ తుట్టతుది విశేషణంవల్ల యితడు చంద్రవంశం గాని, గొల్లవంశం కాదని తెల్పుతూ వుంది. యిక్కడికి వంశాన్ని గుఱించినవి రెండు ముఖ్య విషయాలు బయటికి వచ్చినట్లయింది.

**యిఁక మూడో చరణం...**

**"కాళీయ మౌళిమణి రంజితపదాబ్జాయ,**
**కాలమేఘశ్యామ దివ్యతనవే !**
**కారుణ్యరసవర్షి నయనాంబుజాతాయ,**
**కళ్యాణగుణరత్న, వారినిధయే ॥**
**జయ మంగళం నిత్యశుభమంగళం"**

## కొత్త తెలుగు ఉద్యమం : పిలుపు

భాష సజీవమైంది. సజీవతకు మార్పు సహజం. అతి ప్రాచీనమైన తెలుగుభాష ఎన్నో మార్పులకు గురైంది. మరెన్నో చేర్పులతో సంపన్నమైంది. వందేళ్లక్రితం తెలుగురచనలన్నీ గ్రాంధిక భాషలోనే చేసేవారు. శబ్ద ప్రామాణికతను నిరూపించాలంటే వెయ్యేళ్లు వెనక్కి వెళ్ళి నన్నయాదుల నుంచి ఉదాహరణలు పట్టుకునేవారు. గిడుగు రామ్మూర్తి వ్యవహారిక భాషోద్యమం ఊపందుకుని తెలుగుభాష రూపురేఖల్ని పూర్తిగా మార్చివేసింది. ఇప్పుడు వ్యవహారిక భాషే విశృంఖలంగా విహారం చేస్తోంది.

నేడు తెలుగుభాష క్రాస్‌రోడ్స్‌లో నిలబడి ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి, ప్రచార మాధ్యమాల ప్రభావం, సమాచార సాధనాల ప్రవేశం–వీటన్నిటి కారణంగా తెలుగుమాట కొత్త "పలుకుబడి"ని సంతరించుకుంది. ఛానెల్, ఎపిసోడ్, కేబుల్, డిష్, సెల్, సిమ్ లాంటి మాటలు జనసామాన్యంలోకి వచ్చాయి. వాటికి పర్యాయపదాలు కూడా లేవు. డివిడి, సి.డి., సినిమా లాంటి మాటలు సరేసరి. ప్రచార ప్రసార సాధనాల వల్ల ప్రస్తుతం పట్టణభాషకు జానపదభాషకు అంతరం పూర్తిగా తగ్గింది. రైతులు యూరియా, నైట్రోజన్, బోర్‌బావి, మోటారు లాంటి మాటల్ని, ఇంకా వ్యవసాయానికి సంబంధించిన అనేక మాటల్ని ఇంగ్లీష్‌లోనే వ్యవహరిస్తున్నారు. భాష అనేది భావవ్యక్తీకరణకు మాత్రమే అనుకున్నప్పుడు, ఏ మాట వాడినా తప్పులేదు. వ్యాకరణ సూత్రాలు కావ్యాలకే పరిమితం అయితే విచారించాల్సిన పనిలేదు.

తెలుగు భాష 'పస' తగ్గిపోతోందని పదేపదే వాపోవడం కన్నా, మన తెలుగుకి సరికొత్త జవజీవాలను ఇవ్వడం మంచిది. అందుకే సి.పి. బ్రౌన్ అకాడమి **"కొత్త తెలుగు ఉద్యమం"**కి శ్రీకారం చుట్టాలనుకుంది. అతిగా ఉన్న కట్టుబాట్లను సడలించి, పరభాషా పదాలను ఆదరించి మన తెలుగుని బలోపేతం చేసుకుందాం. ఆంగ్లభాష ప్రపంచమంతా వ్యాపించడానికి కీలకమైన రహస్యం – మోడరన్ ఇంగ్లీష్‌లో 90 శాతం పరభాషా పదాలు స్వేచ్ఛగా ఒదిగిపోవడమే. పూర్వం సంస్కృత, తమిళ, ఉర్దూ, పారశీక మాటల్ని చేర్చుకుని తెలుగు భాష సంపన్నమైంది. చట్ని, సాంబార్, దోశ నేడు తెలుగు మాటలే కదా! ఇప్పుడు తెలుగు భాషని స్వేచ్ఛగా వాడడానికి వీలు కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది. భాష సంకరమైపోయిందని నిష్టూరాలాడుతూ కూచోడం కన్నా ఆమోదించి మాతృభాషకి కొత్తరుచులు మప్పుదాం. మేధావులు, రచయితలు, భాషావేత్తలు మా ఈ ఆలోచనను ఉదారంగా ఆలోచించి కొత్త తెలుగు ఉద్యమానికి మీ సలహా సహకారాలు అందించాల్సిందిగా కోరుతున్నాం. పాఠకులు, ప్రేక్షకులు, శ్రోతలు కూడా తమ తమ అభిప్రాయాలను తెల్పండి. సాహితీ స్రవంతి ఈ ఉద్యమానికి వేదికగా నిలుస్తుంది. మిమ్మల్నందర్నీ సవినయంగా ఆహ్వానిస్తున్నాం.

– సాహితీ స్రవంతి
సంపాదకవర్గం.

ఈ చరణంలో కొంచెం లోతుగా పరిశీలిస్తే శ్రీకృష్ణ పరమాత్మ దయామయాంతరంగుఁడని మాత్రం తెల్లమవుతూంది. మొత్తం మీఁద విశేషణాలవల్ల గొల్ల కాదని, ఆ యీ విశేషణాలు తెల్పుతాయి.

**యిఁక నాలుగో చరణం,**

**నవనీత చోరాయ, నందాది, గోపగో**
**రక్షిణే గోపికా వల్ల భాయ,**
**నారదమునీంద్రనుత నామధేయాయతే,**
**నారాయణానంద తీర్థగురువే,**

ఇందులో, నారదమునీంద్రనుత అనే విశేషణం వల్ల పరమేశ్వరావతారం అని స్పష్టమవుతుంది. లాకలూకాయలనుగొప్పఁ జేసి నారదుఁడు నుతించఁడు కదా! యిందున్న గాధ, జనన ప్రభృతి కళ్యాణపర్యంతమే కాని' అంతకు పూర్వంగాని పదంగాని జరిగిన విషయాలు స్పృశించలేదని, పూతనాసంహారాదులు తెలుపుతూ కొన్ని విషయాలను నందాదిగోపగోరక్షిణే, అనే విశేషణాలు తెల్పుతూన్నాయి. మొత్తం యావరేజీని పరిశీలిస్తే, శ్రీకృష్ణుని బాల్యచేష్టలను తీర్థులవారు ముముక్షుజనులకుగాను దీన్ని, రచించి పరమోపకారం చేశారు. నేను యీ ముదిరిన వార్ధకం దీనివల్ల చాలా సులువుగా కాలక్షేపం చేస్తున్నాను. నా చిన్నతనంలో మా తండ్రిగారు వగయిరా, (పుష్పమాకబ్రహ్మయ్యగారు) వీట్లకు పాడుతూ వుంటే విన్న జ్ఞాపకం నాకు. యిప్పుడు తరుణోపాయమయింది.

**"జర రాఁబోఁగలదంచు నే నెఱిఁగియున్**
**జర్చింప లే దింతదు**
**స్తరమౌనంచి పుడేని యేమిచెడియెన్,**
**దైవంబు నీపాదమౌ**
**దరువున్ జూపెను, దీని నశ్రమముగా**
**దాఁటంగ నే నేర్తు ఛీ**
**మరుతో సాగర మెట్టిదేని సుఖగ**
**మ్యంబంబ కామేశ్వరీ"**
**"తమ మక్షిద్వయ మాక్రమించుటకు నై**
**దౌడవ్వులన్ జేరి రం**
**ధ్రముల న్వేషణ సేయుచున్న ముదురుం**
**బ్రాయమ్ము వార్ధక్యం, మెం**
**త మహారాజును దీనిబారిఁ బడుచో**
**ధైర్యమ్ము గోల్పోవు, నెం**
**తమదోన్మత్తుఁడు దీనికిన్ జడిసెడిన్,**
**నా తల్లి కామేశ్వరీ**
**అల మతివిస్తరేణ. స్వస్తి.**


(శాస్త్రిగారి స్వదస్తూరి)

**(భారతి–ఏప్రిల్ 1950 నుంచి)**

❖ కథా కస్తూరి

# చిలకరంగు విమానం

❖ తాతా కృష్ణమూర్తి

**పాశ్చాత్య సాహిత్యాన్ని నాటి ఆధునిక పోకడలను తెలుగు కథల్లోకి తెచ్చినవారు తాత కృష్ణమూర్తి. Lamb, Hazlitt లాంటి రచయితల ప్రభావం వుంది. 1930 దశకంలో కృష్ణమూర్తి కథలు, స్కెచ్‌లు విరివిగా రాశారు. ఒక కథా సంపుటి కూడా వెలువడింది. –సం॥**

తాను చేసుకున్న మనోనిశ్చయానికి యెట్టి విఘ్నమూ కలుగచెయ్యవద్దని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ "త్రాటిల్" తెరచినాడు రాయి. ధూళి రేపుతూ చక్రాలమీద శరవేగంతో ముందుకొక ఫర్లాంగున్నర దూరం పరుగెత్తి, క్రమంగా దేగవలె వయ్యారంగా పైకి లేచింది విమానం. కందిరీగ రొదతో వలయాకారంగా తిరుగుతూ, కోటచుట్టూ ఒకసారి ప్రదక్షణం చేసి యెత్తుగా గాలిలో తేలిపోయింది తారాజువ్వవలె. ఉదయభానుని బంగరు కాంతిలో విలాసంగా విహరించే సీతాకోక చిలుకవలె రమ్యంగా రెక్కలమీద ఒరుగుతూ, కిందికీ మీదికీ ఊగులాడుతూ, ఉండి లేదనిపించేటట్టు తళుక్కున మెరుస్తూ, నిమిషంలో చూపుకు చిన్నదై అంతరిక్షానికెగిసింది "ప్లేను."

క్రమంగా చెట్లు, చామలు, కొండలు, నదులు, పల్లెలు, అన్నీ పటములో అగుపడే రంగుల మరకలవలె ఎత్తుపల్లాలేకమై, చిన్నవిగా, ఆకారపరిణామాలనే కోల్పోయినట్లు మసక మసకగా కనపడినవి రాయ్ కళ్ళకు. దిలీపాస్తాన సరిహద్దులు దాటి, కొండల మీదుగా ఉత్తరం వైపు మళ్లింది విమానం. ఇంజన్ మోత నిశ్శబ్దమైన నీలిమాకాశమున గాలి శ్రుతులతో కంఠము మేళవించి ఉత్సాహంతో స్వేచ్ఛగా పాడుకొనే విహంగ గానంవలె ఇంపుగా ఉంది, అతని చెవులకు. క్రమంగా 9,10,11 వేల అడుగుల యెత్తును సూచిస్తూ కదిలింది ఆల్టీమీటర్ ముల్లు. గంటకు 90 మైళ్ళ గమనంతో రివ్వున పోతూ ఉంది ప్లేను.

నెల దినముల కిందటనే ఇంగ్లాండునుంచి వచ్చిన సరికొత్త "ఫాక్స్‌మాత్" విమానమది. వెండిరంగు రెక్కలు, చిలుకవన్నె దేహం గల అందమైన ప్లేను. ఇంజన్‌కు, కాక్‌పిట్‌కు నడుమ తనకెదురుగా ఉన్న విశాలమైన కాబిన్‌లో ఒకరి ప్రక్క నొకరు అనవసరమైన యిరకటంతో శరీరాలు రాసుకుంటూ, ప్లేను ఇటూ అటూ కొంచెం ఒరిగినప్పుడల్లా ఒకరిమీద ఒకరు నొక్కుకుపోతూ, చిన్నపిల్లలవలె ఆనందంతో నవ్వుకుంటూ ఏవో ముచ్చటలాడుకుంటున్న యిద్దర్నీ అట్టే చూసినప్పుడల్లా, ఆ విమానాన్నీ, దాన్ని నడపడానికి అమర్చి ఉన్న యంత్ర సామగ్రినీ, తన సారథ్యాన్నీ, లోకాన్నీ, దేవుణ్ణీ–సర్వం మరచిపోయేవాడు రాయ్. హృదయంలో దావానలం రగిలేది. మోతాదు మీరి తాగినవానికి వలె తల జుమ్మున తిరిగేది. కడుపులో ఏదో వికారం పుట్టేది. తప్పిపోతున్నట్లుండిన స్మృతిని మనోబలం చేత తిరిగి స్వాధీనంలోనికి తెచ్చుకుంటూ కాబిన్ నుంచి దృష్టి మరల్చుకొని కంపస్‌వేపు నిదానించి చూసేవాడు. సూటిగా ఉత్తరంవైపు చూపుతూ ఉన్న సూది గజగజ వణుకుతూ ఏ దిక్కు చూపుతున్నదీ తెలుసుకోలేకపోయేవాడు క్షణం వరకు !

నిర్మలమైన ఆకాశం, ఉదయం 8 గంటలవేళ, గాలి రివ్వున వీస్తూ, కొద్దిగామాత్రం తెరిచి ఉంచిన మైకా కిటికీలద్వారా కాబిన్ చొచ్చి, ప్రయాణీకుల మొగాలపై చుర్రున తగిలేది.

"నీవైపు ఉన్న కిటికీసాంతం మూసివేయి, చలిగా ఉంది." అన్నాది ఇందుబాల, రేగి కండ్లలో పడుతూ ఉన్న ముంగురులను ఎగదోసుకుంటూ. "చలిమాట దేవుడెరుగును ! చెంపలు వాయిస్తూ ఉంది, యీగాలి!" అన్నాడు దిలీప్‌కుమార్ కిటికీమూస్తూ.

"బుద్ధిగా కూచోకపోతె వాయించదూ మరి?" అన్నాది, ఇందు మధురంగా నవ్వుతూ.

ఆమె నడుము మీదినుంచి తన చేతిని తీసివేసినాడు దిలీప్. ఇద్దరూ ఒకరిమొగం ఒకరుచూసుకొని నవ్వుకున్నారు.

"ఒక నిర్ణయంమీద నిలువలేని మనిషిని ఏమనాలి?....ఇట్లా అయితే నేను కాక్‌పిట్‌లో పోయి కూచుంటాను." అని బెదిరించింది, ఇందు.

క్షణం ఊరుకొని, "ఆకలితో యజమాని దయకోసం నిరీక్షిస్తూ, ఒక దుమ్మముక్క నోటికి దొరుకుతుందేమో అన్న ఆశతో ఎడంగా పాదాలచెంత గంతులువేసే పెంపుడు కుక్కకున్న అధికం లేదే నాబ్రతుకు! ఆమాత్రానికి కూడా అర్హత లేకుండా చెయ్యాలనా నీ పంతం?" అన్నాడు దిలీప్.

నవ్వుతూ ఇందుబాల, "అలాటి కుక్క మోస్తరు కాదే నువ్వు! భద్రంగా గూట్లో దాచుకున్న వెన్న, పాలు ఎట్లాగో దొంగలించి యెత్తుకుపోయే పిల్లివరస నీది!" అన్నాది.

"ఏం లాభం? ఎలకమాంసం లభ్యమైతే తృప్తికాని, పాలు వెన్న వంటి అల్పాహారాలతో కడుపునిండుతుందా పిల్లికి?" అన్నాడు దిలీప్ సరసంగా.

ముసిముసి నవ్వుతో వానిని క్రేగంటచూస్తూ, యేమీ బదులుపలకలేదు ఇందు. అదివరకు గాలి ప్రయాణం అలవాటు లేక, కాబిన్‌లో

ఒకమూలకుచేరి, భయంతో మొరుగుతూ ఉన్న జాలుకుక్కపిల్లను ఒడిలోకి తీసుకొని, ప్రేమతో తలనిమిరి దానికి ధైర్యమిస్తూ, దువ్వుతూ కూచుంది. కుక్కలంటే ఆమెకు వెర్రిసరదా యేమీలేదు కాని, బయలుదేరేముందు దిలీప్ రాకుమారుడు కోరి బహుమతిగా ఇచ్చిన ఉత్తమజాతి కూన అది.

సుమారు 4,5 మాసములై ఉంటుంది దిలీప యువరాజుతో ఇందుకు పరిచయంకలిగి. మొదట రాయ్ ఒకనాడురాత్రి వానిని విందుకు పిలిచి, ఇంటికి తోడ్కొనివచ్చి, భార్య కతని పరిచయం కలుగజేసినాడు.

"ఇందూ, ఇతడు మాఫ్లయింగ్ క్లబ్‌కు ముఖ్యమైన మెంబరును, నాకు క్రొత్తశిష్యుడును అయిన దిలీపకుమార్-యువరాజు."

చిరునగవుతో చెయ్యి ఇచ్చి వానితో షేక్ హాండ్ చేసింది ఇందు.

అది మొదలు ఇందూరాయ్ దంపతులతో దిలీపునకు బాగా స్నేహం కుదిరింది. ముగ్గురూ చిన్నవాళ్లు, స్వేచ్ఛాప్రియులు. ఒకరిపట్ల ఒకరు చనువుగా మాయమర్మములు లేకుండా వర్తించేవారు.

క్లబ్బులో విద్యార్థులకు ఎగరడం నేర్పే పైలట్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉండేవాడు రాయ్. ఇంగ్లాండులో తరిఫీదై, పెద్దపెద్ద పరిక్షలు పాసై, గొప్ప జీతం మీద ఆ క్లబ్బుల్లో ఉద్యోగానికి కుదురుకున్నాడు. మనిషి 30 ఏళ్ళవాడే కాని, మంచి భారీ విగ్రహం. స్ఫుర ద్రూపి. ఆజానుబాహు. వస్తాదువలె చేతికండలు తిరిగి బలంగా ఉండేవాడు. ముఖం గంభీరంగా, దయగా, శాంతంగా కనపడేది. మధ్య పాపిట తీసేవాడు. మీసం ఉంచుకునే వాడు కాదు. హిందూ దేశానికి తిరిగి వచ్చిన పిమ్మటనే ఇందుబాలను కలుసుకొని, ప్రేమించి, పెళ్ళిచేసుకున్నాడు. ఇంకా ఏడాది నిండలేదు వివాహమై. దంపతులొకరి నొకరు ఎంతో ప్రేమించుకునేవారు.

భర్తకంటె ఇందుబాల 9 ఏళ్ళు చిన్నది. ఎన్నవలసిన రూపవతి. తీరైన మొగం, చారడేసి కళ్లు, ముద్దులు కులికే పెదవులు, నిగనిగలాడే తుమ్మెద రంగు జుట్టు, తెల్లగా దంతంవలె మెరిసే నునుపైన మెత్తని ఒళ్లు, కలిగి మంచి ఏపుగా, ఆరోగ్యంగా, నాగరీకంగా కనపడేది. మగవాళ్ళతో స్వేచ్ఛగా, ధైర్యంగా, దొరసాన్లవలె బెదురులేకుండా సంచరించేది. ఉన్నత విద్యలు నేర్చినది.

రాయ్‌ని ప్రేమించి పెండ్లాడిన తరవాత, అతని పైలట్ వృత్తిని గూర్చి అప్పుడప్పుడామె దిగులుపడుతూ ఉండేది-ఎప్పుడేప్రమాదం వచ్చి అతడు, అతని ప్రేమ తనకు దూరమౌతావో అని! అయినా, మనసులో తానెంత భయపడుతూఉన్నా, భర్తను ఆ ఉద్యోగం చాలించుకోమని ఎన్నడూ చెప్పేదికాదు. ఎగరడమంటే అతనికి వెర్రి ఆనందం, ఉత్సాహం అన్న సంగతి గ్రహించుకుంది. వానితో తానూ అప్పుడప్పుడు విమానమెక్కి ఆ ఎగరడంలో ఉండే అద్భుతానందాన్ని అనుభవించి, అర్థం చేసుకుంది. మొదట్లో కొంచెం జంకేది ఎయిరోప్లేనెక్కడానికి; కాని మగనితో కూడా కాక్‌పిట్‌లో పక్కనే కూచొని, మీద చెయ్యివేసి, అతనితో కలిసి గాలిలో తేలిపోతూ ఉన్నప్పుడు, ఎంతో ధైర్యంగా సరదాగా ఉండేది అమెకు. మొదట ఉన్న తన పిరికితనానికి అప్పుడు తానే సిగ్గుపడేది. భర్త సారధ్య నైపుణ్యానికి ఆశ్చర్యపడేది. చిన్నపిల్లవలె చప్పట్లు చరుస్తూ, బ్రహ్మానంద భరితురాలై ప్రేమతో అతని భుజం ముద్దాడుతూ, ''నువ్వు గంధర్వుడివి-దేవలోకం వదలి నాకోసం భూమిమీదికి దిగిన దేవుడివి!" అనేది. రాయ్ హృదయం సంతోషంతో పొంగిపోయేది, అట్టి సమయాలలో.

పావురా పిట్టలవలె గాలిలో ఎగురుతూ, ఒకరినొకరు గాఢంగా ప్రేమిస్తూ, ఎంతో హాయిగా దినాలు గడుపుతూ ఉండేవారు ఇందూరాయ్‌లు.

దిలీప్‌కుమార్‌తో ఇద్దరికీ స్నేహం ప్రబలుతున్న కొద్దీ ఆ దంపతుల జీవితాకాశాన క్రమంగా చిన్నచిన్న మబ్బులు పొడచూపినవి. అదివరకు గట్టిగా ప్రేమటంకంతో అతుకుకొనిపోయిన వారి హృదయాలు ములికతో పెకలిస్తున్నట్లు కొంచె కొంచెం విడబడసాగినవి. దిలీపునితో ఇందుకు చనువు ముదురుతున్న కొద్దీ ఎన్నడూ లేని అనుమానం, అంకురించినది రాయ్ హృదయంలో. కాని తననట్లా ప్రేమించే స్త్రీరత్నాన్ని శంకించగల తన నీచప్రకృతికి తానే సిగ్గుపడాలనుకొని ఊరుకునేవాడతడు.

దిలీపునితో చెలిమి ఇందుకు ఇంపుగానే ఉంటూ వచ్చింది; కాని అప్పుడప్పుడామె హృదయంలో రగిలే వెర్రి కోర్కెలకు భయపడుతూ ఉండేది. ఏ నిమిషాన తన మనోదేహాలు స్వాధీనం తప్పిపోయి అతని వశమౌతాయో అని తనలో తాను కంపించిపోయేది. రాయ్‌ని, అతని అపారప్రేమను తల్చుకొని మళ్లీ మనసు లొంగదీసుకుంటూ ఉండేది.

భర్త మనసులో కల్లోలం ఇందుకు తెలియదు. భార్య మనసులో ఆరాటం రాయ్‌కి తెలియదు. ఈ ఇద్దరి మనసులలో సంచలనమూ దిలీపునకు అసలే తెలియదు. నిజానికి, ఎవరిపట్లా అన్యాయంగా వర్తించుదామన్న ద్రోహచింత ఆ ముగ్గురిలో ఎవరికీ లేదు. కాని....

దిలీపునకు రాయ్ అంటే అమిత గౌరవము. తన ప్రాణంకంటె అధికంగా ఎంచేవాడతని స్నేహాన్ని. రాయ్‌కంటె నాలుగైదేళ్లు చిన్నవాడు దిలీప్. సన్నగా పొడుగ్గా, చామన చాయగా, నాజూకుగా ఉండేవాడు. మొగం నవ్వుతూ, కళ కళ లాడుతూ ఉండేది. కళ్లలో తెలివితేటలు ప్రతిఫలిస్తూ మెరిసేవి. మీసాలను పెంచి, అందంగా కత్తిరించి, పొమేడ్ రాసి నులిపి, సూది మొనగా దిద్దేవాడు. ఐరోపాదేశాలలో కొంతకాలం ఉండివచ్చిన యువరాజు, ఇంకా పెండ్లి చేసుకోలేదు.

ఇందూరాయ్‌లతో అతడు మిక్కిలి స్నేహంతో, చనువుతో, దగ్గిర బంధువువలె మెలిగేవాడు. మనిషి ఎప్పుడూ కులాసాగా కబుర్లుచెపుతూ, నవ్వుతూ, నవ్విస్తూ, విచారమంటే ఎలాటిదో ఎరుగని అదృష్టవంతునివలె కనబడేవాడు. ఇందుబాలతో ముచ్చటిస్తున్నప్పుడు కాని, ఆమెకు చేరువగా కూర్చున్నప్పుడు కాని, దిలీపుని హృదయం ఎందుకో ఆనందపరవశత్వంతో గంతులాడేది. అదివరకెన్నడూ స్త్రీలస్నేహంలో అతనికి అలాటి అద్భుతానందం లభించలేదు. డబ్బుగల యువరాజు గనుక, ఎందరెందరు స్త్రీలతోనో పరిచయం కలిగేది అతనికి. ఎన్నెన్ని ప్రేమసుఖాలనో చవిచూసినాడు కాని అతని ప్రణయానుభవాలలో ఎన్నడూ, ఏ సౌందర్యవతీ ఇందువలె అతని హృదయకుహరంలో జొరబడి, ఈవిధంగా మనిషిని వెర్రెత్తించి ఉండలేదు. ఇందుబాలను చూచిన మాత్రాన, తలచుకున్న మాత్రాన, అతని నరాలలో రక్తం దూకుడుతో నాట్యమాడుతూ ప్రవహించేది. హృదయం పాటలు పాడేది. ఇందు సాన్నిధ్యంలో ఉన్నప్పుడతనికి స్వర్గంలో ఉన్నట్లుండేది. ఒళ్లు

తెలిసేది కాదు. అయినా రాయ్‌ని, రాయ్ స్నేహాన్ని మరచిపోలేక, దూరంనుంచే ఆమెను పూజించదలచుకునేవాడు. అంతకంటే అధికం ఆశించడానికి ఎందుచేతనో అతని అంతరాత్మ ఒప్పుకునేది కాదు. శరీరం మాత్రం ఎన్నోవిధాల తరుచుగా ఎదురు తిరుగుతూ గోలచేసేది.

దినాలు గడచినకొద్దీ దిలీపుని స్థితి దుర్భరం అయింది. ఇందు కూడా తనమీద మోహంకొద్దీ అట్లానే బాధపడుతూ ఉంది కాబోలని అనుకునే వాడప్పుడు - ఆమె చూపులను, మాటలను, చేష్టలనుపట్టి. దీక్షతోను, ఉత్సాహంతోను, రాయ్ శిక్షణ కింద విమాన సారధ్యం కొంతవరకు సాధించాడు దిలీప్. 'బీ' తరగతి పైలట్ లైసెన్సు సంపాదించగలిగాడు. రాయ్‌ని సలహా అడిగి, 27 వేలుపెట్టి స్వంతంగా తానొక "ఫాక్స్‌మాత్" విమానాన్ని కొన్నాడు. గంటకు 130 మైళ్ళ స్పీడ్‌తో పోగలది అది. వెయ్యి పౌనుల బరువుతో పైకి 25000 అడుగుల ఎత్తువరకు లేవగలది. "డీహావిలాండ్ ఎయిర్ కంపెనీ" వారి పురమాయింపున తయారయిన ఆకుపచ్చని విమానమది. "జిప్సీ మేజర్ ఇంజన్" కలది.

ఆ విమానంలోనే ముగ్గురూ ప్రయాణం చేసి దసరా పండుగకు దిలీపుని సంస్థానానికి వెళ్ళి, వస్తున్నారిప్పుడు.మూడు దినాలు మాత్రం ఆ ఊళ్లో ఉండి, పండుగ వినోదాలలో పాల్గొని, వేడుకలన్నీ చూసి, విందులు కుడిచి, విజయదశిమి ఉత్సవం మర్నాడు వినోదార్థం వేటకని అడవుల్నీ తిరిగి ఏవో పిట్టల్ని ఒక అడవి పందినీ కొట్టి, అలిసి పొద్దుకూకే వేళకు కోట చేరుకొని, ఆఖరు దినమని అర్ధరాత్రివరకూ విందులు, వినోదాలు, ఆసవాలు, ఆటలు, పాటలు, ముచ్చట్లు మొదలైన వాటితో గడిపి, ఉదయం 7-30 గంటలకు కాఫీలు తాగి తిరుగు ప్రయాణం మీద విమానంలో బయలుదేరినారు. తానెంత ఉదార స్వభావంతో కళ్లుమూసుకొని, లెక్కచెయ్యకుండా ఊరుకుందామనుకున్నా, ఆ ఉత్సవదినాలలో ఇందూ దిలీపుల ప్రవర్తన పిచ్చెత్తించింది, రాయ్‌ని. అతని జోక్యమే లేనట్లు ఇద్దరూ ఎప్పుడూ కలిసి మసలేవారు. వాళ్ల ముఖాలే చాటేవి ఒకరినొకరు ప్రేమిస్తున్నట్టు. వాళ్ళ సరసోక్తులు, భావ వీక్షణాలు, మందహాసాలు-అన్నీ చూసీ చూడనట్టు కనిపెడుతునే ఉండేవాడు రాయ్. కాని సుతిమించేవరకూ సహించుకోవడం కొంతవరకు నేర్చుకొన్నాడు, పాశ్చాత్య నాగరికతకలవాటు పడినవాడు గనుక.

ఆఖరురోజున ఇద్దర్నీ డాబామీద వెన్నెట్లో ప్రత్యక్షంగా చూశాడు, ఒకరికౌగిట్లో ఒకరు ఉండడం. దిలీపుని మెడచుట్టూ చేతులు పెనవేసి; ముఖం ఎత్తి ముద్దులు పుచ్చుకుంటూ ఉంది, ఇందు. నిశ్చేష్టుడై క్షణం వరకు ఆ దృశ్యం నిజమా, కలా, అని సందేహించాడు రాయ్. రోడ్డుమీద అజాగ్రత్తగా పడుకున్నకుక్క నడ్డిపైనుంచి బరువైన బండిచక్రం ఎముకలను కటకటా పిప్పిచేస్తూ దొర్లివెళ్ళినప్పుడు అది ఎంతబాధపడుతుందో, అంతబాధపడ్డాడు. ఏం చెయ్యాడానికీ తోచలేదు. ఇంతలో వాళ్లిద్దరూ విడబడి, తాను నిల్చున్న మెట్లవైపే వస్తున్నట్లు పొడగట్టింది అతనికి. సన్నసన్నగా వెనకకుమళ్ళి, హాలులో సోఫామీద చతికిల పడ్డాడు.

ఇంకో ఐదునిమిషాలలో ఇద్దరూ కిలకిలా నవ్వుకుంటూవచ్చి కలుసుకున్నారతన్ని. రాయ్ ఏమీ మాటాడలేదు. టేబులుమీది సీసాలో విస్కీ గ్లాసునిండా పోసుకొని దించకుండా తాగుతున్నాడు, వాళ్లు వచ్చేసరికి. ఆరాత్రి భోజనానంతర వినోదాలలో రాయ్ అట్టే ఉత్సాహంగా కనపడక పోవడానికి కారణం బహుశః అతనికి ఒకచుక్క జాస్తి అయిందేమో అనుకొని నవ్వుకున్నారు ఇందూ దిలీపులు.

చికిత్సకు లొంగనంతమోపుగా గాయపడింది రాయ్ హృదయం. అదివరకతన్ని బాధిస్తూ ఉండిన శంకలన్నీ రుజువుకు వచ్చి రూఢిపడి, తన ప్రేమను, మగతనాన్ని, భర్త్రాధికారాన్ని ధిక్కరించి వెక్కిరిస్తున్నట్లనిపించింది, అతనికి! ఇందూ దిలీపులు అన్యోన్యానురక్తులై, తనకంట్లో ధూళికొట్టి రహస్యంగా కలుసుకుంటూ క్రీడిస్తున్నారని స్థిరపరచుకున్నాడు రాయ్.

ఇద్దర్నీ నిలదీసి అడిగితే? ... ఏం లాభం? దొంగపని చేసినవాళ్లు తనతో నిజం చెపుతారా? ఒకవేళ ఒప్పుకొని నిజమే అని చెపితే, తన బాధ ఏమైనా నివారణ అవుతుందా? మరింత దుస్తరమైపోదూ?.... తనమీద ప్రేమలేదని చెప్పి విడిపోయి, దిలీపునితో లేచిపోతానని ఇందు కాని అంటే! ఆమెను వదలి తాను జీవించగలడా? ఆమె నూరు తప్పులు చేసినా సరే, ఆమె మీది మమతను తాను చంపుకోగలడా? ..... అంత గాఢమైన, స్థిరమైన, అగాధమైన వలపు అతనిది!

దిలీప్‌కుమార్ తననిట్లా మోసం చేస్తాడని కలలోనైనా అనుకోలేదే తాను! నాడు బ్రూటస్ కత్తిపోటుకు బాధపడిన సీజర్‌వలె బాధపడ్డాడు రాయ్.

ఇంతకూ దిలీపుని అనవలసిన పనిలేదేమో అనుకున్నాడు మళ్ళీ. ఇందు రూపం అట్లాటిది-పురుష హృదయాలను రెక్కలపురుగులవలె ఆకర్షించి దగ్ధం చేసే తీక్షణమైన దీపం వంటిది ఆమె అందం ! మెదడు వేడెక్కించుకొని తీవ్రంగా ఆలోచించాడు రాయ్, కర్తవ్యమేమిటని. ఏమీ పాలుపోలేదు. ఇందు ప్రేమను కోల్పోయిన తన బతుకు వ్యర్థమని తలచి, పగసాధించుకుందుకు యత్నించేకన్న ఆత్మహత్య చేసుకోవడం మేలు కాదా అనుకున్నాడు. అట్టి త్యాగశక్తి తన ప్రేమలో ఉన్నదని అతని నమ్మకం. తాను ప్రేమించిన స్త్రీకి సౌఖ్యం కూర్చడమే తాను కోరవలసినదని ఎంచి సంతోషంతో ప్రాణములు అర్పించిన సిడ్నీకార్టన్ కథ జ్ఞప్తికి వచ్చింది రాయ్‌కి.

కాని ఇందును దిలీపుడు సుఖపెట్టి కలకాలం ప్రేమిస్తాడని యేమిటా నమ్మకం తనకు? ఉభయభ్రష్టత్వం చేసి దాని బతుకు మట్టిలో కలుపుతాడేమో?.....తాను చచ్చిన తరవాత ఎవరిగతి ఏమైతే తనకేమనుకున్నాడు మళ్ళీ.

అట్లాకాదు-తాను చెయ్యదలచుకున్న త్యాగానికైనా కొంత విలువ ఉండాలి. అర్థం ఉండాలి, ప్రయోజనం ఉండాలి!

దిలీపునే విడదీస్తే?....వాడిమీద బెంగపెట్టుకొని గుండెపగిలి మరణిస్తుందేమో ఇందు? ఆ తలపుతో గుండెలో భయంకరమైనపగ, ఈర్ష్య పొంగుకొచ్చినవి రాయ్‌కి. ఇందుబాలమీద చెప్పరాని ద్వేషం కలిగింది. డెస్డిమోనాను పీక పిసికి చంపేముందు ఒథెల్లో పడిన హృదయావేదన అతడూ అనుభవించాడు ఆముహూర్తంలో. మనసుతో ఎన్నోవిధాల యుద్ధంచేసి, తుదకొక దారుణమైన సాహసకృత్యానికి

నిశ్చయించుకున్నాడు-తిరుగు ప్రయాణంలో విమానంతో సహా ముగ్గురూ ఏకముహూర్తంలో అంతము కావలసినదే అని !......

ప్లేను నడుపుతూ ఎదురుగా ఉన్న కిటికీవంటి పెద్ద గాజు రంధ్రంలోనుంచి కాబిన్ వేపు చూసినప్పుడల్లా, తన వైపు వీపులాని సుఖాసీనులై ఉన్న ఇందూ దిలీపుల భుజాలు, తలలు మాత్రమే కనపడేవి రాయ్‌కి. ఒక్కొక్కప్పుడు వాళ్లు ప్రక్కగా ఒరిగి ఉన్నప్పుడు అసలు ఏమీ కనబడేది కాదతనికి. ఇంజన్ ఝూంకారంలో వాళ్ళ సంభాషణ ఏ మాత్రం కూడా వినబడడానికి అవకాశమే లేదు. కాబిన్‌లోనైనా ప్రక్కవాళ్ళ చెవిలో నోరుపెట్టి బిగ్గరగా అరిస్తేనే కాని ఒకరిమాట ఒకరికి వినిపించదు. కాబిన్‌లో నుంచి పైలట్‌తో సంభాషించాలంటే టెలిఫోన్‌వలె అమర్చిన గొట్టం ద్వారా మాట్లాడాలి, గొంతు చించుకొని.

ఇందూ దిలీపులొకరి ప్రక్క ఒకరు చేరువగా కూర్చోడం మాత్రమే గమనించగలిగి, తనకు ఈర్ష్యాక్రోధములు రేపే యితర విషయాలను ఊహాశక్తివల్ల తానే కల్పించుకొని, మనసులో తుపానును లేవనెత్తుకొంటూ బాధపడజొచ్చినాడు రాయ్. హటాత్తుగా ప్లేనును పడద్రోసి ధ్వంసం చేద్దామన్న భయంకరమైన తన మనోనిశ్చయాన్ని తల్చుకొని తనలో తాను కంపించిపోయేవాడు.

ఎదురు గాలిని ఢీకొంటూ, గాలికెరటాలపై ఉయ్యాలలూగుతున్నట్లు ఒరుగుతూ, తేలుతూ ఉత్తర ముఖంగా వందమైళ్ల వేగంతో పోతూ ఉంది ప్లేను. అతని కుడి చెంపమీద సన్నని ఎండ పడుతూ ఉంది. జాయ్‌స్టిక్‌ను తనవైపు గుంజుకొని ఇంకా ఎత్తుగా లేపినాడు ప్లేనును. 12వేల అడుగుల ఎత్తు సూచించింది ఆల్టీమీటర్. ఏకి విరజల్లిన దూది పింజలవలె అక్కడక్కడ చిన్న చిన్ని మబ్బులు ఎదురైనవి. గాలి చలిగా వీచింది.

మరికొంతసేపటికి సూర్యుణ్ణి కప్పేస్తూ నల్లని పెద్ద మబ్బొకటి ఎదురైంది. హటాత్తుగా కళ్ళు మిరుమిట్లు గొలిపెటట్లొక సన్నని నీలి మెరుపు మెరిసింది. ఇంజన్ ధ్వనిలో ఉరుముల గర్జన వినరాలేదు. మరుసటి క్షణంలో రాళ్ళు రువ్వినట్లు ఫెళ ఫెళ ధ్వనులతో పెద్ద పెద్ద చినుకులు పడజొచ్చినవి. ప్రళయమైన గాలితో జోరుగా ప్రారంభించింది వర్షం. విమానం చుట్టూ దట్టమైన మేఘాలు ఆవరించినవి. భూమ్యాకాశాలు రెండూ ఏకమై చీకటిలో ముంచినవి ప్లేనును. తనలో తాను గిర్రున తిరుగుతున్నట్లనిపించింది రాయ్‌కి. ప్లేను ఎటుపోతున్నదీ, ఏమవుతున్నదీ, తెలియలేదతనికి. గొంతు పగిలేటట్లు అరుస్తున్న ఇంజన్ చప్పుడు మాత్రం ఇతర ధ్వనులనన్నిటినీ మించి, చెవులు బ్రద్దలు చేస్తూ ఉంది.

గుండీనొక్కి కాక్‌పిట్‌లో విద్యుద్దీపం వెలిగించాడు రాయ్. డాష్ బోర్డ్ మీద మెరుస్తున్న యంత్రపరికరాలు అన్నిటినీ ఒక్కసారి దీపం వెలుగున వరసగా చూసుకున్నాడు,-వాయువేగసూచన యంత్రం, కంపస్, గడియారం, ఆర్టిఫిషల్ హొరైజన్, ఆల్టీమీటర్, ఫ్యూయల్ గేజ్, గాలి ఒత్తిడి తెలిపే యంత్రం, మొదలయినవన్నీ. మబ్బులను పెకలించుకుంటూ, తడిసి బరువెక్కిన రెక్కలతో శక్తికొద్దీ ఈదుకొని పోసాగింది విమానం.

తన సంకల్పాన్ని ఆమోదించి దేవుడు కూడా గాలివానతో తనకు తగిన సహాయం చేయబూనినట్లుగా భావించుకున్నాడు రాయ్. కనురెప్పపాటులో ప్లేనును వెయ్యి చెక్కలయేటట్లు పడద్రోయడానికి అనుకూలమైన మంచి సమయమది! ఆ తలపుతో అతనికి తల గిర్రున తిరిగి, కళ్ళు చీకట్లు కమ్మినట్లయింది. చేతులు వణకనారంభించినవి. గుండె దడదడ లాడింది.

ఇంతలో "రాయ్, రాయ్,...... ఏమిటీ గాలివాన ప్రళయం?...నాకు భయం వేస్తూ ఉంది?" అని గొట్టంలోనుండి అస్పష్టంగా వినవచ్చింది ఇందు స్వరం.

గాలం వేసి చేపను గుంజినట్లు ఆమె కంఠధ్వని రాయ్ హృదయాన్ని గుంజింది బాధాకరంగా. కాని మనోనిశ్చయాన్ని తల్చుకొని గుండెరాయి చేసుకున్నాడతడు. జబాబియ్యకుండా ఊరుకున్నాడు.

ఇంకా యేమో అంటూ ఉంది ఇందు. వినిపించుకోదలచుకోలేదు రాయ్. ప్లేను అతని స్వాధీనంలోనుంచి తప్పించుకో యత్నిస్తున్నట్లు ఇటూ అటూ ప్రమాదకరంగా ఒరుగుతూ పోసాగింది. రాయ్‌కి పౌరుషం కలిగింది. ప్లేను తన చెప్పుచేతలలో అణగి ఉండవలసిందే కాని, అట్లా దాని చిత్తం వచ్చినట్లు పోవడమా మరి!

ఎక్కువ వేగంతో ప్లేను నడుపుస్తూ ఉన్నప్పుడు, కంట్రోల్స్‌ను ఆతురతకొద్దీ బలంగా కదిపితే రడ్డర్, ఎయిలిరాన్, మొదలయినవి కాగితం చిరిగినట్లు చించుకుపోతాయి ఎక్కడివక్కడ. కాబట్టి రాయ్ బహు జాగ్రత్తగా జాయ్‌స్టిక్‌ను లాక్కుని పైకి లేపినాడు ప్లేనును. 15వేల అడుగుల ఎత్తునకూడా మబ్బులు వదలలేదు. వర్షం కుంభవృష్టిగా కురుస్తునే ఉంది. చలివల్ల చేతులు వణుకుతూ కొరడుబారుతున్నాయి. ఒంట్లో రక్తం పేరుకొని పోతూ ఉందా అనుకున్నాడు రాయ్. ప్రమాదకరమైన తుపానులో చిక్కుకొని అవస్థపెడుతూ ఉంది ప్లేను.

మళ్లీ వినవచ్చింది ఇందు పిలుపు, భయకంపిత స్వరము. ఆమె కంఠధ్వని విద్యుచ్ఛక్తివలె అతని శరీరమంతటా వ్యాపించి, వానిని అదివరకావహించిన జెలసీదయ్యాన్ని అప్పటిమట్టుకు పోద్రోలింది. దగ్గిరలో ఉరుముల చప్పుడు వినవచ్చింది. ఇందు ప్రేమను శంకించరాదని ఆకాశవాణి ఆ విధంగా తనకు బోధిస్తున్నట్లు తోచింది రాయ్‌కి.

గొట్టంలోనుంచి, "రాయ్!" అని మళ్ళీ పిలిచింది ఇందుబాల.

తనపేరు ఆ విధంగా ఉచ్చరించడంలోనే ఇందు తన అసాధారణ ప్రేమను వ్యక్తపరుస్తూ ఉందని అనుకున్నాడు రాయ్. ఆపిలుపామె హృదయాంతరాళమునుంచి వెలువడిన ప్రేమశంఖారావము వలె వినవచ్చింది అతని చెవులకు. మంత్రించినట్లు కాఠిన్యమువిడిచి వాని హృదయం వెంటనే మెత్తపడింది.

"ఇందూ, భయపడకు. త్వరలో ఈతుపాను ప్రదేశందాటి బయట పడగలందులకు దేవుని ప్రార్థించు" అని గొట్టంలోనుంచి అరచినాడు రాయ్.

"నువ్వే నా దేవుడివిగా" అన్నాది ఇందుబాల.

ఆమె మాటలకు వెర్రిసంతోషం కలిగింది రాయ్‌కి. తననంత అమాయకమైన భక్తితో నమ్ముకున్న మనిషి నిజంగా తనపట్ల ద్రోహం చెయ్యగలదా అని సందేహించాడు తనలో. అయితే కడచినరాత్రి తాను చూసిన దృశ్యాన్ని సమర్థించుకోవచ్చునేమో, శాంతంగా యోచిస్తే?

"ఇందూ, ఇందూ!" అని మళ్లీ పిలిచినాడు, రాయ్.

జబాబు లేదు.

"అడుగునుంచి దూరివస్తూ ఉందనీ దెగ్గిరికి." అని సమాధానమిచ్చినాడు దిలీప్‌కుమార్. ప్లేను సవ్యంగా ఎగరక, సన్ననికుదుపుతో పక్కగా ఒరుగుతూ, కారణంలేక దిగజారుతూ, చిక్కులు పెడుతూ ఉంది రాయ్‌ని.

కాక్‌పిట్‌లోకి శ్రమమీద బంగురుకొనివచ్చి, భర్తపక్క చతికిలపడింది ఇందుబాల, వణకుతూ.

"నాకిప్పుడు కొండంత ధైర్యంగా ఉంది," అన్నాది ఆమె, అతని భుజాన్ని చెంపరాస్తూ.

"ఇక్కడ చలికి తాళలేవు, వెళ్లి కాబిన్‌లో రగ్గుకప్పుకొని కూచో", అన్నాడు రాయ్.

"ఫరవాలేదు. ఇట్లా నిన్ను ఆనుకొని కూచుంటే ఎంతో వెచ్చగా ఉంది," అన్నాది ఆమె నవ్వుతూ.

ఆమె ఒడలితాకుడుకు రాయ్ శరీరం పులకరించింది. అతని దేహంలో ఒక నూతనశక్తి, మనసులో ఒక నూతనశాంతి ఉదయించినవి. తన నేర్పునంతటినీ వినియోగించి నడుపుతున్నాడు ప్లేనును. వాన, గాలి, ఏ మాత్రం తగ్గుతున్నట్లు లేదు.

"ఇంకా పైకి లేచిపోతే మబ్బులనుంచి తప్పించుకోలేమూ?" అన్నాది ఇందుబాల.

"లాభం లేదు. ఇక్కడనే గాలి ప్రెషర్ సముద్రమట్టంలో ఉండేదానిలో సగానికి తక్కువగా ఉంది. ఇంకా ఎత్తుగా పైకి వెళితే, అసలు తిన్నగా ఊపిరి సలపదు, ప్రాణవాయువు చాలక" అన్నాడు రాయ్.

జాయ్‌స్టిక్ తోను, రడ్డర్‌తోను కొంతసేపు అవస్థపడి, నిరాశతో అతడు, 'ఇందూ, నువ్వు కాబిన్‌లోనికి వెళ్ళిపో. ప్లేను పైకి లేవడం లేదు,-కిందికి ప్రమాదకరంగా దిగజారుతూ ఉంది, ఎందువల్లనో!' అని కొంతసేపు తన పనిలో నిమగ్నుడై, మళ్ళీ, ఒకవేళ అవసరమైతే నేను కేకవేసినప్పుడు నువ్వు, దిలీపు, వెంటనే పారచూట్స్ పట్టుకొని ప్లేనులోనుంచి గెంతిపోవాలి!" అన్నాడు విధిలేక. వెలవెల పోయింది ఇందుబాల.

"మరి నువ్వో?"

"నా మాటకేమి? ఎట్లాగో తంటాలుపడి దేనికీ గుద్దుకోకుండా ప్లేనును వాల్చడానికి యత్నిస్తాను ఆపైని భగవదిచ్ఛ! ఏమైతే అది అవుతుంది."

"రాయ్, క్షమించి నన్ను గెంతమనకు-గెంతడానికి జడుపనుకోకు... నువ్వు నీ ప్రాణానికి తెగిస్తూ ఉన్నప్పుడు, నేనూ నిన్ననుసరించవలసిన దాన్నే!" అని ఇందు వణుకుతూ మీద చెయ్యివేసి, ముద్దులాడింది భర్తను.

"నాతోనే ఉండి మృత్యువు నెదుర్కొంటానంటుంది కాని; ప్రాణాలను దక్కించుకొని దిలీపునితో సుఖపడదామని కోరదుకదా? ఇట్టి భార్యనా నేను శంకించి, ద్వేషించి, నిర్మూలం చేయదలచింది? ఎంత మూర్ఖుణ్ణి!" అని తనలో ఏమేమో అనుకున్నాడు రాయ్.

ఆలోచించడానికి గాని, మాట్లాడడానికి గాని, అవకాశమివ్వడంలేదు ప్లేను.

ఆ నిమిషంలో ఇందుపట్ల మోహమేకాక, ఒకవిధమైన కొత్త గౌరవం మొలకెత్తింది రాయ్ హృదయంలో. ఆమె తననెట్టి అసాధారణప్రేమతో ఎన్నుతూ ఉన్నదో అప్పుడు విశదపడినట్లయింది అతనికి. అదివరకతని గుండెను పీక్కొని తింటూ ఉన్న అనుమానభూతం పూర్తిగా వదలిపోయింది. జీవితంమీద మళ్ళీ నూతనకాంక్ష పుట్టింది! అదివరకల్లా విమానంతో సహా భార్యను, మిత్రుణ్ణి, తనను, అంతం చేయడానికి సంకల్పించుకున్న దృఢచిత్తునికిప్పుడు ఎట్లాగైనా తంటాలుపడి, తన సారథ్యచాకచక్యాన్నంతా వినియోగించి, ప్లేనును సవ్యపరచి, తుపాను ముప్పునుంచి తప్పించి, క్షేమంగా బయటపడదామన్న ఆసక్తి ప్రబలమయింది.

"ఇందూ.....నువ్వు నన్ను ప్రేమించడం లేదేమో అనుకున్నా నీ మధ్య!" అన్నాడు రాయ్ గద్గద స్వరంతో.

ఇందుబాల నోరు తెరచుకొని, దిగాలుపడి భర్తవైపుచూస్తూ, క్షణం ఊరుకొని బొటబొట కన్నీరు కార్చింది.

"రాయ్,రాయ్,.... నా ప్రేమను శంకించకు ! ఎప్పటికీ నేను నీదాన్నే! నాకు తెలుసు, నువ్వెందుకట్లా అనుమానపడ్డావో-నీది తప్పుకాదు, నాదే పొరపాటు, చాలా పొరపాటు! - అగ్నితో చెలగాటమాడబోయినాను, మరికాస్తలో ఒళ్లు కాల్చుకునే దాన్నే ... కాని కాల్చుకోలేదు...నమ్మవూ? నమ్మలేవూ....?"

కంట్రోల్స్‌ను వదలి ఆనందంతో ఇందును పెదవులమీద ముద్దు పెట్టుకున్నాడు రాయ్.

రాత్రి జరిగిన విషయమంతా ఉన్నదున్నట్లుగా ఏమిదాచక భర్తకు చెప్పాలనుకుంది ఇందు, కాని ఆ తుపాను ప్రళయంలో, గాలి రొదలో, ప్లేను గడబిడలో, ఏం మాట్లాడడానికీ వీలుగాని వ్యవధి కాని లేకపోయింది. విమానాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకుందుకు యంత్ర సామగ్రితో రాయ్ పడుతున్న అవస్థలన్నీ ఆతురతతో, ఆందోళనతో, ఊపిరి బిగపట్టి చూస్తూ నోరు మెదపక ఊరుకుంది ఇందు. సినిమా దృశ్యంవలె ఆమె మనోవీథిలో రాత్రి జరిగిన నాటకమంతా తిరిగి ప్రదర్శితమయింది. చల్లగాలికి ఒంటరిగా ఆమె డాబామీద చంద్రుణ్ణిచూస్తూ నిల్చోడం-దిలీప్‌కుమార్ ఎందుకో అక్కడికి వచ్చి ఆమె అందాన్ని పొగడుతూ ఆమెతో ఏమేమో సరదాగా సంభాషించడం-ఇద్దరూ అకస్మాత్తుగా గట్లు తెగిన రెండు ప్రవాహాలు కలుసుకున్నట్లు అణుచుకోలేని మోహావేశంతో కౌగలించుకోవడం-ఎన్నాళ్ళనుంచో అట్టి సమయంకోసం ఎదురుచూస్తున్నట్లు వెర్రిగా ఎంతకీ తనివితీరనట్లు ముద్దులాడుకోవడం- సిగ్గు, కోపం, దుఃఖం ముంచుకొచ్చి ఆమె ఏడిస్తే దిలీప్ ఓదార్చడం- మళ్లీ అట్లా అవివేకంగా ఒళ్ళుమరచి ఎప్పుడూ ప్రవర్తించరాదని ఇద్దరూ తీర్మానించుకోవడం రాయ్‌ని మోసం చెయ్యక,

తమ ప్రేమను పవిత్రంగానే ఉంచుకొని ఇద్దరూ ప్రియులుగా కాక స్నేహితులుగా మాత్రం ఉండవలెనని నిర్ణయించుకోవడం – అన్నీ జ్ఞప్తికి తెచ్చుకుంది ఇందు.

భూమిని ఢీకొనడానికి ముక్కుమీద ఒరుగుతూ ఉన్న ప్లేనును ఎట్లాగో స్వాధీనంలోనికి తెచ్చుకొని పైకి లేపుతూ బతుకుజీవుడా అనుకున్నాడు రాయ్. మళ్ళీ తన ఆజ్ఞలకు లోబడుతూ తేలికగా, సవ్యంగా మీదికి లేచింది ప్లేను. గాలిజోరుకూడా కొంత తగ్గింది. ఇంజన్ మోతలో ఎట్టి అపస్వరమూ వినరాలేదు.

"ఇందూ, ఇక ఫరవాలేదు. ప్రమాదం దాటింది. మబ్బులుకూడా విడిపోతున్నాయి. ప్లేను చెప్పినట్లు వింటూ ఉంది. ఇప్పుడు!" అని సంతోషంతో కెవ్వున అరిచాడు రాయ్.

భూమికి పదివేల అడుగుల ఎత్తున నిమిషానికి రెండుమైళ్ళ గమనంతో నిశ్చలంగా పోతూ ఉంది ప్లేను. మేఘాల చీకటి తగ్గింది.

"దిలీప్, అద్భుతమైన విమానమిది! తప్పదనుకున్న గండం దాటించి, మనలను కాపాడింది." అని గొట్టంలోనుంచి అరచినాడు రాయ్.

వాన, గాలి తగ్గినవి. త్వరలో సూర్యుడు మళ్ళీ ప్రత్యక్షమవుతాడన్న ఆశ గొలిపింది ఆకాశం. యుద్ధంలో జయంపొందిన వీరునివలె గర్వపడ్డాడు పైలట్.

ఇంతలో ఆకస్మికంగా కళ్లు జిగాలుమని దృష్టి తప్పినట్లు ప్లేనుకు దగ్గిరగా గొప్ప కాంతితో ఒక మెరుపు మెరిసింది. ఆ వెంటనే ఆకాశం బ్రద్దలయినట్లు ఫిరంగి ధ్వనితో భయంకరమైన ఉరుము వినవచ్చింది. ప్లేను వణుకుతూ పక్కగా ఒరిగింది.

పిడుగుపడి ఇందూరాయ్‌లు కాక్‌పిట్‌లో స్మృతి తప్పి పడిపోయినారు. ప్లేను నిప్పంటుకుంది. విమానం ఎత్తుగా, ఇంకా ఎత్తుగా పోతూనే ఉంది. పైన భగభగా మంటలు లేచినవి. ఆకాశం ఎర్రబడింది.

ప్లేను వేవో కొన్ని భాగాలు, ఒక రెక్క, జారి కిందపడినవి. పెద్దబాంబు పేలిన ధ్వనితో విమానం బద్దలయి మండుతూ కిందపడింది, ముక్కల కింద. వర్షం ఆగింది.

ఈ భీభత్స దృశ్యాన్ని హడలిపోయి చూస్తూ ఉన్న సమీప గ్రామవాసులు కొందరు గుంపులుగా పరుగెత్తుకొని వచ్చారు, విమానం పడిన మైదానం వద్దకు. నామరూపాలు లేక ప్లేను గుండపిండి అయింది. దానిలో ప్రయాణీకులెవరో, ఎందరో, ఏమీ తెలియలేదు. వాళ్ళ కళేబర భాగాలు మాత్రం అక్కడక్కడ కొన్ని విరజల్లి ఉన్నవి. ఒకకాలు, ఒక చెయ్యి, తోలూడిన ఒక మొండెం, పగిలిన రెండు పుర్రెలు, మాంసంతోను మట్టితోను కలిసి చిక్కుపడి ఉన్న, పొడుగుపాటి జడ, నల్లని బొచ్చుతో ముద్దగా ఉన్న కుక్కపిల్లతోలు, దుమ్ములు, పేగులు, గుడ్డపీలికలు మొదలయినవి!

**[ప్రతిభ (నవ్య సాహిత్య పరిషత్పత్రిక) జులై 1938 సంచిక నుంచి పునర్ముద్రితం.]**

# కోటంరాజు పున్నయ్య

మీరు ఎవరికైనా సహాయం చేశారా?

అయితే, ఎవడికో పెళ్ళి కాని వానికి మీ అమ్మాయినిచ్చి పెళ్ళిచేసి, ఉద్ధరించటం కాదు. వాడు మీరు సహాయం చేసినట్లు గుర్తించడు. వానిదెప్పుడూ వక్రబుద్ధే, వాడెప్పుడూ క్రూరుడే, ఎప్పుడూ శృంగారాసక్తుడే, తిండి తప్ప వేరే యావ ఉండదు, వాడు దశమగ్రహం, వాని సంగతి కాదు నేను చెప్పేది –

ఒకడికి మీరు గుమస్తా ఉద్యోగం ఇప్పించారు; వాడు, పైవాళ్ళు ఒక్కొక్కరే ఛస్తూ పోగా, వాడు పైవాడు అయిపోయి మీకే అందుబాటులో లేనివాడైనాడనుకోండి.

అటువంటి వానిని, మీరు ఇదే నాయనా నేను నీకు ఇంత సహాయం చేశానురా అంటే, వాడూ వాని చుట్టూ చేరే వాళ్ళూ మిమ్మల్ని చూసి నవ్వేస్తారు. అసలు వాడు మీకు దర్శనం ఇవ్వడు. మీరు చచ్చీ చెడీ ఉసూరుమంటూ నడిచిపోతుంటే చూసిగూడా, తనకారును ఆపడు. అదీ వాడి ముచ్చట. నేను ఊహించి, ఇంత ఉపోద్ఘాతానికి ఒడబడ్డాను.

ఇంకా కొంచెం చెప్తాను. ఎన్నడో 1948లో – నేను ఆంధ్రపత్రికలో పని చేస్తున్నాను– చెన్నపట్టణంలో–చాలా అభిమానంతో, ఎక్కడో ఆంధ్రపత్రిక ప్రారంభకాలంలో దానిలో పనిచేసిన కృతజ్ఞతతో, కోటంరాజు పున్నయ్య గారు వచ్చారు. ఆయన ఆ తర్వాతి కాలంలో సింధ్ అబ్జర్వర్ స్థాపక సంపాదకుడు. ఆధునిక కరాచీ నిర్మాణానికి కృషి చేసినవాడు. పాకిస్తాన్ ఏర్పడినప్పుడు ఇక అక్కడ ఉండే వీలులేక తిరిగివచ్చేశాడు. ఆయనగారితో కబుర్లు చెప్పుకంటున్నాం. రెండంతస్థులపైనున్న ఆంధ్రపత్రిక కార్యాలయంలో సంగతి–కిటికీ నుంచి బయటకు చూస్తూ కబుర్లు చెప్పుకుంటున్నాం–ఇంతలో ఒక వృద్ధుడు, ఒక తోపుడు బండిలో మిఠాయి అమ్ముకుంటూ, రోడ్డు మీద పోవటం మా దృష్టికి వచ్చింది. పున్నయ్యగారు గబగబా కిందకు వెళ్ళి, ఆ వృద్ధునికి పాదాభివందనం చేశాడు. ఆ వృద్ధుడూ పున్నయ్యగారూ కౌగలించుకుని ఏడ్వసాగారు. నేనూ కిందకు పరుగెత్తాను. వాళ్ళు కౌగిలి నుంచి విడిపడి, తమ తమ కుటుంబాల వాళ్ళను గురించిన కుశల ప్రశ్నలు వేసుకుంటున్నారు.

సంగతి ఏమిటంటే–ఆ వృద్ధుడు, సింధ్ అబ్జర్వర్ పత్రిక నిర్వాహక మండలి ప్రముఖుడు! అతడి ఆస్తిని పాకిస్తానీలు దోచుకోగా, అతడు తన వారిని చేరదీసుకుని కట్టుబట్టలతో భారతదేశానికి వచ్చివేశాడు! భగవంతుని దయ, అదే చాలుననుకుని తృప్తిపడి, మిఠాయి అమ్ముకుంటున్నాడు!

పున్నయ్యగారు గబగబా కిందకు వెళ్ళి, పాదాభివందనం చేయకపోతే, ఆ వృద్ధుడు ఏమీ అనుకోడు! కానీ అంతటి పని చేయకపోతే, పున్నయ్యగారే బాధపడ్డాడు. అట్లా బాధపడటమే మానవ సంస్కారం.

ఆపైన పున్నయ్యగారు ఆ వృద్ధుని వద్ద మిఠాయికొని, డబ్బులు ఇచ్చాడు! డబ్బులు తీసుకోనన్నాడు వృద్ధుడు! ఇద్దరూ బావురుమన్నారు. ఏడ్పును మించిన సౌహార్ద ప్రకటన వేరేమున్నది?! మాటలకు అతీతమైన సౌహార్దం.

పున్నయ్యగారు మా పత్రికా రచయితల కులంలో "ఋషి."

**(జి. కృష్ణ – 'అప్పుడు–ఇప్పుడు' నుంచి)**

❖ నవపారిజాతం

# సహధర్మచారిణి

❖ టి. శ్రీవల్లీ రాధిక

**శైలజ దగ్గర నా శీలాన్ని ఎలా నిరూపించుకోవాలో నాకు అస్సలు అర్థం కావడం లేదు. ఒకరు కాదు...యిద్దరు కాదు....ఏ అమ్మాయి మీద పడితే ఆ అమ్మాయి మీదే నేను మోజు పడుతున్నానంటుంది.**

బైక్ మీద వెళ్తూ ఉంటామా! సడన్‌గా ఒక అమ్మాయి కనబడుతుంది, బ్రైట్‌గా ఉన్న డ్రెస్‌లో.

అప్రయత్నంగా నా తల అటువైపు తిరుగుతుంది, ఒక్కక్షణమే. అది చాలు తనకి. మోటర్‌సైకిల్ ఆ అమ్మాయిని దాటగానే "బాగుందా!" అంటుంది.

"ఎవరు!" అంటాను నేను బింకంగా.

"ఇప్పుడు చూసిన అమ్మాయి"

ఎప్పుడూ అనుకుంటాను నేను "బాగుంది" అనో "బాగాలేదు" అనో నిజాయితీగా సమాధానం చెప్దామని. కనీసం "నీ అంత బాగాలేదు" అన్న అందమైన జవాబు అయినా యిద్దామని.

కానీ అదేం ఖర్మమో శైలజ ఎపుడు ఆ ప్రశ్న అడిగినా....నా నాలుక టకీమని "ఏ అమ్మాయి! నేనెవర్నీ చూళ్ళేదు." అంటుంది.

శైలజ ఆ అబద్ధాన్ని చచ్చినా నమ్మదు. ఎలా నమ్ముతుంది! నా తల తొంభై డిగ్రీల కోణంలో రెండుసార్లు అటూ ఇటూ తిరగడాన్ని అప్పటికే స్పష్టంగా చూసి ఉంటుంది కదా!

ఇక ఓ అరగంట చర్చ జరుగుతుంది. చివరికి నేను ఓడిపోయి, చేతులెత్తేసి "ఏమైందిపుడు చూస్తే ! ఏదో క్యూరియాసిటీ. అంతే కదా!" అంటాను.

"అంతేలెండి. నేను మాత్రమేమన్నానిపుడు! మీకు కాస్త క్యూరియాసిటీ ఎక్కువ అన్నాను అంతేగా!" అంటుంది.

నోరు మూసుకోవడం మినహా చేసేదేం లేదు. సరే. అంతవరకూ అయితే పర్లేదు. అలాంటి సంఘటనలో పోనీ కాస్తో కూస్తో నా తప్పు కూడా ఉందనుకోవచ్చు. కానీ కొన్ని కొన్ని అభాండాలు నా తప్పు అసలేమీ లేకుండా కూడా నా నెత్తిన పడుతూ ఉంటాయి.

మా వీధి చివర మెయిన్‌రోడ్ మీదకి ఓ ఇస్త్రీ బట్టల దుకాణం వుంది. ఒక లావుపాటి ఆవిడ కూర్చుంటుంది ఆ బంకులో. మొదట్లో కొన్నాళ్ళు మా బట్టలు అక్కడే ఇచ్చేవాళ్ళం. కానీ ఆమె అస్సలు బాగా చేయకపోవడం వల్లా... పైపెచ్చు రోజుల తరబడి బట్టలన్నీ రోడ్డుమీద ఉంచి, ఆ దుమ్మంతా పట్టించి...ఇంకాస్త మురికిగా మారుస్తూండటం వల్లా....ఇక ఆ అమ్మాయికి బట్టలు ఇవ్వకూడదని తీర్మానించింది శైలజ.

మెయిన్‌రోడ్ మీద కాకుండా ఇటు ప్రక్కన సందులోకి ఉన్న షాపులో ఇమ్మంటుంది.

ఈ షాపు ఓ నాలుగడుగులు లోపలికి ఉంటుంది. బైక్ మీదే అనుకోండి... అయినా ఆ కాస్త దూరం వెళ్ళడానికి నాకు బద్ధకం.

ఈ ఒక్కసారికి....ఈ ఒక్కసారికి.... అనుకుంటూ ప్రతిసారీ ఆ అమ్మాయికే ఇస్తూండటం...బట్టలు ఇంటికి రాగానే...విషయం గ్రహించి శైలూ చిందులు తొక్కడం..."ఏం నచ్చింది ఆ అమ్మాయిలో మీకు!" అని విరుచుకుపడడం.

"ఇదిగో శైలూ...దారుణంగా మాట్లాడకు. ఆ అమ్మాయిలో ఏదో నచ్చడమేమిటి!" అని నేను కసురుకుంటానా!

"ఏదోనే నచ్చాలి మరి! ఈ మురికి పట్టిన బట్టలు నచ్చే అవకాశం లేదు కదా! అయినా ఆ అమ్మాయికే ఇస్తున్నారంటే .. ఇంకేదోనే నచ్చుండాలి మరి!" అంటుంది.

నాకు చిర్రెత్తుకొస్తుంది. "ఛీ. ఛీ. ఇంకెపుడూ ఆ అమ్మాయికి ఇవ్వకూడదు." అనిపిస్తుంది. కానీ మళ్ళీ వారం అదే పనిచేయడం...అదే సీన్ రిపీట్ అవడం...శైలూతో అవే మాటలు మళ్ళీ మళ్ళీ పడడం.

అసలు ఈ ఒక్క విషయం అని కాదు. శైలూ నిష్టూరాలాడాలంటే ఇంకో అమ్మాయి సీన్‌లో ఉండాల్సిన అవసరం కూడా లేదసలు.

ఏదన్నా మాటా మాటా అనుకుని ఆ విసుగులో "పో. అవతలికి" అంటానా! "నాకు తెలుసులెండి. నన్ను తరిమేసి ఎవతినో తెచ్చుకుందామనుకుంటున్నారు. మీ ఆటలు నేనేం సాగనివ్వను." అంటుంది.

నాకు నవ్వాలో ఏడవాలో అర్థం కాదు.

శైలజకి నేను ఎంతో స్వేచ్ఛ యిస్తాను. ఏ పని అయినా తన ఇష్టప్రకారమే చేసుకునే అవకాశం ఇస్తాను.

తన ఉద్యోగం... వ్యాపకాలు...దేంట్లోనూ నేను తలదూర్చను. తన టైమ్ అంతా నాకే కేటాయించాలని గానీ..నా పనులే చేయాలని గానీ ఆంక్షలు పెట్టను.

శైలజ బాగా చదువుకుంది. మంచి ఉద్యోగం చేస్తోంది. చాలా విషయాలలో ప్రతిభా... చక్కగా విశ్లేషించగల వివేకం....అనర్గళంగా మాట్లాడగల చాతుర్యం ఉన్నాయి.

మరి ఈ ఒక్క విషయంలో ఇంత మూర్ఖంగా ఎందుకు ప్రవర్తిస్తుందో అర్థం కాదు.

పొద్దున కూడా ఇలాగే అర్థం పర్థం లేని చెత్త వాగుతూంటే...నేను విసురుగా లేచి ఆఫీస్‌కి వచ్చేశాను. తను నాకోసం సిద్ధం చేసి ఉంచిన లంచ్‌బాక్స్ తీసుకోకుండా.. నా కోపం అంతా అర్థమయ్యేట్లుగా తలుపుని గట్టిగా లాగి వచ్చేశాను.

ఇపుడు పరిస్థితి ఎలా ఉందో!

ఇంట్లోకి అడుగుపెట్టి, కామ్‌గా షూస్ విప్పుకుని బెడ్‌రూమ్‌లోకి నడిచాను. డ్రెస్ మార్చుకుని వచ్చి హాల్లో కూర్చుంటుంటే శైలూ అంతే నిశ్శబ్దంగా కాఫీ తెచ్చిచ్చింది.

"మధ్యాహ్నం అన్నం తిన్నారా!" అంది.

"ఆఁ" అన్నాను ముక్తసరిగా.

"ఎక్కడ! క్యాంటీన్‌లోనా!" అంది.

నేను మాట్లాడలేదు. పొద్దున అన్ని మాటలు అని ఇపుడు ఏమీ జరగనట్లు మాట్లాడుతున్న శైలూని చూస్తే ఆశ్చర్యమూ, కోపమూ రెండూ వచ్చాయి.

"శుభలేఖ వచ్చింది" అంటూ కార్డు తెచ్చి చేతిలో పెట్టింది.

పూర్ణ వాళ్ళ గృహప్రవేశం. ముందుగా తెలిసిన కబురే. పది రోజుల క్రితమే పూర్ణ ఫోన్ చేసి "అన్నయ్యా! తప్పకుండా రావాలి" అని చెప్పింది.

"ప్రయాణం ఉందా లేదా!" అంది శైలూ.

"చూస్తాను" అన్నాను.

శైలూ విసురుగా వంటగదిలోకి వెళ్ళిపోయింది. నాకు అర్థమయింది. మళ్ళీ కోపమొచ్చింది తనకి.

ఎల్లుండి తెల్లవారుఝామున గృహప్రవేశం. కాబట్టి రేపు రాత్రికే అక్కడ ఉండాలి. అంటే ఈ రాత్రికో...రేపు ప్రొద్దున్నేనో బయల్దేరాలి.

అంత దగ్గర్లోని ప్రయాణాన్ని గురించి వెళ్తాననో, వెళ్ళననో స్పష్టంగా చెప్పకుండా 'చూస్తాను' అన్నానని శైలూకి కోపం.

కానీ నా పద్ధతి అంతే. ఆఖరి నిమిషం వరకూ నేనేదీ కచ్చితంగా అనుకోను. అది శైలూకెందుకు అర్థంకాదు!

నేను ఆ విషయం వివరించబోయినా 'ఎందుకు అనుకోరు! మీరు ఏదో ఒకటి నిర్ణయించుకునే ఉంటారు. నాకు చెప్పడమే ఇష్టం లేదు' అంటుందని నాకు తెలుసు.

అందుకే నేనేం మాట్లాడలేదు.

రెండుగంటల తర్వాత బయల్దేరి బ్యాగ్‌లో ఓ జత బట్టలు పెట్టుకుని వచ్చి ట్రైన్ ఎక్కాను.

తెల్లవారేటప్పటికి పూర్ణావాళ్ళింట్లో ఉంటాను. పూర్ణ నాకన్నా రెండేళ్ళు చిన్నది. మహేశ్ దాన్ని పెళ్ళి చేసుకునేటపుడే ఉద్యోగం మానేసేయాలని చెప్పాడు. పూర్ణ ఒప్పుకుంది.

అత్తగారూ, మామగారూ పూర్ణ దగ్గరే ఉంటారు. వాళ్ళ పనులూ, మహేశ్ పనులూ ఇదే లోకం దానికి.

గేట్ తీసుకుని లోపలికి అడుగుపెడుతూండగానే పూర్ణ గబగబా ఎదురొచ్చి "వదినేదీ!" అంది.

"బాబుకి పరీక్షలు" అన్నాను నేను.

''ఏరా వచ్చావా!'' అంటూ అమ్మా... ఆ వెనుకే అన్నయ్యా..వదినా...పిల్లలూ నన్ను చుట్టుముట్టారు.

నా మొహంవైపు ఒకసారి పరీక్షగా చూసి బ్యాగ్ అందుకుని లోపలికి నడిచింది పూర్ణ.

స్నానం చేసి, పూర్ణ పెట్టిన ఇడ్లీలు తిని న్యూస్‌పేపర్ పట్టుకుని కూర్చున్నాను.

ఇల్లంతా సందడిగా వుంది. "నా షేవింగ్ సెట్ ఏదీ! వేణ్ణీళ్ళు పెట్టావా! లుంగీ ఏదీ! దువ్వెనిస్తావా!" అంటూ అన్నయ్య ఒకదాని తర్వాత ఒకటి అడగడం, వదిన అందించడం వినబడుతోంది.

అన్నయ్యని చూస్తే ఇదే చిరాకు నాకు. ప్రతిపనికీ వదినని సతాయిస్తాడు.

అన్నయ్య అనే కాదు. చాలామంది మగవాళ్ళు అంతే. ఇక్కడ ఫంక్షన్‌లో కూడా అటు మహేశ్ బావగార్లూ..అన్నదమ్ములూ అందరూ అన్నీ ఆడవాళ్ళనే అడగడం..వాళ్ళని ఒక్కక్షణం కూడా తీరుబడిగా ఉండనివ్వకపోవడం గమనిస్తున్నాను నేను.

నేను శైలజనెపుడూ ఇలా అడగను. నా పనులన్నీ నేనే చేసుకుంటాను. ఇలా చిన్నపిల్లల్లా ప్రతిదానికీ భార్యమీద ఆధారపడే వాళ్ళని చూస్తే నాకు చాలా చిరాకు కూడా.

మహేశ్ కుటుంబం గురించి నాకసలెపుడూ సదభిప్రాయం లేదు. పూర్ణని ఉద్యోగం మానేసి ఇరవైనాలుగు గంటలూ ఇంట్లో చాకిరీ చేయాలని స్పష్టంగా చెప్పినవాళ్ళు కదా!

ఆలోచనతోనూ, అసహనంతోనూ ముడుచుకున్న నా నొసలు "హలో! ఎప్పుడొచ్చారు!" అంటూ వచ్చి నా ప్రక్కనే కూర్చున్న మహేశ్‌ని చూడగానే మామూలుగా అయ్యాయి.

ప్రొద్దున లేస్తూనే గృహప్రవేశం చేయాల్సిన ఇంటిదగ్గర పనులేవో చూడటానికి వెళ్ళాడట.

నాతో ఒక నిమిషం మాట్లాడి స్నానానికి వెళ్ళాడు మహేశ్. ఆ తర్వాత అంత హడావుడిలోనూ పూజ చేసుకున్నాడు. అప్పుడు పూర్ణ పెట్టిన ఫలహారం తిని మళ్ళీ ఎక్కడికో వెళ్ళాడు. మధ్యాహ్నం భోజనాలప్పుడు కాసేపు కనిపించాడంతే. మళ్ళీ రాత్రి భోజనాలదాకా ఏవో పనులమీద తిరుగుతూనే ఉన్నాడు.

రాత్రిపూట భోజనం అయ్యాక నేను వరండాలో వాల్చిన మంచంమీద కూర్చుంటే అందరికీ వక్కపొడి అందించి...చివరగా నా దగ్గరికి వచ్చాడు. నేనో పలుకు నోట్లో వేసుకోగానే డబ్బాకి మూతపెట్టి ప్రక్కనపెట్టి తనుకూడా నా ప్రక్కనే కూర్చున్నాడు.

"ప్రొద్దున్నుంచీ ఒక్కక్షణం కూర్చోకుండా తిరుగుతున్నారే! మీరు కూడా పనిచేస్తారని నాకీరోజే తెలిసింది." అన్నాను నేను.

మహేశ్ నవ్వుతుంటే....పూర్ణ వచ్చి వరండాలో మెట్లమీద కూర్చుంటూ "ఏంట్రోయ్ బావగారి మీద జోకులేస్తున్నావ్!" అంది.

"జోకులు కాదే. మెచ్చుకుంటున్నాను. నీమీద పెత్తనం చేయడం

కాకుండా బావగారు వేరేపనులు కూడా చేస్తారని నాకు తెలీదు.” అన్నాను.

“పెత్తనం గురించి నువ్వు మాట్లాడుతున్నావా! వదిన్ని ఇంట్లో వదిలేసి వచ్చావుగానీ!” అంది పూర్ణ.

“నేను వదిలేయడమేమిటి! బాబుకి పరీక్షలని తనే రాలేదు” అన్నాను.

“బాబుకి పరీక్షలు కాబట్టి నేను రాలేనని నీతో చెప్పిందా!”

“నాతో చెప్పడమెందుకు! ఆ రోజు నీతోనే చెప్పిందిగా!”

“ఏ రోజు!”

“నువు ఫోన్ చేసిన రోజు. 'సరిగ్గా అదే టైమ్‌కి బాబుకి పరీక్షలు' అందికదా!”

పూర్ణ నావైపు సూటిగా చూసింది. “అంటే ఆ తర్వాత నువు మళ్ళీ వదినని అడగలేదన్నమాట.”

“లేదు” అన్నాను. పూర్ణ ఎందుకన్ని ప్రశ్నలేస్తోందో అర్థం కాలేదు నాకు.

“ఎలాంటి మనిషివన్నయ్యా నిజంగా నువ్వు!” అంది పూర్ణ చిరాకుపడుతూ. “నేను ముందే అనుకున్నాను. నువు వదిననసలు సరిగ్గా అడగకుండా నీపాటికి నువు బయల్దేరి వచ్చి ఉంటావని. ఆ రోజు నేను గృహప్రవేశం గురించి చెప్పగానే వదినేదో మామూలుగా బాబుకి పరీక్షలు అంది. యూనిట్‌టెస్టులేగా, రాయకపోయినా పర్లేదులే.' అన్నాను నేను. 'అవున్లే' అంది తను.”

పూర్ణ మాటలు విని నేను ఆశ్చర్యపోయాను. నేను ఏదో చెప్పబోతూంటే పూర్ణ లేచి నిలబడింది. “పెళ్ళాంతో సరిగా మాట్లాడటమన్నా రాదు కానీ పెత్తనాల గురించి చెప్తున్నాడు. ఎంత బాధగా ఉందో నాకు చిన్నవదిన రాకపోతే”...రుద్ధమయిన గొంతుతో నన్ను కసురుకుని విసురుగా లోపలికి వెళ్ళిపోయింది పూర్ణ.

“వాళ్ళు కూడా వస్తే బాగుండేది.” అన్నాడు మహేశ్. “సరే. కాసేపు పడుకోండి. బయల్దేరాల్సిన టైమ్‌కి లేపుతాను.” అంటూ లోపలికి వెళ్ళాడు.

మంచంమీద వాలానుగానీ నిద్రపట్టలేదు నాకు. నిన్న సాయంత్రం శైలూ సోఫాప్రక్కన నిల్చుని 'ఏంటి ప్రయాణం వుందా!' లేదా అని అడగడమే కళ్ళముందు మెదుల్తోంది.

శైలూ కూడా వద్దామనుకుందా! అయ్యో! నిజంగా చాలా బాధగా అనిపించింది నాకు. కానీ నాకెలా తెలుస్తుంది! బాబుకి పరీక్షలంటే సాధారణంగా శైలూ ఎక్కడికీ వెళ్ళదు. వీలైతే ఆఫీసుకు సెలవు కూడా పెడుతుంది. అదే అనుకున్నాను కానీ.... తను వస్తే తీసుకురావడానికి నాకేం అభ్యంతరం!

తెల్లవారుఝామున గృహప్రవేశం...ఆ తర్వాత సత్యనారాయణ వ్రతం. బయటి సందడితో సంబంధం లేకుండా నా మనసులో ఆలోచనలు..

ఆ ఆలోచనలని భగ్నం చేస్తూ మధ్యమధ్య వాళ్ళ మాటలూ వినబడుతున్నాయి.

పూర్ణ ఆడపడుచులిద్దరూ పూర్ణ అత్తగారి దగ్గర కూర్చుని వ్రతం చూస్తున్నారు.

“ఇదేం చీరమ్మా! చాలా బాగుంది.” తల్లి చీరని పరీక్షిస్తూ అడిగింది మహేశ్ వాళ్ళక్క.

“ఏమోనమ్మా. నాకు తెలీదు. వదిన తెచ్చింది.” అంది ఆవిడ.

“బాగుంది. ఈ రంగు నీకు చాలా బాగా సూట్ అయింది.”

కూతురి ప్రశంస విని పూర్ణ అత్తగారు నవ్వింది. “రంగు ఏమో కానీ చాలా తేలిగ్గా హాయిగా ఉంది. బరువు చీరెలు కట్టలేకపోతున్నాను. మీ వదిన నాకు హాయిగా ఉండేవి చక్కగా ఏరి తెస్తుంది.”

“వదిన చేసిన పనికి ఇంక వంకేం ఉంటుంది!” అంది మహేశ్ చెల్లెలు. “ఇంట్లోకి రాకముందే ఎంతచక్కటి తోట పెంచిందో చూడు.”

పూర్ణ అత్తగారు నవ్వుతూ చెప్పింది “అవును. ఇల్లు మొదలు పెట్టినపుడే మొక్కలు కూడా నాటింది. కనకాంబరం, మందార, గన్నేరు, చామంతి, నిత్యమల్లె...అన్నయ్య పూజకి బోలెడు పూలు. అన్నయ్య కూడా రోజూ వచ్చి నీళ్ళు పోసేవాడు. ఇద్దరూ కలిసి మంచితోట తయారుచేశారు.

నాకు ఆనందంగా అనిపించింది వాళ్ళు పూర్ణని మెచ్చుకుంటుంటే. వాళ్ళు ఎప్పుడూ తనని అలాగే మెచ్చుకుంటారు. 'పొగిడి పనిచేయించు కోవడం... అదోరకం తెలివి' అనుకుని చిరాకు పడేవాడిని నేను.

కానీ ఇపుడు పూర్ణ పరోక్షంలో కూడా మెచ్చుకుంటున్నారంటే... అందులో నిజాయితీ ఉందేమోననిపించింది.

'బాగున్నారా!' అంటూ నా ప్రక్కనే వచ్చి కూర్చున్న వ్యక్తిని చూసి ఆలోచనలలోనుంచి తేరుకున్నాను. మహేశ్ పిన్నికొడుకు. బెంగుళూర్‌లో ఉద్యోం చేస్తున్నాడు.

నవ్వుతూ తలవూపి “సెటిలయ్యారా బెంగుళూర్‌లో.” అన్నాను.

అతనికి ఈ మధ్యే పెళ్ళయ్యింది. భార్య ఇంకా కాపురానికి రాలేదు.

“ఇల్లు తీసుకున్నాను. కానీ ప్రస్తుతానికి ఫ్రెండ్‌రూమ్‌లోనే ఉంటున్నాను.” అన్నాడతను.

“ఏం!” అన్నాను.

“ఫర్నీచర్ ఏం లేదు కదా క్రొత్తఇంట్లో. మంచాలు, టి.వి. ఏం లేవు. భోజనానికి కూడా ఇబ్బంది కదా!” అన్నాడు.

“మీకు వంట రాదా!” అన్నాను నేను గొంతులో హేళన ధ్వనించకుండ జాగ్రత్తపడుతూ.

పెళ్ళాం లేకపోతే భోజనానికి యిబ్బంది అనే మగవాళ్ళని చూస్తే నాకు నవ్వొస్తుంది. వంట అనేది పెద్ద బ్రహ్మవిద్యలా భార్యలమీద ఆధారపడిపోవడం.

నేనయితే శైలూ ఆఫీసునుంచి రావడం లేటయితే తనొచ్చేసరికి వంట చేసేస్తాను. తను ఉన్నపుడు కూడా నాకిష్టమయినవి ఏమయినా కావాలంటే తనని అడక్కుండా నేనే చేసేసుకుంటాను.

నా మనసులో మళ్ళీ బాధ సుడులు తిరిగింది. నేను ఇంత బాగా ఉన్నా కూడా శైలూకి నామీదా, నా ప్రేమ మీదా నమ్మకం లేకపోవడం ముల్లులా మనసుని గుచ్చింది.

“వంట రాక కాదండీ. ఫర్నిచర్ అన్నీ ఇపుడే కొనకు. తను వచ్చాక ఇద్దరూ కలిసి వెళ్ళి కొనుక్కోండి. తనకి కూడా నచ్చాలి కదా! అంది

పూర్ణ వదిన. అందుకే ఏమీ కొనలేదు. ఇల్లు మాత్రం మళ్ళీ దొరకదని తీసేసుకున్నాను. అద్దె ఇల్లే కదా! నచ్చకపోతే మార్చచ్చు."

అతని మాటలు నన్ను ఆశ్చర్యపరిచాయి. పూర్ణ మాటలకి ఎంత విలువ ఇస్తారు వీళ్ళందరూ! అనుకున్నాను.

నాకు మా పెళ్ళప్పటి రోజులు గుర్తొచ్చాయి. పెళ్ళయ్యేసరికి నాకో డొక్కు స్కూటర్ ఉండేది. సెకండ్ హ్యాండ్‌లో కొన్నది. శైలూతో కలిసి ఎక్కడికి బయల్దేరినా అది మధ్యలో ఆగిపోతూ ఉండేది.

ఇక లాభం లేదని క్రొత్త బైక్ తీసుకున్నాను. ఆఫీస్‌లో ఫ్రెండ్స్ స్వీట్స్ అడిగితే..ఒక ప్యాకెట్‌కొని అందరికీ పంచి...మిగిలినవి ఇంటికి తీసుకువెళ్ళాను. ప్యాకెట్ చేతిలో పెడుతుంటే.... 'ఎందుకు!' అంది శైలూ.

"కొత్త బైక్ తెచ్చుకున్నాను" అన్నాను నేను బాత్‌రూమ్‌లోకి వెళ్తూ.

బైక్ అనేకాదు. ఇంట్లో ముఖ్యమైన సామానంతా శైలజ వచ్చేసరికే కొనేశాను. "నువ్వు చిన్న స్పూన్‌కూడా తీసుకురానవసరం లేదు మీ ఇంటినుంచి" అని మొదటి రాత్రి శైలూతో గర్వంగా చెప్పాను కూడా.

పదిపదిహేనుమంది పిల్లలు బిలబిలమంటూ రావడంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మహేశ్ స్టూడెంట్స్‌ట వాళ్ళందరూ.

మహేశ్ వాళ్ళకి ఇల్లు చూపిస్తుంటే....నేనూ వాళ్ళతో కలిసి లోపలికి నడిచాను.

మహేశ్ లైబ్రరీగది చూసి మురిసిపోయారు వాళ్ళు.

"సర్ నా రిసెర్చ్‌వర్క్ అయ్యేవరకూ ఇక్కడే ఉండిపోతాను సర్" అన్నాడు వాళ్ళలో ఒకతను.

"నిరభ్యంతరంగా ఉండు" అన్నాడు మహేశ్ నవ్వుతూ. "ఇదిగో ఈ ప్రక్కనే గెస్ట్‌రూమ్ కూడా ఉంది..."

మహేశ్ మాట పూర్తి కాకముందే అందరూ సంతోషంతో 'ఓ' అని అరిచారు.

మధ్యాహ్నమంతా అదే సందడి.

సాయంత్రానికి ఇంట్లో వాళ్ళం మాత్రం మిగిలాం. అలసిపోయిన శరీరాలతో తోటలోని కుర్చీలలో కూలబడ్డాం.

"ఈ హడావుడి అయ్యాక ఒక నాలుగు రోజులు మా దగ్గరికి రా."

అమ్మ ఆహ్వానం విని "అఁ ఇక్కడ ఇబ్బంది కాదూ!" అంది పూర్ణ.

"ఇబ్బందేం ఉంది! భార్య చేత చాకిరీ చేయించుకునే మగవాళ్ళకి భార్య రెండ్రోజులు లేకపోతేనే ఆమె విలువ తెలిసొస్తుంది," అన్నాను నేను.

"ఏం బావగారూ!" అంటే మహేశ్ నవ్వి ఊరుకున్నాడు. పూర్ణ మాత్రం "మాటమాట్లాడితే చాకిరీ చాకిరీ అంటావేమిట్రా! నీకు చాకిరీకి, సహకారానికీ తేడా తెలీదు. భర్తకి సహకారం అందించడానికి ఏ భార్యా బాధపడదు. సంతోషపడుతుంది" అంది.

''ఆ మాట నువ్వే చెప్పాలి.'' అన్నాను నేను. ''నిజానికి అమ్మాయిలెవరూ పెళ్ళికాగానే ఇన్ని బాధ్యతలు నెత్తినేసుకోవాలనుకోరు. పెళ్ళికి ముందు ఎలా ఉన్నారో పెళ్ళయ్యాక కూడా అలాగే ఉండాలనుకుంటారు.'' ఆడపిల్లల మనస్తత్వాన్ని కాచి వడబోసిన అనుభవజ్ఞుడిలా దర్పంగా చెప్పాను.

''పెళ్ళికి ముందులాగే ఉండేటట్లయితే ఇక పెళ్ళి చేసుకోవడమెందుకూ...!" అంది అప్పుడే అక్కడికి వచ్చిన వదిన తన భారీకాయాన్ని కుర్చీలో కుదేస్తూ.

వదిన అమాయకంగా దీర్ఘం తీసిన తీరుకి అందరూ ఒక్కసారి ఫక్కున నవ్వారు. అరక్షణం తర్వాత ఆ వాక్యంలోని లోతైన భావమేదో పట్టుకున్నట్లూ మళ్ళీ ఒక్కసారి కలిసికట్టుగా మందహాసం చేశారు.

నాకు మనసంతా ఏదోగా అయిపోయింది. వాళ్ళందరూ ఒక్కటై మూర్ఖంగా నన్ను అపహసిస్తున్నారనిపించింది. ఇది నేను కూర్చుని మాట్లాడదగిన సభ కాదనిపించింది. విసురుగా లేచి ఇవతలికి వచ్చేశాను.

మెట్ల దగ్గరికి నడిచి రెయిలింగ్‌కి ఆనుకుని నిలబడ్డాను. పూర్ణ లేచి నా దగ్గరికి వచ్చింది. "అదేంటన్నయ్యా అలా వచ్చేశావు! కోపం వచ్చిందా!" అంది.

నేను మాట్లాడకపోవడంతో నాచేతిమీద చేయివేసి "ఏంటన్నయ్యా!" అంది.

నాకెందుకో దుఃఖం వచ్చింది. నేనేదో చాలా ఆదర్శవంతంగా ఉంటున్నానన్న నా భావానికీ...అహంభావానికీ దెబ్బ తగలడంవల్లో...ఏ ఇబ్బందీ కలిగించకుండా ఎంతో బాగాచూసుకుంటున్నా, శైలూ నా మీద వేస్తున్న అభాండాలు గుర్తు రావడంవల్లో ... ఎందుకో తెలీదు ... దుఃఖం వచ్చింది.

దాన్ని అదిమిపెట్టి గాంభీర్యాన్ని తెచ్చుకుని...."మీ ఆడవాళ్ళసలు ఎపుడూ అర్థం కారులే" అన్నాను నిష్ఠూరంగా.

ఒక రకమైన ఆవేశంతో నేను శైలజని ఎంత బాగా చూసుకుంటున్నానో...ఎంత స్వేచ్ఛనీ, ప్రైవసీనీ ఇస్తున్నానో...అయినా తను నామీద ఎలాంటి అపనిందలు వేసి బాధపెడ్తుందో గడగడా చెప్పాను.

నా ఆవేదన అంతా పూర్ణ స్థాణువులా నిలబడి వింది.

నా దగ్గరగా వచ్చి నా చేయి పట్టుకుని లాగి మెట్లమీద కూర్చోపెట్టి తనూ నా ప్రక్కనే కూర్చుంది.

రెండు క్షణాలు మౌనంగా గడిచాయి. నేనే తేరుకుని..."మొన్నకూడా తను ఇలా అడ్డగోలుగా మాట్లాడటం వల్లే నా మూడ్ పాడయింది. లేకపోతే 'నువ్వూ వస్తావా!' అని అడిగి ఉండే వాడినేమో!" అన్నాను సంజాయిషీ ఇస్తున్న ధోరణిలో...తప్పునాది కాదన్న భావాన్ని కలగలుపుతూ.

పూర్ణ మోకాళ్ళమీద తల ఆనించుకుని నావైపు చూసింది. వెన్నెల్లో మెరుస్తున్న దాని మొహమూ...అందులోని సానుభూతి నాకు సాంత్వన కలిగిస్తుంటే మెల్లగా అన్నాను.

"అదికాదే పూర్ణా. ఆత్మవంచన లేకుండా చెప్పు. ఈ చాకిరీతో నువు బాధపడడం లేదూ! ఎంతోమంది అమ్మాయిలు పెళ్ళయ్యాక ఉండే చాకిరీకి భయపడి అసలు పెళ్ళే వద్దనుకుంటున్నారు తెలుసా ఈ రోజుల్లో!"

“పెళ్ళి వద్దనుకునే అమ్మాయిల సంగతి నాకు తెలీదన్నయ్యా. పెళ్ళి చేసుకున్న అమ్మాయిలు ఏం ఆశిస్తారో చెప్పమంటే చెప్పగలను” అంది పూర్ణ.

“ఏం ఆశిస్తారు! భర్త తమ కష్టం సుఖం అర్థం చేసుకోవాలని ఆశిస్తారు. తమ మీద పెత్తనం చేయకూడదని ఆశిస్తారు.” అన్నాను నేను.

“అవును దానితోపాటు భర్త తన సహకారాన్ని అందుకోవాలని కూడా ఆశిస్తారు.” అంది పూర్ణ.

“నీలాంటివాళ్ళు” అన్నాను నేను వ్యంగ్యంగా.

“నేనే కాదన్నయ్యా. వదిన కూడా అదే ఆశిస్తుంది” అంది పూర్ణ స్పష్టంగా.

నేనేదో అనబోతూంటే నన్ను మాట్లాడవద్దన్నట్లుగా చేయి అడ్డం పెట్టింది పూర్ణ.

“నేను చెప్పేది విను అన్నయ్యా. నీ ఆలోచనలని నేను తప్పుపట్టడం లేదు. కానీ ఒక్క విషయం అర్థం చేసుకో....భార్యాభర్తల మధ్య ముఖ్యంగా ఉండాల్సింది సహకారం. అందుకోసమే పెళ్ళి. అలా సహకరించుకునే ఉద్దేశ్యమే లేకపోతే పెళ్ళి అవసరమే లేదు. ఒకరొన్కరు అర్థం చేసుకోకుండా...బలవంతంగా దౌర్జన్యంగా సహకారాన్ని పొందడమూ...అయిష్టంతో, అసహాయతతో సహకరించడమూ లోపాలయితే వాటిని సరిదిద్దుకోవాలి. కానీ ఆ లోపాలను పూడ్చడం కోసం అసలు సహకారాన్నే వద్దనుకోవడం...ఇంకా పెద్ద లోపం.”

పూర్ణ చిన్నగా నిట్టూర్చి మళ్ళీ చెప్పింది.

“భార్యాభర్తలుగా మీరిద్దరూ ఒకరినొకరు సహకరించుకుంటున్న విషయాలే కనబడట్లేదన్నయ్యా నాకు. తన పనులన్నీ వదిన చేసుకుంటుంది. నీ పనులన్నీ నువు చేసుకుంటావు. బహుశా బాబు పనుల్లో ఏమన్నా కొంచెం సహకారం అందించుకుంటున్నారేమో. కానీ నా కర్థమయినంతవరకూ అదికూడా సహకారం అన్న భావంతో కలిసి చేసుకోవడం కాకుండా...కొన్ని పనులు నీవీ, కొన్ని పనులు నావీ అన్న ధోరణిలో ఉన్నారు.” ఆమాట అంటూ పూర్ణ లేచి నిలబడింది.

“భార్యాభర్తలు ఒకరినొకరు సహకరించుకునే పనులు తగ్గించుకోవడం కాదన్నయ్యా. కల్పించుకోవాలి. నీ పనులన్నీ తనచేత చేయించకపోవడం తనని సుఖపెట్టడమయితే కావచ్చు. కానీ ఇద్దరూ కలిసి కొన్ని పనులు చేయడం సాహచర్యం. మొదటిదానివల్ల ప్రేమ కలుగుతుందో లేదో నాకు తెలీదు కానీ రెండో దానివల్ల బంధం బలపడుతుంది.”

మెట్లు దిగుతూ నా భుజం మీద తట్టింది పూర్ణ. “పద. భోజనాల సంగతి చూడాలి. మళ్ళీ నీవు బయల్దేరాలి కదా!”

తను వడివడిగా లోపలికి వెళ్ళిపోయింది కానీ నేను వెంటనే కదల్లేకపోయాను.

కాసేపటి తర్వాత పూర్ణ భోజనం పెట్టి, నా కోసం శైలజ కోసం కొన్న బట్టలు పెట్టింది.

అవన్నీ బ్యాగ్‌లో సర్దుకుంటూ ప్రక్కనే నిలుచున్న పూర్ణని “భార్యాభర్తలు సహకరించుకునే పనులంటే ఏమిటే!” అన్నాను.

పూర్ణ నవ్వింది. “ఏంటంటే ఏం చెప్పను అన్నయ్యా! సరిగ్గా ఆలోచిస్తే నీకే తెలుస్తుంది. పెద్దన్నయ్య ఉండడం వల్ల సగం పనులు నీదాకా రానేరావు. నాన్న తద్దినానికి కూడా నీకిష్టమయితే వస్తావు. లేకపోతే అన్నయ్యొక్కడే పెట్టేస్తాడు. మిగతా సగం పనులూ నువు వేస్ట్ అనో బోర్ అనో తీర్మానించి మానేశావు. ఇక ఒక గృహస్థుగా నువు చేసే పనులేమున్నాయి! అందులో వదిన సహకరించడానికి ఏం మిగిలాయి?”

అదలా ఎక్కడ్నుంచి ఎక్కడికో ముడిపెడుతుంటే నాకు ఒళ్ళుమండింది. “ఏం పనులు చేయడం లేదే నేను!” అన్నాను ఉక్రోషంగా. “ఇక్కడ అందరూ నిన్ను నీ అంతవాళ్ళు లేరని పొగుడుతుంటే...ఇక మిగతా వాళ్ళందరూ చవటల్లా కనిపిస్తున్నారు నీకు.” అన్నాను.

నా మాటలకి పూర్ణ నవ్వింది. “ఊరికే ఎందుకు పొగుడుతారన్నయ్యా నన్ను! మీ బావగారి సంగతి నీకు తెలీదు. నేను చేసిన పని బాగుంటేనే మెచ్చుకుంటారు” అంది.

“బాగాలేకపోతే!”

“బాగాలేకపోతే పర్లేదులే అని సర్దుకుంటారు. అత్తయ్యగారు, మామయ్యగారు కూడా అంతే. బాగుంటే మెచ్చుకుంటారు. లోపాలుంటే సర్దుకుంటారు.”

“మరింక నీ గొప్పదనమేముంది అందులో!” అన్నాను నేను హేళనగా.

“నిజమే అన్నయ్యా.” అంది పూర్ణ వెంటనే ఒప్పుకుంటూ. “నా గొప్పతనం ఏమీ లేదు. ఇది వాళ్ళ గొప్పతనమే. ఇంకో విషయం చెప్పనా నీకు! పనుల విషయానికి వస్తే శైలూ వదిన నాకంటే సమర్థురాలు. మీ బావగారు నీకంటే సమర్థులు. అయినా వదినలాగా అభద్రతా భావం నాలో కలగడం లేదంటే అది వాళ్ళ గొప్పదనమే.”

ఒక షాక్‌లా తగిలాయి నాకామాటలు. మరింకేం మాట్లాడలేని వాడిలా చూసి బ్యాగ్ తీసుకుని బయటకి నడిచాను.

నా వెనకే వస్తూ “ఎపుడైనా మనధర్మం మనం సరిగ్గా నిర్వర్తిస్తే ఏ కన్ఫ్యూజనూ ఉండదన్నయ్యా. అది వదిలిపెట్టి ఎన్ని ఆలోచనలు చేసినా....ఆదర్శాలు చెప్పినా చివరికి అయోమయమే మిగుల్తుంది” అంది పూర్ణ.

అది అంతకు ముందు చెప్పిన విషయానికీ, ఈ మాటలకీ సంబంధం ఏమిటో నాకర్థం కాలేదు.

శైలూ నా శీలాన్ని నమ్మడం లేదన్న నా సమస్యకు ‘నువు ధర్మాచరణ చేయాలి’ అని పరిష్కారం చెప్తుందేమిటి పూర్ణ!

నేను అర్థం కానట్లు చూస్తూ...“అంటే ఏమిటి? శీలమూ, ధర్మమూ ఒకటేనంటావా!” అన్నాను.

పూర్ణ నవ్వింది. ‘నువు వేరనుకుంటున్నావా!’ అంది.

బ్యాగ్‌తో పాటు ఆ ప్రశ్ననీ మోసుకుంటూ వచ్చి బస్ ఎక్కానునేను.

ప్రశ్నలు, .....ఆలోచనలు..మధ్య మధ్య నిద్ర...మళ్ళీ ప్రశ్నలు..ప్రయాణమంతా ఇలాగే సాగింది.

మధ్యాహ్నం మహేశ్ చుట్టాలాయన ఎవరో అన్నాడు. "ఇల్లు బాగుందయ్యా. నీ లైబ్రరీ,...పూజగదీ...గెస్ట్‌రూం...మీ అమ్మానాన్నల గదీ... ఇంటిముందరి తోట... అన్నీ ఒక్కోటి ఒక్కో యజ్ఞశాలలా ఉన్నాయి" అని.

గృహస్థు అంటే పంచయజ్ఞాలు చేయాలట. ఆయన వివరంగా చెప్పాడు కానీ నేను సగమే వినిపించుకున్నాను. బస్‌లో కూర్చుని ఆలోచిస్తుంటే ఆయన మాటలు కొంచెం అర్థమయినట్లుగా అనిపించాయి.

తెల్లవారేసరికి ఇంట్లో అడుగుపెట్టాను. శైలూ మౌనంగా కాఫీ ఇచ్చింది. డైనింగ్ టేబుల్ దగ్గర నిలుచుని పంచదార డబ్బాలోకి వంచుతోంది.

నేను కాఫీ సిప్ చేస్తూ టీపాయ్‌మీది పాంఫ్లెట్ చేతిలోకి తీసుకున్నాను.

శివాలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా సత్యనారాయణవ్రతం చేయిస్తారట. దాని వివరాలు.

"మనం కూడా చేసుకుందామా!" అన్నాను.

శైలూ అర్థం కానట్లు చూసింది.

పాంఫ్లెట్ చూపిస్తూ "వ్రతం" అన్నాను.

ఆశ్చర్యం కోపాన్ని జయించగా "ఎందుకు!" అది శైలూ.

"ఊరికే. నిన్న పూర్ణావాళ్ళు చేసుకుంటుంటే నాకు కూడా చేసుకోవాలనిపించింది... నీతో కలిసి."

ఆఖరిమాట వింటూనే శైలూ కళ్ళల్లోకి ఓ మెరుపు దూసుకువచ్చింది.

స్పష్టంగా అర్థమవుతున్న ఉద్వేగాన్ని కంట్రోల్ చేసుకుంటూ సగం వంచిన పంచదార కవర్‌ని జాగ్రత్తగా టేబుల్‌మీద నిలబెట్టి నాదగ్గరికి వచ్చింది శైలూ.

నా వడిలో కూర్చుని ధీమాగా నా గుండెలపై తల ఆనించింది.

తనని చుట్టేసిన నా రెండు చేతుల్లోని పాంఫ్లెట్‌వైపు మా ఇద్దరి కళ్ళూ చిరునవ్వుతో చూశాయి. అందులోని వివరాలవైపు ఆసక్తిగా పరుగుతీశాయి. ●

**చిరునామా : 5-4-345, రోడ్ నెం. 5, కమలానగర్, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070. సెల్ నెం. 9441644644.**

# సంప్రదాయాలు

అన్యసంప్రదాయాన్ని అనుసరించగోరితే, దాన్నిగురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి, జాగరూకతతో అనుసరించాలి. లేకపోతే, అవకతవకలు జరుగుతాయి.

ఇంగ్లీషుభాషలో పాశ్చాత్య సంప్రదాయం ప్రకారం ఇప్పుడు పెక్కుమంది అచ్చువేసి పంపిస్తున్న పెండ్లిశుభలేఖల సందర్భంలో -నిష్కర్షగా చెప్పాలంటే ఎన్నెన్నో అవకతవకలు కానవస్తున్నాయి. వాటిని మా పాఠకుల దృష్టికి తీసుకువస్తున్నందుకు మమ్ము అపార్థం చేసుకోరని ఆశిస్తున్నాము; మాపై ఆగ్రహపడరని నమ్ముతున్నాము.

మాటవరసకి, పుల్లయ్యగారి కుమార్తె పెళ్లి జరుగుతున్నదనుకోండి. ఆయన పంపిస్తున్న శుభలేఖలు "శ్రీమతి, శ్రీ పుల్లయ్య"ల పేర ప్రస్తుతం వెడుతున్నాయి. పాశ్చాత్య సంప్రదాయంప్రకారం ముందుగా పేర్కొనవలసింది "మిస్టర్"నే, "మిసెస్"ను కాదు. అయినా, సభాసదులను ఉపన్యాసకుడు "లేడీస్ అండ్ జంటిల్‌మెన్" అని సంబోధించడం సంప్రదాయం కాబట్టి, అదే అన్ని సందర్భాలకు వర్తిస్తుందన్న భ్రమవల్ల కాబోలు, మన శుభలేకలలో ముందు 'శ్రీమతిని' పేర్కొని, తర్వాత "శ్రీ"ని పేర్కొనడం జరుగుతున్నది. ఎవరు ఈ పద్ధతిని ముందుగా ప్రారంభించారో తెలియదుకాని, ఇది శుద్ధ తప్పు.

భర్త ఇంటిపేరునుబట్టి భార్య ఇంటిపేరు మారుతుంది. అందువల్ల 'మిస్టర్' తర్వాతనే "మిసెస్"ను పేర్కొనాలి. ఇందుకు విరుద్ధంగా వెళ్ళడం ఏ సంప్రదాయం ప్రకారమైనా సబబు కాదు.

పోతే, ఈ శుభలేఖలలో "సౌభాగ్యవతి" అనే మాటను ..... అని కుదిస్తున్నారు. ఇంగ్లీషులో ... అనే మాటకు అర్థమేమిటో తెలిసినవారు ఈ పిచ్చిపని చేయరు.

ఇదే విధంగా "చిరంజీవి" అనే పదాన్ని .... అని కుదించడం కూడా అసభ్యమే. .... అనే ఇంగ్లీషు వర్ణక్రమాన్ని "ఛీ" అని కూడా ఉచ్చరించడానికి వీలున్నదన్న సంగతిని ఈ సందర్భంలో గమనించాలి. ఈ ప్రమాదం ఉన్నప్పుడు "చిరంజీవి" అని పూర్తిగా అచ్చేవేయడమే సముచితం కాగలదు.

పోతే, సంభాషణ సందర్భంలో "నా మిసెస్", మీ మిసెస్" అనడం కూడా శుద్ధతప్పు. "మిసెస్" తర్వాత విధిగా భర్తపేరు రావాలి. లేదా "మై వైఫ్", "యువర్ వైఫ్" అనాలి.

సంప్రదాయాలు సరిగా తెలియకపోతే, ఏ భాషలోనైనా ఇట్టి పొరపాట్లు జరగడం కద్దు. "మా ఆవిడ" మనకు నుడికారం. అది తప్పుకాదు. ఇదే ధోరణిలో "మా భార్య" అనడం ఎంత ఘోరమో మేము ప్రత్యేకించి వివరించనక్కరలేదు.

ఇట్టి ఉదాహరణలు మరికొన్నింటిని పేర్కొనవచ్చుగాని, సంప్రదాయాన్ని క్షుణ్ణంగా తెలుసుకొనకపోతే, దాన్ని జాగ్రత్తగా అనుకరించకపోతే, ఎన్ని అవకతవకలు జరగగలవో ఇప్పటికే మేము తగినంతగా వివరించగలిగినట్టు నమ్ముతున్నాము.

**(నార్ల - కదంబం-'చెణుకులు, చురకలు' నుంచి)**

# సాహితీ స్రవంతి

## వ్యాస రచన పోటీ–బహుమతులు: రూ॥ 10,000

**భా**ష, యాస, సంస్కృతి, కవితారీతి వాటి పరిణామక్రమం పరిశోధనలో తేలిన కొత్త ప్రతిపాదనలతో సోదాహరణంగా, సాధికారంగా కూర్చిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం.

- ❖ వ్యక్తులు, ప్రదేశాలపై కాక వ్యాసాలు భాష సాహిత్యప్రక్రియలకు సంబంధించినవై వుండాలి.
- ❖ వ్యాసాలు సాహితీస్రవంతిలో నాలుగైదు పేజీలకు మించకుండా, అంటే 12–15 అరఠావులలో వుండాలి. సమగ్రత కోసం పేజీలు కొద్దిగా పెరిగినా పర్వాలేదు.
- ❖ దస్తూరి అర్థమయేలా వుండాలి. ముఖ్యంగా పద్యాలు, శ్లోకాలు, పదాలు, మరింత శ్రద్ధగా రాయాలి. ఇతర కవులను పరిశోధకులను వుదహరించినపుడు మూలరచనల వివరాలను పొందుపరచాలి.
- ❖ వ్యాసాలు పరిశోధన స్థాయిలో సమగ్రంగా విశ్లేషించి, చదివించే రీతిలో రాయాలన్నది మా అభిలాష. నేడు ప్రచారం ఉన్న వ్యవహారిక భాషలో (పరభాషా పదాలు విస్తృతంగా వాడుతూ) రాయండి. నేటి తెలుగుని మీ వ్యాసాలలో ఆవిష్కరించండి!
- ❖ ఎంపిక చేసిన అయిదు ఉత్తమ వ్యాసాలకు, ఒక్కోదానికి రెండువేల రూపాయల నగదు బహుమతి. ఈ వ్యాసాలతో బాటు మామూలు ప్రచురణకు మరికొన్నింటిని కూడా తీసుకునే అవకాశం ఉంది. సాధారణ ప్రచురణ వ్యాసాలకు తగిన పారితోషికం ఉంటుంది. వ్యాసాల కాపీరైటు అకాడమికి ఉంటుంది.
- ❖ ఫలితాలు జనవరి–మార్చి, 2011 సాహితీ స్రవంతి సంచికలో వెలువడతాయి. విజేతలకు వ్యక్తిగతంగా కూడా తెల్పుతాం.
- ❖ ఈ విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఇ–మెయిల్, ఫోన్ సంభాషణలకు ఆస్కారం లేదు. తుది నిర్ణయం సాహితీ స్రవంతి సంపాదక వర్గానిదే.
- ❖ ఎంపిక కాని వ్యాసాలను తిప్పి పంపడం సాధ్యం కాదు. కనుక మీ వద్ద కాపీ పెట్టుకుని మాత్రమే పంపండి. హామీపత్రం విధిగా జతపరచాలి. లోగడ ప్రచురితమైనవి, ప్రసారమైనవి, పోటీకి అనర్హం.

---

**వ్యాసాలు మాకు చేరవలసిన**
**ఆఖరు తేది**
**31 అక్టోబర్, 2010**

**మా చిరునామా :**

**సాహితీ స్రవంతి, సి.పి. బ్రౌన్ అకాడమి,**
**53, నాగార్జునహిల్స్, పంజగుట్ట, హైదరాబాద్–500 082.**
Phone No. 040-23423188, 23430448-50,
email : info@cpbrownacademy.org
website : www.cpbrownacademy.org

## ముఖాముఖి

# ఆచార్య కొలకలూరి ఇనాక్

## "తెలుగు భారతి పురస్కారం 2010" గ్రహీత

గుంటూరు జిల్లా వేజండ్లలో కొలకలూరి రామయ్య ఉరఫ్ శాంసన్, వీరమ్మ ఉరఫ్ విశ్రాంతమ్మ దంపతులకు ద్వితీయ పుత్రుడిగా 1-7-1939న ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు జన్మించారు. మట్టిలో మాణిక్యంగా ఆ పల్లెలో పుట్టిన వీరు, కులభూషణమై వర్ధిల్లారు. ఆయన కడుపునిండా అక్షరాలు, కళ్ళనిండా కలలు, దారంతా ఆలోచనలు. ఇంట్లో అమ్మ సంరక్షణ, కాలేజిలో గ్రంథాలయ సంవీక్షణ, సడలని దృఢ దీక్ష ఆయనను శిఖరాగ్రానికి చేర్చాయి. బహుముఖ ప్రజ్ఞాశాలిని చేశాయి. ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. అభివ్యక్తం చేయని ఆధునికవాదం లేదు. ఇంత వైవిధ్యభరితమైన సాహిత్య సృష్టి చాలా అరుదైనది. ప్రతి ప్రక్రియల్లోనూ మణిపూసల్లాంటి పుస్తకాలు, కథల్లో 'ఊరబావి', 'కట్టడి', కవిత్వంలో 'త్రిద్రవ పతాకం', 'చెప్పులు'. విమర్శ వ్యాసాల్లో 'సాహిత్య సందర్శనం', 'సాహిత్య దర్శిని', నాటకాల్లో, 'మునివాహనుడు', 'జైహింద్'. నాటికల్లో 'దృష్టి', 'అభ్యుదయం' బాలసాహిత్యంలో 'అమ్మ' నవలల్లో 'అనాథ', 'అనంతజీవనం', 'సర్కారుగడ్డి' పరిశోధనంలో 'ఆధునిక సాహిత్య విమర్శసూత్రం', 'శూద్రకవి శుభమూర్తి వసుచరిత్ర వైశిష్ట్యం', 'జానపదుల సాహిత్యవిమర్శ' ఈ విధంగా పట్టుకున్న ప్రతి ప్రక్రియా ప్రయోజనకరం, సారవంతం, స్వరపూరితం చేసే పరుసవేది ఆయన చేతిలో ఉందేమో!

కవితలల్లినా, కథలు చెప్పినా, నవల నడిపించినా, నాటకాలు కూర్చినా...పద్యం పాడినా పాఠం చెప్పినా ఉపన్యసించినా ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆయనకాయనేసాటి. ఆయన శైలి సరళంగా ఉంటుంది. వాక్యం క్లుప్తంగా ఉంటుంది. అందంగా అర్థవంతంగా ఉంటుంది. పరిసరాలు ఆ ప్రాంతంలో మనం నడుస్తున్నట్లే ఉంటాయి. పాత్రలు ప్రాణంతో నిలబడి పలకరిస్తాయి. కథముగించినా ఆలోచనలు ముసురుకునే ఉంటాయి. ఏదో ఒక వేదనారవం, లోలోపల సుడి తిరుగుతుంటుంది. ఆయన గొప్ప అన్వేషి. అవేమి కథలు! అదెక్కడి జీవితం? గూగడు, నాగలింగం, రాముడి కోడలు నాగమ్మ వీళ్ళంతా ఎక్కడ దొరికారో. ఆ 'ఊరబావి' ఎక్కడుంది? ఇంగ్లీషు, హిందీ, కన్నడ, తమిళ, ఫ్రెంచి, జర్మను భాషల్లోకి అనువదించబడినా ఆ తెలుగుకథ గొప్పదనం తెలుగు వాళ్ళకెందరికి తెలుసు? ఆయన ఎగరేసిన త్రిద్రవ పతాకంలో రెపరెపలాడే మూడు ద్రవాలు రక్తం, స్వేదం, కన్నీళ్ళు.

**"జాతీయ పతాకం,**
**మొన్న కన్నీటిని తుడిచింది,**
**నిన్న చెమటలో తడిసింది,**
**నేడు రక్తంలో మునిగింది**
**ఇప్పుడది త్రిద్రవ పతాకం"** మానవుల కష్టాల కారణాలు ధ్వంసమై



***గుప్పెడు తెలుగక్షరాలు / పుక్కిటను దోసిటను నింపుక***
***విత్తనాల వలె దారికి / ఇరువైపుల చల్లినాడు***

ఆనందానికి కారణమైన శ్రమ, చెమట వర్ధిల్లాలని ఆయన ఆకాంక్ష. అంతేకాక, దేశభక్తులు చెమటోడ్చి సంపాదించిన స్వాతంత్ర్యం కన్నీటిని తుడిచిందనీ ఇప్పుడు రక్తంలో మునిగిందనీ భావన. ఆయన రచించిన 'మునివాహనుడు' నాటకం నాలుగు భాషల్లో అనువదించబడింది. విద్యార్థి దశలోనే రచించిన 'దృష్టి' నాటికకు కేంద్రప్రభుత్వ బహుమతి పొందారు. పుట్టగానే పరిమళించిన పూవు ఆచార్య కొలకలూరి.

ఈఏడు సి.పి. బ్రౌన్ అకాడమివారి తెలుగు భారతి పురస్కారానికి ఎన్నికైన సందర్భంగా వారితో సంభాషణ.

కథ, నవల, కవిత్వం, నాటకం, వ్యాసం, విమర్శ, పరిశోధనం అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ ముందు వరసలో ఉన్న మీరు ఈ సంవత్సరం 'తెలుగు భారతి' పురస్కారానికి ఎంపికైనందుకు అభినందనలు.

ధన్యవాదాలమ్మా! తెలుగు భాషా సాహిత్యాల అభ్యున్నతికి ఇంతగా కృషిచేస్తున్న అకాడమికి అభినందనలు. ఆయా రంగాలలో కృషి చేస్తున్న మా వంటి వారిని గుర్తిస్తున్నందుకు ధన్యవాదాలు.

**చిరునామా : ఆచార్య కొలకలూరి ఇనాక్, 4/282, న్యూ సర్వోదయానగర్ కాలనీ, మీర్‌పేట, పోస్టు హైదరాబాద్-500 097. ఫోన్ నెం.040-24093433, సెల్ నెం. 9440243433.**



**సుజాతాదేవి : మీరు ఏ వయసునుంచీ రాస్తున్నారు? అసలు రచనలు చేయాలనే తలపు ఎలా కలిగింది? మీ పెద్దల ప్రోత్సాహం ఉందా?**

**ఆచార్య ఇనాక్ :** పెద్దల నుంచీ ఏమీ లేదమ్మా? మా అమ్మకు నేను పెద్ద చదువులు చదివి ఉద్యోగం చేయాలని ఆశ ఉండేది. మా నాన్నకు ఎక్కడన్నా జీతానికి పెట్టాలని ఉండేది. మూడవ తరగతి చదివాక అదే జరిగింది. కాని ఆ సంవత్సరమే. తరగం దేవదాసుగారనే బి.ఎ. చదువుతున్న సారు మా పల్లెలో పిల్లలకు ట్యూషన్లు చెప్పి గుంటూరు బడిలో చేర్పించటానికి కృషి చేసేవారు. ఆయన సంకల్పబలం. మా అమ్మ ఆశ. మూడో తరగతి అర్థంతరంగా మానేసి జీతానికి కుదిరిన నాకు అప్పటికే గొడ్లు కాసే పని మీద బులపాట తీరిపోవడం, అన్నీ కలిసి నేనాసారుదగ్గర ట్యూషన్లో చేరిపోయాను. సారు ఫస్టుఫారం పరీక్షకు పంపాడు. పాసయ్యాను. గుంటూరులో బడి, వేజండ్లలో ఇల్లు. రైల్లో ప్రయాణం అరగంటయినా స్టేషనులో వెయిటింగ్. ఎక్కువ ఉంటే ఇంత తిని అంత పట్టుకెళ్ళడం. లేకపోతే వెళ్ళిపోవడం. 9వ తరగతి పూర్తయింది. నాన్నపోయాడు. అక్కడనుంచీ అమ్మది ఒంటరి పోరాటం. నేను తమ్ముడు, చెల్లెలు. కూలీ నాలీ చేసి మమ్మల్ని పెంచింది అమ్మ. ఆ దశలో 1954లో స్కూల్ ఫైనల్ పూర్తి చేశాను.

**సు॥ అంత కష్టపడి చదువుకున్న మీకు ఈ సాహిత్య పవనం ఎటునుంచొచ్చి చుట్టుకుంది?**

ఇ॥ కష్టం ... ఇప్పుడు ఆలోచనలోకొచ్చింది. అప్పుడనుభవించిందికాదు. అమ్మ అన్నం పెట్టి కాదు పెంచింది పట్టుదల. అమ్మ! మొదటిసారి గుంటూరులో ఎంట్రెన్సు పరీక్ష రాస్తున్నప్పుడు మొదటి రోజు బాగా రాశాను. సారు కూడా సంతోషించారు. రెండోరోజు టికెట్ కొనడానికి డబ్బుల్లేవు. స్క్వాడ్ వచ్చింది, రైలు వెళ్ళింది. రైలు పట్టాలమీద పరుగు మొదలు పెట్టాను. ఎనిమిది మైళ్ళు. దారి తెలుసు. కనుక సమయానికి మూడున్నరగంటల్లో వెళ్ళాను. అక్కడ కష్టం ముఖ్యం కాదమ్మా.. వెళ్ళటమే ప్రధానం.

**సు॥ మరి సాహిత్యగంధం ఎక్కడ సోకిందనీ...?**

ఇ॥ తెలుగు పాఠాలు ఆసక్తిగా ఉండేవి. శ్రద్ధగా వినేవాడిని. రోజూ రైలు ప్రయాణమే కదమ్మా. దాసు అనే ఒక అన్న ఉండేవాడు. వేజండ్ల స్టేషన్లో కూర్చుని పాడుతుండేవాడు. అతనెప్పుడూ జాషువాగారి పద్యాలు పాడుతుండేవాడు. అవి చక్కగా అర్థమయేవి. సొగసైన నడకతో ఆహా! అనిపించేవి. విన్నకొద్దీ వినాలనిపించేవి. వినీ వినీ ఇంటికెళ్ళాక కూడా పాడుకునేవాడిని. అవి నా ఆలోచనలకు దగ్గరగా ఉండేవి. గుంటూరు ప్లాటుఫారంమ్మీద, వేజండ్ల ప్లాటుఫారంమ్మీద పుస్తకాలు అన్న అమ్మేవాడు. ఒకో పుస్తకం రెండణాలు. ఆ రెండణాలు పుస్తకం చదివాక ఇచ్చేసి ఇంకో అర్థణ ఇస్తే.. ఇంకో పుస్తకం ఇచ్చేవాడు. నేను మొదట జాషువా కవిత్వమే చదివాను. అప్పుడు మాకు టీచర్ జంధ్యాలపాపయ్యశాస్త్రిగారు ఉండేవారు. నాకు పద్యాలు చెప్పేవారు. ఆయన పద్యాలు కూడా తీయగా ఉండేవి. టెక్స్టు బుక్కుల్లో ఉండేవి అర్థం చెబితేగాని తెలిసేవి కాదు. ఇవి మాత్రం బావుండేవి. నాక్కూడా పద్యాలు రాయాలనిపించేది, రాసేవాడిని. అవి పాపయ్యశాస్త్రిగారికిస్తే ఇదిలా, అదలా... అని మార్పులుంటే చెప్పేవారు. ఆ విధంగా మొదట కవిత్వమే రాశాన్నేను. అలా రాసి ఎవరికైనా చూపిస్తే ...బాగా రాశావోయి, కరుణశ్రీ పద్యాల్లాగే ఉన్నాయి, జాషువా పద్యాల్లా ఉన్నాయి అనేవాళ్ళు. అట్లా అనడం నాకు నచ్చలేదు. నేను రాసినవి నేను రాసినట్లే ఉండాలనిపించింది. అప్పుడు పద్యాలు రాయడం మానేశా...ఇంక లైబ్రరీమీద పడి కథలూ నవలలూ చదవడం మొదలుపెట్టా. అప్పుడు ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ వారపత్రిక లొచ్చేవి. వాటి ధర పావలా. కాని ఒక అణా ఇస్తే




అద్దెకిచ్చేవాళ్ళు. అట్లా వాటిని చదివేవాడిని. రైల్లో దాసు దగ్గర జాషువా పద్యాలేకాక, ఇంకో అన్నదగ్గర కొవ్వలి, జంపన నవలలన్నీ చదివేవాడిని. కథలు చదువుతుంటే మనం కూడా రాద్దామనిపించేది.

**సు॥ మొదటికథ ఎప్పుడు వ్రాశారు? దానికి ప్రేరణ ఏమిటి?**

ఇ॥ 1954లో నేను ఇంటర్‌లో ఉండగా పెద తాతయ్యను కొట్టి చంపేసినట్లు చీటీ వచ్చింది. అసలు ఊరినుంచి చీటీ రావడమంటేనే ఏం ఏడుపు కబురు మోసుకొచ్చిందోనని భయంగా ఉండేది. అదే విషయంగా కథ రాశాను. ఎసి కాలేజి మాగజైన్‌లో అచ్చయింది. ఆ కథ పేరు 'ఉత్తరం'.

**సు॥ మీ కథలు చాలావరకూ రకరకాల వృత్తులవారెదుర్కొనే యాతనను చిత్రిస్తాయి. పుస్తకపఠనం ఇచ్చిన కొత్త దృష్టితో కొత్త అవగాహనతో ఆ చిన్నవయసులో కూడా మీ కథావస్తువుల్లో మార్పు లేదా?**

ఇ॥ ప్రేమ కథలు రాయలేదా అని అడుగుతున్నారు మీరు. నా కర్థమవుతుందమ్మా. కాని ఆ రోజుల్లో నాకున్న పల్లెజీవన పరిమితుల్లో, మీరడిగే మృదువైన భావాలకు చోటులేదు. మొదటి సమస్య ఆహారం, దారిద్ర్యం, కులం అంటరానితనం. మా ఇళ్ళల్లో తగాదాలు అర్థంలేనివిగా ఉండేవినాకు. పైగా మా అమ్మ చాలా దృఢమైన ఆలోచనగలామె. నీకవన్నీ ఎందుకు... నీ పని నువ్వు చేసుకో అని నన్ను గిరిలోనే ఉంచేది. బరిలోకి పంపేది కాదు. అందువల్ల సంఘంలోని జనం, వృత్తులు, సమస్యలు దగ్గరగా ఉండేవి. పుస్తకాలు చదివినందువల్ల, వయస్సువల్ల ప్రేమకథలు విరివిగా వ్రాసి ఉండవలసింది నిజమే. వ్రాయలేదు. నా ఆలోచనలు అటుపోలేదు.

**సు॥ మధ్య తరగతి జీవితాలలో మాత్రం ఎన్ని సమస్యలు లేవు? అధిక సంతానం, చాలీచాలని రాబడి, కట్నాలు, కలతలు, వైమనస్యాలు ఆశనిరాశలు, మిధ్యాగౌరవాలు.**

ఇ॥ నాది మధ్యతరగతి కాదమ్మా! మీరనే దిగువతరగతి, మధ్యతరగతి సమస్యలు మాకు లేవమ్మా! తెలియవు. అయితే ఆకలి లేకపోతే పీడన....ఈ రెండే తెలుసు. రైతు కొట్టటం, తిట్టటం. ఆయన వీళ్ళనంటుకోడు. కనుక కర్ర విరిగేట్టు కొట్టటం, గింజల్లేక వాళ్ళన్నం ఒండుకోరు. ఇవే ఎక్కువగా జీవితాన్ని ప్రభావితం చేసేవి. ఇవాళన్నం లేదు ఎలాగెల్తావు? అని మా అమ్మంటే ఫరవాలేదులే సాయంత్రం వచ్చి తింటా అని వెళ్ళిపోయిన రోజులు కూడా ఉన్నాయమ్మా. స్కూలు 10 గంటలకు, ట్రైన్ టైమ్ 6.30గంటలకు. కనుక 6 గంటలకే ఇంట్లో బయల్దేరాలి. 4.30కి స్కూలు వదిలితే, సాయంత్రం 6.30 వరకు స్టేషన్లో ఉండేవాళ్ళం. అంటే ఉదయం 6కి బయలుదేరితే రాత్రి 8కి ఇంటికి చేరతాము. పొద్దున్నే కాస్త తిని క్యారేజ్ పట్టుకెళ్ళకపోతే ఏమీ దొరకదు. అయినా 'ఫరవాలేదు, వచ్చాక తింటా' అని వెళ్లిపోయేవాడిని. ఇప్పుడు పల్లె పరిస్థితి మారింది. రోజూ భోజనం చేయగలుగుతున్నారు. కూలిరేట్లు పెరిగాయి. దౌర్జన్యాలు తగ్గాయి. మా అమ్మ పోయినప్పుడు ఊళ్ళో అందర్నీ పిలిచాను. అందరూ భోజనానికి వచ్చారు. అంటుజబ్బు తగ్గుతుందని నేనంటే మీ ఇంటికి కాబట్టి వచ్చారని వాళ్ళు అంటున్నారు.

**సు॥ మీరు ఫలానా విషయంలో చైతన్యం తీసుకురావాలని కథను అల్లుకుంటారా లేక మిమ్మల్ని కదిలించిన సంఘటన ఆధారంగా రాస్తారా?**

ఇ॥ చూసిందో, విన్నదో, తెలుసుకున్నదో ఆధారంగా ఉంటుంది. ఆ సంఘటనవెంటబడే మాటా నిజమే. అయితే ఒక సన్నివేశం కథానిక

రూపమివ్వడం కంటే ఒక ఆలోచనకు కథానికా రూపమివ్వడం నాకిష్టం. ఆ ఆలోచనకు పాత్రలు, పరిసరాలు కథనం అన్నీ అమరాలి. అవి నాకు పరిచితంగా ఉండాలి. మీకు పరిచయం చెయ్యాలి.

**సు॥ జరిగిన సంఘటన ఆధారంగా రాసిన కథ మీ మొదటికథ చెప్పారు. ఆలోచన ఆధారంగా రాసిన కథ ఒక్కటి చెబుతారా?**

ఇ॥ ఒకసారి లైబ్రరీలో కూర్చుని చదువుకుంటున్నా. ఎదురుగా ఒకమ్మాయి కూర్చుంది. చాలా అందంగా ఉంది. నా చూపు పుస్తకం మీద నిలవటం లేదు. మళ్ళీ మళ్ళీ అటే మళ్ళుతోంది. ఆమె కళ్ళకు మందపాటి సోడాబుడ్డి కళ్ళద్దాలున్నాయి. అయ్యో పాపం అనిపించింది. ఇంత చక్కటి పిల్ల ఆ కంటిచూపులేకపోతే ఎవరైనా చేసుకుంటారా? అనే ఆలోచన వచ్చింది. దాన్నుంచి కథ చిలవలు పలవలుగా సాగింది. డబ్బుగలవారమ్మాయైతే ఎలా ఉంటుంది? పేద పిల్లయితే ఏం జరుగుతుంది? డబ్బుకోసం చేసుకునేవాడు ప్రేమగా చూస్తాడా? అలా... అలా ఎన్నో ఆలోచనలు. చివరికొకతను అంగీకరిస్తాడు. అతన్ని వీళ్ళే చదివిస్తూ ఉంటారు. కళ్ళకు ఆపరేషన్ చేస్తారు. కళ్ళువస్తాయి. కాని ఆ పిల్ల అతని గుణం తెలుసుకోవాలని కళ్ళు రాలేదని చెబుతుంది. అతడి బుద్ధి తెలుసుకుని నిరాకరిస్తుంది. అది 'దృష్టి' అనే నాటకంగా రూపుదిద్దుకుంది. దానికి బహుమతి వచ్చింది. గంట నాటకంగా రేడియోలో ప్రసారమైంది.

**సు॥ ఒక అందమైన అమ్మాయిని చూసినపుడు కలిగిన చిన్న ఆలోచన గంట నాటకంగా రూపుదిద్దుకుందంటే మీ దృష్టి, ఏకాంశవ్యగ్రత ఎంత తీక్షణమో తెలుస్తుంది.**

ఇ॥ అందమైన అమ్మాయిని చూసినపుడు కూడ నాకు దుఃఖ పూరితమైన ఆలోచనలేవచ్చాయి. ఆ నాటకానికి ఢిల్లీ నుంచి బహుమతి అందుకున్నాను. అప్పుడు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు స్పోకెన్‌వర్డ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. బుచ్చిబాబుగారు ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా ఉన్నారు. ముఖ్యపాత్ర అయిన హేమలత పాత్రకు శ్రీమతి తురగా జానకీరాణి గాత్రాభినయం.

**సు॥ ఇప్పుడు భిన్నవర్గాల నుంచి విభిన్న స్వరాలు వినబడుతున్నాయి. స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం, వాటిలో మళ్ళీ ప్రాంతీయ భేదాలు. ఆ విధంగా ఏదో ఒక వాదానికి చెందనివారికి ఉనికి లేదు. పూర్వం రోజుల్లో మీరేమిట్లు? అని అడిగినంత సహజంగా ప్రాంతీయత చోటు చేసుకుంటుంది. దీని వలన సాహిత్య దృక్పథం సంకుచితమై పోవడం లేదా?**

ఇ॥ ఏ దృక్పథంతోనైనా నవరసాలూ రాయవచ్చు. జీవితంలోని భిన్నకోణాలు చూడవచ్చు. ఈ వాదాల వలన ఎవరి సమస్యలు వాళ్ళకే అర్థమవుతాయి. ఎవరికి తెలిసిన ప్రపంచాన్ని వాళ్ళే వివరించగలరు. పై నుంచి చూసి, అంతెత్తునుంచి ఎంత లోతులకెళ్ళగలరెవరు. ఏ దృక్పథంతోనైనా నవరసాలూ రాయవచ్చు. ఇంతకుముందు రచనలు బ్రాహ్మణులు మాత్రమే రాసేవాళ్ళు. వాళ్ళ అనుభవాలు, అలవాట్లు అవే సాహిత్యం. ఇప్పుడు స్త్రీలంతా రచనలు చేస్తుండటం వల్ల యాభైశాతం వాళ్ళ సమస్యలు మనకర్థమవుతున్నాయి. ఇపుడు అనేక వర్గాల నుంచీ రచనలు చేయడం వలన విస్తృతమైనటువంటి జీవితం పరిచయమవుతుంది సాహిత్యానికి. భిన్న ప్రాంతీయవాద సాహిత్యాలు వస్తున్నాయి. భిన్నప్రాంతాలు ఆలోచనలు ఆందోళనలు, అవస్థలు, భాష, భావజాలం అర్థమవుతూ ఉంది. అంతా ఒకేవిధంగా ఉండనక్కరలేదు. వైవిధ్యం శక్తికి ప్రతిబింబం. భిన్నత్వం ఏకత్వ సాధకం భిన్నత్వంలో ఏకత్వం. ఎన్ని జీవనరంగాల్లో ఉండేవాళ్ళు అన్ని రకాలుగా రచనలు చేస్తే అన్ని రకాల జీవితం సాహిత్యంలోకొస్తుంది. రానీయండి.

ప్రేమ అనేది స్త్రీవాదుల్లో ఎలా ఉంటుంది దళిత వాదుల్లో ఎట్లా ఉంటుంది మైనారిటీల్లో ఎట్లా ఉంటుంది అనేది ఇప్పుడు మనకర్థమవుతుంది. ఒక్క ప్రేమ మాత్రమే కాదు. ఏ భావమైనా ఏ బంధమైనా సరే. దాని వలన మనకు విశాలమైన జీవితం తెలుస్తుంది. వాళ్ళ సమస్యలేమిటి? వాళ్ళు దాన్నెట్లా ఎదుర్కొంటారు? ఏ విధంగా పరిష్కరిస్తుంటారు. పైగా అన్ని రకాల ఆలోచనలూ ఆ కథల్లోనూ ప్రతిఫలిస్తాయి. నేను రాసే కథల్లో కూడా, కాకి-కట్టడి వంటి సీరియస్ కథలు సామాన్యంగానే చెప్పాను. ఇంకో విషయమమ్మా! స్త్రీని సమానంగా చూడడం. అట్టడుగువర్గాల్లోనే బాగా కనబడుతుంది. ఎందుకంటే ఇద్దరూ కాయకష్టం చేసుకుని ఇద్దరూ కూలీ తెచ్చుకుంటారు కాబట్టి. అట్లా రాజ కుటుంబాల్లో చూడరు. బ్రాహ్మణ కుటుంబాలలో కూడా చూడకపోవచ్చు. ఎప్పుడైతే స్త్రీలు సంపాదనపరులు కారో అప్పుడు వాళ్ళపట్ల చిన్నచూపు వచ్చేస్తుంది. పునరుత్పత్తి శక్తితో పాటు ఉత్పత్తి శక్తిగా కూడా స్త్రీ ఉంటే ఆ స్త్రీకి విలువా గౌరవం వస్తాయి. అది లేనిచోట ఇబ్బందులొస్తాయి. ఎందుకు దళితులను, కింది తరగతులవాళ్ళు అనబడే వాళ్ళను తక్కువగా చూస్తున్నారంటే, వాళ్ళు పనికి దూరం కావటంవల్ల. వాళ్ళు పూర్తి శ్రమశక్తులయినప్పుడు గౌరవించబడతారు.

**సు॥ మీరు దాదాపు సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ రచనలు చేశారు. ఔననిపించుకున్నారు. అన్నింటిలోను దళిత జనజీవన సరళి ఎక్కువగా ప్రతిబింబపజేశారు. అయితే ... మీకు నచ్చిన ప్రక్రియ ఏది?**

ఇ॥ ఔనమ్మా. దళిత స్పృహతోనే రచనలు చేశాను. కాని ధిక్కార స్వరంతో కాదు. నేను పేదలకోసం రాసినా, అణగారిన వర్గాల గురించి రాసినా, అంటరానివాళ్ళ గురించి రాసినా, అందరికోసం రాస్తున్నాను. వాళ్ళ అంగీకారం కోసం రాస్తున్నా. అందరూ ఈ కథలు చదివి, ఈ జీవితాలు ఇట్లా ఉన్నాయని, తెలుసుకోడానికి, తెలిసి కాస్త కరుణ చూపించడానికి, వాళ్ళను ఆదుకోవాలి. ఆసరా ఇవ్వాలి అనే అభిప్రాయంతో రాస్తున్నా గాని, వాళ్ళని వ్యతిరేకించి శత్రువులుగా మార్చడానికి మాత్రం కాదు. అది మొదటి నుంచి ఉందమ్మా. నా రచనలు ప్రారంభించినప్పటి నుంచి వీళ్ళ ఆలోచనల్ని అందరూ అర్థం చేసుకోవాలి. వీళ్ళను కాపాడేవాళ్ళు కాపాడవలసినవాళ్ళు వినాలి అనే నా ఉద్దేశ్యం.

**సు॥ ఔనండీ! 'ఊరబావి' కథలో ఊరబావిని మాదిగవాళ్ళకు సొంతం చేయడమే మీ ఉద్దేశ్యం. సాధించుకోడంలో అక్కడొక స్త్రీ చొరవచూపించారు.**

ఇ॥ ఔనమ్మా! అది అవతలి వాళ్ళు అంగీకరించేట్లు చేసి ఆ పైన అది మాదిగవాళ్ళ సొంతం కావటం చిత్రించాను. ఎనభైశాతం అంగీకారంతోనే మావాళ్ళ అభివృద్ధి జరగాలి. దళితులు మేము అభివృద్ధిలోకి రావాలి, బాగా బతకాలి అని కోరుకోడంలో,

దళితేతరులు వాళ్ళ కోర్కె న్యాయమైనదే వాళ్ళకు మనం సహాయం చేయాలి, వాళ్ళని పైకి రానీయాలి అనుకోవడంతో మాత్రమే అభ్యుదయం ఉంటుందని నా రచనలు మొత్తం ఉంటాయమ్మ. వీళ్ళను పైకి రానీయటం వాళ్ళకు తప్పనిసరికావటం కూడా చిత్రించాను. స్త్రీల గురించైనా స్త్రీల సమస్యలను, ఇబ్బందులను పురుషులు అర్థం చేసుకుని సహకరించాలి. అప్పుడే అది సహజీవనమవుతుంది. మైనారిటీవాదం తీసుకుంటే ముస్లింల స్థితి ఇంకా అధ్వాన్నం. వాళ్ళకు అధిక సంతానం. పైటను తగలెయ్యమని మన స్త్రీవాదులు మామూలుగా అంటున్నారు గాని వాళ్ళు బురఖా తీయమని అనగలుగుతున్నారా? ఆ బురఖాలో మగ్గి మగ్గి ఒళ్ళంతా మగ్గిపోయేవాళ్ళెందరో. వాళ్ళ సొంత బాధలు వాళ్ళ గొంతు విప్పితేనే కదా మనకర్థమవుతాయి. భిన్నస్వరాలు వినబడుతున్నాయి. ఇన్నిరకాల సమస్యలు విని, వాటి పరిష్కారమార్గాలు అన్వేషిస్తాం. రానివ్వండి విచారమెందుకు? మనం అంతా ఒక సమూహంగా ఇప్పుడవుతున్నాము, అవుతాం. ఇంతకుముందు లేము భిన్న సమూహాలు. ఒక్క సమూహం అవుతాం.

**సు॥ మీరు సరైన దృక్పథంతోనే చెబుతున్నారు. కాని కొత్తగా రాస్తున్న వాళ్ళకి ఏదో ఒక గొడుగు ఉండాలనుకుంటున్నారు కదా?**

ఇ॥ నిజమే! ఏదో రచయితల సంఘమో గొడుగు కావటం నిజమే ఎడిటర్‌ని బట్టి తాము సభ్యులయిన సంఘ దృక్పథాన్ని బట్టి కథలను రాసేవాళ్ళు అప్పుడూ ఉన్నారు. రాసేవాళ్ళు సరిగా రాయలేకపోతేనే ఇలాంటి బాధలు. రకరకాల వ్యక్తులకు రకరకాల సమస్యలుంటాయి. ఎవరికి వారు పరిష్కరించుకునేవి కాదు. సమాజం అంగీకరించవలసిన సమస్యలు వచ్చినపుడు నలుగురికీ ఆమోదయోగ్యంగా సమస్యలు పరిష్కరించుకోవాల్సిందే. కాని నలుగురిని ధిక్కరించి పరిష్కరించుకోడానికి వీలులేదు. అది స్త్రీవాదమైనా, దళితవాదమైనా, మైనారిటీ వాదమైనా నలుగురి ఆమోదంతో ఈ సమస్యలు పరిష్కరించుకోవాలి. సమస్యలు సమస్యలే అవి వాళ్ళు ప్రయత్నించవలసిందే! వాళ్ళు అంగీకరింపవలసిందే! సమాజంలో ఆర్థిక పీడన ఉంది. పీడనకు పరిష్కారం అన్నిసార్లు పీడనకాదు, కొన్నిసార్లే! మార్పు ఎంతవరకూ నీకు సాధ్యమవుతుందో అంతవరకూ సమాజం ద్వారానే చెయ్యి. హింసవల్లగాని, హత్యలవల్లగాని, మానభంగాల వల్లగాని సమస్యలు శాశ్వత పరిష్కారాలుండవు, ప్రమాదాలుంటాయి. సానుకూలమైన ఆలోచనలతో, సానుభూతి పొందే రచనలతో సమస్యలు పరిష్కారాలుండవు. వ్యతిరేకంగా రచన ఉన్నా, ఒప్పించే ప్రయత్నంలో ఉంటే మేలు. అందరికీ అనుకూలంగా రాయటం అసాధ్యం. ఎవరికీ అనుకూలం కాకపోయినా, వాళ్ళు ఒప్పుకొనేట్టు రాయవచ్చు. ఒప్పుకోవటం తప్పనిసరి అయ్యేట్లు రాయవచ్చు.

**సు॥ అన్ని ప్రక్రియల్లోను చేపట్టే రచనలు చేశారు. ఏ ప్రక్రియ మీకు ఎక్కువ ఇష్టం?**

ఇ॥ అది సబ్జెక్టుని బట్టి ఉంటుందమ్మా. ఒక మెరుపులాంటి ఆలోచన. వెంటనే కవితారూపంలో రాస్తాను. మనసును బాధించి వెంటాడే సంఘటన, దృశ్యం, విజయం, కథారూపం దాలుస్తుంది. అది ఆకృతి దాల్చటం నా సమయాన్ని బట్టి ఉంటుంది. నాటకం కూడా అంతే. నవలలైతే ఇంకా ఎక్కువ సమయం పడుతుంది. ఇక



పరిశోధన చేస్తున్నాననుకోమ్మా... ఆ పని చేస్తూ ఎన్ని పనులున్నా చేస్తా. నవల రాస్తున్నప్పుడు మాత్రం ఇంకో పని చేయను. అదే ధ్యాస.

**సు॥ ధ్యానంలో ఉంటారన్నమాట. ఇంతకూ విషయమే ప్రక్రియను సూచిస్తుంటారు?**

ఇ॥ ఔనమ్మా. కొందరి కవిత చదివినపుడు ఇది కథగా బాగుండేదనిపిస్తుంది. చావు-పుట్టుక అని శ్రీశ్రీ ఒక కథ రాశాడు. అది కవిత్వంగా రాస్తే బావుండేది. ఏదైనా సారాంశంగా ఉన్నది కవిత్వంగా చెప్పటం తేలిక. జీవితంగా ఉన్నదానిని, కథగా చెప్పటం తేలిక, బాగా ఘర్షణ సమస్య ఉన్నదానిని నాటకంగా చెప్పటం తేలిక. కారంచేడుమీద ఏదైనా రాయాలంటే, కవిత్వం వచ్చింది, కథ వచ్చింది. నవలగా అయితే గొప్ప విజయం పొందుతుంది- నాటకంగా సక్సెస్ ఔతుంది. వస్తువులో ఉన్న గుణాన్ని బట్టి మనం తీసుకున్న ప్రక్రియ విజయం ఆధారపడి ఉంటుంది.

**సు॥ మీరన్ని ప్రక్రియలు రాయగలరు కాబట్టి మీకది తేలిక.**

ఇ॥ అవునమ్మా! వారు సాధ్యమయిన ప్రక్రియలోనే అన్నీ రాస్తారు. ఎవరి సామర్థ్యం వారిది.

**సు॥ ఎన్నో రచనలు చేసి బహుమతులు అందుకున్నారు, మీ రచనలమీద ఎందరో పరిశోధనలు చేశారు. ఒక కవిగా రచయితగా మీరు అత్యంత ఆనందం పొందిన సంఘటన చెప్పండి?**

ఇ॥ రచయితలు అల్పసంతోషులమ్మా! ప్రతి అభినందన ఆనందాన్నే కలిగిస్తుంది. పదుగురు మెచ్చిన ప్రతి రచనా కించిత్ గర్వాన్ని ప్రతి సన్మానమూ అత్యంత సంతోషాన్ని ఇస్తుంది. కాని బాగా గుర్తుండిపోయిన విషయం-

ఒకసారి రేడియోలో కథ చదువుతున్నపుడు మా ఊళ్ళో, మునసబుగారింట్లో మావాళ్ళంతా కూర్చుని వింటున్నారు. ఆ కథానాయకుడు ఊహల్లో ఎత్తునుంచి పడుతూ...'అమ్మా' అని ఆక్రందన చేస్తాడు. అది విన్న మా అమ్మ 'అయ్యో కొడుకా పడిపోయావా!' అని కన్నీరుమున్నీరైంది. నన్ను చూసేవరకూ ఏడుపాపలేదు. అన్నం తినలేదు. ఆమె పేరు విశ్రాంతమ్మ. కాని మమ్మల్ని పెంచడానికి, చదువు చెప్పించడానికి అవిశ్రాంతంగా పోరాటం సలిపిందమ్మా!

**సు॥ పద్యాలతోనే రచనా వ్యాసంగం మొదలైందంటున్నారు కదా? గుర్తుంటే ఒక్క పద్యం మా కోసం చెప్పగలరా?**

ఇ॥ సాహిత్య వనవాటి చక్కగా పుష్పింప
విలుసిల్లు విరజాజి విరులుదెచ్చి,
సంగీత రసవార్ధి బంగారు కెరటాల
మదిలోన వ్యథ జెందు మణులు దెచ్చి,
శిల్పలోకమ్ములో చెలువమ్ము లెగబ్రోయు
చిరుకొమ్మ చిగురాకు చిదిమితెచ్చి
నాట్య ప్రపంచాన నవనవోన్మేషమ్ము
సుమియించు మధుర భంగిమలు దెచ్చి

తగిన యన్నింటి దెచ్చి స్వతంత్ర వీధి
చలువ సంస్కృతి పందిళ్ళ వెలుగు దిశల
కుతుకముప్పొంగ కూర్మితో కూర్చిపేర్చి
పూని రత్నాలు వెలిగించు మానవుడను.

**సు॥ ఒక విద్యావేత్తగా, ఇవాల్టి విద్యావిధానం మీద మీ అభిప్రాయం ఏమిటి?**

ఇ॥ కాలమహిమ. ఎన్నో మార్పులొస్తున్నాయి. అప్పుడు ఎమ్.ఎ. తెలుగు పదకొండుమంది చదివేము. ఆ పదకొండుమందీ ఈ రోజు గొప్పవాళ్ళంగానే కన్పిస్తున్నాం. అంటే విద్యారంగంలో మంచి పొజిషన్‌లోనే ఉన్నాం. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అయిదువందల మంది తెలుగు ఎమ్.ఎ. చదువుతున్నారు. అయిదువందల మందీ గొప్పగా లేరు. ఒకవంద మంది గొప్పగా ఉన్నారు. అయినా నా ఆలోచన ఎలా ఉంటుందంటే అప్పుడు పదకొండుమంది మాత్రమే గొప్పవారైతే ఇప్పుడు వందమంది సమర్థులౌతున్నారు గదా అని సంతోషిస్తాను. అయిదువందలమంది సమర్థులు కావడంలేదు అనేది ఒప్పుకుంటున్నాను. అప్పుడు పదకొండు మందే, ఇప్పుడు వందమందయ్యారు. చదువు బాగా పెరిగింది. కొదవలేదు. వీళ్లు పిల్లలకు లక్ష్యం పెడుతున్నారు. పిల్లలు తమకు తామే లక్ష్యాలు పెట్టుకుంటున్నారు. దీని వలన పిల్లల్ని ఒక మిషన్‌లో పడేస్తున్నారు. దానిని పిల్లలు తట్టుకోలేకపోతున్నారు. నువ్వెట్లయినా ఇంజనీరువి కావాలి, నువ్వెట్లయినా డాక్టరువి కావాలసిందే అనే ఒత్తిడి. కాలేకపోతే మా అమ్మా నాన్న ఏమైపోతారోనని వాళ్ళకు ఆత్రం. యాంగ్జైటీ నుంచి పిల్లలు దెబ్బతింటున్నారు. ఇంత పోటీ ఉండగూడదు చదువులో. చదువు ఆడుతూ పాడుతూ సాగాలి. ఇష్టమైతే ఎంతలోతుకైనా వాడువెళ్తాడు. నేను విరాటపర్వం మొదటిసారి చదివినప్పుడు సాయంత్రం ఐదుగంటలకు మొదలుపెట్టాను. ఫ్రెండొచ్చి భోజనానికి రమ్మని పిల్చాడు. వెళ్ళలేదు. అలా తెల్లారేవరకూ చదువుతూనే ఉన్నానమ్మా. పిల్లలంతా అట్లా చదవాలని కాకపోయినా, నువ్వు కదలకుండా ఆరుగంటలు చదవాలి–పదిగంటలు చదవాలి అని వాళ్ళని శాసించకూడదు. ఇప్పుడు పిల్లలే కొన్ని లక్ష్యాలు పెట్టుకుని కష్టపడుతున్నారు. తలకుమించిన బరువేమోస్తున్నారు. కొందరు సాధిస్తున్నారు. కొందరు నిరాశతో, తోవ తప్పుతున్నారు. ఆ లక్ష్యాలేవో వాళ్ళేపెట్టుకుంటే ఫరవాలేదు. నేనిది చెయ్యాలి, సాధించాలి అని పిల్లలనుకుంటే హాయిగా చేస్తారు. కాని పెద్దవాళ్ళు పిల్లలమీద మితిమీరిన ఒత్తిడి తీసుకొస్తే పిల్లలు ఆ విధంగా చేయలేకపోతే అది కొన్ని ప్రమాదకర పరిస్థితులు తెస్తుంది. ఆ ప్రమాదకర పరిస్థితుల్లో ఇప్పుడు కార్పొరేట్ ఎడ్యుకేట్, కాంపిటేటివ్ ఎడ్యుకేషనూ ఉంది. వాళంతటవాళ్ళు ఏర్పరుచుకున్న లక్ష్యాల కోసం వాళ్ళు శ్రమిస్తే సరే. కాని హాస్టల్లో వార్డెన్‌దో, ప్రిన్సిపాల్‌దో, పేరెంట్స్‌దో అజమాయిషీ ఎప్పుడూ ఉంటే కుదరదు. చక్కని మొక్క కుండీలో మాత్రమే పెరగదమ్మా! అది చాలా విస్తృతమైన ప్రాంగణంలోనే బాగా పెరుగుతుంది.

పిల్లల్ని ఆడుకోనివ్వాలి. పాడుకోనివ్వాలి. ఆటపాటల్లో ఆదమరచి పోనివ్వరాదు. సడలింపుల్లేని క్రమశిక్షణ మంచిదికాదు. అలా అని పిల్లల్ని గాలికి వదలకూడదు. ప్రేమతో కూడిన నియమాల మధ్య పెరగాలి, చదవాలి. ప్రేమలేని నియమాలు, ప్రేమలేని భోజనం, ప్రేమలేని చదువులు అన్నిసార్లూ సత్ఫలితాలు ఇవ్వవు.

పిల్లవాడు ఇష్టపడి చదువుకునే చదువు వాడెంతసేపయినా చదువుకోవచ్చు కాని, ఇది చదువు, ఇట్లా చదువు, ఇంతసేపు చదువు అని వాడికి కొన్ని నియమాలేర్పరచి, గిరిగీసి నిలబెట్టడం అంతమంచిది కాదు. ఆ ఒత్తిడికి లోబడి పిల్లలు చదవడం ప్రారంభిస్తే దుష్పరిణామాలు వస్తాయి. అనారోగ్యాలనుంచి ప్రాణాపాయం వరకూ ఏదైనా సంభవించవచ్చు. అందుకని ఈ విషయంలో తల్లిదండ్రులు ఆలోచించి ప్రవర్తించాలి.

**సు॥ మారుతున్న రాజకీయ పరిణామాల్లో విద్యార్థులూ కీలకపాత్ర వహిస్తున్నారు. అది వాళ్ళ కెరీర్‌కి ఆటంకం కాదా? ఈ విషయంలో ఒక విద్యావేత్తగా వి.సి.గా మీ అభిప్రాయం ఏమిటి?**

ఇ॥ పిల్లల్ని ఒక విద్యార్థి సంఘం వాళ్ళొచ్చి తీసికెళ్ళి సమ్మె చేయిస్తారు. ఆ పైన మరో సంఘం వాళ్ళొస్తారు. ఇంకొక సంఘం వాళ్ళొస్తారు. ఏవో కారణాలు. అక్కడ సంఖ్యాబలం కావాలి. ఈ భావిభారత పౌరుల కంఠస్వరమూ కావాలి. పిల్లలు వాళ్ళంతవాళ్ళు కాదంటే పేచీ లేదు. అటువంటి పరిణామాలు వచ్చేవరకూ మనమేం చేయలేం. నేను వి.సి.గా ఉండగా అనేకమంది విద్యార్థి సంఘాలవాళ్ళొచ్చి యూనివర్సిటిలో మీటింగులు పెట్టుకుంటామని అడిగారు నేనొప్పుకోలేదు. ఈ దేశంలో రాజకీయంకాని రంగం ఏదీలేదు. బాదరబందీ లేక, సమయం ఉండీ విద్యార్థులు కీలకపాత్ర వహిస్తారు. అది వాళ్ళ జీవితాలమీద దుష్పరిణామం, సత్పరిణామం రెండూ కలిగిస్తుంది. అది విద్యార్థులే చూసుకోవాలి. తల్లిదండ్రులూ గుర్తించాలి. కొందరు అధ్యాపకుల సూచనల్ని పాటిస్తారు.

**సు॥ విద్యార్థులకు మీరు చెప్పించలేరా? అందరికీ ఆయా విషయాల మీద వాళ్ళకంత కమిట్‌మెంటు ఉంటుందా?**

ఇ॥ విద్యార్థులు అందరూ కలిసి చేసే ఏ కార్యక్రమమైనా చేయండి. ప్రత్యేక గ్రూపులు వద్దు అలా అనడం వలన ఒక వి.సి.గా నేను కొన్ని ఇబ్బందులెదుర్కొన్నాను. అయినా జంకలేదు. అలా అంగీకరించకపోవడం వలన మేలే జరిగింది. కీడు జరగలేదు. పరిణామాలకు జడిసి నేను ఒప్పుకుంటే, నాలుగు రకాల మీటింగులు పెట్టి విశ్వవిద్యాలయాన్ని గబ్బుపట్టించేవాళ్ళు. అందరికీ అన్ని విషయాలమీద సీరియస్‌నెస్ పెద్దగా ఉండదు. చిన్న చిన్న ప్రలోభాలకు వీళ్ళు లొంగిపోతారు. గొర్రెదాటు వ్యవహారంగా ఉంటారు. రాజకీయ నాయకులు అమాయక విద్యార్థులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడమనేది ఎప్పుడూ ఉందమ్మా. అయితే దానివలన నష్టపోయేది మేమే అనే తెలివి వీళ్ళకురావాలి. ఎవరిమీదో ఒకరిమీద ఏదో ఒక మచ్చ పడుతుంది.

ఒక్కోసారి దెబ్బలూ తింటారు. వీళ్ళే తెలుసుకోవాలి. తెలుసుకుని మారాలి. పేదకుటుంబాలనుంచి వచ్చేవాళ్ళు ప్రలోభాలకు లొంగుతారు. ఉన్నతస్థాయి వాళ్ళు దౌర్జన్యాలకు, అల్లర్లకు సరదాగా ముందుకొస్తారు. మధ్యతరగతివాళ్ళు వీటన్నింటికీ దూరంగా ఉంటారు.

**సు॥ చాలా తెలుగుపదాలు, తెలుగు పిల్లలకే అర్థం కావడం లేదు. చాలావరకూ ప్రాథమిక విద్యకూడా ఇంగ్లీషు మీడియం కావడం, మార్కుల స్కోరు కోసం తెలుగుబదులు సంస్కృతం తీసుకోవడం. కారణమేదైనా తెలుగులో అన్యభాషా ప్రమేయం ఎక్కువౌతోంది. అలా అంగీకరించుకొంటూపోతే తెలుగు ఉండదు అనీ అంటున్నారు. మీరేమంటారు?**

ఇ॥ ఇంగ్లీష్ మాధ్యమం పెరిగింది. తెలుగు మాధ్యమం తరిగింది. ఇది ప్రాథమిక విద్యనుంచీ ఉంది. కళాశాలస్థాయిలో సంస్కృతం, ఫ్రెంచ్, జర్మన్ గ్రహిస్తున్నారు. గ్రహించేవాళ్ళు తెలుగు విద్యార్థులే. ప్రోత్సహించేవాళ్ళు తల్లిదండ్రులు, బంధుమిత్రులు. అధ్యాపకులు అందరూ ఆంధ్రులే. ఆంధ్రులకి ఆంధ్రం అక్కరలేకపోతే ఎవరేం చేయగలరు. తెలుగువాళ్ళు తెలుగులో మాట్లాడటం తగ్గుతూ ఉంది. తెలుగుపుస్తకాలు చదవరు. తెలుగులో వ్రాయరు. అలసట కొంత కారణం. షోకు కొంత కారణం. పాఠ్యాంశ నిర్ణయం కొంత కారణం. వ్యామోహం కొంత కారణం. భాషపట్ల ప్రేమలేకపోతే మరి సంస్కృతిపట్ల అభిమానం లేకపోవటం మరింత కారణాలు.

ఇతర భాషా పదజాలం మా భాషలో కలవడానికి వీల్లేదని కచ్చితంగా మడికట్టుక్కూర్చుని తమిళం ఉంది. వాళ్ళు విజయవంతంగా ఉన్నారు. కన్నడమూ, తెలుగువాళ్ళు ఏ భాషా పదజాలాన్నయినా స్వీకరిస్తారు బాగానేఉందిప్పటివరకూ. పత్రికల్లో అంత కలుషితం కాలేదు. టీ.వీ. కార్యక్రమాల్లో, ఏవి పిల్లలకు ఉత్సాహంగా ఉంటాయో ఆ విధంగా రెండు మూడు భాషలు కలిపి మాట్లాడుతుంటారువాళ్ళు. భాషా పదాలైతే ఫరవాలేదు. ఇంకో చిక్కేమిటంటే అక్కడ వింటూ ఉండేవాడు ఒకడు ఇంగ్లీషు వచ్చినవాడు, ఒకడు హిందీ వచ్చినవాడు, వీళ్ళందరికీ అర్థమవడం కోసం అన్నీ కలిపి మాట్లాడుతుంటారు. అది చాలా కృతకంగా ఉంటుంది. మనది చాలా పేద భాషగా ఉన్నప్పుడు నన్నయ గ్రాంథికంగా రాస్తే భాషను పెంచుకోడానికి చాలా స్వేచ్ఛగా సంస్కృతం నుంచి తీసుకోవాలని అప్పుడన్నారు. ఉర్దూ నుంచి కూడా మనం తీసుకుంటున్నాం. తెలుగులో ఆ మాట చెప్పలేకపోతే, తరువాత వాడుకలో ఉండే పేరు తెలుగులో చెప్పడానికి వీలుంటే, నేనింటికెళ్తున్నా అంటానికి నేను హోమ్‌కి పోతున్నా లాంటి మాటలు వాడక్కర్లేదు అని అనిపిస్తుంది. ఏమైనా కొన్ని కొన్నిటిని కార్యక్రమాలు పిచ్చివాళ్ళ స్వర్గంలా ఉంటాయి. ఎవరూ చూడకుండా ఉంటే అవి మారతాయేమో. అన్యభాషా పదాల వాడకం తప్పు కాదుగాని మిళితం కావాలి. భాషా ప్రయోగంలో క్రమంగా మార్పు కనిపిస్తూంది. ఇంకా వస్తుంది.

**సు॥ మాండలిక రచనల గురించి మీ అభిప్రాయమేమిటి? ఒక్కో పదం ఇతర ప్రాంతాలవాళ్ళకు అన్యభాషలాగే ఉంటుంది. ఇది కొత్త విషయం కాకపోయినా వెరేషన్ కూడా ప్రాంతీయంగా ఉంటే అర్థం కాదు గదా?**

ఇ॥ అవునమ్మా! పాత్రలు చెప్పేవి ప్రాంతీయ భాషతో రాసినా రచయిత చెప్పేవి పత్రికాభాషలో ఉంటే అందరికీ అర్థమవుతుంది.

**సు॥ మీరేం చెప్పాలని కథలు రాస్తున్నారు.**

ఇ॥ ఈ సమాజం ఇంతకంటే బాగుండాలని. రేపు ఉండబోయే సమాజం కోసం ఉండవలసిన సమాజం కోసం, ఉంటుందనే ఆశను ప్రసాదించే సమాజం కోసం, దానికోసం కలలు, దానికోసం ఆరాటం, దానికోసం రచన పీడనలేని, దోపిడీలేని, లైంగికవివక్ష, కులహైన్యం, పరాయీకరణ వృత్తినైచ్యం లేని సమాజం కోసం రాశాను. రాస్తున్నాను. రాస్తాను.

**సు॥ జీవితంలోతుల్ని చూశారు. సాహిత్య శిఖరాలనందుకున్నారు. దళిత జీవన సారాంశాన్ని సంక్షోభాన్ని సమర్థవంతంగా చిత్రించారు. స్త్రీ దృక్పథం, బహుజనదృష్టి దేశప్రేమలతోపాటు మానవతా భావనల సంఘజీవితం ప్రతిభావంతంగా సాహిత్యంలో ప్రతిబింబింపచేశారు. సాహితీ ప్రక్రియలన్నింటినీ స్పృశించి ఉత్తమ రచనలందించారు. మీకింకా చేయవలసినవేమైనా ఉన్నాయా?**

ఇ॥ చాలా పనులున్నాయమ్మా చేయవలసినవి. ముఖ్యంగా సాహిత్య అకాడమి వారు జీవితచరిత్ర రాయమన్నారు. రాస్తున్నాను. తరవాత బాగా దోపిడీ ప్రాంతాలు, పీడనప్రాంతాలు, ప్రభుత్వహింస మీద చెబుతున్నారు. సాంఘికహింస చెప్పరు. అవీ ఉన్నాయి–

**సు॥ విద్యావ్యవస్థ లేదాండి?**

ఇ॥ విద్యావ్యవస్థలో ఇంత క్రూరత్వం లేదు. అంటే ఒకటి....ఈ కార్పొరేట్ సంస్థలొచ్చి, ఫీజులు పెంచి డబ్బులు దండుకునేది నిజమే కాని ఆ రకమైన విద్య కావాలనుకుని మనం పిల్లల్ని పంపిస్తున్నాం. మనం కోరుతున్నాం. మన కోరిక వాళ్ళు తీరుస్తున్నారు. సాంఘికంగా మనం కోరని, జనం కోరని, దుస్థితి బలవంతంగా రుద్దుతున్నారు. దాన్ని కాదనాలి.

**సు॥ ఇంకా మీరు చేయాలనుకున్నవి చెపుతున్నారా?**

ఇ॥ మన సాహిత్యం మొత్తం పురాణాలమ్మా...పురాణాల మీద ఆధారపడి ఇతిహాసాలు. ఇతిహాసాల నుంచి మన సాహిత్యమంతా వచ్చింది. పురాణాలకు మూలం ఏమిటి? అనే పరిశోధన పెట్టుకున్నాను. అన్ని పురాణాలకు ఒకే థీమ్ ఉంది. సృష్టి ప్రతిసృష్టి, వంశం, వంశానుచరితం మన్వంతరం ఒకే ప్రణాళిక ఉంది. అష్టాదశపురాణాలకు, ఉపపురాణాలకు, కులపురాణాలకు, స్థల పురాణాలకు, వృత్తి పురాణాలకూ ఉన్నాయి. అన్ని పురాణాలకూ ఒకే ప్రణాళిక ఉండడమేంటి? ఆలోచించాలి.

మన సాహిత్యానికంతటికీ పురాణాలే మూలమైతే పురాణాలకు మూలమేంటి? అది పరిశోధనా రంగానికి చెందింది. అదీ.. జీవితచరిత్ర నేను చేయవలసిన పనులు. నవలొకటి రాయాలని ఉందమ్మా, రాస్తాను. కథానికలు, కవితలు సరే, రాస్తూనే ఉంటాను.

**సు॥ తప్పకుండా రాస్తారు మీరు. ఏ సంకల్పబలం, ఏ దృఢదీక్ష మిమ్మల్నింతటివారిని చేసిందో ఆ శక్తి ఈ మూడు పనులూ దిగ్విజయంగా మీతో చేయిస్తుంది. ఇంత సమయం వెచ్చించి ఎన్నో విషయాలు తెలియజేసినందుకు ధన్యవాదాలు.**

ఇ॥ నమస్కారమమ్మా!

**– డి. సుజాతాదేవి**

* * *

# గోపీచంద్ నవలలు–కథన శిల్పం

❖ ఆచార్య పర్వతనేని సుబ్బారావు

**కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి, పున్నమ్మ గార్లకు సెప్టెంబర్ 8, 1910న గోపీచంద్ జన్మించారు. వీరి బాల్యం కృష్ణాజిల్లాలోని అంగలూరు, చౌటపల్లి, రామాపురం గ్రామాలలో గడిచింది. తెనాలిలో హైస్కూలు చదువు, గుంటూరులో కళాశాల చదువు పూర్తిచేశారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో న్యాయపట్టా పుచ్చుకొని కొద్దికాలం ప్రాక్టీసు పెట్టినా ఆ వృత్తిలో ఇమడలేకపోయారు.**

25-05-1932 సంవత్సరంలో శకుంతలాదేవితో వివాహం జరిగింది. ఆస్తికసమాజంలో పుట్టిన శ్రీ గోపీచంద్ నాస్తిక వాతావరణంలో పెరిగారు. ఆయనమీద ఎమ్.ఎన్.రాయ్ ప్రభావం ఎక్కువగా ఉంది. మార్క్సిజం ప్రభావమూ ఉంది. 'మార్క్సిజమంటే ఏమిటి?', 'పట్టాభిగారి సోషలిజం', 'సోషలిష్టు ఉద్యమ చరిత్ర' లాంటి రాజకీయ గ్రంథాలూ రాశారు.

విశ్వకథా సాహిత్యంలో ప్రముఖులు చెకోవ్, బేట్సు, టాల్‌స్టాయ్, పుష్కిన్, గోర్కీ, మామ్, పెరల్‌బక్ మొదలైన ప్రముఖ రచయితల కథలను ఆకళింపు చేసుకొని తెలుగులో నూతన దృష్టితో సుమారు మూడువందల కథలు రాశారు.

గోపీచంద్ 1939లో చలనచిత్ర రంగంలో ప్రవేశించి రచయితగా, సహాయ దర్శకునిగా, దర్శకునిగా కూడా పనిచేశారు.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక గోపీచంద్ 1953లో రాష్ట్రసమాచారశాఖ డైరెక్టరుగా నియమితుడయ్యారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ తర్వాత సమాచారశాఖ జాయింట్ డైరెక్టరుగా పనిచేశారు. 1957 నుంచి 1962 వరకు హైదరాబాద్ ఆకాశవాణిలో పనిచేశారు. గ్రామస్థుల కార్యక్రమాల ప్రయోక్తగా గోపీచంద్‌కు మంచి పేరుండేది.

ఈ కాలంలో గోపీచంద్ అరవిందుల భావాలవైపు మొగ్గారు. తత్వవేత్తలు మొదటి భాగాన్ని 1959లోనూ, 1960లో రెండో భాగాన్నీ ప్రచురించారు.

పోస్టు చెయ్యని ఉత్తరాలు(1955), ఉభయ కుశలోపరి (1956), మాంచాల (1960), తత్వమసి (1961), మొదలైనవి గోపీచంద్‌గారి ఇతర రచనలు.

గోపీచంద్‌గారి నవలారచన 1943లో 'పరివర్తనం' నవలతో ప్రారంభమై ఆయన మరణించేవరకు అంటే (02-11-1962) 19 సంవత్సరాలు నిరాఘాటంగా సాగింది. ఈ కాలంలో ఆయన 11 నవలల్ని రాశారు అవి :

1. పరివర్తనం (1943)
2. అసమర్థుని జీవయాత్ర (1947)
3. పిల్లతెమ్మెర (1960-61)
4. మెరుపుల మరకలు (1960-61)
5. గడియపడని తలుపులు (1961)
6. పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా (1961)
7. శిథిలాలయం (1962)
8. గతించని గతం (1962)
9. చీకటిగదులు (1960-62, అసంపూర్ణం)
10. ప్రేమోపహతులు (1962, అసంపూర్ణం)
11. యమపాశం (1962, అసంపూర్ణం, 1963లో ముద్రితం)

ఇవిగాక కొడవటిగంటి కుటుంబరావు, పాలగుమ్మి పద్మరాజు, మునిమాణిక్యం నరసింహారావు, శ్రీశ్రీ, చింతాదీక్షితులతో కలసి "ఆదర్శజీవులు" అనే ఆరు అధ్యాయాల గొలుసు కట్టు నవలను రాశారు. ఇందులో 'శకుంతల: లోకం' అనే పేరుతో నాలుగో అధ్యాయాన్ని గోపీచంద్ రాశారు.

పైన పేర్కొన్నవాటిలో పరివర్తనం, మెరుపుల మరకలు, పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా నవలలు కాగా అసమర్థుని జీవయాత్ర మనోవైజ్ఞానిక నవల. ఇక పిల్లతెమ్మెర, గడియపడని తలుపులు, శిథిలాలయం, గతించనిగతం నవలికలు. చీకటిగదులు, ప్రేమోపహతులు, యమపాశం అసంపూర్ణ నవలలు.

కథారచయితగా గోపీచంద్ హిమాలయాలంత ఎత్తులో ఉంటాడు. గోపీచంద్ రాసిన కథ చదువుతుంటే 'రసభరితమైన ఒక నాటకాన్ని చూస్తున్నట్లుంటుంది. చక్కని చలనచిత్రాన్ని చూస్తున్నట్లుంటుంది. వాస్తవిక జీవితాన్నే చూస్తున్నంట్లుంటుంది' అంటారు కీ.శే. ఆవుల సాంబశివరావు.

ప్రఖ్యాత నవలాకారుడిగా గోపీచంద్ కథన శిల్పాన్ని (Technique) పరిశీలించడం నా వ్యాస ప్రధానోద్దేశం.

'ఏ పనిలోనైనా కళానైపుణ్యం చూపే పద్ధతిని శిల్పమనవచ్చు... సాహిత్యప్రక్రియలోని వస్తువు, పాత్ర, సంవాదం, సంఘటన, సంఘర్షణ, సన్నివేశం, కథాకథనం, శీర్షిక మొదలైన అంశాల కల్పనలోనూ, చిత్రణలోనూ రచయిత ప్రదర్శించే కళానైపుణ్యమే ఆయా అంశాల శిల్పంగా (వస్తు విన్యాసం శిల్పం, పాత్రచిత్రణ శిల్పం మొదలైనవి) రూపొందుతుంది. (పోరంకి దక్షిణామూర్తి) 'సాహిత్యం...అనుభూతులను కలిగించి తద్వారా మన సంస్కారంలో మార్పుతెస్తుంది. ఆ మార్పు అభ్యుదయకరమైనదైతే ఆ సాహిత్యం అభ్యుదయ సాహిత్యమౌతుంది. స్థూలంగా ఇలా అనుభూతులను కలిగించే రచనా విధానాన్నే శిల్పమంటాం' (రాచమల్లు రామచంద్రారెడ్డి)

సాహిత్యంలో రూపం, వస్తువులలో ఏది ముఖ్యమన్నప్పుడు వస్తువని సమాధానం చెప్తారు. అలాగే సుందరత, వాస్తవికత, తాత్వికతలలో ఏది ప్రధానమంటే సుందరత అనే చెప్తారు. సాహిత్యం పాఠకుల మనస్సులోకి చొచ్చుకుపోవాలంటే సౌందర్యం అన్నిటికంటే ముందుండాలి. ఈ సౌందర్యరాశిని శిల్పమని పిలిచినా, అలంకారమని పిలిచినా అభ్యంతరముండదంటారు, రాంభట్లకృష్ణమూర్తి. 'శిల్పం యొక్క ఆశయం విముఖుల్నికూడా విషయోన్ముఖుల్ని చెయ్యటం' అంటారు కుటుంబరావు.

నవలా రచయిత కథా వస్తువును సమకూర్చుకోవటం దగ్గర్నుంచి తన ఉద్దేశాన్ని సాధించేవరకు ఎన్నుకునేపాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు, భాష మొదలైన అంశాల్ని అతని ఊహాలోకంలో ఉన్నంతవరకు లేదా సమగ్ర రచనాకృతి పొందనంతవరకు మొదటి భాగంగానూ, అవన్నీ రచనలో అంగాలుగా ప్రాణం పోసుకొని సమగ్రరూపం పొందటాన్ని రెండోభాగంగానూ చెప్పవచ్చు.

'శిల్పం' గురించి మాట్లాడటమంటే దాదాపు అన్ని అంశాలను గూర్చి మాట్లాడినట్లేనని పేర్కొన్నాడు మార్క్‌షోరర్ (Forms of modern fiction: Technique as discovery) ఇక్కడ అన్ని అంశాలూ అంటే పాత్రచిత్రణ, సన్నివేశకల్పన మొదలైనవని అర్థం.

రచయిత తాత్విక దృక్పథం శిల్పాన్ని మలచటంలో గణనీయమైన పాత్ర పోషిస్తుంది. పాత్రచిత్రణ విషయంలో రచయితలు చాలా అప్రమత్తంగా ఉంటారు. 'పాత్రల పరిణామం శిల్పంలో ఒక భాగం' అని గుర్తించిన రచయిత తన రచనలో ఎంతో పరిపక్వతను సాధిస్తాడు. గోపీచంద్ నవలలోఈ పరిపక్వత కనిపిస్తుంది.

నవలా రచన మొదలుపెట్టకముందే గోపీచంద్ కథా రచనలో చెయ్యితిరిగిన వాడిగా పేరుతెచ్చుకున్నాడు. ఈ కీర్తికి ఇతర కారణాలతోపాటు శిల్పం (technique) కూడా ఒక ప్రధాన కారణమే.

'పరివర్తనం' నవలా ఇతివృత్తాన్ని చూసినప్పుడు రాజారావుకు భార్య జీజీతో ఉన్న మానసికానుబంధం వియోగ దుఃఖంగా మారి తర్వాత వేదనాప్రియత్వంగా మారటం ; అక్క తమ్ముడికి కొత్త జీవితాన్ని కల్పించటానికి పూనుకోవటం, కిష్టుడిచెల్లెలు శాంత రాజారావు జీవితంలో చోటును కోరుకోవటం, రాజారావు సంఘర్షణకులోనై విశాలప్రపంచంలోకి అడుగు పెట్టటం అనే అంశాలను మలచటం, కథానాయకుని సంక్లిష్ట మనస్తత్త్వాన్ని సరళమైన కథాకథనం ద్వారా తెలియజెయ్యటమే గాక రచయిత హేతువాద భావాలమూలంగా కూడా ఈ శిల్పానికి గాంభీర్యం వచ్చింది. సమకాలీన భావకవుల విరహ సంస్కారాన్ని ఖండించే అభ్యుదయకరమైన వస్తువుకు రచయిత ఆకర్షణీయమైన రూపాన్ని ఇచ్చినట్లయింది.

'అసమర్థుని జీవయాత్ర' నవలలో అడుగడుగునా తాత్విక దృక్పథం కన్పిస్తుంది. కాని ఎక్కడా దేవుడు కన్పించడు. శక్తివంతమైన రచనలో సజీవమైన అసమర్థుడు సీతారామారావును సృష్టించిన గోపీచంద్ తెలుగు నవలా సాహిత్యాన్ని మహోన్నత స్థాయిలో నిలిపారు. అద్దుమిల్లి పూర్ణచంద్రరావు ఒకచోట అసమర్థుని జీవయాత్ర ఒకటి చాలు గోపీచంద్‌ను ఉత్తమ భావనాబలంగల భారతీయ రచయితలలో ఒకరిగా, ప్రపంచ నవలాకారులలో ఒకరుగా చూపడానికి' అంటారు. ఇది అక్షరసత్యం.

కాలం చెల్లిన ఆదర్శాలను పాటించాలనే యువకుడు అసమర్థుడైనప్పుడు, మానసిక దౌర్బల్యపీడితుడైనప్పుడు ఎలాంటి విషమ పరిస్థితుల్ని ఎదుర్కోవలసివస్తుందో రచయిత ఈ నవలలో సీతారామారావు పాత్ర ద్వారా చెప్పించాడు. ఈ నవలను గోపీచంద్ ఆరు ప్రకరణాలుగా విభజించాడు.

1. అసమర్థుడు 2. అసమర్థుని భార్య 3. అసమర్థుని ఆదర్శం 4. అసమర్థుని మేనమామ 5. అసమర్థుని ప్రతాపం 6. అసమర్థుని అంతం.

మొదటి ప్రకరణంలో ఆదర్శమనే స్వప్నాల్లో తేలిపోయే సీతారామారావు దాతృత్వాన్ని ప్రదర్శించి ఆచరణలో వైఫల్యాన్ని పొందుతాడు. ఫలితంగా సమాజంలో పరాజితుడై అసమర్థుడవుతాడు. ఆరవ ప్రకరణంలో అసమర్థుని అంతంలో సంఘం మీద సీతారామారావు చేసిన దాడికి అతడే ప్రతిక్రియ అనుభవిస్తాడు. ఏకాకి అవుతాడు. విషపూరితమైన మానసిక జీవితం ఆతణ్ణి బలితీసుకుంటుంది. ఈ నవలలో ఉన్న ఆరు ప్రకరణలూ దేనికదే సమగ్రంగా ఉన్నట్లుగానే ఉండి నవలకు ఉపాంగాలుగా ఉన్నాయి. ఈ పద్ధతివల్ల నవలకు సమగ్రరూపం సిద్ధించింది.

నిజం చెప్పాలంటే నవలలో సీతారామావు జీవితం చివరి అంకంలోనే ప్రారంభమవుతుంది. అతని ద్వంద్వ ప్రవృత్తిద్వారా, ఆలోచనలద్వారా, అంతర సంభాషణను సృష్టించి రచయిత నాటకీయ శిల్పాన్ని ప్రదర్శించాడు. చాలావరకు కాలానుగతికంగా సాగిన కథాకథనం సంక్లిష్ట మానసిక ప్రవృత్తిని అర్థం చేసుకోవటానికి తోడ్పడింది. నవల ఆఖరి ఘట్టంలో సీతారామారావు శ్మశానంలో అసాధారణ రీతిలో ఆత్మహత్య చేసుకున్న సన్నివేశం బీభత్స రస ప్రధానమైంది. కాగా, అతడు ఉన్మాది కావడం, జీవితం కాస్తా విషాదాంతం కావడం కరుణరస ప్రధానమైన అంశాలు. వీటి మూలంగా నవల అనుభూతి ఎంతో సంపన్నంగా రూపుదిద్దుకొందని చెప్పవచ్చు.

ఒక అమాయకురాలి నిష్కపట లైంగిక స్వేచ్ఛాప్రవృత్తి విషాదాంతం కావటం 'పిల్లతెమ్మెర' నవలికలో ప్రధాన కథా వస్తువు. భర్త రామనాథం ఆమె శ్రేయోభిలాషిగా సంఘర్షణకు గురవుతాడు. డ్యాన్సు మాష్టరు ఒక సహృదయుడిగా, మృణాళిని సాటి స్త్రీగా, శచీంద్రుడు శ్రేయోభిలాషిగా, సాటి కళాకారుడిగా పైకి కన్పిస్తూనే శమంతకమణి పూర్తిగా తనది కాలేదనీ తనమార్గంలో నడవలేదనీ సంఘర్షణకు గురవుతాడు. శచీంద్రుడు ఈ సంఘర్షణనుంచి బయటపడే ప్రయత్నంలో శమంతకమణిని హత్యచేస్తాడు. 'పిల్లతెమ్మెర'లో రచయిత సంఘర్షణోత్పాదన శిల్పాన్ని ప్రదర్శించాడు.

శమంతకమణి ముగ్ధత్వ చిత్రణ అనుభూతి సంపన్నంగా ఉండటంవల్ల ఆమె చుట్టూ తిరిగే పాత్రలు కూడా సజీవంగా సాక్షాత్కరిస్తాయి. ఇందులో రచయిత ప్రధాన కథతోపాటు మృణాళినీ, డ్యాన్సు మాష్టారుల ఉపకథనుకూడా కల్పించారు.

ఇందులోని కథాకథనం ఆత్మాశ్రయ పద్ధతిని ఆశ్రయించి ఉంది.

'మెరుపుల మరకలు' నవలలో ఉషారాణికే రెండు కథల సృష్టి జరిగింది. మొదటి కథలో ఉషారాణి లైంగిక, కామ దాహంతో పరితపిస్తే, రెండో కథలో ఆధ్యాత్మిక గంగా ప్రవంతిలో ఓలలాడింది.

ఈ నవలలోని పాత్రలు జీవితానుభవం నుంచి, మానసికానుభూతి నుంచి అవగాహనను పెంచుకొని జ్ఞానాన్ని సాధిస్తాయి. దీనిమూలంగా రచయిత సన్నివేశ చిత్రణలో సంఘటన ఘటనలో శిల్పాన్ని అద్వితీయంగా ప్రదర్శించారు.

ఉషారాణి మొదట చక్రవర్తితో శారీరక సంబంధం పెట్టుకుంటుంది. ఆ తర్వాత శ్రీకాంత్‌తో కూడా సంబంధం పెట్టుకుంటుంది. ఇది తెలుసుకున్న చక్రవర్తి ఆమెను దూషించిన సన్నివేశం ఆ తర్వాత అతనిలో పశ్చాత్తాపాన్ని కలిగిస్తుంది. మార్పు వచ్చిన తర్వాత చక్రవర్తి సౌహార్ధాన్ని ప్రదర్శించిన సన్నివేశం ఉషారాణిలో ఆలోచనలు రేకెత్తిస్తుంది.

ఉషారాణి కమలాకరంతో చర్చించిన సన్నివేశాలు జ్ఞానదాయకంగా ఉన్నాయి. అదేవిధంగా అతనితో లైంగిక సంపర్కం నెరపిన సన్నివేశం అనుభూతి సంపన్నంగా ఉంది. శ్రీకాంత్ ఆమె మీద చేయి చేసుకున్న సంఘటన లైంగిక ప్రవృత్తిపట్ల పునరాలోచనకు దారితీసేదిగా ఉంది.

ఉషారాణి హిమాలయాలను సందర్శించిన సన్నివేశం, ప్రకృతి ద్వారా సంఘాన్ని అర్థం చేసుకోవటానికి అలౌకికలక్ష్యం వైపు పయనించటానికి దోహదపడింది. ఆమె ఆధ్మాత్మికమైన మైమరపును పొందిన సన్నివేశం జ్ఞానాతీతస్థితిని అందుకొని ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగుతుందని నిరూపించింది.

ఉషారాణి తన భర్త రామానుజంతో తాను పర పురుషులతో పెట్టుకున్న సంబంధాలను వివరించిన సన్నివేశం ఎంతో ముఖ్యమైనది. ఆ తర్వాత రామానుజం రెండో పెళ్ళి చేసుకొని భార్యను నిర్లక్ష్యం చేయకుండా సంసారం చేయడానికిది దోహదపడింది.

పైన పేర్కొన్నట్లు సన్నివేశాల ద్వారా, సంఘటనద్వారా పాత్రలో మానసికమైన ఎదుగుదలను సాధించటం 'మెరుపుల మరకలు' నవలలో గోపీచంద్ ప్రదర్శించిన శిల్పం.

పూర్వాశ్రమంలో ఉషారాణి తేజస్సు, ప్రతిభ, మేధస్సు, చైతన్యం ఎంతగా పాటకులను ఆకర్షించి ఉత్తేజం కలిగించాయో, చివరకు ఈ మహాయోగిని సందర్శనం కూడా అంతకు మించిన ఆకర్షణను ఉత్తేజాన్ని, మత్తునూ కలిగిస్తాయి. సజీవ రూపకల్పనలు చేయటంలో ఒక ప్రత్యేకతను సంతరించుకొన్న గొప్పరచయిత గోపీచంద్.

'గడియపడని తలుపులు' నవలికలో భిన్న మనస్తత్వాలున్న కోటేశ్వరమ్మ, శ్రీనివాసుల కలయిక అనుకోని పరిణామాలకు దారి తీస్తుంది. ఇందులో కథనం కథకుని పరంగా నడిచింది. కథన శిల్పంలో దాగుడుమూతలు కన్పిస్తాయి. కథ ఎంతో ఉత్కంఠపూరితంగా నడుస్తుంది.

కోటేశ్వరమ్మలోని ముఖ్య లక్షణం అన్వేషణాశీలం. డబ్బూ, పలుకుబడీ, శ్రీనివాసరావు, బ్రహ్మానందస్వామీ, తీర్థయాత్రలూ ఆమెకు తన అన్వేషణలో తాత్కాలికంగా కనిపించిన మజిలీలు. చివరకి మృత్యువుకూడా ఆమె అన్వేషణలో చివరి మజిలీగా రూపొందటంవల్ల అన్వేషణాశీలం ఆ పాత్రలోని జీవలక్షణంగా భాసించింది.

రచయిత కోటేశ్వరమ్మలో అన్వేషణాశీలాన్ని జీవలక్షణంగా చిత్రించటం ద్వారా పాత్రచిత్రణలో శిల్పాన్ని ప్రదర్శించాడు. ఇందులోని కథనం ఆత్మాశ్రయపద్ధతిలో సాగింది.

'గడియపడని తలుపులు' చదువుతున్నంతసేపూ 'మెరుపుల మరకలు' స్ఫురణకు వస్తూ ఉంటుంది. కోటేశ్వరమ్మ, ఉషారాణి-ఇద్దరూ అక్కా చెల్లెళ్ళేమో అనిపిస్తుంది. అయితే ఎవరి వ్యక్తిత్వాలు వారికున్నాయి. ఉషారాణి జీవితలక్ష్యం బతుకునుంచి వీలైనంత సుఖాన్ని ఎక్కువగా పిండుకోవడం. అందుకోసం ఆవిడ పురుషుల్ని మెట్లుగా వాడుకుంటుంది. ఇక కోటేశ్వరమ్మలో ధనాకాంక్ష, శారీరకసుఖం, పరోపకార చింతన, అధికారదాహం.... అన్నీ కలగలిపి ఉంటాయి. ఉషారాణి హిమాలయపర్వతసానువుల్లో ప్రశాంతతను పొందితే కోటేశ్వరమ్మ భాగవత పఠనంలో ఆనందం పొందుతుంది. ఈ రెండింటిలోనూ సున్నితమైన మనస్తత్వ వివరణ మనల్ని చకితుల్ని చేస్తుంది.

దాంపత్యజీవితాన్నీ, భార్యనూ నిర్లక్ష్యం చేసిన వ్యక్తి భార్య తనను వదలి వెళ్ళిన తర్వాత మళ్ళీ దాంపత్య జీవితంకోసం భార్యకోసం ఆరాటపడి ఒక వ్యభిచారిణిని భార్యగా స్వీకరించటం 'శిథిలాలయం' నవలికలోని కథావస్తువు. ఈ నవలికలో మూడు విభిన్న మనస్తత్వాల మధ్య సంఘర్షణను అత్యంత సహజంగా, మనోహరంగా చిత్రించాడు రచయిత గోపీచంద్. రచయిత తాను చెప్పాలనుకొన్న ఆదర్శాలను ఒక కొత్త పోకడలో రాయటం జరిగింది. తన ఆదర్శాలను తనుగాని, తను సృష్టించిన పాత్రలద్వారాగాని ఎక్కడా చెప్పరు. పాత్రల నడవడిక, పాత్రల ప్రవర్తన, పాత్రలజీవితాల ద్వారా ఆదర్శాలను చెప్పారు.

ఆదర్శాలను ఒక సిద్ధాంతం లాగా కాక ఒక జీవితాన్ని చూసి ప్రజలు తమ జీవితాలు దిద్దుకొనేటట్లు చేయడానికి ప్రయత్నించినట్లు కనిపిస్తుంది. ఊపిరి బిగపట్టి చదువుతాం. కడుపుబ్బ నవ్వుతాం. బాధపడతాం. చివరకు ఆయన చెప్పింది అవునని ఒప్పుకుంటాం. ఈ నవలికలోని కథనం పరాశ్రయ పద్ధతిలో సాగింది.

'గతించని గతం' నవలికలో ఒక సహృదయుడు మతోన్మాదిగా మారటం, ఆ తర్వాత మతాతీత దృష్టితో మానవతావాదంవైపు మొగ్గు చూపటం ప్రధాన కథావస్తువు.

ఇందులో హుస్సేన్‌ఖాన్ ఒక హిందూ యువతిని చెరుస్తాడు. ఆ యువతిని ఒక ముస్లిం దాదా ఆదుకుంటాడు. దానయ్య తన ఆస్తిని కోల్పోటానికి హుస్సేన్‌ఖాన్ కారణమవుతాడు. అయితే ఆ దానయ్యే హుస్సేన్‌ఖాన్ తల్లిని ఆదుకుంటాడు. ఈ నాలుగు అంశాల మధ్యన సమతుల్యతను సాధిస్తూ తన కళానైపుణ్యాన్ని ప్రదర్శించాడు రచయిత. ఇందులో హుస్సేన్‌ఖాన్ తల్లి సందేశాన్ని అర్థం చేసుకొని విలపించిన సన్నివేశం మానవత్వపు విలువల్ని మానవానుభూతుల 'పరిభాష'లోకి అనువదించేదిగా ఉంది. 'గతించని గతం'లోని కథనం కూడా పరాశ్రయ పద్ధతిలోనే సాగింది.

గోపీచంద్ రాసిన నవలల్లో 'పండితపరమేశ్వరశాస్త్రి వీలునామా' తెలుగులో వచ్చిన ప్రఖ్యాత నవలల్లో ఒకటి. ఇందులోని కథానాయకుడు కేశవమూర్తి. అతను ఒక రచయిత. అతడు పురుషోత్తముడు అనే కొత్తనవలను రాయటం ప్రారంభించిన ఘట్టంతో ఈ నవల ప్రారంభమై అతడు రచించే నవల ముగిసేనాటికి అసలు నవల కూడా పూర్తవుతుంది.

ఈ నవలలో పండిత పరమేశ్వరశాస్త్రి, సుజాత, సీమంతం, శారద్వతుడు, రాధారమణ, కృష్ణమూర్తి, రామమోహనశాస్త్రి, సుభాషిణి మొదలైనవి ముఖ్యపాత్రలు. ఇందులోని సంఘటనలన్నీ కేశవమూర్తి, సుజాతల చుట్టూ తిరుగుతాయి. ఒక జాతి జీవితంలోని విభిన్న దశల్ని కేశవమూర్తిలో మనం చూడగలుగుతాం. ఇందులో కేశవమూర్తి ఒక వ్యక్తికాదు. ఒక తరానికి ప్రతినిధి. అతను ఒక రాజకీయవాది, రచయిత, ఆర్ద్రహృదయుడు, మానవతావాది, ఆధ్యాత్మిక భావసంపన్నుడు.

వీలునామాలో రకరకాల మనుషులు మనకు తారసపడతారు. సమాజంలోని అనేక వర్గాలకూ, విభిన్న సిద్ధాంతాలకూ, విభిన్న ఆలోచనా విధానాలకు వీరు ప్రాతినిధ్యం వహిస్తుంటారు. ఆయా వర్గాల, సిద్ధాంతాల, ఆలోచనా విధానాల అంతర, బాహ్యరూపాలు ఎలా ఉంటాయో ఈ ప్రతినిధులద్వారా మనం తెలుసుకోగలుగుతాం.

ఈ నవలలోని కథాకథనాన్ని పరిశీలించినప్పుడు కొన్ని విశేషాలు కన్పిస్తాయి. గోపీచంద్ ఇతర నవలల్లో కథానాయకుడు కథ చెప్పటం లేదా రచయిత కథ చెప్పటం అనే రెండు విధానాలలో ఉంటుంది. ఇందులో ఆత్మాశ్రయ, పరాశ్రయ విధానాలు ఉంటాయి.

ఈ నవలలో అలాగాకుండా రచయిత చెప్పిన కథతోపాటు కేశవమూర్తి, సుజాత, సుభాషిణి పాత్రలు ఆత్మాశ్రయ పద్ధతిలో చెప్పిన కథకూడా చోటుచేసుకుంది. అలాగే కేశవమూర్తి డైరీ ద్వారా, సుజాతా, పరమేశ్వరశాస్త్రుల ఉత్తరాలద్వారా కూడా మరికొంత కథను చెప్పారు. దీనినిబట్టి మిశ్రమ కథాకథన విధానాన్ని రచయిత స్వీకరించాడని చెప్పవచ్చు. లేఖలద్వారా ఆత్మాశ్రయ లక్షణాన్నే పాటించాడు కాబట్టి ఈ నవల పరాశ్రయ, ఆత్మాశ్రయ విధానాల సమ్మేళనంగా పేర్కొనవచ్చు.

ఈ నవలకు కేంద్రసాహిత్య అకాడమి బహుమతి వచ్చింది. అయినా విమర్శకుల విమర్శలుకూడా ఈ నవల మీదే ఎక్కువ వచ్చాయి. అందులోనూ ముఖ్యమైన విమర్శ 'ఈ నవలలో కనిపించే అరవిందుల తాత్త్విక సిద్ధాంత ప్రస్తావన ఇతరులకోసం, ముఖ్యంగా పాఠకుల కోసం ఉద్దేశించినట్లు మాత్రమే కన్పిస్తుంది. కేశవమూర్తి జీవితాచరణలో ఆ తత్త్వం ప్రతిఫలించలేదు కాబట్టి రచయిత లక్ష్యం నెరవేరలేదు.' ఆర్.ఎస్. సుదర్శనం ఈ నవలలో సాహిత్యపు విలువలు మృగ్యమనీ, ఇది ప్రయోగాత్మక రచనల్లో ప్రయోగాత్మక రచన అనీ పేర్కొన్నారు.

గోపీచంద్ రాసిన నవలలు వర్తమానంలోనే ప్రారంభమైనా వెంటనే లేదా స్వల్ప వ్యవధి తర్వాత పాఠకుణ్ణి గతంలోకి తీసుకువెళ్తాయి. ఒక్కోసారి ఈ గతం కేవలం ఒక ప్రస్తావనగా కూడా కన్పిస్తుంది.

చీకటిగదులు, ప్రేమోపహతులు, యమపాశం నవలలు అసంపూర్ణ నవలలు. చీకటిగదులు నవలకు ముందుమాటలు రాస్తూ దాని రచన వెనకాల ఉన్న 'బోలెడు' కథను చలసాని ప్రసాద్ వివరించారు. చలసాని ప్రసాదుకు గోపీచంద్‌తో పరిచయమైన తర్వాత ఎక్కువగా సాహిత్య చర్చలు చేసుకుంటూ ఉండేవారు. గోపీచంద్ ఆఖరిమజిలీగా అరవిందయోగిపట్ల ఆకర్షితులుకావటం ఆ విషయాలు వీరి మధ్యన ఎక్కువగా ప్రస్తావన రావటం జరిగేది. ఒకరోజు విసుగు చెందిన ప్రసాద్ "ఈ ఫిలాసఫీ గొడవ మానేసి మళ్ళీ మీరు కథలు రాయండి" అని అన్నారట. దానికి గోపీచంద్ కోపం తెచ్చుకోకపోగా "ఎవరి కథో ఎందుకు? మనకథ మనమే రాసుకుందాం. కానివ్వు. కాగితం కలం తీసుకో" అని ఏకబిగిన 50 పేజీలు డిక్టేటు చేశాడట. ఇదీ 'చీకటిగదులు' నవల పుట్టుపూర్వోత్తరాలు.

'చీకటిగదులు' నవలలో ఇతివృత్తం త్రిపురనేని రామస్వామి చౌదరిగారి జీవితచరిత్ర, గోపీచంద్‌గారి జీవితచరిత్రేనని త్రిపురనేని సుబ్బారావుగారి 'గోపీచంద్' అనే పుస్తకంలో రాశారు.

"అదొక పల్లెటూరు. దానిపేరు రామాపురం. అయిదారువందల గడప ఉంటుంది." అంటూ నవల ప్రారంభమవుతుంది. రామాపురంలోనే అమ్మమ్మ పోషణలో గోపాలం తన బాల్యాన్ని గడిపాడు. ఈ నవలలోని గోపాలమే గోపీచంద్. ఇందులోని కృష్ణస్వామిగారు మన కవిరాజు త్రిపురనేనే. శివకామయ్య ఉన్నవ లక్ష్మీనారాయణపంతులుగానూ, దుర్గ శకుంతలాదేవిగారుగానూ కన్పిస్తారు.

'గోపీచంద్ జీవితచరిత్రా అది స్పృశించినంతమేర ఆంధ్రదేశరాజకీయ చరిత్రా ఒక పెద్ద నవలలో సమన్వయ దృక్పథం నుంచి రాయటానికి పూనుకున్నాడు. అదే చీకటిగదులు' అంటారు ఆర్.ఎస్. సుదర్శనం.

చీకటిగదులు ఆత్మకథాత్మక నవలగా పేర్కొనవచ్చు.

'ప్రేమోపహతులు' నవల కూడా అసంపూర్ణమే. ఇందులో సుందరీ జయరామారావులు భార్యాభర్తలు. ప్రధానపాత్రలు. భర్తకు ఇష్టమైన స్త్రీతో స్నేహంచేసి అతనితో ఆ స్త్రీకి సంబంధం ఏర్పడటానికి ఆ సుందరి ప్రయత్నిస్తే, భార్యకు ఇష్టమైన పురుషునితో స్నేహం చేసి ఆమెకు ఆ పురుషునితో సంబంధం ఏర్పడటానికి జయరామారావు ప్రయత్నించటం ఇందులోని ఇతివృత్తం. ఈ నవలకు గోపీచంద్ రాసిన 'ఆత్మద్రోహులు' అన్న కథ ఆధారం.

ఈ అసంపూర్ణ నవలలోని ఇతివృత్తం అపూర్వమైనది. స్వేచ్ఛాప్రవృత్తి వేస్తున్న వెర్రి తలలను ఖండించటానికి, ఆధునిక నాగరికత పేరుతో జరుగుతోన్న ఆత్మవంచనను చిత్రించటానికి రచయిత ఎన్నుకున్న ఈ ఇతివృత్తం ఎంతో బలమైనది. దీనిలోని సంభాషణాచాతుర్యం ఎంతో గొప్పగా ఉంది. మనుష్యులు ఎంతచక్కగా నటించగలరో ఎంత సిగ్గులేకుండా ప్రవర్తించగలరో, దయాదాక్షిణ్యాలులేకుండా అమాయకుల్ని ఎంతగా హింసించగలరో 'నాగరికత', సంస్కారం ముసుగులో ఎంత అనాగరికంగా, ఎంత సంస్కార హీనంగా ప్రవర్తించగలరో ఈ నవలలో రచయిత చిత్రించారు. ఈ విధానం ఎంతో అమోఘమైంది.

'ప్రేమోపహతులు' నవల చివరిదశలో అసంపూర్ణంగా మిగిలిపోయింది.

గోపీచంద్ రాసిన 'యమపాశం' నవలకూడా అసంపూర్ణమే. ఇందులో కథానాయకుడు నారాయణరావు. "ఆనాడు నారాయణరావు ఇంటికి వచ్చేటప్పటికి రాత్రి ఏడుగంటలయింది" అంటూ ఇందులో కథ ప్రారంభమవుతుంది. నారాయణరావు మధ్యతరగతికి చెందినవాడు. పట్టణంలో చదువుకొని పెళ్ళి అయిన తర్వాత పట్టణంలోనే ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరపడ్డాడు.

భార్యతో కొంత మాట్లాడినతర్వాత గతంలోకి వెళ్ళి తన పెళ్ళిని గుర్తుచేసుకొంటాడు. మధ్యలో అక్కడక్కడ కొద్దిసేపు వర్తమానంలోకి వస్తూ రెండు సంవత్సరాలక్రితం తన ఆఫీసులో పనిచేసిన శారద వృత్తాంతాన్ని గుర్తుచేసుకొంటాడు. ఇలా గుర్తు చేసుకోవటంతో కథ గతంలోకి వెళ్తుంది.

ఇందులో కథంతా ఒక పగలు, రెండురాత్రులతో ముగిసిపోతుంది. ఒక గుమస్తా దైనందిన జీవితాన్ని అతని ఆశల్ని, సమాజ పోకడల్ని సాగరంతో పోటీపడుతున్న సంసారాన్ని చిత్రించటమే రచయిత లక్ష్యం. గోపీచంద్‌ని 'వేదనాజీవి' అంటారు గోపాలరెడ్డిగారు. ఆయన రచనల్లో ఆవేదన, ఉద్వేగం గోచరిస్తాయి. ప్రజలలోని ఆక్రందనలు ప్రతిధ్వనిస్తాయి. "శైలి ఆ వ్యక్తి యొక్క గుర్తు" అన్నదానికి గోపీచందే సాక్ష్యం, ప్రమాణం కూడా. అదే ఆయన రచనలోని విశిష్టత.

రచయిత ప్రత్యేకించి నవలా రచయిత తన నవలలోని అంశాలను కల్పించటంలోనూ, చిత్రీకరించటంలోనూ, అభివ్యక్తీకరించటంలోనూ, వర్ణించటంలోనూ ఎంతో కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడు. ఈ నైపుణ్యం మూలంగానే రచన సర్వాంగసుందరంగా రూపొందటం జరుగుతుంది. అలాంటప్పుడు ఆ రచన అనుకొన్న ప్రయోజనాన్ని సాధించగలుగుతుంది. గోపీచంద్ నవలలన్నింటిలోనూ ప్రయోజనం సిద్ధించింది.

గోపీచంద్ ఆయా నవలలలోని పాత్రచిత్రణ విషయంలో కూడా ఎంతో శ్రద్ధ కనబరిచారు. పాత్రల పరిణామం శిల్పంలో ఒక భాగంగా గుర్తించాడు కాబట్టే ఆయన తన రచనలన్నింటిలోనూ ఆ పరిపక్వతను సాధించినట్లు కన్పిస్తుంది.

గోపీచంద్ విషయంలో మరొక అంశాన్నికూడా పేర్కోవలసి ఉంది. రెండు భావాలకు మధ్య సంఘర్షణ ఉన్నప్పుడు (ఉదాహరణకు సంప్రదాయం × అభ్యుదయం, ఆస్తికత్వం × నాస్తికత్వం) వస్తువు ప్రధాన చర్చనీయాంశంగా ఉంటుంది. భావం విషయంలో పేచీ లేని దశలో అంటే ఏ భావం గురించి రాయాలో ఆ భావం మీద లేదా ఆ విషయం మీద ఎంతో స్పష్టత ఉండటంవల్ల ఇలాంటిచోట్ల కూడా రచయిత ఏ ఇబ్బందీ లేకుండా ముందుకు పోగలిగారు. రచనలో ప్రత్యేకత, భావంలో స్పష్టత, భాషలో సరళత, కథను నడిపించటంలో నేర్పు, సమయానుకూలంగా హాస్యం...ఇవన్నీ గోపీచంద్ కథన శిల్ప నిర్మాణానికి దోహదపడ్డాయి. తెలుగు నవలా వినీలాకాశంలో గోపీచంద్ ఒక ధ్రువతారగా వెలుగొందుతూనే ఉంటాడు.

## ఉపయుక్త వ్యాసాలు, గ్రంథాలు :


1. గోపీచంద్-గోపీచంద్ రచనా సర్వస్వం, అలకనంద ప్రచురణలు, విజయవాడ, 2009 (సంపుటాలు 3,4,5,6)
2. గోపీచంద్ స్మారకసంచిక, శ్రీ త్రిపురనేని గోపీచంద్ సంస్మరణ కార్యక్రమ సంఘము ప్రచురణ, 1963.
3. దక్షిణామూర్తి, పోరంకి-తెలుగు కథానిక : స్వరూప స్వభావాలు, 1988.
4. రామచంద్రారెడ్డి రాచమల్లు - సారస్వత వివేచన, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, విజయవాడ, 1976.
5. వేణుగోపాల్, అమ్మంగి - నవలారచయితగా గోపీచంద్, జయమిత్ర పబ్లికేషన్స్, హైదరాబాద్, 1988.
6. సాంబశివరావు, ఆవుల - "కథాకథన చాతురి" - గోపీచంద్ సంస్మరణ సంచిక, ప్రచురణ. శ్రీ త్రిపురనేని గోపీచంద్ సంస్మరణ కార్యక్రమ సంఘము, హైదరాబాద్, 1963.
7. సుదర్శనం, ఆర్.ఎస్. సాహిత్యంలో దృక్పథాలు, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1968.
8. సుబ్బారావు, త్రిపురనేని - కవిరాజు జీవితం - సాహిత్యం, కవిరాజు సాహితీ సదనం, హైదరాబాద్-24, 1964.


●

**చిరునామా : తెలుగు శాఖ, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం - 530 003. సెల్ నెం. 9848337287.**

# కొత్త తెలుగు ఉద్యమంలో మనమూ పాలుపంచుకొందాం!

❖ ఆచార్య ఎస్. ఎస్. ప్రభాకర రావు

**భాష ముఖ్యంగా భావాల వ్యక్తీకరణకి ఉపయోగించే మీడియమ్. మారుతున్న సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక, సాంకేతిక మార్పులకి అనుగుణంగా భాష అన్ని వేళలా, అన్నిచోట్లా మారుతూనే ఉంటుంది. చైతన్యం ఉన్న భాషకి, వ్యవస్థకి మార్పు తప్పనిసరి!**

ప్రారంభదశలో తెలుగుపై సంస్కృతభాష ప్రభావం అధికంగా ఉండడం సహజం. క్రమేపీ, పొరుగున ఉన్న ద్రావిడ భాషలు, బైటనుంచి వచ్చిన అరబ్బీ, పారశీక భాషలు తెలుగు పదసముదాయాన్ని, నుడికారాన్ని ప్రభావితం చేసాయి. శ్రీనాధుడి కవిత్వంలో పారశీక పదాల ప్రయోగం కనిపిస్తుంది. హరవిలాసంలో 'ఖుసి మీరన్ సురధాణి నిండుకొలువై కూర్చున్నచోన్' అన్న చోటా, ఆయన చాటువుల్లోని 'కుల్లా యుంచితి, కోకసుట్టితి' అన్నచోటా అన్యభాషాపదప్రయోగం కనిపిస్తుంది. అది వారి హృదయవైశాల్యానికి ఉదాహరణ. అల్లసాని పెద్దన కూడా మనుచరిత్రలో 'పచ్చని హురమంజి పనిసైంధవంబు' అని పర్షియన్ పదాన్ని ప్రయోగించాడు.

భాష స్వచ్ఛంగా, 'నిష్కళంకంగా' ఉండాలని పట్టుబట్టే ప్యూరిస్టులు ఎప్పుడూ ఉంటారు. ఇంగ్లండులో ఏంగ్లో-సాక్సన్ మాటలే ఉండాలని కొందరు వాదించారు. నిజానికి, ఏంగిల్స్, సాక్సన్స్ కూడా యూరప్ నుంచి వచ్చిన వారే! ఎందరు అభ్యంతరం చెప్పినా, ప్రగతి శీలురు సంస్కృతిని భాషని ఈ అభ్యంతరాల సంకెళ్లనుంచి విడదీసి ముందుకు తీసుకువెళ్ళారు. మంచి ఆలోచనలని అన్ని దిక్కులనుంచి ఆహ్వానించమని మన వేదాలు బోధిస్తున్నాయి. మరి మాటలకి ఎందుకు అధిక్షేపం? కొత్త అనగానే భయపడాల్సిన అవసరంలేదు. పాత అంతా స్వర్ణమయమనీ అపోహపడనక్కరలేదు. ఈ విషయాన్నే కవికులగురువు కాళిదాసు 'పురాణమిత్యేవ నసాధుసర్వం, నచాపి కావ్యం నవమిద్య పద్యం' అని కొత్తది పరిహరించవలసిన అవసరంలేదని స్పష్టం చేసాడు.

ఏ భాషైనా సుసంపన్నం కావాలంటే ఇతరభాషలతో 'ఆదాన్-ప్రదాన్' ఎంతైనా అవసరం. ఈనాడు ప్రపంచభాషగా, వ్యాపార, సాంకేతిక రంగాలలో అత్యంత ఉపయోగకారిగా రూపుదిద్దుకున్న ఇంగ్లిష్ మొదటినుంచి పరభాషలనుంచి మాటలని దిగుమతి చేసుకుంటూనే ఉంది. మొదట జర్మన్ భాషనుంచి, తరవాత సాంకేతిక పదాలని గ్రీక్ భాషనుంచి (ఉదాహరణకి'సైకాలజి'), మత సంబంధమైన పదాలని లాటిన్ భాషనుంచి (ఉదాహరణకి థియాసఫీ') తెచ్చుకుంది. 1026లో నార్మన్ కాంక్వెస్టు తరవాత ఫ్రెంచి భాషనుంచి భోజనానికి, ఫేషన్‌కి సంబంధించిన మాటలని ఎన్నో తెచ్చుకుంది. స్వర్గానికి దారి కావాలంటే, పర్షియా దేశానికి వెళ్ళి పర్షియన్ భాష నుంచి 'ఫిరదౌసీ' అనే మాటని పారడైజ్‌గా పరివర్తన చేసుకుంది. కొత్త భావాలని వ్యక్తం చెయ్యవలసిన సందర్భంలో ఏ భేషజానికి పోకుండా, అన్యభాషలనుంచి మాటలని విరివిగా దిగుమతి చేసుకుని పరిపుష్టమైంది. ఎ.సి.బా (A.C.Baugh)అనే భాషాశాస్త్రవేత్త అంచనా ప్రకారం ఇంగ్లిష్‌లో దేశీయపదాలు 13% అయితే, అన్యభాషా పదాలు 87% ఉంటాయి.

రమారమి వంద సంవత్సరాల క్రితం, 'తండులంబులు నిండుకున్నవి పోయిరమ్ము' అని గుమ్మం ముందు నిలబడ్డ బిచ్చగాడిని భయపెట్టే పండితులని ఎదిరించి వ్యావహారిక భాషా ఉద్యమాన్ని నడిపించిన గిడుగు రామమూర్తిగారి కృషి అనితర సాధ్యం! వేదాలలోని భాషకూడా ఆనాటి ప్రజలకు అర్థమయ్యేది అని, తరవాత సంస్కృతం ప్రజలకి దూరమై అర్థంకాకుండా పోయింది అని ఆయన వాదించి 'నేటి తేట తెలుగు వాడకాన్ని ఉద్యమస్ఫూర్తితో ప్రచారం చేసారు. మళ్ళీ ఇప్పుడు నేటి తెలుగుని విస్తృతంగా వాడడానికి ప్రజలను ప్రోత్సహించడానికి 'కొత్త తెలుగు ఉద్యమం' చారిత్రక అవసరం.

తెలుగులో కూడా ఇటువంటి దిగుమతి విషయంలో అవసరమైన చొరవ లేకపోలేదు. సాంకేతిక, శాస్త్ర రంగాలలో ఆ శాస్త్రసంబంధమైన పారిభాషిక పదాలని యధాతథంగా వాడుకోవడం జరుగుతోంది. సల్ఫ్యూరిక్ ఏసిడ్ అన్న మాటకి గంధకికామ్లము, నైట్రోజన్‌కి నత్రజని అని అనువాదాలు ఉన్నా ఇంగ్లిష్ మాటలని వాడడం కూడా ఉంది. ఇంక కాల్కులస్ (Calculus) వంటి మాటలని దిగుమతి చేసుకోవడాన్ని ఎవరూ తప్పుపట్టరు. రైలుబండి, రైల్వేస్టేషన్ అన్న మాటలని ధూమశకటము/ధూమ శకట విశ్రమస్థానము అని ఎవరూ ఈ రోజుల్లో అనడంలేదు. అయితే, కొన్ని సందర్భాలలో ఇంగ్లిష్ మాట, తెలుగు అనువాదం కూడా వాడుకలో ఉండవచ్చు. ఇంగ్లిష్‌లో కూడా 11వ శతాబ్దంలో దేశీయమైన బోల్డ్(Bold), ఫ్రెంచి నుంచి దిగుమతి అయి కరేజియస్ (Courageous) రెండూ కూడా వాడుకలో ఉండేవి. అలాగే, ఒక ప్రఖ్యాత శాస్త్ర అధ్యాపకుడు కాస్మిక్ రె (Cosmic Ray) అన్న మాటని 'విశ్వమయూఖ' అని తన పాండిత్య ప్రకర్షని ప్రకటిస్తూ అనువదించాడు. ఆ మాటకూడా ఇంగ్లిష్ మాటతో కూడా ప్రాచుర్యం పొందితే ఆక్షేపణ ఏమీలేదు. పాత, కొత్తల మేలు కలయిక వల్ల తెలుగుభాష పరిపుష్టమయితే మంచిదే కదా!

ఈ రోజుల్లో ఇందుగలదు, అందులేదని సందేహము వలదు అని అన్నిచోట్లా ప్రత్యక్షమయే సెల్ తాలూకు పరిభాష అంతా ఇంగ్లిష్‌లోనే ఉంటోంది. సిమ్‌కార్డ్, ఎస్‌ఎమ్‌ఎస్ వంటి పదాలు జనబాహుళ్యానికి చేరువయ్యాయి. వీటిని తెలుగులోకి అనువదించడానికి ఎవరూ సాహసించడంలేదు. ఇక కంప్యూటర్ పరిభాష అంతా ఇంగ్లిష్‌లోనే! సీడి, మానిటర్, ఇంటర్నెట్ ('అంతర్జాలము' అని ఎవరో అనువదించి ఇంద్రజాలం చేసారట!). లాగ్ ఇన్, లాగ్ ఔట్ అన్న మాటల ప్రయోగం సర్వసామాన్యం.

ఆర్థిక, వ్యాపార రంగాలలో వాడుకలో ఉన్న బజెట్, టాక్స్ అన్న మాటలని వాడుకోక తప్పదు. తెలుగు పత్రికలలో సామాన్యంగా కనిపించే 'బడ్జెట్ ప్రతిపాదనలు' కొంచెం ఎబ్బెట్టుగా ఉంటాయి. బజెట్ అని రాస్తే ఆ మాట ఉచ్చారణకి దగ్గరగా ఉంటుంది కదా! క్రీడారంగంలో అందరికి అభిమానపాత్రమైన క్రికెట్‌కి తెలుగు అనువాదం అవసరమా? ఆ గేమ్‌కి సంబంధించిన వికెట్, స్పిన్‌బౌలింగ్, ఫాస్ట్ బౌలింగ్ అన్నీ ఇంగ్లిష్ మాటలే కదా! అలాగే టెన్నిస్, షటిల్ వంటి మాటలు కూడా తెలుగులో చేరుతున్నాయి.

ఈ రోజుల్లో అన్ని ఇళ్లలోనూ, అందరి ఇళ్లల్లోకి అవసరమైన టెలివిజన్‌కి తెలుగుమాట దూరదర్శన్ అందామంటే అది ఒక చానల్‌లో మాత్రమే కనిపిస్తుంది. ఈ సందర్భంలో టెలివిజన్‌తోపాటు, చానల్, ఏంకర్, సర్ఫింగు వంటి మాటలు అందరి నోళ్లలోనూ ఆడుతూనే ఉన్నాయి. వీటికి తోడు ఎంతో డైనామిక్‌గా కనిపించే, వినిపించే ఏంకర్ అమ్మాయిలు ప్రయోగించే కొత్తమాటలు భాషకి అన్యాయం చేస్తున్నాయా? భాష పురోగమనానికి సహకరిస్తున్నాయా? అలాగే సినిమాలో వినబడె డైలాగులు భాషని ముందుకు తీసుకువెడుతున్నాయా? ఈ విషయం ఆలోచించతగ్గది. 'ఆయనకి అంత సీన్ లేదు' అని, ప్రేయసి ఇంతవరకూ తనతో తిరిగిన ప్రియుడికి బైబై చెబుతూ 'లైట్ తీసుకో!' అంటే అతగాడు తను రిజెక్టెడ్ లిస్టులో చేరినట్లు అర్థం చేసుకుంటాడు. ఇటువంటి ప్రయోగాలు భాషని పరిపుష్టం చేస్తాయని అనడం తొందరపాటుకాదు.

ఇంగ్లిష్‌లో క్రియాపదాన్ని నామవాచకంగా, నామవాచకాన్ని విశేషణంగా వాడడం ఉంది. 'విద్యార్థులు రాజకీయాలలో ప్రత్యక్షంగా పాల్గోడంపై మీ టేక్ ఏమిటి?' అన్న వాక్యంలో టేక్ అన్న క్రియాపదాన్ని నామవాచకంగా వాడడం కనిపిస్తుంది. అలాగే, అదే సందర్భంలో మీస్టాండ్ ఏమిటి అని కూడా స్టాండ్‌ని క్రియాపదంగా వాడడం కనిపిస్తుంది. ఇలాంటి ప్రయోగాలు తెలుగులోకూడా చేయడానికి వీలుపడుతుందేమో విజ్ఞులు పరిశీలించవచ్చు. భాష అభివృద్ధికి ఇటువంటి ప్రయోగాలు ఉపకరించవచ్చు.

తెలుగు నేర్చుకోవాలంటే ఉన్న కష్టాలలో చేంతాడులాంటి వర్ణమాల ఒకటి. తెలుగు రాయడానికి, మాట్లాడడానికి 56 అక్షరాలు అవసరమంటారా? కొన్ని అక్షరాలని విడిచిపెడితే మాతృభాషకి అన్యాయం చెయ్యడం అవుతుందా? ఉదాహరణకి, ఋ, ౠ, ఌ ౡ, అ, చే జే వంటి అక్షరాలని విడిచిపెడితే భాషాసౌలభ్యానికి దోహదమవుతుందేమో భాషాభిమానులు ఆలోచించాలి.

మారే పరిస్థితులకి అనుగుణంగా మార్పుచెందే భాషని, ప్రయోగాలని స్వాగతిద్దాం. మన తెలుగు కొత్త రూపుతో హుందాగా ముందుకు పోవడానికి మనవంతు సహాయం చేద్దాం. ఈ బృహత్తర కొత్త తెలుగు ఉద్యమంలో పాలుపంచుకుందాం! ●

**చిరునామా : 64, ఓం నగర్, లంగర్‌హౌస్, హైదరాబాద్-500 008. సెల్ నెం. 9246273643.**

*నివాళి*

# వేటూరి సుందర రామమూర్తి



జననం : జనవరి **29,1936**
మరణం : మే **22, 2010**

సినీ 'పాట'లీ పుత్రంలో వేటూరిది ఒక శకం. దివి సీమలోని పెదకళ్లేపల్లి వారి స్వస్థలం. 1936 జనవరి 29న జన్మించిన వేటూరి సుందర రామమూర్తి వంశానుగతంగా వచ్చిన పాండితీ ప్రకర్షను అందిపుచ్చుకున్నారు. జర్నలిస్ట్‌గా జీవితాన్ని ప్రారంభించారు. ఆంధ్రపత్రికలో "అనూరాధ డైరీ" శీర్షిక నడిపేవారు. ఆంధ్రప్రభలో అసెంబ్లీ విశేషాలను "సభాపర్వం" పేరుతో రాసేవారు. "శ్రీకాకుళం చిన్నది" రూపకం, "జీవన రాగం" నవల, కొద్దిగా కథలు రాశారు.

అయితే మూడున్నర దశాబ్దాల వేటూరి పాటల ప్రస్థానం వీరి యితర రచనలను మరుగున పడేసింది. పదులు కాదు వందలు కాదు వేలాది పాటలు వేటూరి ఫౌంటిన్ హెడ్ నుంచి ఫౌంటెన్ పెన్ ద్వారా జాలువారాయి. సినిమా పాటకు కావ్యభాషతో కొత్త పరిమళం అద్దారు. అన్నమయ్య త్యాగయ్య పోతన ప్రబంధకర్తలు ఆయన నాల్కపై నర్తించేవారు. సుమారు ఏడువేల పాటలు రాశారని ఒక అంచనా. కనకవర్షం కురిపించిన పాటలను వందల సంఖ్యలో రాశారు. 2010, మే 22న వేటూరి ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన పాటల్లో జానపదాలు మాత్రమే కాదు జ్ఞానపథాలు కూడా వున్నాయి. ఒక గొప్ప గీతాకారుణ్ణి తెలుగువారు కోల్పోయారు. వారికి అంజలి ఘటిస్తున్నాం.



# ‘నాగబు’ తొలి తెలుగు పదం కాదు!

❖ డా॥ ఈమని శివనాగిరెడ్డి,
కె. జితేంద్రబాబు, డి. సూర్యకుమార్

**భాష మూలాల్ని వెదక్కోవలసి వచ్చినపుడు ఆ జాతి మాటలు, పాటలు, శాసనాలు, సాహిత్యాలను ప్రమాణంగా తీసుకోవటం ఆనవాయితీ. ఒక జాతి ఔన్నత్యాన్ని వివరించే ఏ తొలి సాహితీ రూపాన్నైనా ఇందుకోసం వెతుక్కుంటాం. తెలుగు భాషకు సంబంధించినంత వరకు దాని మూలాలను వెతుక్కోవటంలో చాలామంది పరిశోధకులు వారికి తోచిన ఆలోచనల్ని బయటపెట్టారే తప్ప అందరికీ ఆమోదకరమైన ఆధారాన్ని చూపించటంలో మాత్రం ఒక్క తాటి మీదకు రాలేకపోయారు.**

తెలుగు నేల, తెలుగు జాతి, తెలుగు భాష అనే పదాలు వాడుకలోకి రాకమునుపు ఆంధ్రదేశం, ఆంధ్రజాతి, ఆంధ్రభాష అనే పదాలే అటు తొలి శాసనాల్లోనూ, తొలి సాహిత్యంలోనూ పేర్కొనబడినాయి. అనేకమంది భాషా పరిశోధకులు, చరిత్రకారులు ఆంధ్రుల ప్రాచీనతను చెప్పటనికి ‘ఐతరేయ బ్రాహ్మణాన్ని మొదటి ఆధారంగా చూపిస్తూ వచ్చారు. ఎక్కడో ఎప్పుడో, కచ్చితమైన చారిత్రక ఆనవాళ్ళు లేని ఐతరేయ బ్రాహ్మణం కంటే, కచ్చితమైన చారిత్రక నేపథ్యమున్న కాలాన్ని నిక్కచ్చిగా చెప్పటానికి వీలున్న బౌద్ధ సాహిత్యాన్ని గానీ, ఇతర పాలీ సాహిత్యాన్ని గానీ పేర్కొన్న దాఖలాలు చాలా తక్కువ. బౌద్ధ, జైన, చార్వాకాలను అవైదిక ధర్మాలుగా, నాస్తిక మతాలుగా తీసిపారేశారే తప్ప, హేతువాదాలుగా వాటిని లెక్కలోకి తీసుకొనుంటే, ఆ సాహిత్యాలు మనదేశంలో నాశనమయ్యేవి కావు, వాటిలోని చారిత్రక విషయాలు వెలుగులోకి రాకపోయేవి కావు . ఏనాడూ ప్రజల భాష కాని సంస్కృత భాషే అన్ని భారతీయ భాషలకు మూలమన్న మరో అపోహను నిజం చేసిన వర్గాలే పండితులుగా మనగలిగి, వారికి నచ్చిన రీతిలో చరిత్రను, సాహిత్యాన్ని వక్రీకరించారు. క్రీ.పూ. 6వ శతాబ్దానికి చాలా ముందు నుంచే జనపదాల్లో వాడుక భాషగా ఉన్న ప్రాకృత భాషను మన భాషలన్నిటికీ మూలమన్న పచ్చి నిజాన్ని ఇటీవలి కాలం వరకూ గుర్తించలేనంత పాండిత్యాన్ని పండించుకొన్నాం కూడా. ఇంతెందుకు భాష విషయంలో చిన్న పిల్లల్ని కూడా తరతరాలుగా పాఠ్యపుస్తకాల ద్వారా తప్పుదోవను బట్టిస్తున్నాం. విద్యాశాఖ ఉన్నతాధికారులు, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత విద్యా గంధపు వాసన ఏ మాత్రం లేని అనేకమంది తెలుగు మంత్రులు గుడ్డెద్దు చేలోపడ్డట్టు వ్యవహరించారేతప్ప, నా భాష, మనభాష అన్న మమకారంలేక తెలుగుభాష పట్ల ఏమాత్రం మక్కువ చూపించలేకపోయారు. ఇదంతా ఎందుకంటే, తెలుగు వాచకాల్లోని వ్యాకరణ విభాగంలో ప్రకృతి-వికృతుల గురించి రాస్తూ ప్రకృతిని వికృతిగానూ, వికృతిని ప్రకృతిగానూ చలామణిలోకి తెచ్చారన్న సంగతిని గుర్తుచేసుకోవటానికే. ఉదాహరణకు పల్లె జనాలు మామూలుగా వాడే ‘సింగారం’ అన్న మాటను ప్రకృతి అనాల్సింది పోయి, వికృతిగా చెప్పటం; ‘వంకర’ అన్న అచ్చ తెలుగు మాటను ప్రకృతి అనాల్సిందిపోయి ‘వక్రం’ను ప్రకృతిగా పేర్కొని, ‘వంకర’ను వికృతిగా చెప్పడం, ఒకటి, రెండు ఉదాహరణలు మాత్రమే. ఇలా చెప్పుకొంటూ పోతే వందల కొద్దీ ఉదాహరణలను ఇక్కడ గుప్పించవచ్చు. ఒక్క అధికార భాషా సంఘం చేస్తున్న కృషి, తెలుగు భాషా సమితి ఉద్యమాలు, నడుస్తున్నచరిత్ర లాంటి పత్రికలను మినహాయించి, పాఠశాల, కళాశాల విద్యాశాఖలు, తెలుగు అకాదమి, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, వీటన్నింటి మీద పెత్తనం చెలాయించే ‘ఉన్నత విద్యామండలి’ ఇప్పటికైనా మేల్కొని తెలుగును సంస్కృతంగా కాక, తెలుగును తెలుగుగా తెలుగులో నేర్పించటానికి పూనుకొంటే మన తెలుగును కాపాడుకొంటాం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజల నోళ్లలో నానుతున్న, వాడుకలోనున్న మాండలికాలను తెలుగు వాచకాల్లో పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. అంతేకాదు! పరభాషల ప్రభావం లేని వేమన, అన్నమయ్య లాంటివారు వాడిన తెలుగు పదాలను పాఠ్యాంశాల్లో చేర్చకపోతే నిజంగా మనం తెలుగు నేలపై బతుకుతున్నా, తెలుగుకు మాత్రం దూరమవుతాం. తద్వారా తెలుగు జాతికి కూడా తెలియకుండానే దూరమవుతాం.

ఇక తొలి తెలుగు పదానికి సంబంధించిన చర్చకు వద్దాం. 1905-06వ సంవత్సరంలో అమరావతి స్థూపం దగ్గర జరిపిన తవ్వకాల్లో అనేక శిలాపటాలతో పాటు ప్రాకృత శాసనాలున్న రాతి పలకలు కూడా బయల్పడినాయి. మద్రాస్ మ్యూజియంలో దాచి ఉంచిన ఈ శాసనాల నకళ్లను తీసి 1920వ సంవత్సరం ‘ఎపిగ్రాఫియా ఇండికా’లో ఆర్చీచందా ప్రచురించారు. ఆ శాసనాలను పరిశీలిస్తున్నప్పుడు ‘నాగబు’ అన్న ఒక మూడక్షరాల శాసనం 1928లో ప్రముఖ సాహితీ, చారిత్రక, శాసన పరిశోధకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి వేటూరి ప్రభాకరశాస్త్రి దృష్టి నాకర్షించింది. ఆయన అదే సం॥ ‘భారతి’లో దీనిపై ఒక వ్యాసం కూడా రాశారు. తరువాత ప్రభాకర స్మారికలో ‘ప్రాచీనాంధ్ర శాసనములు ఇంచుమించు రెండు వేలేండ్ల క్రిందటి తెనుగు’ అన్న పేరుతో వ్యాసాన్ని ప్రచురించారు. అమరావతి శాసనాల నకళ్లను తీసిన చందా ‘నాగ’ ఒక పదంగానూ, ‘బు’ ఒక పదంగానూ గుర్తించగా ప్రభాకరశాస్త్రిగారు మాత్రం అది ఒకే పదమని, అదికూడ తెలుగు

ప్రత్యయాంతమైన తత్సమ పదమని పేర్కొన్నారు. అంతేకాదు నాగబు అనగా నాగంబు అని, క్రీస్తు తర్వాత 1,2 శతాబ్దాల నాటికి సంస్కృత పదాలు తెలుగు ప్రత్యయాలతో తెలుగులో వ్యవహరింపబడుతుండేవనీ, ప్రథమా విభక్తి ప్రత్యయరూపము 'బు' కూడా అప్పటికే వాడుకలోకి వచ్చిందని కూడా రాశారు. తరువాత ఆరుద్ర తన సమగ్రాంధ్ర సాహిత్యం-1లో కూడా 'నాగబు' అనేదే మనకు లభించిన మొదటి తెలుగు మాట అనీ, ఈ 'నాగబు' అన్న పదమే నాగమ్బు, నాగంబు, నాగమ్ము, నాగము, నాగంగా మార్పులు చెందిందనీ పేర్కొంటూ ఈ విషయంలో ప్రభాకరశాస్త్రిని నూటికి నూరుపాళ్లు అనుసరించారు. ఆయన ఇంకొకడుగు ముందుకెళ్లి, ఈ పదం అసలు ఆంధ్ర లిపికి మూలంగా భావించి దాని స్వరూపాన్ని (అక్షరాలను) తన గ్రంథానికి రంగ పీఠికగా తీసుకొని అట్టమీద అగ్రశీర్షిగా అగ్రపీఠమిచ్చినట్లు స్వయంగా రాసుకొన్నారు. ఇలా తెలుగు సాహిత్య చరిత్ర, భాషాచరిత్రలపై పుస్తకాలు రాసిన వారందరూ దాదాపు ఇదే అభిప్రాయంతో ఉన్నారు. అమరావతి శాసనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే రాజుల కంటే వర్గ, వర్ణ కుల విభేదాలు లేని పలు సమసమాజాన్ని కోరుకొన్న బౌద్ధంపట్ల ఆకర్షితులైన వివిధ వర్గాలకు చెందిన స్థానిక ప్రజలు, ఆడా, మగా తేడా లేకుండా అక్కడి స్థూపానికి తమ శక్తి కొద్దీ దానాలనందించారు. కొందరు వేదిక, అండము, ప్రదక్షిణా పథము, తోరణాలు, మొదలైన స్థూప భాగాలకు అవసరమైన విడిభాగాలను శిల్పాలతో చెక్కించి బహూకరించారు. అలా కట్టడి భాగాలను దానం చేసిన వారి పేర్లే అమరావతి శాసనాల్లో ఎక్కువగా కనబడతాయి. శాసనాల్లో ఉన్న ఎన్నో పేర్లలో 'నాగ' అన్న పదం చాలాసార్లు కనబడుతుంది. ఉదాహరణకు : నాగసేన, నాగనిక, నాగసిరి, నాగమిత, నాగచంపకి, నాగతిస్స, భదంతనాగ, నాగోపాజ్ఞాయ, ('చమకారస నాగోపాజ్ఞాయ పుతసవిధిక, (స), నాగబోధి, నాగబుద్ధి ఇంకా బుద్ధి, బుద్ధిల అనే పేర్లు కూడా అనేకసార్లు కనిపిస్తాయి. కొన్ని శాసనాల్లో కేవలం నాగ, అలాగే కేవలం బుద్ధి, చూలబుద్ధి, కొన్ని సందర్భాల్లో ఈరెండు పదాలను కలిపి నాగబుద్ధి, ('ధనగిరివత్తన నాగబుద్ధి' వనియపుతో'), నాగబుద్ధు అన్న పేర్లు కూడా ఉన్నాయి. ప్రభాకరశాస్త్రి పేర్కొన్న 'నాగబు', 'నాగబుద్ధి' అన్న పదంలోని చివరి అక్షరం(బహుశ శిల్పి పొరపాటు గావచ్చు) చెక్కకుండా వదిలేయబడింతప్ప మరొకటికాదు . ప్రాచీనాంధ్ర శాసనాల్లో ఇలాంటి శిల్పి పొరపాట్లు కోకొల్లలు.

పైన ఉదహరించిన 'ధనగిరి వత్తవ నాగబుద్ధి వనియపుతో' అన్న శాసనంలోనూ, అమరావతిలోనే దొరికిన మరో శాసనంలో 'నాగబు' ఒక వరుసలోనూ దానికింద గల రెండో వరుసలోనో అని పేర్కొనబడటం చేత నాగబు ఒక అసమగ్ర పదమనీ, 'నాగబుద్ధి' ఒక వ్యక్తి పేరని కచ్చితంగా చెప్పటానికి వీలుదొరికింది. అలాగే ప్రభాకర శాస్త్రి అన్నట్లు 'క్రీస్తు తర్వాత 1,2 శతాబ్దాల నాటికి సంస్కృత పదాలు తెలుగు ప్రత్యయాలతో తెలుగులో వ్యవహరింపబడుతుండేవన్న అభిప్రాయాన్ని కూడా ఇంకోసారి పరిశీలించాల్సి ఉంది. ఎందుకంటే నూటికి నూరుశాతం ప్రజలు ప్రాకృతం మాట్లాడుకొంటూ, ప్రాకృత భాషనే శాసన, సాహిత్య భాషగా అంగీకరించినపుడు సంస్కృత పదాల అవసరం అంతగా ఉండి ఉండదేమోనని మా అభిప్రాయం. మరి దాదాపు అదే కాలంలో ఆచార్య నాగార్జునుడు ప్రజల భాషైన ప్రాకృతభాషకు, శాసనభాషైన ప్రాకృతానికి భిన్నంగా తన వ్యాసంగాన్ని సంస్కృతంలో ఎందుకు కొనసాగించాడో అన్న విషయం కూడా ప్రస్తుత మా వ్యాసపరిధి నుంచి మినహాయిస్తూ, ఈ విషయంపై 'మిసిమి' సంపాదకులు అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి సందర్భం వచ్చినపుడు తన అభిప్రాయాన్ని వెల్లడిస్తారనుకొంటున్నాం. మళ్లీ విషయానికొస్తే దాదాపు 80 ఏళ్లుగా పండితులు, పరిశోధకుల నోళ్లలో నానుతున్న 'నాగబు' తొలి తెలుగుపదం అన్న విషయంపై పరిశోధకులు మరోసారి ఆలోచన చేయాల్సిన అవసరముంది.

ఇక తొలి తెలుగుపదం, పదాల గురించి కొంత చర్చించుకోవాలి. తెలుగు భాష ప్రాచీనతను నిర్ధారించటానికి పరిశోధకులు కేవలం శాసనాల మీదే ఆధారపడి, శాతవాహనుల కాలపు అమరావతి బ్రాహ్మీశాసనాల్లోని తెలుగుకు దగ్గరగా ఉన్న ప్రాకృత పదాలనే ఎంచుకొన్నారు. శాసనాలకంటే మరింత ప్రాచీనమైన నాణేలను, అందునా భూమిపొరల్నుంచి బయల్పడిన శాతవాహనుల కంటె ముందరి రాజుల నాణేలను పరిశీలనలోకి తీసుకోకపోవటం విచారించదగ్గ విషయం. 1934లో కృష్ణాజిల్లా సింగవరం, 1980లో కరీంనగర్ జిల్లా కోటలింగాల్లో దొరికిన ఆంధ్ర జనపద నాణేలపై మంచి పరిశోధన చేసిన డా॥ దేమెరాజారెడ్డి చెప్పేంత వరకూ అమరావతి శాసనాల కంటే ముందు తెలుగు పదాలు లేవనే అందరూ అభిప్రాయపడ్డారు. పదేళ్ళక్రితం కొత్తూరులో బయటపడిన బౌద్ధ ధాతు పేటికపై గల 'తంబయదానం' అన్న శాసనంలోని 'తంబయ' ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన పదమనే విషయంలో ఎలాంటి వివాదమూ లేదు. కోటలింగాల తవ్వకాల్లో శాతవాహన పొర కంటే కిందిపొరలో తొలిసారిగా గబద, నరన, కంవాయ అనే పేర్లున్న నాణేలు కూడా దొరకటంతో కొటలింగాల తవ్వకాలు ప్రాముఖ్యతను సంతరించుకొన్నాయి. కోటలింగాల్లో గోబద నాణేలు, 15, నరన నాణేలు 3, కంవాయ నాణేలు 4, సమగోపుని నాణేలు 39 లభించటం చేతనూ, పైగా వాటిపై రాణో గోదబస సిరినరనస, కంవాయసిరిస, రణో సమగోపన అని బ్రాహ్మీలిపిలో శాసనాలుండటంతో, శాసన లిపినిబట్టి ఈ అక్షరాలు క్రీ.పూ. 3వ శతాబ్దికి చెందినవనీ, రాజుల పేర్లు తెలుగుభాషలో ఉన్నాయనీ, అలాంటి పేర్లు ఇప్పటికీ తెలంగాణా ప్రాంతంలో పెట్టుకొంటారని డా॥రాజారెడ్డి తెలియజేస్తున్నారు. ఈ సాక్ష్యాధారాలు తెలుగుభాష ప్రాచీనతను క్రీ.పూ. 4-3 శతాబ్దాలకు తీసుకుపోతుందని ఆయన నిక్కచ్చిగా తేల్చిచెప్పారు. కాబట్టి క్రీ.పూ. 3వ శతాబ్దికి చెందిన కోటలింగాల్లో బయటపడిన నాణేలపై గల 'గోబద', 'నరన', 'సమగోప' అనే పదాలే ఇప్పటివరకూ అందుబాటులోకొచ్చిన ఆధారాల ప్రకారం తొలి తెలుగుపదాలుగా పేర్కొనవచ్చు.

**(వ్యాసం ముగించేముందు 'నాగబు' అసలు పదమే కాదని తొలి తెలుగుపదం కానేకాదని, ప్రభాకరశాస్త్రి ప్రతిపాదన అంగీకారయోగ్యం కాదని మొదటిసారిగ చెప్పిన వ్యక్తి కీ.శే. బి.యస్.ఎల్.హనుమంతరావు. ఈ వ్యాసానికి ప్రేరకులైన హనుమంతరావుకి శ్రద్ధాంజలులు-రచయితలు)**

●

# జాతీయోద్యమకవిత్వం-ప్రారంభదశ

❖ డా॥ మద్దాళి సుబ్బారెడ్డి

**ఇరవైయవ శతాబ్ది ఆరంభంనుండే వివిధ రాష్ట్రాల్లో జాతీయచైతన్యం పెల్లుబికింది. సర్వజాతీయ జీవనరంగాల్లో స్వాతంత్ర్యపిపాస, సంస్కరణోత్సాహం పాదులు కట్టుకొని పెరుగుతూవచ్చింది. శతాబ్దాలుగా దాస్య తమస్సులో కూరుకొనిపోయిన ప్రాణికి ఈ స్వాతంత్ర్యోద్యమ రాగాలాపన చైతన్యామృత వర్షపాతంగా పనిచేసి-జీవనసరళిలో నూతనత్వానికి నాందీవచనం పలికింది. స్వేచ్ఛకోసం తపించిన, వ్యథలలో మథనపడుతున్న మానవాళికి ఈ ఉద్యమం ఆశాజ్యోతుల్ని వెలిగించింది.**

ప్రజల మహావేశాన్ని హద్దుల్లో నిలిపి రక్తపాతంవైపు దృష్టి పోనీక, సత్యాహింసలకు ప్రాధాన్యమిచ్చి ముందుకు సాగిన శాంతియుత జాతీయ విప్లవోద్యమ స్వరూపానికి జాతీయోద్యమానికి ప్రభావితులై తదనుగుణమైన కవిత్వసృష్టికి విక్రమించి-జాతీయుల మనఃఫలకాలమీద స్వాతంత్ర్య భావముద్రలను అక్షరాత్మకంగా అద్దగలిగిన ఆంధ్రజాతీయ కవిశిఖామణు లనేకులు. ఆధునికాంధ్ర సాహిత్యంలో జాతీయోద్యమ కవితాశాఖ మహోజ్వలమైంది.

భారతదేశంలో ఏ ఉద్యమం లేచినా మొదట వంగభూమిని ఆకట్టుకుంటుంది. తర్వాత ఆంధ్రను స్పందింపజేస్తుంది. ఆంగ్లప్రభుత్వంలో బహిరంగఘర్షణ వంగ దేశంలో ఈ శతాబ్ది ఆరంభంలోనే ప్రారంభమైంది. ఆ సంఘర్షణను వెంటనే ఆంధ్రదేశం అందుకుంది. ఇంతకుముందే భాషా, సంఘసంస్కరణలతో పదునువారుతున్న ఆంధ్రుల హృదయాలు ఈ స్వదేశీయోద్యమంతో మరింత నిశితమైపోయాయి. ఆనాటి ప్రభుత్వాధినేత కర్జన్ వంగరాష్ట్రాన్ని రెండుగా చీల్చి అగ్నిలో ఆజ్యం పోశాడు. వంగప్రజల్లో స్వరాజ్యవాంఛ జడలు విప్పింది. స్వదేశవస్తువుల మీద మమకారం, విదేశవస్తువులమీద వికారం విస్తరిల్లింది.

ఈ విధంగా వంగదేశాన పొటమరించిన ఈ ఉద్యమం క్రమంగా భారతదేశమంతటా శాఖలుసాచి విస్తరించింది. "వందేమాతరం" అను నినాదము దిక్కులనుకుద్దాలింపసాగినది. ఆ ప్రభావముతో ఆంధ్రదేశము ప్రబుద్ధమై క్రుద్ధమై నిలిచినది.

ఈ ప్రభావం విద్యావంతులైనవారిమీద అధికారికంగా ప్రసరించింది. వెల్లువ వలె భావగీతాలు పరవళ్ళు తొక్కాయి. కావ్యాలు కదను తొక్కాయి. ప్రబోధగీతాలు పుంఖానుపుంఖంగా ప్రసారితాలైనాయి. ఖండకావ్యాలు గండరించాయి, కీర్తనలు, పాటలు, బుర్రకథలు, హరికథలు-ఒకటేమిటి సర్వప్రక్రియలు దేశీయుల నరనరాలలో స్వాతంత్ర్యభిరుచిని ప్రచలితం చేశాయి. ఆనాటికి కవై పుట్టిన ప్రతివానిమీద ఈ ప్రభావం ప్రత్యక్షంగానో పరోక్షంగానో పనిచేసిందని చెప్పవచ్చు.

వ్యష్టిలాభంకోసంకాక సమష్టి శ్రేయస్సుకోసం సముద్దిష్టమైన ఈ జాతీయోద్యమ కవిత్వానికి క్షతిలేదు. నాటిసమాజానికి ఏది హితమో, శ్రేయమో దాన్ని ఊహించి ఉపదేశించాడు కవి. ఆ కవి పూరించిన సాహిత్య శంఖారావాన్ని విని మేల్కొన్నాడు దేశీయుడు. దాదాపు ఏభై సంవత్సరాల ఆధునికాంధ్ర కవిత్వంలోని వివిధశాఖలపై ప్రసరించిన జాతీయోద్యమ ప్రభావరేఖల్ని, పరిశీలిద్దాం.

1905లో వంగదేశవిభజనతో భారతీయులగుండె భగ్గుమంది. స్వరాజ్యం భారతీయుల జన్మహక్కు అన్న ధ్యేయంతో వందేమాతరోద్యమం ప్రారంభమైంది.

బిపిన్ చంద్రపాల్ కలకత్తానుండి బయలుదేరి బరంపురం, విశాఖపట్టణాల మీదుగా రాజమండ్రి, బందరు, నెల్లూరు మొదలైన ముఖ్యపట్టణాల్లో ప్రభుత్వ దమన నీతికి వ్యతిరేకంగా ఇచ్చిన ఉపన్యాసాలు ఆంధ్రప్రజల్లో ఇంతకుముందే రగులుకొనే జాతీయోద్యమ వైశ్వానరమును మరింత రెచ్చగొట్టాయి. ఆంధ్రులు కుపిత కుంజర వైరులయినారు. 'వందేమాతర'మన్న నినాదానికి 'మందే రాజ్య'మని సంరంభాన్ని సముజ్జ్వలం చేశారు. 1907 ఏప్రియల్లో బిపిన్ చంద్రపాల్‌గారి ఆంధ్రపర్యటన ప్రారంభమైంది. ఏప్రియల్ 19 నుండి 24 వరకు రాజమండ్రిలో ఉపన్యసించారు. వారి ఉపన్యాసాలను తెనిగించినవారు చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు. ఉపన్యాసాల చివరిరోజు చిలకమర్తివారు ఆశువుగా ఈ పద్యం చెప్పారు.

> **"భరతఖండంబు చక్కని పాడియావు**
> **హిందువులు లేగదూడలై యేడ్చుచుండ**
> **తెల్లవారను గడుసరి గొల్లవాడు**
> **పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"**

ఈ పద్యం సభను ఉత్సాహతరంగితం చేసింది. అంతతో ఆగక ఆనాడు వ్యాప్తిలో ఉన్న పత్రికలలో ఎక్కింది. అంతేకాదు ఆంధ్రుల జిహ్వాగ్రాలమీద చిందులాడింది. 'చిలకమర్తివారి 'భరత ఖండంబు'

అన్న పద్యము తెలుగులో భారతజాతీయోద్యమ సంబంధమైన తొలి రచనయని చెప్పవచ్చును. అన్నారు నారాయణరెడ్డిగారు. ఈ మాటలు కొంతవరకే నిజం. ఎందువల్లనంటే 1897-98 మధ్యకాలంలో 'సరస్వతి' మొదలయిన పత్రికల్లో భారతదేశపు స్థితిగతులనుగూర్చి అశేషమైన ఖండికలు వెలువడ్డాయి. అని మొదలి నాగభూషణ శర్మగారు అన్నారు. భారతదేశపు స్థితిగతులను వర్ణించేవి వెలువడి ఉండవచ్చుగాని నారాయణరెడ్డిగారు చెప్పినట్లు "సూటిగా ఆంగ్ల ప్రభుత్వమును విమర్శించిన జాతీయకవి"గా చిలకమర్తిగారికి ప్రాధాన్యమీయక తప్పదు.

భారతదేశపు స్థితిగతులను వర్ణించి వివరించిన మొదటి జాతీయకవికూడా చిలకమర్తివారేనని చెప్పడానికి ఆధారాలున్నాయి. చీకటిని నిందిస్తూ కూర్చునేకంటే ఎంత చిన్నదైనా ఒక దీపాన్ని వెలిగిస్తే తర్వాత అది ప్రజ్వలించి వెలుగులను విరజిమ్ముతుంది. ఇదే చిలకమర్తివారి ఆశయం. ఆంగ్ల ప్రభుత్వమంటే భయం వదలని కాలంలోనే, వందేమాతరోద్యమ జ్వాలలు జనతలోని చలిని ప్రిదిలించక ముందే 'దేశభక్తి' కవిత్వానికి చిలకమర్తివారు శ్రీకారం చుట్టారు. 1895లోనే 'గోదావరి మండలసభ'లలో వారు చదివిన పుష్పమాలిక 'చింతామణి' పత్రికలో ప్రకటింపబడింది. ప్రభుత్వాన్ని ప్రత్యక్షంగా ఎదుర్కొనేధైర్యం ఆనాటికింకా బలపడలేదు. సంపూర్ణ స్వరాజ్యకాంక్షే దేశంలో ప్రబలం కాలేదు. కోర్కెలను సాధించుకొనేందుకు మండలసభలు, మహజర్లే వేదికలుగా ఉండేవి. అందుచేత మొదటి ఒకటి రెండు పద్యాల్లో మాత్రం ప్రభుత్వాన్ని పొగిడినట్లే కనుపించింది. కాని తర్వాత జాతీయ భావస్ఫోరకాలైన పద్యాలు ప్రవచించి ప్రజలకు ప్రబోధించేశారు. ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని ఇంత నిక్కచ్చిగా వెలువరించిన ఈ కవిత జాతీయోద్యమానికి ప్రతిధ్వనియే. చిలకమర్తివారు ప్రభుత్వ పన్నుల విధానాన్ని నిరసిస్తూ-

'నేల దున్నుదమన్నఁ జాల తరము పన్ను
నీరు గావలెనన్న నీటి పన్ను
వాణిజ్యమొనరింప వచ్చు బడికి పన్ను
సరకు లమ్ముదమన్న సంత పన్ను
కఱ్ఱ లమ్ముదమన్నఁ గలప కింకొక పన్ను
పట్టణంబుల మున్సిపాలు పన్ను
పారిపోవుదమన్నఁ బండి హాసీల్ పన్ను
కొంపమ్ముకున్నచో స్టాంపు పన్ను
ఉన్నమట్టుకు తినకుండ నుప్పు పన్ను
ననెడు పన్ను వెదిగదీసె జనుల నెల్ల'

"ఉప్పుకును పన్ను బాబు, పప్పుకును పన్ను బాబు" అన్న గరిమెళ్ళ సత్యనారాయణగారి పరిణతికి బీజావాపనం చేసినవారు చిలకమర్తివారే. గరిమెళ్ళ ముందుకు సాగిపోయి 'మాకొద్దీతెల్లదొరతనము' అనగలిగినాడు. 'దేశస్థులకు మైత్రి దిట్టపరచుటకు'ను 'అఖిల జాతులవారి కైకమత్యముఁ గొల్పుటకు'ను గౌతమీ మండలసభ ఏర్పాటు చేయబడినట్లుకూడా ఆ పద్యాల్లో వివరించారు. "మొగమోట యనునూటఁ దెగగోసి దొరలతో జనులకై వాదించు సాహసులు" కావాలని ప్రబోధించారు.

ఈ విధంగా ప్రభుత్వంయెడ అసంతృప్తిని చాటుతూ ఐకమత్యాన్ని ప్రబోధిస్తూ, సాహసులకై పిలుపునిచ్చే కవిత్వాన్ని వెలార్చి తెలుగులో జాతీయోద్యమ కవిత్వానికి శ్రీకారం చుట్టిన ఘనత చిలకమర్తి వారికే దక్కుతుంది.

1895లో చిలకమర్తివారు విత్తిన విత్తు మొలకలెత్తనారంభించింది. 1897లో 'చింతామణి' పత్రికలోని పి.రామశాస్త్రిగారు వ్రాసిన 'విశాఖపట్టణ మండలసభ' పద్యాలు ఇంకొంచెం ముందుకు సాగాయి. ఈ పద్యాల్లో 'దేశాభిమాని' తత్త్వం ఆవిష్కరించబడింది.

సీ॥ దొరతనంబునఁ గల్గు దోషగుణంబుల
నమరంగఁ గనెడు దేశాభిమాని
తానెట్టులున్నను దన దేశభాగ్యోచ్ఛ్
యంత్రంబె దలచు దేశాభిమాని
దుస్థితి దేశంబు దొరయంగ మనమున
నలమటఁ జెందు దేశాభిమాని
దేశంబు వృద్ధిని దేజరిల్లఁగఁ జేయ
నతి కష్టమొందు దేశాభిమాని

అహహ దేశాభిమానిత యనఁగ నొప్పు
గుణమునకు సాటి వేరొండు గుణమ్ము గలదె స
జనులు దేశాభిమానులై చనువు మీరంబట్టి
గూడు టొకచోట జనరత్నఁ గొటగాదె"

(చింతామణి, 1897-మే)

దేశాభిమాని తత్త్వావిష్కరణమే కాక, ఐకమత్యంయొక్క అవసరాన్ని గూడ నొక్కి చెవుతారు తర్వాత పద్యాల్లో. సంఘశక్తికి దీటైంది లేదని శ్రీరామశాస్త్రి గారి విశ్వాసం.

"అతి నిరంకుశులైన యధిపతులై నను
సంఘబలంబుచే వంగియుంద్రు"
-- -- --
సంఘశక్తికి సరియైన శక్తి గలదె"

అని నమ్మి తదనుగుణంగా వేదిక తయారు చేసినారు. ఆంగ్లప్రభుత్వ నిరంకుశ అధికారమనే తెరను కొంచెం చీల్చుకొని అప్పుడప్పుడే 'దేశభక్తి' భారత జాతీయ రంగంమీదకు తొంగిచూడాలనే తాపత్రయం కనుపిస్తుంది. తెరను చించివేసే ధైర్యం ఇంకా రాలేదు. అందుచేతనే దేశభక్తి దోబూచులాడుతుంది. ఇదేసభలో ఈశ్వర జగన్నాథ మార్తాండశాస్త్రిగారు-

"క్షామముచే గృశించి కడుఁ గాసిలుచున్న జనాళిఁ జూడ కు
ద్దామహిమస్థలంబుల నిదాఘము పొఁజను నా దొరల్ వినన్
హైమ గిరుల్ ప్రతిధ్వనుల నార్భటిఁ జూపగ నీ సభాస్థలిన్
వేమరు దీనదుస్థితిని వేయి ముఖంబుంఁ జాటి పాపరే"

అనేపద్యంలో హిమగిరులు ప్రతిధ్వనించేటట్లు భారతహైన్యస్థితిని చాటమన్నారు. ఐకమత్యంతో ప్రతిసంవత్సరం మండలసభలు జరిపి

ప్రభుత్వానికి జాతీయులలో నెలకొన్న అసంతృప్తిని తెలియజేయాలనే కోర్కెను ఇదేసభలో మంతిన ఆదినారాయణమూర్తిగారు కూడా పద్యముఖాన వెల్లడించారు.

1909 అక్టోబరులో (మాఘసంచిక) 'ఆంధ్రభారతి' మాసపత్రికలో 'మేలుకొలుపు' అనే శీర్షికతో ఒక గేయం ప్రచురించబడింది. ఇది ప్రబోధాత్మకమైన గేయం.

"మేలుకొనిమీ భరతపుత్రుడ, మేలుకొనుమీ
--- ------ సుజనపుత్రుడ" అనేది.

"భారత జాతీయోద్యమమును, ముఖ్యముగాఁ వందేమాతరం ఉద్యమమును కవిత్వరూపమున ప్రకటించిన మొదటిగేయము సైతమిదియే"నని నారాయణరెడ్డిగారభిప్రాయపడ్డారు.

1902లో కృష్ణాపత్రిక పుట్టినప్పటినుంచీ దేశభక్తి ప్రపూరితాలైన వ్యాసాలను వెలువరిస్తూ వచ్చింది. గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు 1905 అక్టోబరులో ప్రచురించిన "స్వదేశాభిమానము" అనే వ్యాసం దేశీయుల్ని జాగృతం చేసింది. లార్డు కర్జన్ చేసిన బంగ్లా విభజన మనకెంతో మేలుచేసిందని గాడిచర్ల వారి అభిప్రాయం. "లార్డు కర్జన్-ఓహో హిందూదేశస్థులారా! మీరొక్క రాష్ట్రపువారగుటకు నొక్క ప్రభువుకు లోబడియుండుట చాలదు. మీ దేశాభివృద్ధికొరకు మీరెల్ల రైకమత్యము గనబరచి ఒకరినొకరు సహాయ మొనర్చుకొనుడని' వారి కార్యమువలన బ్రచురించి మనదేశమునకు వారట్లభిప్రాయపడకుండియు మహోపకారమొనరించిన వారయినారు" అని గాడిచర్లవారు వ్యంగ్యంగా ప్రబోధించినారు. 1905 డిసెంబరు కృష్ణాపత్రికలో కొండా వెంకటప్పయ్యగారు సంపాదకీయంలో వంగవిభజన సంగతి ప్రస్తావించి-''నేడు సేతువు మొదలు హిమాచలపర్యంతము వ్యాపించుచున్న దేశాభిమానమునుచూడ మేము జీవించియున్నందు కెంతయు సంతసించుచున్నాము. ఆంగ్లేయులపాలనలో 'వందేమాతరం' అనుమాట బూతుగా మారినది. స్వదేశాభిమానులు అడవి మృగములవలె వేటాడబడుచున్నారు. ఘరానా మనుష్యులు బంట్రోతులుగా మార్చబడుచుండిరి" అని దేశదుస్థితిని సూచిస్తూనే లావాలాగా పొంగుతున్న దేశాభిమానాన్ని నుతించారు. ఇదేపత్రికలో చన్నాప్రగడ భానుమూర్తిపంతులుగారున్నూ "దేశాభిమానమే దేశాభివృద్ధికిని దేశజనుల సౌఖ్యక్షేమమునకును ముఖ్యసాధనము" అని నొక్కి చెప్పారు. బిపిన్ చంద్రపాల్‌గారి ఆంధ్రపర్యటనకుపూర్వమే చైతన్యమూర్తులైన నాయకులు దేశాభిమానాన్ని చాటుతూ ఐక్యతను ప్రబోధిస్తూ వచ్చారని తేలింది. ఈ పిలుపునందుకొని ఒక మహాకవి (పేరు తెలియదు) 1905 డిసెంబరు 15వ తేది కృష్ణాపత్రికలో "ది క్రై ఆఫ్ మదర్ ఇండియా" (హిందూదేశపు మొర) అనే గీతాన్ని ప్రచురించారు. దేశభక్తి గీతానికి పునాది ఇదే. నోళ్లు నొక్కుకొని జీవించే ఆంధ్రజాతికి గొప్ప సందేశాన్నందించిన ప్రథమ గేయమిదే. పైగా చిలకమర్తివారు 1907లో ఆశువుగా చెప్పిన "భరతఖండంబు చక్కని పాడియావు" అన్న పద్యానికి ఉత్సాహమిచ్చిన రచన ఇదేనని స్ఫురిస్తుంది. ఆ గేయం ఇది -

"హిందువులారా ! ఎన్నాళ్లీ గతి
మందమతులరై మాటికి జెడెదరా
నందనులగు మీరందరు స్రుక్కగ
యెందుకు నా బ్రతుకితరులకోసమ
నా వంటనుగల సారంబంతయు
నావంతయు లేకే వెలికేగేను
చేవ చెడిన నే నేవిధి బ్రతుకుదు
జీవించిన సార్థక్యంబేమిక
దూడనోరుగొట్టి ద్రోహంబు గొల్లలు
పాడి సమస్తము పరుల కమ్ముగతి
కూడులేని నా కొడుకుల గాదని
యేడకో నా ధనమెల్లను బోయెడి
చీము నెత్తురు చిక్కెనో లేదో
ఏమెయి బ్రతుకుదు-నీ దుర్దశతో
ప్రేమ జూపరే ! ప్రేమ జూపరే !
రామ రామ ! నా లావు చెడియె నిక
ఇకనైనను మీరెల్లరు సోదరులై
ప్రకటింపుడు నాపై ప్రేమమ్మును
అకటా ! యెన్నాళ్లిక జీవింపుడు
సకలేశుడు మీకిక తోడ్పడుగాక
-- -- --

తల్లీ ! తల్లీ ! తల్లీ ! తల్లీ !
తప్పులనెల్ల క్షమించి బ్రోవుమిక
తొల్లిటివలె మేమెల్లరు కజ్జా
లల్లి కొనక వర్తిల్లెద మొకటై
ఈ మెయి మము బోషింపని తప్పది
మామీదనె యున్నది నిక్కముగా
కంటివి బిడ్డల కరవు దీరనీ
వంటి తల్లి కిటువంటి పాటులా
చచ్చిన బ్రతికిన సకలము నీవ
హెచ్చుగ నీకొరకే కృషి చేతుము"

వంగవిభజన, నాయకులప్రబోధం ఎంత ప్రభావాన్ని నెరపినవో ఈ గీతమే సాక్ష్యం. ఆంగ్లేయులు భారతదేశ సంపదను కొల్లగొట్టినస్థితిని ఆమూలంగా తెలుపుతుంది. "దూడ నోరుకొట్టి" అన్నభావాన్నే విస్తరించి చిలకమర్తివారు ఒక ఉదాత్త శిఖరానికి తీసుకొనిపోయారనిపిస్తుంది. గీతం చివర దేశీయుల పశ్చాత్తాపహృదయం కర్తవ్యనిర్వహణకు పునరంకితం కాగలమన్న విశ్వాసం ప్రకటించింది.

1906లోనే చన్నాప్రగడ భానుమూర్తి పంతులుగారు దేశభాషలో దేశాభిమానపూరితాలైన 'వందేమాతరం' అన్న పద్యఖండాన్ని వెలువరించారు. వందేమాతరోద్యమ పతకాన్ని ప్రాథమికదశల్లోనే చేతబట్టినవారిలో చన్నాప్రగడ వారొకరు. గత వైభవాన్ని స్మరిస్తూ -

"మాతరో నీ సుతుల్మునుపు మాన్యచరిత్రుల మేయ శేముషీ
ఖ్యాతులునై యనారత మఖర్వగతిం ధనధాన్యసంపదల్
ప్రీతికి మెండుగా గలిగి పేదరికంబున పేదలై కలా
చాతురి శౌర్యసంపదల శాస్త్ర పరిశ్రమమించి రెంతయున్"

అంటారు. నేటి దుస్థితినికూడా చాలా నిశితంగా వర్ణిస్తారు. తర్వాతపద్యం నాటి దేశీయుల హృదయాలలో శూలాలను దించింది.

"ప్రొద్దున లేవంగ ప్రొయిరాజవలెనన్న
నగ్నిహోత్రముస్వేడ నంపవలసె
నాబాల గోపాల మఖిలంబునకును మాం
చెష్టరు పుట్టము ల్నేయవలసె
మునుమాపు వ్యాయామమునకు కందుకములు
లండను పంపుచు నుండవలసె
వ్రాతకు లేఖినీ పత్రముల్వలయుచో
నాస్ట్రియా జర్మను లంపవలసె

చిన్నబిడ్డలు ద్రావంగ క్షీరములును
భాగ్యవంతుల పాలకు పంచదార
యూరి పేదలగంజికి నుప్పుగల్లు
నన్యదేశంబు లంపంగ నయ్యె నకట."

భారతదేశ ఆర్థికదుస్థితికి కారణాలు చెప్పబడడం, వందేమాతరోద్యమంలో ప్రధానలక్ష్యంగా పేర్కొనబడడం, విదేశవస్తు బహిష్కరణ, స్వదేశవస్తు స్వీకరణ అనేవి ఈపద్యాలకు ప్రాణం. భానుమూర్తిగారు నిష్కళంక దేశభక్తులు. ఉద్యమంలో స్వయంగా పాల్గొని జాతిని ప్రబోధించినవారు. భారతీయుల దుస్థితికి సహేతుకమైన కారణాలను కనుగొన్నవారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక తత్త్వాలన్నింటిని అవగాహనచేసికొని రచనలు సాగించారు.

గత వైభవస్మరణ, వర్తమానదుస్థితిని వివరించడంతోనే ఊరుకొనక కర్తవ్యాన్ని కూడా ప్రబోధించారు.

"జాతిమతాది భేదమతి సంస్కరణంబు ననేకదేశసంజాతుల మన్నమాటను ప్రజల్మది నెక్కొననిల్పి యాత్మలని భ్రాతృ విశేషభావనకుఁ బన్పడఁ జేయుచు నైకమత్యము న్నీతియుఁగల్గి దేశజననిం దరిజేర్తురే? కూడి యందరున్" అన్నదే కర్తవ్యబోధ. "దేశాభిమానంబు నాత్మ సీమ నెపుడు వెలయించుగాత" అని ప్రార్థన. ఈ ఖండికనే భానుమూర్తిగారు 1907లో ప్రచురించిన "భారత ధర్మదర్శనము" అనే ఖండకావ్యంలో చేర్చారు.

స్వరాజ్యస్థాపనమే భారతజాతికి శరణ్యం అన్నభావం బలపడింది. గత 20 సంవత్సరాలనుండి జాతీయోద్యమం 'కాంగ్రెసు పందిళ్లలో'నే కాపురం చేస్తూ వచ్చింది. మితవాదమార్గాన్ని కాదని అరవిందులు లాంటివాళ్లు సాయుధవిప్లవం సాగించి ప్రభుత్వాన్ని ఆటలాడించాలను కున్నారు. కాని పరిస్థితులు అనుకూలంగా లేక విదేశవస్తు బహిష్కారం, జాతీయవిద్యాప్రచారం, స్వదేశీయోద్యమాలే సాధనాలుగా భావించారు నాయకులు. ఈ స్వదేశీయోద్యమ శంఖారావాన్ని విన్న చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు 1906లోనే 'మనోరమ' అనే పత్రికలో ఆ ప్రభావానికి అనుగుణంగా పద్యాలు వ్రాశారు. 'The Salvation of India' 'భారతఖండవిముక్తి' అనే శీర్షికక్రింద ఉన్న పద్యాలకు కర్త పేరు లేదుగాని మనోరమ సంపాదకులు చిలకమర్తివారే అయినందున వారే వ్రాసి ఉంటారని ఊహించడంలో తప్పులేదు. మొదలి నాగభూషణ శర్మగారు కూడా 'బహుశా దీనికి సంపాదకులైన చిలకమర్తివారిదే కావచ్చు. "భరతఖండవిముక్తి" శీర్షికలో కొన్ని పద్యాలు 1906లో వెలువడ్డాయి" అని అభిప్రాయపడ్డారు. ఈ పద్యాల్లో స్వాతంత్ర్యతత్త్వం సంపూర్ణంగా రూపుదాల్చింది.

"స్వాతంత్ర్యము ననుగాదే
ఖ్యాతిన్ బలముల జయంబుఁ గనుదేశంబుల్
స్వాతంత్ర్యమె మేటి దొడవు
స్వాతంత్ర్యము లేని బ్రతుకు బ్రతుకే తలపన్"

అయితే స్వాతంత్ర్యాన్ని పొందడానికి ముందు భారతజాతి తనను తానెలా సంస్కరించుకోవాలో సూచించారు. హీనజాతులవారి దీనత్వాన్ని ఉడుపలేనిజాతి స్వాతంత్ర్యాన్ని కర్హం కాదంటారు. ఐక్యత ఉంటేనేగాని స్వాతంత్ర్యం సిద్ధించదు. ఐక్యత చేకూరాలంటే సమతాభావం అవసరం. కాబట్టి ముందు స్వార్థనాశం తర్వాత స్వాతంత్ర్యసంపాదనం. ఇదీ వారి సిద్ధాంతం.

"హిందూదేశమునం దెసంగు జనులేయే జాతులం బుట్టినన్
వందేమాతరమంచు నేకతను సేవా ప్రీతి సంధిల్ల నా
ర్తిం దూదింబలెఁ దూలగొట్టుటకునై దేశాభిమానంబునుం
జెందన్ గల్గదె మంగళంబు ప్రతిభా శ్రీయుక్తి శోభిల్లగన్"

అన్నది వారి సందేశం. ఈ విధంగా బిపిన్ చంద్రపాల్‌గారు రాకపూర్వమే చిలకమర్తివారు మండలసభల్లోనూ పత్రికాముఖంగానూ దేశభక్తి సంబంధ రచనలుచేస్తూ వచ్చారు. కాకపోతే చంద్రపాల్ రాక చలిదీర్చింది.

ఉద్యమం నానాటికి ఉధృతం కాజొచ్చింది. నాయకులపర్యటనలు, ఉపన్యాసాలు ప్రజలమీద మహోన్నతమైన ప్రభావాన్ని నెరపుతూ వచ్చాయి. ప్రభుత్వానికి కంపరమెత్తింది, సభలు సమావేశాలు జరపరాదనే ఆంక్షలు విధిస్తూ 1907లో ప్రభుత్వం ఒక అత్యవసరచట్టాన్ని (ఆర్డినెన్సు) ప్రవేశపెట్టింది. లాలా లజపతిరాయ్‌ని 1907 మేనెలలో ప్రభుత్వం బంధించడమేకాక, దేశానికి దూరంగా బర్మాలో ఉంచింది. అందుకు నిరసనగా ఆంధ్రదేశంలోని ప్రధాన నగరాలన్నింటిలో విద్యార్థులు సమ్మెలు చేశారు. ఆ రోజుల్లోనే విశాఖపట్టణంలో మద్రాసురాష్ట్ర రాజకీయ సమావేశం జరిగింది. న్యాపతి సుబ్బారావుగారు అధ్యక్షించారు. ఆ సభలో కె. శ్రీనివాసరావుగారు ప్రభుత్వ దమననీతిని

ఖండిస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. చిలకమర్తి వారు లాలా లజపతిరాయ్ నాయకత్వాన్ని సేవలను కొనియాడుతూ తీర్మానాన్ని బలపరిచారు. ఈ సంఘటన దేశీయుల్లో గొప్ప సంచలనం కలిగించింది. విద్యార్థులే నాయకులై ఊరూరా ఊరేగింపులు సాగించారు. దేశీయుల్లో కల్గిన ఈ సంచలనాన్ని చిలకమర్తి ఆవేశపూరితరీతిలో కవితాబద్ధం చేశారు.

"చెరసాలన్ పృధు చంద్రశాలలె యగున్, చేదోయి గీలించు న
య్యరదండల్ విరిదండ లయ్యెడున్, హేయంబైన చోడంబలే
పరమాన్నంబగు, మోటు కంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యే నరుడాత్మ దేశమును భక్తిం గొల్చు నవ్వానికిన్"

భరతఖండంబె యొక పెద్ద బందెఖాన
అందులోనున్న ఖయిదీలు పొందుజనులు
ఒక్క గదినుండి మార్చి వేరొక్క గదిని
బెట్టుటే కాక చెరయందు వేర గలదె.

'భరతఖండంబె ఒక పెద్ద బందిఖాన' అని కుండ బ్రద్దలుకొట్టినట్టు ప్రభుత్వాన్ని విమర్శించారు. దేశీయుల్లో ఉన్న నైరాశ్యాన్ని నిక్కచ్చిగా నిశితంగా వెలువరించారు. "ఈ పద్యములలో జాతీయ భావస్ఫులింగములు చటపటలాడిపోవుట గమనింపదగినది. జాతీయభావమును వ్యంగ్యముగనో, అన్యోపదేశముగనో చిత్రించక, సూటిగా ఆంగ్ల ప్రభుత్వమును విమర్శించిన మొట్టమొదటి జాతీయకవి చిలకమర్తివారే"

1907లో విశాఖపట్టణంలో రాష్ట్రరాజకీయమహాసభ జరిగింతర్వాత 1908లో గుంటూరుజిల్లా తెనాలిలో మండలసభ జరిగింది. అప్పటికే స్వరాజ్యం, స్వదేశీయోద్యమం, బహిష్కరణోద్యమం, జాతీయవిద్యా, నాలుగూ నాల్గువేదాలుగా దేశీయుల్లో బహుళప్రచారాన్ని పొందాయి. తెనాలిలో జరిగిన సభనుగురించి కృష్ణాపత్రికలో కొండా వెంకటప్పయ్యగారు ఎంత చమత్కారంగా చెప్పారో చూస్తే ప్రభుత్వ శాసనాలు వారికి చెలగాటమయిందని తోస్తుంది.

"తెనాలిలో మండలసభ జరుగుతున్న తేదీలలో గూఢచారులు మందలు మందలుగా ప్రత్యక్షమయి ప్రతి దేశభక్తుని వెంటను పెనుభూతములవలె వెంబడించి, వారు సభాస్థానముననేగాక, భోజనసమయములందును మారువేషముల ధరియించి తమ ధర్మములను నెరవేర్చుకొనిరి. వీరికి జీతబత్తెములనిచ్చి మాకు రక్షకభటులనుగా బంపిన ప్రభుత్వమువారికి మా వందనము లర్పించుచున్నాము. గూఢచారులనవెవరు? దేశభక్తుల పూర్వకర్మఫలమే గూఢచారులుగ అవతరించి దేశభక్తులకు తోడునీడై వెంటనంటియున్నది." నాయకులు, ప్రజలు ఏ విధంగా భయంవిడిచి ఉద్యమాన్ని సాగించడానికాయత్తమౌతున్నారో తెలిసికొనడానికి ఈ మాటలు చాలు. దేశభక్తుల ప్రతి కదలికను ప్రభుత్వం అనుమానిస్తుందనీ, ప్రతిచర్యా వేయికన్నుల్తో పరిశీలిస్తుందనీ అర్థమౌతుంది. ఈ తెనాలి సభలో చంద్రమౌళి చిదంబరరావుగారు ప్రబోధాత్మకమైన పద్యాలు పఠించారు. మితవాద రాజకీయాలలో విసిగి –

"మనవి యర్జీలతోడనె తృప్తినొందుచు
నూరక యువ్విళులూరు కొనుచు"

ఉన్న నాయకులను నిరసించారు. స్వాతంత్ర్యసముపార్జనామార్గాన్ని సూచించారు.

"ఎందరెందరో చాల బందెలబడి బాధలంది
గుందుచు పేఋ జెందకుండ
ఎందరెందరో ప్రాణ మందపేక్షను
వీడి శూరత్వమనయంబు జూపకున్న
యెందరెందరో ధనమందు కాంక్షను వీడి
ధనము దేశమునకై యునుపకున్న
బానిసత్వంబు, నైచ్యంబు, పరిభవంబు,
పారతంత్ర్యంబు పోవునే ప్రాజ్ఞులార"

అని ఏ విధంగా ప్రవర్తించారో నిర్దుష్టంగా చెప్పినట్లయినది. నాటికి ప్రచారమొందిన నిర్మాణకార్యక్రమాన్ని గురించికూడా కవికి దృఢమైన అభిప్రాయాలున్నవి. 'బహిష్కార ఖడ్గంబు' పూనమనుట, 'జాతీయకళాశాల' లేర్పరుపమనుట నిర్మాణ కార్యక్రమంలోని భాగాలే. తన్మూలకంగా స్వరాజ్యప్రాప్తి అనేగమ్యాన్ని చేరమని ఉద్బోధ.

1908 కృష్ణాపత్రికలో 'భరతమాతృశతకము' నుండి తీసికొనబడినవి అని కొన్ని పద్యాలు కనుపిస్తున్నాయి. దానిలో కర్తపేరు లేదు. మామిడిపూడి వెంకటరంగయ్యగారి సంపాదకత్వాన వెలువడ్డ 'The Freedom struggle in Andhra' అన్న గ్రంథంలో "In 1908 propaganda was also carried on through books and two of them are entitlid, Hindu Desa Daridryam by Attill Suryanarayana and the other Matru Satakam (100 verses in praise of Mother India), by Mutnuri Venkata Subbarayudu and Mangipudi Venkata Sarma, came to the notice of the police." అని చెప్పిన మాటలను బట్టి చూస్తే వీరిరువురు వ్రాసిన పుస్తకం 'భారతమాతృశతకమే' ననవచ్చును.

జాతీయోద్యమ కవిత్వ ప్రపంచంలో మంగిపూడివారి స్థానం మహోన్నతమైంది. ఎదగబోయే ఆయన కవితాహృదయానికి చిహ్నాలు ఈ పద్యాల్లోనే గోచరిస్తాయి. భారతదేశస్తవం, దేశభక్తి నిర్వచనం, పరతంత్ర స్వభావం, దేశీయవస్తు స్వీకరణ మున్నగు విషయాలున్నవి ఈ పద్యాల్లో 'దేశభక్తుడు, దేవనిభుడు' అన్నంతవరకు పోయారు.

పరతంత్రత సౌఖ్య హరము
పరతంత్రత ప్రాణ మానభంగకరంబున్
పరతంత్రత బహు హేయము
నరకమువలె భరతమాత న్యాయ సమేతా"

అని పరతంత్రతను నిరసించి ఈ ప్రభుత్వంలో –

పంటలు తక్కువ పన్నులు ఎక్కువ
కంటికి ద్రవ్యము కరవై పోయెను"

అని దురపిల్లినారు.

1909 (శా.శ. 1831 మాఘసంచిక) 'ఆంధ్రభారతి'లో 'మేలుకొలుపు' అనే శీర్షికతో ప్రచురింపబడ్డ గేయాన్ని ఇక్కడ పరిశీలిచవచ్చు. ఇది ప్రధానంగా ప్రబోధాత్మకమైంది. మూఢాచార నిరసనంకూడా కనుపిస్తుంది. కర్తపేరు లేదు.

"మేలుకొనుమీ భరతపుత్రుడ
మేలుకొనుమీ సుజనపుత్రుడ
మేలుకొనుమీ సచ్చరిత్రుడ
మేలుకొనవయ్యా ! వత్సా ! మేలుకో
వేడుకను జాతీయతను వేగుచుక్క పొడిచెనదుగో
కూడి వందేమాతరమ్మను కుక్కుటము లరచెన్"

అని జాతీయభావాన్ని నిర్ద్వంద్వంగా, నిర్దుష్టంగా రూపొందించిన జాతీయులు కన్నులు నులుముకొని లేచేవేళ వందేమాతరమనే కుక్కుటాలు జాతిని లేపేవేళ. ఇంకా పలుదేశాలలో సాగిన జాతీయోద్యమాలను స్మృతివధాన నిలిపిన గేయంగా కూడా చిరస్థాయిగా నిలుస్తుంది.

"కౌతుకమున జపాను లెల్ల
సకాలమున మేల్కాంచి పరగును
గాఢనిద్రను విడిచి చైనులు
కనులు తెరచి జగంబు గనుగొని
పారశీకులు దీర్ఘ నిద్రను
బారద్రోలిరి గౌరవంబున
వారి దారిని యా తురుష్కులు
వర్తిల్లెద రిదిగో
అందరును నీకంటె ముందర
నడుగులేయుచు మెలగుచుండగ
పందవలె నిటు నిద్రవోవగ
పాడి యగునయ్యా"

అని భళ్లున చరిచినట్లయింది.

1909 'ఆంధ్రభారతి'లోనే (1831 శ్రావణం) 'మాలవాండ్రపాట' అన్న గేయమున్నది. కర్తపేరు లేదు. గాంధీగారు రంగంమీదికి రాకపూర్వమే అస్పృశ్యతకు వ్యతిరేకంగా గొంతెత్తిన గేయమిది.

"అందారు పుట్టిరి హిందమ్మ తల్లీకి
అందారు ఒక్కటై ఉండాలి సక్కంగా
-- -- --
వర్ణాల యెక్కువ పుట్టంగ లేదయ్య
మమ్మేల క్రిందీకి క్రుమ్మేరు మానోరు
-- -- --
ఎట్టాగు యెక్కువ బ్యామ్మర్లు మాకంటె
ఎట్టాగు యెక్కువ యేరైన మాకంటె
-- -- --
తమ్ముాలమని మీరు మమ్మూల జూడండి
అమ్మోరు దీవించి అయిశ్వర్య మిచ్చును"

అంగాంగ సమన్వయంలేని శరీరంవంటి సంఘాన్ని మరమ్మత్తు చేయాలనే ఆకాంక్ష ఆనాడే కల్గింది. పంచమసమస్యకు ఒకరూపం ఇచ్చి సమస్యాపరిష్కారానికై ప్రయత్నం ప్రారంభమైనట్లు కనుపిస్తుంది. జాతీయోద్యమ ప్రభావంవల్లనే ఈ మూఢాచార నిరసనం ప్రబలింది. క్రిందితరగతులు వాడుకొనే గ్రామ్యభాషలో వ్రాయబడింది.

1909లో మింటోమార్లే సంస్కరణలవల్ల భారతభూమి కొంత చల్లబడింది. ఉద్యమం సన్నగిల్లింది. అయితే అది రాబోయే తుఫానుకు ముందటి స్థితి. అందుచేత కవిత్వవిషయంలోకూడా దీన్ని ప్రాథమికదశ అనవచ్చు.

ఆంధ్రలో 1895 నుండే జాతీయోద్యమభావ సుమాలు విరియజొచ్చాయి. కవులు వారి పరమళాలందుకొని తమ కవితామారుతాలతో మారుమూలలకు కొనిపోసాగారు. ఉద్యమంలోనూ ఉద్యమ కవిత్వ విషయంలోనూ ఇది ప్రారంభదశేననాలి. ప్రయత్నం, ప్రాప్త్యాశ, నియతాప్తి, ఫలాగమాలు ముందున్నవి. మంచు తెరల అంచుల్ని ఒకింత తొలగద్రోసిన స్థితి. తెరల తెమర్చి తాండవమాడే స్థితి రానున్నది.

**("తెలుగులో జాతీయోద్యమ కవిత్వం" నుంచి ఆగస్టు 15, సందర్భంగా)**

---

## నివాళి

# భరాగో



**జననం : ఫిబ్రవరి 6, 1932**
**మరణం : ఏప్రిల్ 7, 2010**

భమిడిపాటి రామగోపాలం 2010, ఏప్రిల్ 7వ తేదీన "ఇక సెలవు, ఇట్లు మీ విధేయుడు" అంటూ శాశ్వతంగా వెళ్ళిపోయారు. 1932, ఫిబ్రవరి 6న విజయనగరం జిల్లా పుష్పగిరిలో జన్మించారు. కడదాకా విజయ నగరానికి కొండగుర్తుగా నిలిచిన గంటస్తంభానికి దీటుగా భరాగో సాహితీ రంగంలో నిలిచారు. 160 కథలు, నాలుగు నవలలు, బోలెడు సినిమా కబుర్లు రాశారు. భానుమతి, పి.సుశీల వంటి సినీ ప్రముఖులపై సావనీర్లు ఎడిట్ చేశారు. సినిమా పాటల మీద నూటపదహార్లు పేరుతో రెండు విమర్శనాత్మక వ్యాస కదంబాలను వెలువరించారు. అనేక పత్రికలలో కాలమ్స్ రాశారు. కథనకుతూహలం చాలా పేరు తెచ్చిపెట్టింది. విశాఖ పోర్ట్ ట్రస్ట్‌లో సర్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. మధ్యతరగతి జీవితాలను తన కథల్లో కాచి వడపోశారు. ఆయన వెన్నెలనీడ, వంటొచ్చిన మగాడు కథలు ఎన్న తగినవి. స్నేహపాత్రుడు ఎందరికో అభిమానపాత్రుడు చిరస్మరణీయుడు. భరాగోకి అక్షర నివాళి.

# మా మేస్టారు : భమిడిపాటి కామేశ్వరరావుగారు

❖ డా॥ పోరంకి దక్షిణామూర్తి



**రాజమండ్రిని (కాదు, 'రాజమహేంద్రి' అనాలట) తలుచుకోగానే అక్కడి అఖండ గౌతమి గుర్తుకు వస్తుంది. మా ఇంటికి దగ్గరిలో ఉన్న పడవలరేవు గుర్తుకు వస్తుంది. భద్రాచలం లాంచీల రేవు, పుష్కరాలరేవు, పక్కనే మొదటి రైలు వంతెన గుర్తుకు వస్తాయి. (ఆ రైలు వంతెన, ధవళేశ్వరంలో ఆనకట్ట, ఎలా కడుతున్నారో చూసి వచ్చి, మా తాతయ్య యనమండ్ర పురుషోత్తంగారు, ఊళ్ళో వాళ్ళకు వర్ణించి చెప్పేవారట). కోటిపల్లి బస్‌స్టాండు సంగతి సరేసరి (ఆలమూరునుంచి, కపిలేశ్వరపురం నుంచి, కోటిపల్లి నుంచి వచ్చే బస్సులకు అది అడంగు అన్నమాట). దానికి దగ్గరగానే వీరేశలింగంపంతులుగారి బొమ్మ కనిపిస్తుంది (బొమ్మకింద, రాతిపలకమీద చిలకమర్తివారు రాసిన పద్యం ఒకటి చెక్కి ఉంటుంది –"తన దేహము తన గేహము......ఘనుఁడీ వీరేశలింగకవి జనులారా!").**

ఆ బొమ్మకు ఎదురుగా, తూర్పువైపు వీధి ఒక పెద్దగేటు దగ్గర ఆగిపోతుంది. ఆ గేటుకు పైన నిలువంపు కట్టుబడిమీద 'వీరేశలింగాస్తికోన్నతపాఠశాల' అన్న పేరు కనిపిస్తుంది (టూకీగా, వి.టి. హెచ్. స్కూలు అంటూంటారు దాన్ని). ఆ గేటు దాటితే విశాలమయిన ఆవరణలో రెండంతస్తుల పెద్దభవనం గుండ్రటి స్తంభాలతో కానవస్తుంది. ఒకప్పుడు మాకు చదువుపట్టూ ఆటపట్టూ అయిన ఆ ఆవరణలో అడుగుపెట్టినపప్పుడు ఆరు దశాబ్దాల పూర్వపు జ్ఞాపకాలన్నీ ఒక్కుమ్మడిగా ముసురుతాయి. అప్పటి ఉపాధ్యాయులూ సహాధ్యాయులూ ఎందరో మనసులో మెదులుతారు.

అప్పటికి పుష్కరకాలం కిందట మా అన్నయ్య అదే స్కూల్లో చదివాడు కాబట్టి అప్పటి ఉపాధ్యాయుల పేర్లు కొన్ని చెబుతూండేవాడు–జయంతి గంగన్నగారు, అడవి శంకరరావుగారు, భమిడిపాటి కామేశ్వరరావుగారు, కందర్ప సత్యనారాయణగారు, చెరుకుమిల్లి వెంకట్రావుగారు మొ॥వారు. అప్పటి ఉపాధ్యాయులందరినీ 'మేస్టారు' అంటూండేవాళ్ళు (ఇప్పట్లా, 'టీచరు' స్త్రీలింగం, 'సారు' పుంలింగం అన్న తేడాలు అప్పటికి లేవు). వారందరూ విద్యార్థులను సొంతపిల్లల్లా అభిమానించేవారు, ఆదరించేవారు. మాట వరసకొక ముచ్చట–నేను హైస్కూలు చదువు ముగించాక దాదాపు ఏడెనిమిదేళ్ళ తరవాత, హైదరాబాద్‌లో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో, ఒకప్పటి మా సైన్సు మేస్టారు కందర్ప సత్యనారాయణగారు రాజమండ్రిలో నా అడ్రసు సంపాదించి హైదరాబాదులో మా ఇంటిని వెదుక్కుంటూ వచ్చారు; మా యోగక్షేమాలు అడిగి సంతోషంగా వెళ్ళారు. వారి ఆప్యాయత నా హృదయాన్ని కదిలించింది; కళ్ళు చెమ్మగిలేటట్లు చేసింది!

భమిడిపాటి కామేశ్వరరావుగారిని గురించి నేను మొట్టమొదట విన్నది మా అన్నయ్య దగ్గర. ఆయన గొప్ప రచయిత అనీ, నవ్వు పుట్టించే నాటికలూ వ్యాసాలూ కథలూ చాలా రాశారనీ సభలో ఆయన మాట్లాడేటప్పుడు విన్నవాళ్ళు విరగబడి నవ్వుతారు కాని ఆయన మాత్రం నవ్వేవారు కారనీ చెప్పాడు. ఆ చిన్నవయస్సులో, ఆయన ఎంత గొప్పరచయితో తెలుసుకొనే తెలివి నాకులేదు. కాని, మా అన్నయ్య చెప్పినదానికి దృష్టాంతం , ఆ తరవాత దాదాపు పాతిక ఏళ్ళకు, 'భారతి' మాసపత్రిక పాత సంచిక ఒకటి చదివినప్పుడు కనిపించింది. 1943 డిసెంబరు సంచికలో 'కలగూరగంప' విభాగంలో, 'భమిడిపాటి కామేశ్వరరావుగారు' అన్న శీర్షికతో కొడవటిగంటి కుటుంబరావుగారు రాసింది కనిపించింది. అందులో ఈ కింది వాక్యాలు ఉన్నాయి:

> **"నా సొంత జవాబుదారీమీద శ్రీకామేశ్వరావుగారు ఈనాటి ఉత్తమోత్తమ రచయిత అంటున్నాను. గురజాడ అప్పారావుగారి తరవాత గాని, కామేశ్వరరావుగారి తరవాతగాని ఇంతవరకూ కామేశ్వరరావుగారి స్థానంతో పోటీ చెయ్యగలవాడు లేదు."**

**(పుట 615)**

కామేశ్వరరావు మేస్టారి పేరుమీద ప్రచారంలో ఉన్న రెండు ఛలోక్తులు కూడా మా అన్నయ్య చెప్పాడు. ఒకసారి బడికి ఒక తనిఖీ అధికారి వచ్చాడు. మేస్టారు పాఠం చెబుతున్న తరగతికి అతడు రీవిగా వచ్చి విద్యార్థులను కొన్ని ప్రశ్నలువేశాడు. విద్యార్థులు సరిగా సమాధానాలు చెప్పలేదు. అప్పుడు మేస్టారు కలగజేసుకొని తామే ప్రశ్నలు వేశారు. వాటికి విద్యార్థులు టకీమని సమాధానాలు చెప్పారు. "చూశారా, మావాళ్ళు ఎంత తెలివయినవాళ్ళో!" అన్నారట మేస్టారు. "మీరు వేసినవి లీడింగ్ క్వెశ్చన్సండీ!" అన్నాడట తనిఖీ అధికారి. 'లీడింగ్ క్వెశ్చన్' అంటే జవాబు స్ఫురింపజేసేటట్లు వేసే ప్రశ్న (రామరావణయుద్ధం ఎవరెవరికి జరిగింది?–లాంటిది). "మరి నా ప్రశ్నలకు జవాబులు ఎందుకురాలేదు?" అని కూడా అన్నాడు. "అవి మిస్‌లీడింగ్ క్వెశ్చన్స్

కావచ్చు!'' అన్నారట మేస్టారు (మిస్‌లీడింగ్ క్వెశ్చన్ అంటే తప్పుదారిపట్టించే ప్రశ్న/తప్పుడు ప్రశ్న అని అర్థం). ఆ ఛలోక్తికి తనిఖీ అధికారి నవ్వకుండా ఉండలేకపోయాడు.

మరొక సందర్భంలో ఒక పెంకె విద్యార్థి, మేస్టారు చెప్పిన పాఠం తనకు అర్థంకాలేదనీ మళ్ళీ చెప్పమనీ అడిగాడట, క్లాసులో. "అల్లాగటోయ్! ఒక పాఠం ఒకసారి చెప్పడానికే స్కూలువాళ్ళు నాకు జీతం ఇస్తున్నారు. రెండోసారి చెబితే ఎవరిస్తారు మరి?" అని అడిగారట. ఆ అబ్బాయి వెర్రిమొహం వేసేసరికి ఆయన జాలిపడి, క్లాసులయిపోయాక "నా దగ్గరికి రా! లేకపోతే మా ఇంటికి రా!" అన్నారట.

కపిలేశ్వరపురం జమీందారు బుచ్చి సర్వారాయుడుగారు ఒకసారి కామేశ్వరరావు గారిని రమ్మని కబురుపెట్టారు. మా మనమడికి లెక్కలు సరిగా రావడం లేదట. మీరు ప్రయివేట్ ట్యూషను చెప్పండి మేస్టారూ! జీతం ఎంతకావాలో తీసుకోండి," అన్నారట.

"మీ మనమడికి లెక్కలు సరిగా రావడంలేదంటే నేను స్కూల్లో పాఠాలు సరిగా చెప్పడం లేదన్నమాట. ట్యూషన్ చెప్పడానికి నాకు అభ్యంతరం లేదు. కాని నేను చెప్పినా అతనికి లెక్కలు సరిగా రాకపోతే మళ్ళీ మాట వస్తుంది. కనక, జీతంగ్రటా వద్దు. రేపట్నించి రమ్మనండి, మా ఇంటికి," అన్నారడ కామేశ్వరరావుగారు. ఆ జమీందారు మనమడు ఎవరనుకున్నారు? ఉత్తరోత్తరా, ఉమ్మడి మద్రాసు రాష్ట్రప్రభుత్వంలోను, దరిమిలా ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర, కేంద్రప్రభుత్వాల్లోను మంత్రిపదవుల్లో ఉన్న ఎస్.బి.పి. పట్టాభిరామారావుగారు.

అరుగో, ఆ కామేశ్వరరావు మేస్టారే మాకు ఐదోఫారంలో, ఇంగ్లీషు-తెలుగు అనువాద తరగతులకు వచ్చేవారు. ఒక ఇంగ్లీషు వాక్యంలో 'అండ్' అనేమాట ఉన్నపుడు దాన్ని 'మరియు' అని మక్కికి మక్కిగా అనువదించడం సహజం. ఒక పుస్తకం తీసి అనువాద వాక్యాన్ని ఆయన క్లాసులో పైకి చదివారు. ఎందుకో అర్థం కాలేదు. "నేను పెసరట్టు మరియు ఉప్మా తింటిని. రాముడు మరియు రంగడు సినిమాకి వెళ్ళిరి. సీత మరియు రాధ పేరంటమునకు వెళ్ళిరి" అంటూ వరసగా మూడు నాలుగు వాక్యాలు ఆయన అనేసరికి మేమందరం గొల్లున నవ్వాం. ముందు వరస బల్లమీద కూర్చున్నవాణ్ణి నేను గట్టిగానే నవ్వాను. "నవ్వుతారేం?" అన్నారు మేస్టారు. "మరియు అంటే బాగోదండి," అన్నాం, ఒకేగొంతుతో. అప్పుడాయన ముసిముసి నవ్వులు నవ్వి, "నంబర్‌సెవెన్" అన్నారు. అప్పుడు వెర్రిమొహం వేసుకొని నిలబడ్డ వాడెవడు? భవదీయుడు! తిట్టకుండా కొట్టకుండా-మా తప్పుమాకు తెలిసేటట్లు చేయడం మా మేస్టారిపద్ధతి, అందుకే ఆయన మాటంటే మాకు గురి. ఒకసారి ఒక చిత్రం జరిగింది. మేస్టారు క్లాసులో పాఠం చెబుతున్నారు. ఒక కుక్క గదిలోకి వచ్చి, పిల్లలబల్లలకూ మేస్టారి కుర్చీకీ మధ్యకు వచ్చి కూర్చుంది. "వీళ్ళు చదువుకునేపిల్లలు. నువ్వెందుకే ఇక్కడ?" అన్నారు మేస్టారు. అది వెంటనే లేచి వెళ్ళిపోయింది!

ఎస్.ఎస్.ఎల్.సి. తరగతి (ఆరోఫారం)లో మేస్టారు మాకు ఇంగ్లీషు, గణితం చెప్పేవారు. తొమ్మిదో ఏటిదాకా స్కూలు మొహంఎరగని నాబోటివాళ్ళకు ఆ రెండూ భయంకరంగా కనిపించడంలో వింతలేదు. వాటి భయం పోగొట్టినవారు కామేశ్వరరావుగారే. సాధారణంగా ఇంగ్లీషులో సంశ్లిష్ట వాక్యాలు, సంయుక్తవాక్యాలు రాసేటప్పుడు పిల్లలకు తప్పులు ఎక్కువగా వస్తూంటాయి. కనక, చాలావరకు సరళవాక్యాలు రాయమని ఆయన మాకిచ్చిన సలహా చాలా ఉపకారం చేసింది. క్రియల కాంజుగేషన్ తెలిస్తేచాలు, సరళవాక్యాలతో ఎంతయినా రాయగలమన్న ధైర్యం వచ్చింది. ఇక, గణితవిషయంలో, ఆయన చెప్పిన విధంగా స్టెప్పులు వేస్తే మూడో స్టెప్పులో-తప్పితే నాలుగో స్టెప్పులో-సమాధానం వచ్చితీరవలసిందే.

1950-51 ఎస్.ఎస్.ఎల్.సి. తరగతి ఇంగ్లీషు పాఠ్యపుస్తకం చాలా గొప్పగా ఉండేది. టాల్‌స్టాయ్, ఛార్లెస్ డికెన్స్, సరోజినినాయుడు వంటివాళ్ళ రచనలు పాఠ్యభాగాలుగా ఉండేవి. టాల్‌స్టాయ్ కథ-'గాడ్‌సీస్ ద ట్రూత్, బట్ వెయిట్స్' అన్నది ఒక పాఠం. ఒకనాటి రాత్రి ఇద్దరు పడుచు వర్తకులు ఒకచోట బసచేసి ఉండగా ఒక దొంగ, ఒక వర్తకుణ్ణి కత్తితో పొడిచి చంపి, పొడిచిన కత్తిని రెండో వర్తకుడి తలగడకింద పెట్టి, డబ్బు సంచులు తీసుకొని పారిపోయాడు. రెండో వర్తకుడికి యావజ్జీవకారాగార శిక్షపడింది. ఎనభైఏళ్ళుదాటి పండు ముసలివాడు అయేవరకు అతనిబతుకు చెరసాలలోనే గడించింది.

వేరొకకేసులో పోలీసులకు పట్టుబడి అదే చెరసాలలో శిక్షను అనుభవించడానికి వచ్చిన ఆ హంతకుడు (వర్తకుడికి యావజ్జీవ శిక్ష పడటానికి కారకుడయినవాడు) అతని కాళ్ళమీద పడి తనను క్షమించమని కోరినప్పుడు వాళ్ళిద్దరిమధ్యా జరిగిన సంభాషణలను చదువుతూ తెలుగులో చెబుతూ ఉంటే మేస్టారి గొంతుకలోంచి మాటలు ఆగి ఆగి రావడం, ఆయన కళ్ళలో నీళ్ళు తిరగడం నాకు ఇప్పటికీ గుర్తు. అలా అనుభూతి పొంది పాఠంచెప్పే ఉపాధ్యాయులు ఎందరికి ఉంటారు? ఆ అదృష్టం మాకు కలిగింది.

1948-51 మధ్యకాలంలో దాదాపు ప్రతిరోజూ సాయంకాలం, 'శ్రీరామ బాలభక్త సమాజం'వారి గ్రంథాలయానికి వెళ్ళి పుస్తకాలు చదువుతూండేవాణ్ణి. అప్పట్లో మా మేస్టారి పుస్తకాలు చాలా చదివాను-నాకు దొరికినంతవరకు. ఆయన రూపం, ఆయన మాటలు, ఆయన రచనలు ఆయనమీద ఆరాధనభావం కలిగించేవి, అప్పటి విద్యార్థులకు. అది శాశ్వతంగా నిలిచిపోయేది.

కామేశ్వరరావుగారి రచనావ్యాసంగం వాక్చమత్కృతుల సేకరణతో, సంకలనం చేయడంతో మొదలయింది (కాలక్షేపం, 1,2 భాగాలు). ఆ తరవాత, 1923 ప్రాంతంలో, కళాశాల విద్యార్థులకోరిక మేరకు, వాళ్ళు రంగస్థలంమీద ప్రదర్శించడానికి అనువయిన వినోదాత్మక నాటికలు రాయడానికి పూనుకోడం జరిగింది. ప్రసిద్ధ పాశ్చాత్య రచయితల నాటికలలోని వస్తువులను, సంభాషణ చాతుర్యాలను గమనించి తెలుగులో

చిన్న చిన్న నాటికలు రాస్తూ వచ్చారు. అవి అనువాదాలు కావు; అనుసరణలు, తెలిగింపులు. పాత్రలు, పాత్రలపేర్లు, సంభాషణరీతులు తెలుగుతనం ఉట్టిపడేవే.

మోలియర్ అనే ఫ్రెంచి రచయితను అనుసరించి కామేశ్వరరావుగారు రాసినవి, 'మాయల మాలోకం' (ఆరు రంగాలు), 'పెళ్ళి కంట్రోలు' (నాలుగు రంగాలు), 'నామాటే నెగ్గింది' (తొమ్మిదిరంగాలు), 'ఏవళ్ళ గొడవ వాళ్ళది' (మూడు రంగాలు), 'రెండురెళ్ళు నాలుగు' (మూడు రంగాలు). రిచర్డ్ బ్రిన్‌స్లీ షెరిడన్ (1751-1816) రచించిన 'రైవల్స్' ఆధారంగా ఆయన, 'ప్రణయరంగం' (ఏడురంగాలు), 'డ్యూయెన్నా' ఆధారంగా 'ఈడూ జోడూ' (ఆరు రంగాలు) రచించారు. ఆలివర్ గోల్డ్‌స్మిత్ (1730-74) రచన 'షి స్టూప్స్ టు కాంకర్' ఆధారంగా 'వినయప్రభ' (ఏడు రంగాలు) రాశారు.

కేవలం పాశ్చాత్య రూపకాలనే కాక, అనేక సంస్కృత రూపకాలను కూడా ఆయన, తెలుగుతనం ఉట్టిపడేలా ప్రదర్శనయోగ్యాలు చేయడం ఒక విశిష్టత. విశాఖదత్తుని ముద్రారాక్షస నాటకాన్ని 'రాక్షసగ్రహణం' (ఏడురంగాలు) పేరుతో తెలిగించారు. శూద్రకమహారాజు 'మృచ్ఛకటిక' నాటకాన్ని 'వసంతసేన' (తొమ్మిదిరంగాలు) పేరుతో రచించారు. క్రీస్తుపూర్వం 350 సం|| ప్రాంతపువాడయిన భాసమహాకవి గొప్పనాటకకర్త. ఆయన రచించిన రూపకాలు 13 లభ్యమయాయి. వాటిలో 'చారుదత్తం' అసంపూర్ణంగా ఉంది. తక్కిన పన్నెండింటినీ ప్రదర్శన యోగ్యంగా తెలుగులో రచించినవారు కామేశ్వరరావుగారు. వీటిలో, మధ్యముడు' అనే సంపుటంలో ఐదు, 'బాలకేసరి' సంపుటంలో మూడు, 'ప్రతిమ' అనే సంపుటంలో రెండు, 'స్వప్నం'లో రెండు చొప్పున 12 రూపకాలు తెలుగులో కూర్చి ప్రచురించారు.

హాస్యానికి ఆయువుపట్లు భమిడిపాటివారికి బాగా తెలుసు. ఒక్కొక్క నాటికలో వింత వింత పాత్రలను ప్రవేశపెట్టి వాళ్ళ సంభాషణల్లో హాస్యం గుప్పించారు. 'బాగు బాగు'లో బాగయ్య; 'పెళ్ళి ట్రెయినింగ్'లో శానయ్య; 'చెప్పవేం'లో కోదండం; 'ప్రణయరంగం'లో సారథి, ఆకాశం, తలుపులు; 'ఈడూ జోడూ'లో తంపటి, మండోదరం, జలేశం; 'మాయల మాలోకం'లో మా లోకం, తలుపులు, కదంబం, గరటయ్య; 'నా మాటే నెగ్గింది'లో తలుపులు, మాలోకం; 'ఎవళ్ళ గొడవ వాళ్ళది'లో పాటయ్య, ఆటయ్య, మాటయ్య, మూటయ్య, మాలోకం; 'రెండు రెళ్ళు'లో శానయ్య, చంచలం, గరుడవాహనం విలక్షణంగా కనిపిస్తారు. హాస్యప్రధానమయిన పాత్రలకే కాక, ఇతర పాత్రలకు కూడా కొన్నిటికి ఈయన పెట్టిన పేర్లు తమాషాగా ఉంటాయి. 'వినయప్రభ'లో హృదయనాథం, లకుముకి, దుగ్గయ్య, కంతాలమ్మ, వినయప్రభ-; ఈడూ జోడూలో పరిధానం, జలేశం, నభోమణి, మండోదరం, కరాళం, కిశోరి, అమ్మతల్లి-; 'ప్రణయరంగం'లో పరాంకుశం, కుమారసేనం, వసంతం, ఆకాశం, జ్వాలారంగం, రాంభాణమ్మ, ఉళక్కి-; 'చెప్పలేం'లో వరహాలు, మిస్‌చకోరం-; 'నామాటే నెగ్గింది'లో శఠకోపం, అభిషేకం, నవనీతం, డాక్టరు సంతానం, డాక్టరు సముద్రం, సలిలం-; 'రెండురెళ్ళు'లో గరుడవాహనం, చంచలం, చంద్రవంక-; "ఏవళ్ళ గొడవవాళ్ళది'లో వనప్రియ, దవనం, మరువం-; 'మాయల మాలోకం'లో కదంబం, గరటయ్య, బాచి మొదలగునవి. ఇవి ఎంత చైతన్యవంతంగా ఉండే పాత్రలంటే నాటిక మొదలు నుంచి కొనవరకు మన దృష్టిని ఆకట్టుకుంటాయి.

రూపకకథను నడపవలసిన ఒడుపులు కామేశ్వరరావుగారికి చక్కగా తెలుసు. ఆయనకు స్వయంగా నటనానుభవం, దర్శకత్వానుభవం ఉన్నందువల్ల ఏది, ఎక్కడ, ఎంతవరకు నప్పుతుందో పసికట్టి చటుక్కున మలుపుతిప్పుతారు. వారి సంస్కృత రూపకానుసరణాలనుబట్టి అది తెలుసుకోవచ్చు. 'రాక్షస గ్రహణం'కాని, 'వసంతసేన'కాని, బాసనాటకాలు కాని చాదస్తంగా తెలిగించలేదు ఆయన. అనవసరమనిపించినవాటిని కత్తిరించేసి, కథ నడపడానికి అవసరమయినంత మట్టుకే వాడుకొని, అవి అసలు తెలుగులో పుట్టినవే అనిపించేటట్టు చేశారు.

కామేశ్వరరావుగారి తెలుగుపలుకుబడి సహజంగా ఆయన రచనలన్నిటిలోనూ కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. నాటిక మూలం ఎరగనివాళ్ళు అచ్చం అది ఆయన సొంత రచనే అనుకొనే అవకాశం ఉందంటే ఆయన రచనావిశిష్టత గోచరిస్తుంది. మూలకర్తలకు కూడా ఆయన న్యాయం చేశారు. ఏ రూపకానికి ఎవరిది, ఏ రచన మూలమో చెప్పకుండా ఉండలేదు. టాల్‌స్టాయ్ రచనలను తెలిగించడానికి భమిడిపాటివారు, రష్యావారి దౌత్యకార్యాలయం ద్వారా లిఖితానుమతి పొందారు. అంతేకాదు, తమరచనమీద తమకున్న హక్కును ఉల్లంఘించి ఒక సినిమాలో తమ డైలాగులను వాడుకొన్నందుకు ఆ సినిమా నిర్మాతమీద కోర్టు కేసుపెట్టారు. బ్రహ్మ చెవుడున్న గిడుగు వెంకటరామమూర్తిగారు ఆ కేసులో, కామేశ్వరరావుగారి తరఫు సాక్షి! ఆయనకు ఎంత చెవుడున్నా, ఆ సినిమాచూసి, పాత్రధారుల పెదవుల కదలికలను బట్టి, వాళ్ళు పలికినవి కామేశ్వరరావుగారి డైలాగులేనని తేల్చారు. చివరికి ఆ సినిమా నిర్మాత రాజీబేరానికి రావలసివచ్చింది. కామేశ్వరరావుగారి పట్టుదల సాధారణమయినది కాదు. కాపీరైట్లు ఉల్లంఘన కేసుల్లో ఆయనదే మొదటిదని అంటూంటారు.

మనుషుల్లో సాధారణంగా కనిపిస్తూండే కొన్ని బలహీనతలను కేటాయింపుగా చూసి, వాటితో పాత్రలను పుట్టించి, వాటికి నప్పే మాటలు మప్పి, సూటిగా చెప్పేస్తే చప్పచప్పగా ఉండే సంవాదాల్ని ఒకచోట విరిచి, మరోచోట అతికి, ఇంకోచోట చుట్టు తిప్పి, ముప్పుతిప్పలుపెట్టి, సాగదీసి తీసి, మరొకప్పుడు బాకులా సయ్యిన దూసినట్టూ ఇంకొకప్పుడు నేలకేసి కొట్టినట్టూ రకరకాల వస్తాదుల కుస్తీపట్లతో, మాటలను తూటాల్లా విడుస్తూ చెడుగుడు ఆడించారు. మాటలకు రంగూ రుచీ వాసనా దూకుడూ సత్తువా ఉంటాయని సర్‌వాల్టర్ రాలీయో మరొకరో అన్నారుకదా! కామేశ్వరరావుగారి నుడికారపురంగంలో అవన్నీ సర్కస్ ఫీట్లు చేసి చూపిస్తాయి.

'కాలక్షేపం' (రెండు భాగాలు) కింద ఆయన కూర్చిన ఛలోక్తుల సంగతి అలా ఉంచితే, యువతీయువకుల వినోదం కోసం కామేశ్వరరావుగారు ఎక్కువగా హాస్యప్రధానమయిన రూపకాలు, ప్రసంగవ్యాసాలు (రెండో భాష తెలుగుమేస్టరు, అద్దెకొంపలు మొ॥ వాటితో సహా) రచించినందువల్లా జయపురం రాజా విక్రమదేవవర్మచేత 'హాస్యబ్రహ్మ' బిరుదం పొందినందువల్లా భమిడిపాటి కామేశ్వరరావుగారి మీద 'హాస్య రచయిత' అన్న ముద్ర పడిపోయింది. పడితే పడింది-దానివల్ల నష్టమేంలేదు; లాభం కూడా ఉంది. కాని కొందరు, ఆయన అత్యంత పరిశోధనాత్మకంగాను గంభీరంగాను రాసిన 'త్యాగరాజు ఆత్మవిచారం, ఆంధ్రనాటకపద్యపఠనం' వంటి గ్రంథాలను పరిశీలించకుండా ఆయన విశిష్టతను తేలికచేసి మాట్లాడటం వింటూ ఉంటాం. ఇది నిజంగా, కామేశ్వరరావుగారిపట్ల మహాపచారం. దీన్ని మానుకోడం అవసరం.

త్యాగరాజు రచించిన కీర్తనల్లో ఆరువందలకుపైగా నిశితంగా పరిశీలించి కామేశ్వరరావుగారు, వాటిని తొమ్మిది భాగాలుగా విభజించి ఆ కీర్తనల ద్వారా వ్యక్తం కాగల త్యాగరాజు హృదయాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. అందుకే "ఆయన యశస్సునకీ గ్రంథము వైజయంతి" అన్నారు మధునాపంతులవారు.

తెలుగు నాటకాల్లో పద్యాలను రాగయుక్తంగా పాడటం నటులకు ఎప్పుడు అలవాటయిందో కాని సాధారణప్రేక్షకులకు అందులో ఒక వినోదం కనిపించింది. కాని, పద్యాన్ని రాగయుక్తంగా పాడటంవల్ల దానిలోని భావాన్ని సంగీతం మింగేస్తోందనీ నాటకం అసహజంగాను, రసాభాసంగాను తయారువుతోందనీ కామేశ్వరరావుగారు బాధపడ్డారు. భావం తెలిసేటట్లుగా పద్యం చెప్పాలే కాని రాగంతో భావాన్ని హతమార్చగూడదని ఆయన అభిప్రాయం. దీన్ని సోదాహరణంగా వివరించడానికే ఆయన, 'ఆంధ్రనాటకపద్యపఠనం' అన్న గ్రంథాన్ని రచించారు. బళ్ళారిరాఘవవంటి మహానటులు కొందరు, భమిడిపాటివారి అభిప్రాయాన్ని సమర్థించడమే కాక, తాము స్వయంగా దాన్ని పాటించారు కూడా.

ప్రసిద్ధ భాషాసాహిత్య సేవకులను గురించి, తదితర మహావ్యక్తులను గురించి ప్రశంసాత్మకంగా వివిధ సందర్భాలలో కామేశ్వరరావుగారు చేసిన ప్రసంగాల, రచనలకూర్పు 'చంద్రుడికి...' (ఒక నూలుపోగు). కాశీనాథుని నాగేశ్వరరావు, గిడుగు వెంకటరామమూర్తి, గురజాడ అప్పారావు వంటి ఒక్కొక్క మహనీయుని వ్యక్తిత్వాన్ని, కృషిని ఆయన అన్ని పార్శ్వాలలోను గమనిస్తూ వివరిస్తూ చేసిన ప్రసంగాల అద్భుతగ్రంథమిది.

ఇటువంటి పరిశోధనాత్మక/పరిశీలనాత్మక గ్రంథాల్లో కూడా భమిడిపాటివారి శైలి చాలా ప్రసన్నంగా చదివించేటట్లు ఉండటం పెద్ద విశేషం. ఆయనది స్వతహాగా హాస్యప్రవృత్తి కాబట్టి, ఇటువంటి గ్రంథాల్లో కూడా అక్కడక్కడ అది కనిపిస్తుంది; సందర్భాన్నిబట్టి.

మనిషిలో ఉన్న లోపాలను ఎత్తిచూపి ఎగతాళి చెయ్యడానికే హాస్యాన్ని ఆశ్రయిస్తాడు ఏ రచయిత అయినా. మాటవరసకు, కామేశ్వరరావుగారు తెలుగువాళ్ళను 'కచటతపలు' అన్నారు. దానిలోని వ్యంగ్యార్థాన్ని గమనిస్తే మనలో ఐకమత్యం లేదన్న సంగతి స్ఫురిస్తుంది. కచటతపలనే అక్షరాల్లో ప్రతిదీ తలకట్టుతో తల ఎగరేస్తూ దేనికదే విడిగా ఉంటుంది; ఒకదానితో ఒకటి కలవదు. అలాగే ప్రతి ఒక్క తెలుగువాడూ తనకు తాను గొప్పవాణ్ణని అనుకుంటూ తల ఎగరేస్తూ ఉంటాడు కాని మరొక తెలుగువాడితో కలవడు. అందుకనే మనం కచటతపలు అనిపించుకుంటున్నాం, ఇప్పటికీ.

మహాకవులూ విమర్శకులూ పత్రికాసంపాదకులూ భమిడిపాటి వారికి దగ్గరి స్నేహితులూ అయిన మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు కామేశ్వరరావుగారి హాస్యాన్ని గురించి ఇలా రాశారు:

"భమిడిపాటి కామేశ్వరరావుగారి ప్రతిరచనయు హాస్యరసప్రచురము. ఆయన రచన చేతిలోనున్న పాఠకుడు, ఏ యవస్థలోనున్నవాఁడైనను నవ్వును; చిఱునవ్వును; అంతలో పెద్దపెట్టున నవ్వును; మరల మందహాసమున కవతరించును; అంతలో అట్టహాసమున కధిరోహించును. ఇట్లు చేయగల సుగుణము, ఆయన వ్రాతలలోను, మాటలలోను, సరితూకముగనే యున్నది. కామేశ్వరరావుగారి కూర్పులో భావముతోపాటు భాషయును హాస్యరసోత్పాదకమగుట విశేషము. ప్రహసనకర్తలలోఁ బేరుమోసిన వీరేశలింగముపంతులు, చిలకమర్తి కవియు దీనిని సకృత్తుగాఁ బాటించినారు. "కన్యాశుల్క" కారునిలో స్పష్టకృత్తుగా నీ లక్షణమున్నది. 'భమిడిపాటి' వారికి 'గురుజాడ' వారి దారి యొరవడి కావచ్చును. కామేశ్వరరావుగారి రచన వినీవినఁగనే భాష మొదలు నవ్వించును; భావము పిదపకవ్వించును. వీరి భాషలో ఆ పాఠరమణీయ హాస్యము, భావములో విచారితరమణీయహాస్యము నుండెనని నేననుకొందును." (ఆంధ్రరచయితలు, 1950/1973,పుట 529)

"నా యుద్దేశమున 'భమిడిపాటి'వారి హాస్యములో ఉత్తానమైన వాచ్యతకంటె, ఉదాత్తమైన వ్యంగ్యమర్యాదపాలు హెచ్చుగా నుండుననియే." (అందులోనే, పుట 530)

ఈ సందర్భంలో, కామేశ్వరరావుగారి కుమారుడు రాధాకృష్ణగారు (నాటకరచయితగా, సినీరచయితగా, నవీన జ్యోతిషశాస్త్రవేత్తగా పేరు పొందినవారు) స్వయంగా చెప్పగా విన్నవారొకరు నాకు చెప్పిన సంఘటనలు (ప్రాక్టికల్ జోక్స్) రెండు గుర్తుకు వస్తున్నాయి. కామేశ్వరరావుగారు గణితశాస్త్రం బోధించే ఒక తరగతిలో రాధాకృష్ణ విద్యార్థి. పరీక్షలో వాళ్ళ నాన్నగారిచే లెక్కల పేపరు దొంగతనంగా కాపీ చేసుకురమ్మని కొందరు సహాధ్యాయులు అతన్ని ప్రోత్సహించారు. స్నేహితుల మాట కాదనలేకపోయాడు అతను. నాన్నగారు పడుకున్నాక, రాధాకృష్ణ మెల్లగా లేచి ఆ పరీక్షాపత్రాన్ని కాపీచేసి స్నేహితులకు అందజేశాడు. మర్నాడు పిల్లలందరూ సంతోషంగా ఉరుక్కుంటూ పరీక్షహాలులోకి వచ్చారు. తీరా చూస్తే, లెక్కల పేపరు రాధాకృష్ణ కాపీ చేసి ఇచ్చినది కాదు! తరవాత తెలిసింది ఏమిటంటే, లెక్కల పేపరుకు

## "మా మేస్టారు" శీర్షికకి మీ రచనలు పంపండి!

"మా మేస్టారు" శీర్షికను కొనసాగించడానికి మీ అందరి సహకారాన్ని అర్థిస్తున్నాం. సాహిత్య సంగీత నాట్యాది విద్యలలో యితర సబ్జెక్టలో మీకు పాఠాలు నేర్పిన మేస్టారి ప్రతిభని ప్రత్యేకతని వ్యక్తిత్వాన్ని సాహితీస్రవంతి పాఠకులతో షేర్ చేసుకోండి. వుద్యోగ బాధ్యతలు కొత్తగా తీసుకున్నప్పుడు-అకౌంటింగ్, మార్కెటింగ్ రంగాలలో మెళకువలు నేర్పిన వారు మేస్టర్లే. ఆకాశవాణి, టివి ఛానెల్స్‌లో తమ అనుభవాన్ని పంచినవారూ మేస్టర్లే. పత్రికారంగంలో అడుగుపెట్టిన వారికి భాషాపరంగా, పేజ్‌మేకప్, రకరకాల ఫాంట్స్ వాడకం, ప్రజంటేషన్‌లలో ఓనమాలు దిద్దించిన సీనియర్ జర్నలిస్టులు మేస్టర్లే కదా!

చెల్లపిళ్లవారి వద్ద విశ్వనాథ విద్య నేర్చారు. చెల్లపిళ్ల ఒకచోట "ఇతడు మా కంటెను పిండిగలవాడు" అని విశ్వనాథకి కితాబు యిచ్చారు. విశ్వనాథ తన గురువుపై పలు పద్యాలు, గద్యాలు రాశారు. "అలనన్నయకు లేదు తిక్కనకు లేదా భోగము...." అంటూ విశ్వనాథ చెల్లపిళ్లపై రాసిన సన్మాన పద్యం ఒక గొప్ప మెరుపుగా మెరిసింది. గొప్ప గురువుల వద్ద విద్యలు అభ్యసించి, వున్నతస్థాయికెదిగిన మీలాంటి శిష్యులు యీ శీర్షికలో పాల్గొనాలని కోరుతున్నాం. శిష్యునిగా మీ అనుభవాలని నెమరువేసుకుని మేస్టారికి "అక్షర దక్షిణ" సమర్పించండి. అందుకు సాహితీ స్రవంతి వేదికగా నిలుస్తుంది. దీనికి నిడివి నిబంధన లేదు.

**మీ రచన పంపాల్సిన చిరునామా :**

**సాహితీ స్రవంతి**
సి.పి. బ్రౌన్ అకాడమి, 53, నాగార్జున హిల్స్, పంజగుట్ట,
హైదరాబాద్ - 500 082, ఫోన్ : 040-23423188.
**ఇ-మెయిల్ : info@cpbrownacademy.org**

రాధాకృష్ణ నకలు రాసుకున్నాడని కామేశ్వరరావుగారికి అనుమానం వచ్చింది. మర్నాడు పొద్దున్నే ఆయన స్కూలుకు వెళ్ళి లెక్కల పేపరు మార్చేసి పరీక్ష వేళకు పిల్లలకు అందజేసేసరికి అందరూ తెల్లబోయారు.

మరొక సంఘటన-మునిమాణిక్యం నరసింహారావుగారు ఏదో పనిమీద రాజమండ్రి వచ్చినప్పుడు భమిడిపాటి వారిని కలుసుకోడానికి వీరేశలింగం హైస్కూలుకు వచ్చారు. కాస్సేపు కూర్చుని కబుర్లు చెప్పాక, "జేబులో సిగరెట్లు అయిపోయాయి. కొనుక్కొని వస్తాను" అంటూ మునిమాణిక్యంవారు లేవబోయారు. "లేవకండి, నేను తెప్పిస్తాను!" అని ఆయన్ని కూర్చోపెట్టేశారు కామేశ్వరరావుగారు. "మా అబ్బాయి రాధాకృష్ణ, క్లాసులో ఉన్నాడు. నేను రమ్మన్నానని తీసుకురా!" అని ఒకరికి పురమాయించారు. రాధాకృష్ణ వచ్చాడు.

"ఒరేయ్, మునిమాణిక్యం నరసింహారావుగారు వచ్చార్రా! నీ సిగరెట్టు పెట్టీ అగ్గిపెట్టీ ఆయనకియ్యి!" అన్నారు కామేశ్వరరావు. బిక్కచచ్చిపోయాడు కుర్రాడు. తను సిగరెట్లు కాలుస్తాడన్న సంగతి నాన్నగారికి తెలియదనే అనుకున్నాడు, అంతదాకా! గ్రంథస్థం కానివి, ఇలాటి సంఘటనలు ఇంకా ఎన్నున్నాయో మనకు తెలియదు.

ఇంతటి గొప్ప హాస్యప్రియులు, నిత్యజీవితంలో ఎంతో హాస్యాన్ని పండించినవారు, తమ రచనలద్వారా ఎందరికో పంచిపెట్టినవారు లోలోపల ఎంత విషాదాన్నీ వేదననూ దిగమింగుకున్నారో చాలామందికి తెలియదు.

ఆకివీడులో భమిడిపాటివారిది అసలే పెద్దకుటుంబం; దానికి తోడు పేదరికం. స్కూలు చదువు చెప్పించడానికే తండ్రి నరసావధానులుగారికి స్తోమత లేదు. దాచిపెట్టుకున్న రెండు మూడు రూపాయల చిల్లర డబ్బులిచ్చి వాటితో చదువుపూర్తి చేసుకోమన్నారు-వేదం నేర్చుకొనేవాళ్ళకు ఆ మాత్రం ఖర్చుకూడా ఉండదు కదా! అప్పుడు కామేశ్వరరావుగారు ఎన్నో తంటాలు పడి ఎవరెవరి దగ్గరో ధనసహాయం పొంది స్కాలర్‌షిప్పులు సంపాదించి ఎఫ్.ఎ.చదువు పూర్తి చేశారు. బి.ఎ. కూడా చదవాలనిపించింది. ఒక దగ్గరి చుట్టం దగ్గర అప్పుచేసి బి.ఎ. చదువుముగించారు. ఒక స్నేహితుడి సలహాప్రకారం, దరఖాస్తు చేసి మద్రాసులో అకౌంటెంట్ జనరల్ ఆఫీసులో ఉద్యోగం సంపాదించారు. ఉద్యోగంలో చేరిన కొన్నాళ్ళకే దాన్ని వదిలేసి ఇంటికి వచ్చేశారు. కారణమేమిటంటే, బి.ఎ. చదువుకోసం అప్పిచ్చినాయన అతను దూరంగా మద్రాసులో ఉంటే తన అప్పు వసూలు కాదని, వెంటనే దావాచేస్తానని నరసావధానులుగారిని బెదిరించాడట. ఆ సంగతి తెలియగానే కామేశ్వరరావుగారు మద్రాసు ఉద్యోగం వదిలేసి రాజమండ్రిలో ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించారు. వీరేశలింగం హైస్కూలుకు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగవిరమణచేశారు. అప్పటిదాకా స్కూలుకు దగ్గరిలో ఇన్నీసుపేటలో ఉంటూ వచ్చి ఉద్యోగవిరమణ తరవాత దానవాయిపేటలో పార్కుదగ్గర ఒక ఇల్లు కొనుక్కున్నారు. కేన్సరువ్యాధి ముదిరిన తరవాత కొంతకాలం విశాఖపట్నంలో వైద్యం చేయించుకుంటూ 1958లో కన్నుమూశారు.

"నవ్వు అంటే ఏమిటి-అనే ప్రశ్న వస్తే "ఇహ్హి" అని ఒఖ్ఖ నవ్వు దాఖలు చేసుకోడం తెలికగాని నిర్వచించడం నవ్వులాట కాదు," అన్నారు భమిడిపాటి కామేశ్వరరావుగారు, ఒకచోట. ఇప్పుడు, ఆయన సంపూర్ణ వ్యక్తిత్వాన్నీ వైశిష్ట్యాన్నీ రూపుగట్టించమంటే, ఆయనవల్ల స్ఫూర్తిపొందిన నాబోటి సాహిత్యాభిమానులు, రచయితలు, నటులు, భాషాప్రియులు, శాస్త్రసాంకేతికాదిరంగాల్లో వర్ధిల్లుతూ వచ్చిన ఇతర శిష్యులు-ఎవరయినా చేయగలిగింది, ఆయనను తలచుకొని తలవంచి నమస్కరించడం ఒక్కటే! ●

**చిరునామా : నెం. 1-100 (గంగా హాస్పిటల్ దగ్గర), చైతన్యపురి కాలనీ, హైదరాబాద్ - 500 060. ఫోన్ నెం. 24146205**

❖ అలనాటి కవిత

# చెల్లీ

❖ తుమ్మల వెంకట్రామయ్య

చెల్లీ కన్నీరదేల!
తల్లీ గద్గదమదేల!

నీ మధుర ప్రేమ పాత్రలో నీచులు విసమోసినార!
నీ హృది విపంచితీగ నిలువున తెగగొట్టినార?
చిగురించిన భవదాశాలత చిందర వందరయై పోయెన?
కుసుమించిన నీ హృదయంలో కురిపించిరె నిప్పుల కుప్పలు?
హసియించిన నీ అధరమునే వరియించెనె విషాదరేఖ?

చెల్లీ ! నీ నెచ్చెలి నా మిత్రుడు
నీ హృదయాధి నాథు గుండె
నెత్తురొలికిన భువిపై తల్లీ!
పెరిగి పోయెనొ నీగళ సుమదామం?
చెల్లీ రాలిపోయెనొ నీ నొసటి కుంకుమ?

నీ నెచ్చెలి గుండెనుండి దూసుకున్న తుపాకి గుండ్ల
కఠిన కర్కశ విలయ ధ్వనిలో
నీ గాజుల మంజుల రావం, నీ కంకణ నిక్వాణం
నీ నవ్వుల చిరునువ్వులు వినరావో ఇక తల్లీ?
వినబడవో ఇక చెల్లీ?

వగ పేటికి చెల్లీ!
పగ బూనుము!
కలకాలం ఈ రాక్షస కలికాలం నిల్వబోదు
కలకాలం ఈ దానవ పరిపాలన సాగబోదు
ప్రేయసి ప్రియు వియోగ బాధ, కన్నతల్లి కడుపుకోత
పసిగందుల దిక్కులేమి కల్పించిన రాకాసులు

మానవ మారణ హోమానికి చేసే దారుణ రణ సన్నాహం
ఫలియించదు! ఫలియించదు!
నీ రోషకషాయిత నేత్రం కురిపించిన అగ్నిధార
ఆ నీచులు, ఆ పాపులు హతమౌదురు.
వగపేటికి చెల్లీ
పగ బూనుము!

నను వెచ్చని గుండె నెత్తురడుగడుగున అర్పించిన
నీ నాథుని, నా యోధుని నిస్వార్థపు త్యాగశక్తి
నిరర్థకం కాదు తల్లీ!
ఈ శోకపు తెర వీడిపోయి, ఈ లోకపు వ్యథ తీరిపోయి
నవలోకం ప్రభవించునులే
దానవలోకం సమయునులే
మానవలోకం వెలయునులే,
వగపేటికి తల్లీ
పగ బూనుము!

నీ పగ తీరునులే చెల్లీ! నీ వగ తీరునులే తల్లీ!
నవలోకం ప్రభవించునులే, నవజీవనం కుసుమించునులే
వగపేటికి చెల్లీ
పగ బూనుము!

(కల్పన-కవితా సంపుటి 1935)

* * *

❖ కొత్త కవిత

# స్థిత ప్రజ్ఞత వైపుకు

❖ మహమ్మద్ ఖాన్

స్తబ్దతను తరిమి
నిబద్ధతగా
స్థిత ప్రజ్ఞాత వైపు, ఇతిమిద్ధముగా
నా ప్రయాణం, సాగిపోతూ ఉంటుంది!

విచక్షణతో
విజ్ఞతను పెంచే దశలో
నా ప్రాపంచిక ప్రయాణం
విలక్షణ రీతిలో సలక్షణముగా
జీవన స్ఫూర్తితో, చైతన్య దశగా విజృంభిస్తూ ఉంది!

ఇన్నేళ్ళూ, నాకునేను దూరమై
ఊహకందని, ఉజ్వల జగత్తును
అజ్ఞానంగా, దూరం చేసుకున్నాను !
ఇప్పుడు, నాకు
చినుకు మార్గదర్శకమై
నను, ఎన్నెన్నో జల రూపాలను పరిచయం జేసింది
తుదకు, సముద్రాన్ని కలిసే మార్గములో
త్రివేణి సంగమము వద్ద సాగుతూ, నది రూపమెత్తి
సాగరం వైపుకు ప్రవహిస్తున్నాను !
హృదయాన్ని తట్టి
స్పందింపజేసే సాహిత్యం కోసం
నా ఈ వెంపర్లాటంత !
రెప్పవాలుతున్న
జ్ఞాన నేత్రాన్ని సాహిత్య దర్శనముతో
వినూత్న ప్రపంచాన్ని సొంతం చేసుకునే
చిత్రమైన ఆరాటం, నా సొంతం !
సాహిత్యం నా జ్ఞాన నేత్రం
కవిత్వం, నా ఆరోప్రాణం ఈ జీవనవేగంలో
మనసును పద విన్యాసములలో సొంతాన పర్చేదీ, సాహిత్యం !

* * *

చిరునామా : 11-161, గన్నవరం-521101. సెల్ నెం. 9440137475

# విశ్వనాథ సంగీత సాధన...

❖ జి.కృష్ణ

**అరవై ఏళ్ళు వచ్చిన తర్వాత చదువుకోవచ్చునా–మన పెద్దలు నవ్వుతారు కదూ! "చదువుకోనా! నోట మట్టి కొట్టుకోనా! అని పెద్దల మాట. కానీ, విశ్వనాథ సత్యనారాయణ డెబ్బయ్ ఏళ్ళు దాటిన తర్వాత సంగీతం నేర్చుకొననారంభించారు. ధర్మపురి రామమూర్తి రోజూ వెళ్ళి పాఠం చెప్పేవాడు. నిజం చెప్పాలంటే, సత్యనారాయణ కొంత నేర్పాడు కూడా! దాదాపు నాలుగేళ్ళు నేర్చాడు.**

ఒకనాడు నాకు కూడా సత్యనారాయణ తన సంగీత నైపుణిని చూపెట్టారు. చక్కగా రాగవరసన ఒక త్యాగరాజకృతి పాడాడు. కొంత స్వర ప్రస్తారం కూడా చేశాడు. ఇక కావ్యగానం మానివేసి, స్వయంగా కృతులో, కీర్తనలో వ్రాసి, వాటిని గానం చేస్తూ ఉంటాడనుకున్నాను. దేనికదేనన్నాడు.

ఈ పట్టుదలే ఆయనను కవిగా, రచయితగా పైకి తెచ్చింది! ఆయన రచనల కంటే ఈ పట్టుదల చాలా ముచ్చటయినది.

మరొక విశేషం–ఆయన ఎంతగా మన బూజువట్టిన రాచమర్యాదలకు కట్టుపడిన వాడైనా, వ్యావహారిక జీవనంలో సంప్రదాయ భగ్నం యధేచ్ఛగా చేసి, నెగ్గుకు వచ్చేవాడు. ఆయన నవలలు చదివితే ఈ విశేషం బయటపడుతుంది.

ఆయన స్నేహితులలో అన్ని కులాల వాళ్ళూ, అన్ని శాఖల వాళ్ళూ ఉన్నారు. నిజంగా అట్లాంటి స్నేహితులు దొరకటం అదృష్టం. వారిలో కొందరిని ఎరుగుదును. అట్లాగే ఆయనకు ఇష్టంలేని మనుషులలో ఆయన "కుల శాఖ"ల వాళ్ళూ ఉన్నారు.

ఆయన నవలల్లో, వీళ్ళందరూ రకరకాల పేర్లు పెట్టుకుని సాక్షాత్కరిస్తూ ఉంటారు. వాళ్ళందరినీ పేరు పేరునా మనం గుర్తించకపోయినా, వాళ్ళు మాత్రం గుర్తించుకోగలరు. ఇదంతా చూస్తే ఆయనకు ఏవేవో వ్యక్తిగతమైన పట్టుదలలు తప్ప, గట్టిగా "కుల, శాఖా" భేదాలు లేవనిపిస్తుంది. కొంచెం ఉండి ఉంటుంది. వేయి పడగలలో "ధర్మారావు" పాత్ర తనేనని ఆయన భావం కాబోలు! ఆయన స్నేహితులందరినీ గుర్తించిన తర్వాత ఇక ధర్మారావు అంటే ఆయనేననాల్సిందే. పోనీండి! తను ఇట్లా ఉండాలని అనుకున్నాడా!

ధర్మారావు టిఫిన్ క్యారియర్‌తో హోటల్ నుంచి ఒక బ్రాహ్మణునిచేత భోజనం తెప్పించుకుని, పట్టుబట్ట కట్టుకుని తింటాడు.

అదీ ఆయన ఆచారం! అయి ఉండాలి!

అప్పటి ఆచారాలు చాలా వింతగా ఉండేవి పెద్ద కమ్మవారి ఇళ్ళల్లో (ముఖ్యంగా జమీందార్లు) వంట బ్రాహ్మణులు, నీళ్ళ బ్రాహ్మణులు ఉండేవాళ్ళు. బ్రాహ్మణులు భోజనం చేయటానికి వీలుగా ఇట్లా చేసేవాళ్ళు. వాళ్ళు మాంసాహారం తినదల్చుకుంటే, వేరేవాళ్లు వండి పంపించేవాళ్ళు. పైగా వంట బ్రాహ్మణులు వంటచేసే చోటుకు రాజావారు కూడా వెళ్ళడు–రాణీగారు వెళ్ళవచ్చు! భోజనాల వద్ద –రాజావారు ఒకవైపున, బ్రాహ్మణులు ఒకవైపున కూర్చునేవాళ్ళు. కానీ పెద్ద పెద్ద సమారాధనలు జరిగేటప్పుడు, రాజావారు పట్టుబట్టలు ధరించి, నేయి వడ్డించేవాడు–రాజావారే. వెండి బుట్టలో తీపి పదార్థాలు (శోభస్కరాలు) పెట్టుకుని, తానే వడ్డించటం ముక్త్యాలలో చూశాను. ముక్త్యాల రాజావారు. విశ్వనాథకు ఆప్తుడు. విశ్వనాథ షష్టిపూర్తి ఉత్సవం నాడు, అధ్యక్షుడు పింగళి లక్ష్మీకాంతం, ముక్త్యాల రాజావారు, దోవ వెంట పూలు చల్లుకుంటూ, విశ్వనాథుని సభాస్థలికి తోడ్తెచ్చారు.

తనకు అన్నగారు అంటూ లక్ష్మీకాంతంకు విశ్వనాథ పాదాభివందనం చేసేవాడు.

వేయి పడగలలో రాఘవరావు అనే పాత్ర కానవస్తుంది. అతడు కొల్లివర సూరయ్య! విశ్వనాథకూ, అతడి జంటకవి కొడాలి ఆంజనేయులుకూ సహాధ్యాయి. సూరయ్య గారి తండ్రి పంపే డబ్బుతో ముగ్గురూ చదువుకున్నారంటారు. విశ్వనాథ విద్యార్థి జీవితం, అధ్యాపక జీవితం చాలాగొప్ప విశేషాలతో కూడినది.

ఒకప్పుడు విశ్వనాథ తన అభిమానులతో కలిసి, బందరు వద్ద మంగినపూడి తీరానికి వెళ్ళాడు...వచ్చే తుపాను చూడటానికి! సముద్రం కల్లోలంగా ఉంది. "కడలిలోనూ నౌక కరడు లేచినది" అనే గేయం ఆశువుగా చెప్పాడు. ఆపైన "మనసు గుర్రమురోరి మనిషి!" గేయం చెప్పాడు. అభిమానులలో ఉన్న వడ్లపట్ల దుర్గాప్రసాదరావు అది విని బుద్ధిలో ధరించాడు. విశ్వనాథ మరిచేపోయాడు! కొంతకాలం తర్వాత "చెలియలి కట్ట" వ్రాస్తూ, ఈ గేయాలు వాడుకోవాలనుకున్నాడు. అప్పుడు ప్రసాదరావును పిల్చి, వాటిని పాడించుకున్నాడు!

ఈ ప్రసాదరావును బందరు హిందూ కాలేజీ వాళ్ళు, ఇతడు "నియ్యోగిరాయ్!" అని తెలుసుకుని ఫిజిక్స్ డిమాన్‌స్ట్రేటర్ పదవి నుంచి తొలగించారు! అది బందరుకూ, గుంటూరుకూ పోటీ.

సరి! ఆ పోటీలు నిజంగా ఎంతో హాస్యాస్పదమైనవి! ఆ పోటీలు వైదీకి, నియ్యోగి శాఖలకు సంబంధించినవి గదా. అటు తిరుపతి కవులు, ఇటు కొప్పరపు కవులు పట్టుకుని, కవిత్వాలు చెప్పేశారు! శాఖా భేదాలకు

చెలియలి కట్టలేకపోయింది! ఇటూ అటూ ఈ కోట్లాటకు నిర్వాహకులు ప్లీడరు గుమస్తాలు! మేథా సంపదకు కొదువలేదు!

ఆ తగాదాలను అయ్యదేవర కోటేశ్వరరావు గారు ఒక్కమాటలో వర్ణించాడు. 'ఇద్దరు జంటకవులూ, వాళ్ల అభిమానులూ కలిసి బ్రాహ్మణీకాన్ని మంటగలిపారు అని.

దారుణమైన ఒక విశేషం ఏమంటే వైదీకులు 'భాట్ట' మతం వారనీ, నియోగులు "ప్రభాకర" మతం వారనీ, ఒక గొప్ప రాద్ధాంతం ప్రారంభించారు. ఈ కొట్లాట నిర్వాహకులు! అంటే, వైదికులు 'రోం' మతం వారనీ, నియోగులు "అరేబియా" మతంవారనీ అన్నట్లు! భలే వాళ్ళులేండి! మనలో పలువురు పూర్వం వాళ్ళు గొప్పవాళ్ళు అనుకుంటూ ఉంటారు గదూ! ఇదీ మన పూర్వం వాళ్ళ గొప్పతనం.

ఇంతకూ విశ్వనాథ సత్యనారాయణ ఈ వైదికి నియోగి కోట్లాటలలో "పాత్రధారి" కాదు.

చెళ్ళపిళ్ళ శాస్త్రిగారి మాట ప్రకారం, వైదీకీ నియోగి కొట్లాటలు బ్రాహ్మణ, అబ్రాహ్మణ కొట్లాటలు అయ్యేవే! కొద్దిలో తప్పింది. తిరుపతిశాస్త్రి గారు తన ప్రియ శిష్యుడైన త్రిపురనేని రామస్వామిని పోటీలో పెట్టటానికి సంకల్పించాడు. రామస్వామి గారికి తెలుగు భాష వశంలో ఉంటుంది. కాని ఎందువలనో మతి మార్చుకుని, వేలూరి శివరామశాస్త్రి గారిని పోటీలో పెట్టాడు!

పట్టుదల ఉన్నవాళ్ళకు, వాళ్ళ పట్టుదలే కానీ, సంఘం ఏమైతే ఏం! నేను ఈ కొట్లాటలను దాదాపు యాభై ఏళ్ళ కిందటే తెలుసుకున్నాను. సంతానానికి ఒక్కటే హెచ్చరిక చేసి ఉంచాను. "జీవితంలో వైదీకులను, నియోగులను మాత్రం నమ్మవద్దు."

"ఈ కథనాన్ని కొంచెం దారి మళ్ళిస్తాను. విశ్వనాథ ఇంట్లో మల్లాది వసుంధర అనే అమ్మాయి ఉండేది. అమాయికతకు ఉండే గడుసుదనం ఉంది. చదువుకున్నది. తల్లి చిన్ననాడే చనిపోగా, ఆమె తండ్రి లక్ష్మీనారాయణ, ఆమెను విశ్వనాథ ఇంట్లో దించివేశాడు! ఆమె తన గ్రాంథిక శైలిలో నవలలు చాలా వ్రాసింది. ఆమె వ్రాసిన ఒక నవల ఆమెకు పాఠ్య గ్రంథమైంది. ఆమె వ్రాసిన ఇంకా రెండు నవలలు పాఠ్య గ్రంథాలైనాయి. ఇవన్నీ విశ్వనాథ ఆమెకు వ్రాసి పెట్టినాడనే అపప్రథ ఉంది కాని అవన్నీ ఆమె శైలిలో ఉన్నాయి. విశ్వనాథ శైలి కాదు; ఒక్క "తంజావూరు పతనంలో మాత్రం విశ్వనాథ దిద్దుబాటు చూసి ఉంటుంది. ఇంతకూ ఆమె పుస్తకాలపై వచ్చిన డబ్బును ఆమె పేరిటనే విశ్వనాథ బ్యాంకులో దాచి ఉంచాడు. విశ్వనాథ చనిపోయే నాటికి దాదాపు ఐదు లక్షలయింది ఆ డబ్బు.

విశ్వనాథ చనిపోగానే, ఆమె తన ఆప్తబంధువుల వద్దకు చేరుకుంది. ఆమెకు వడ్డీ వ్యాపారం ఇష్టం కాబోలు! తన డబ్బునంతా ఆప్తబంధువులకు వడ్డీకి ఇచ్చింది. అంతే డబ్బు మొత్తం పోయింది. ఆమె దాదాపు పేదదయింది! చివరికాలంలో ద్రౌపదిని గురించి కథ వ్రాసి పెట్టమని నటుడు జి.కృష్ణ ఆమెకు కొంత డబ్బు ఇచ్చాడు. ఇంకా ఇచ్చేవాడే. ఆమె సంస్కృత భారతం నుంచి ద్రౌపది కథను ఉద్ధరిస్తూ చనిపోయింది. అంత్యక్రియలకు డబ్బు కావాలి కదూ! ఆమె సంచీలో ఐదారు వేల డబ్బా కనపడింది! ఆమెను విశ్వనాథ పోతూ పోతూ ఎందువలన తీసుకెళ్ళలేదు?!!

ఆమెకూ నాకూ ఒక అనుబంధం ఉంది. నన్ను ఎంతో ఆప్యాయంగా "అన్నా" అని పిల్చేది. ఆమె ఇచ్చిన అప్పులు వసూలైతే కొంత డబ్బు ఇచ్చి, నాకు హైదరాబాద్‌లో ఇల్లు వాకిలి కల్పిస్తాననేది. నేను "డబ్బుతో బతకను" అనేవాడిని. "అదే పోలిక నాకూ వచ్చింది అన్నా! నేనూ డబ్బు లేకుండా బతకాల్సి వచ్చింది!" అనేది. కానీ నాకు డబ్బులేని జీవితం సహజం. అమెకో!

**(అప్పుడు-ఇప్పుడు పుస్తకం నుంచి)**

## కవిబ్రహ్మలు

బ్రహ్మసృష్టికంటె కవిబ్రహ్మసృష్టి విశిష్టమైనదా? విశిష్టమైనది కాకపోయినా, అది నిశ్చయంగా విఖ్యాతమైనదే !

మేనక ఎందరు పిల్లలను కనిందో, ఎందరిని పారవేసిందో, వారి పేరులైనా మనకు తెలియవు. కాని, శకుంతలకు శాశ్వతకీర్తి లభించడం కాళిదాసు చలవవల్లనే !

శకుంతల కనీసం ఒక అమ్మ కన్నబిడ్డ. కవిబ్రహ్మలైనవారు తల్లి గర్భం నుంచికాక, తమ మస్తిష్కంనుంచి పుట్టిన బిడ్డలకు సయితం శకుంతల పేరు ప్రతిష్టలకు సాటిరాగలవాటిని సంపాదించి పెడుతూ ఉంటారు.

కానన్ డాయిల్ మస్తిష్కంలోనుంచి పుట్టిన పత్తేదారు షెర్లాక్ హోమ్స్. కాని, నిజమైన ఏ పత్తేదారుకు అతనికున్న పేరు ప్రఖ్యాతులు లేవు.

లండన్‌లోని బేకర్ స్ట్రీట్‌లో షెర్లాక్ హోమ్స్ నివసిస్తూ ఉండేవాడని డాయిల్ వ్రాశాడు. అందువల్ల తీర్థయాత్రికులవలె అక్కడికి షెర్లాక్ హోమ్స్ భక్తులు రావడం ప్రారంభించారు. వారికి ఆశాభంగం కలిగించకుండా అక్కడ ఒక హోమ్స్ క్లబ్బును కొన్నేళ్ళక్రితం నెలకొల్పవలసి వచ్చింది.

లండన్‌లోని బేకర్ స్ట్రీట్‌లోనే కాదు, జనీవాకు దగ్గరగా మరొకచోట కూడా ఒక షెర్లాక్ హోమ్స్ స్మారకచిహ్నం వెలిసింది. దొంగ దూరిన కారణంగా అది నేడు వార్తకెక్కింది.

కడుపుకు ఇంత తిని ఆ దొంగ వెళ్ళిపోయాడుగాని, అంతకుమించి దేనినైనా దొంగిలిస్తే ఎంతో దూరం అతడు పారిపోకముందే, ఇతరులకు తోచని ఆరాలు ఇట్టే తీసి, అతడిని షెర్లాక్ హోమ్స్ పట్టివేసి ఉండేవాడే !

**(నార్ల – కదంబం–'చెణుకులు, చురకలు' నుంచి)**

## ❖ సమీక్షా స్రవంతి

# కవితావాటిక

– కీ.శే. బోడేపూడి వేంకటరావు

**నాకు తెలిసిన నాలుగు ముక్కలు**

కీ.శే.బోడేపూడి వేంకటరావుగారి కృతులు చదివాను. వారు మహాకవులు. 'ఆంధ్రతేజం' వీరు నేనేడాది శిశువుగా ఉన్నప్పుడు వ్రాశారు. దానికి తొలి పలుకులు వ్రాసిన విశ్వనాథ సత్యనారాయణగారిలా అన్నారు.

> **"వ్యక్తి హృదయ వ్యాపారము వివరించు కవి హృదయకవి. జాతియొక్క హృదయగత ధర్మస్వభావములు వివరించుకవి జాతీయకవి. ఇతడు సర్వోత్కృష్టుడని పెద్దల అభిప్రాయము వలన తెలియుచున్నది"**




వేంకటరావుగారు హృదయకవీ, జాతీయకవీ కూడా అనివారికృతులు చదివిన వారికి తెల్లమవుతుంది. 12,13 ఏళ్ల వయస్సు వరకు చదువుపై శ్రద్ధకనువరచనివీరిని తనంతతను దరిచేర్చుకొని ఉభయభాషలలోను గొప్పకవిగా తీర్చిదిద్దినది దేవాభక్తుని భద్రయ్యగారట. మేనమామ అయిన పాటిబండ్ల వీరయ్య కృపాఫలము చేతనే కవితా సంపద అబ్బిందట. వేంకటరావుగారి భార్య శ్రీకృష్ణమ్మ. ఆమె మరణం ఆయన్ను చలింపజేసింది. ''కృష్ణా'' అనేమకుటంతో ఒక శతకమే వ్రాసి ఆమెకేమకుటంపెట్టాడు, చాలా ఆర్ద్రత కనిపిస్తుంది కృష్ణశతకంలో. అంతేకాదు, దానిలోని ఒక పద్యంలో కావ్యసమీక్ష అంటే ఎలా ఉండాలో చెప్పారు. అది యిది.

**"గుణదోషంబులు నిర్ణయించుచు రసజ్ఞుల్‌మెచ్చుగాఁ బాత్రపో**
**షణరీతుల్, రసవైభవంబును సమీక్షల్ సేయు మార్గంబు స**
**ద్గుణ మాన్యంబగుఁగాక, యీ కవి మహాకావ్యాప్త బంధాసుధీ**
**చణుడన్నంత సమీక్ష ఎట్లగును? కృష్ణా! మన్మనోవల్లభా!"**

అన్నీ తప్పులే వ్రాసినా కావ్యానికి అభిప్రాయంవ్రాసే వారు "బ్రహ్మాండంగా ఉంది" అని పొగిడే నేటి సమీక్షకులకిది చంపపెట్టులాంటిది. ఈ పద్యం తిరుపతి వేంకటకవుల "ఇది శ్లాఘ్యం, బిద్ది శ్లాఘ్యబుకాదు విశేషంబిట, నిర్విశేషమిట, మాధుర్యంబిటన్ వహ్వారే కవిరాజా అని మెచ్చియిచ్చు నృపులొక్కండైన కర్వైనచో కవియై పుట్టుటకన్న పాపపరిపాకంబుండునే' అనే పద్యం గుర్తుకితెస్తుంది. వేంకటరావుగారి కావ్యాలకి పీఠికలు వ్రాసిన ఇద్దరూ దిగ్దంతుల్లాంటి వాళ్ళు కావడం గమనార్హం. (దివాకర్ల వేంకటవధాని, విశ్వనాథవారు.)

**ఆంధ్రతేజం :** వీరుడైనభర్త (రాజకుమారుడు) యుద్ధభూమినుండి యౌవనవతియైన భార్యని ఒకసారి చూచి మళ్లీ వెళ్దామనివస్తే, (శత్రువుకి వెఱచికాదు) ఆమె పలికిన పలుకులీ పద్యంలో చూడండి.

**"అచ్చపు రాజపుత్రునకు నాలములోన జయంబు గాంచుటో**
**చచ్చుటో పోలుగా కిటుల సాహసమేది కులంబువీతిడిం**
**బుచ్చి యశంబుఁగోలు పడఁ బోలునె చత్తుమటన్న నీతిచేఁ**
**జచ్చు దనంబునన్ సగము సచ్చిన పీనుఁగులౌటయుక్తమే"**

'చిల్లపెంకుల బోరించుజీవగడ్డ'లాంటి రత్నాల్లాంటి వాక్యాలు వాడారు ఆంధ్రమాతకి. మాఱు మాటాడకుండా తిరిగి వెళ్తాడు భర్త. ప్రక్కనుండి ఎవడో ప్రయోగించిన శూలం గుండెలో గుచ్చుకొన్నప్పుడు ఆ వీరుడు మరణించే ముందు ఆంధ్రవీరుల్ని ఉత్తేజపరుస్తూ యుద్ధంలో వీరవిహారం చేసిన తన ఖడ్గాన్ని భార్యకి పంపిస్తాడొక భృత్యునిచేత. అతణ్ణి "అర్గళశ్రీసముదీర్ఘ బాహుడు, విశేష విభాసురమూర్తి" అని వర్ణిస్తాడు కవి. అంతకుముందు "ఎనుబదియేండ్లు నిండెననుటే" ఎఱుగని ప్రభువురామరాజుని (రౌద్రరసమూర్తిని) ఎదుర్కోడానికి గుండె సాలక ప్రక్క వేటునశిరందు నుముతాడొక పాపితురక. ఈ నాలుగు ప్రకరణాల కావ్యం చదివేటప్పుడు, శరీరం గగుర్పొడుస్తుంది. కథాంతంలో ఆ రాకొమారునిసతి భర్తచితిలో దూకుతుంది. "అమృత పాయసమట్టు లా యతివమేని నంతలో నాహరించె హుతాశనుండు" అంటాడుకవి.

**తృష్ణావర్తం :** ఇది ఒక టాల్స్టాయి కథని కేవలం ఆధారంగా చేసుకొని స్వతంత్ర కవిత్వజృంభణంతో వ్రాసిన సందేశాత్మక కృతి. 'దివసలక్ష్మికి వార్ధకమవతరించె' అంటాడొకచోట. ఒక్కరోజులో తాను చుట్టి వచ్చే భూమినంతా దక్కుతుందని అత్యాశతో బయలుదేరిన రైతు"అక్కటా దాపురించె సాయం సమయము" అనుకుంటాడు. ఈ క్రింది పద్యం ఎంత అందంగా ఉందో !

**"వేడివేలుపు నేడేమొ వేగ వేగ**
**నడచిపోవుచునున్నట్టు లెడదఁదోఁచుఁ**
**గాల చక్రంబు బిఱబిఱ గడచిపోవు**
**నేమి మునిగెను దీనికి నీ దినాన"**

ఇది రైతు ఆత్మగతం. చివరికి చీకటిపడితే మరునాడు భిల్లరాజుకి తాను చుట్టి వచ్చిన భూమిపరిమాణంచెబుదామని ఒకచోట ఇంక నడువశక్తిలేక కళ్లు చీకట్లు క్రమ్మగా పడుకుందామనుకున్న రైతు.

**"చిరమనోరథ సిద్ధి చేకుఱు నటన్న**
**కాంక్షలవియెల్ల కలలయి కానుపింప**
**అతిథియాకాపు దీర్ఘనిద్రానురక్తి**
**నందగల్గే నిరంతరానందగరిమ"** అంటాడు కవి.

"How much land does a man need" అనేది టాల్స్టాయి కథ. కవిత్వం దృష్టితో చదవాలి దీన్ని.

**కళాక్షేత్రం :** తన గురువర్యులైన దేవాభక్తుని భద్రయ్యగారికి అంకితంగా వ్రాసినదీకృతి. మధ్యమభాగం బుద్ధచరిత్రం. ప్రథమభాగంలో నాగార్జునకొండనీ అక్కడి శిల్పుల నాటి ప్రతిభని వర్ణిస్తుంది. అది ప్రశంసాఖండం. దానిలోని మొదటి ఖండంలో

**శిలలబదును చేసి మలచిరేయిట్టులు**
**కఱకుటులులఁ దీర్చఁగలిగి రోటు**
**శిల్పవరుల యోగ సిద్ధిబలంబునఁ**
**దలపులెల్ల రూపుదాల్చె గాక"** (ప్రశంసాఖండం 1)

అనే పద్యంలో ఎంత భావుకత కనిపిస్తుందో చెప్పనలవికాదు, అందులోనిదే "ఏమహీమండలాధీశుని సంతతి కాషాయం మిచ్చుట గట్టెకొనెనొ " అనే పద్యం జాషువాగారి శ్మశాన పద్యాల్ని గుర్తుకి తెస్తుంది. ఈ కావ్యంలోని సీసపద్యాలన్నీ ఆణిముత్యాలే. శ్రీనాథుని సీసాల నొక్కొక్కటి తలదన్నేలా ఉంటుంది. బుద్ధుణ్ణి కని చనిపోయే మాయాదేవినిలా వర్ణిస్తాడు కవి.

**"విశ్వసందీపకము జోతి వెలుగుజేసి**
**మూలతేజంబు తను దాన మూరిఁబోయె" అంటాడు.**

బుద్ధుడు తపస్సుచేసి గ్రహించిన నాలుగు సత్యాల్ని మంజరీ ద్విపదలో అద్భుతంగా మలిచారు వేంకటరావుగారు. అవతారఖండం– 1లోని 130నుంచి 144 పద్యాల వరకు (15 పద్యాలు) లోక యాత్రలో తొలుత వారణాసిలో బుద్ధుడు చేసిన ధర్మబోధని తెల్పుతాయి. అది ధర్మపథ శంఖారావమట. చదివిగ్రహించి ఆనందించాలి దాని సారాన్ని. ఈ కృతుల పుస్తకంలో ఇదే పెద్ద కావ్యం.

**కవితావాటిక :** "కొండఱాలంబడి కుములు వాఙ్మయలక్ష్మి కంతః పురావాసమలవరించా"డట నన్నయ. (అంటే శాసనాల్లో) తిక్కనది "ఔచిత్యమేదలని యట్లు సల్లాపముల్ (నాటకీయత) దిద్దితీర్చగజాలు ధీబల" మట. విద్యానగరం ఖండికలోని ఈ క్రింది పద్యం ప్రపంచ విఖ్యాత నగరాల కొక సవాలు.

**సీ॥ ఆంగ్ల సామ్రాజ్య మహావైభవము నాట**
**పట్టగు 'లండను' పట్టణంబు.**
**అంబరచుంబి దీవ్యత్సౌధమాలికా**
**పటలంబు 'న్యూయార్కు' పట్టణంబు**
**నవ్యనాగరికతా నాట్యభంగిమముల**
**పట్టంబు 'ప్యారిసు'పట్టణంబు**
**శార్మణ్యదేశీయ జాతీయ వికసన**
**ఘట్టంబు 'బెర్లిను' పట్టణంబు**

**తే॥ కళలదులకించి జీవంబు లొలుకఁబోసి**
**తెలుగువెలుగుల మూసుకుందివియఁజాలు**
**మహిత లావణ్యశిల్ప సంపదల నీకు**
**సాటియగునోటు? పైడాబు సరియ గాక!"**

'మార్పు' ఖండికలోని ఆఖరిపద్యం ఆంధ్రభాషామతల్లికి ఓదార్పు లాంటిది అది ఇది.

**సీ॥ "అభినవ తిక్కనాఖ్యాకులై సర్వాంధ్ర**
**జనగౌరవంబులఁ దనరువారు.**
**ఆంధ్రతేజమున దీవ్యత్కాంతులంగూర్చి**
**జాతినుజ్జీవింపఁ జాలువారు**
**వీరభారత కథావిరచనంబునఁ గవి**
**బ్రహ్మలై కీరితిఁ బఱగువారు.**
**తన మార్గమునఁ గ్రొత్తఁ దనము నాపాదించి**
**విబుధులకామెతల్ వెట్టువారు**

**తే॥ గద్యమునఁ జిన్నయను బోలఁ గలుగువారు**
**ఘనవిమర్శకాగ్రణులు నైఘంటికులును**
**అగ్రహారంబులకు యోగ్యులైనవారు**
**కల రుపాధ్యాయ పండిత కాండమందు"**

"కవితావాటిక"లోని అన్నిపద్యాలు బాగున్నాయి. 'పటేలు' ఖండికలో ఉన్నది రెండు పద్యాలే అయినా ధ్వని ప్రధానాలు. 'గంగాలహరి' మంచి అనువాదం. 'చారుచర్య'లో క్షేమేంద్రుని శ్లోకాలన్నీ ఎందుకు అనువదించలేదోమఱి! ఒక్కో పద్యం తీసుకుని ఒకటి రెండు పీరియడ్లు పూర్తిగా ఒక పురాణగాథ చెప్పచ్చు ఉపాధ్యాయుడు. ఈ 17 పద్యాలకు ఎన్నుకొన్న దేశీయచ్ఛందస్సు సుకుమారంగా మెత్తగా నడిచింది.

**పేజీలు :** 236, వెల రూ ॥ 150.
**ప్రతులకు :** బోడేపూడి చిరంజీవిరావు, 6, కల్యాణి అపార్ట్‌మెంట్, 4వ లైను, ఆర్.టి.సి. కాలనీ, విజయవాడ–520 008. సెల్. నెం. 9912029686.

**– 'అభినవ సూరన' గాడేపల్లి సీతారామమూర్తి**
**(బి.ఎ., ఎల్ఎల్.బి., రిటైర్డ్ సబ్ జడ్జి, అద్దంకి.)**


## సి.పి. బ్రౌన్ అకాడమి కొత్త ప్రచురణలు

**దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి** రూ ॥ 95
– డా॥ నిడమర్తి నిర్మలాదేవి
**కొప్పరపు సోదర కవులు** రూ ॥ 95
– డా॥ రాపాక ఏకాంబరాచార్యులు
**జంధ్యాల పాపయ్యశాస్త్రి (కరుణశ్రీ)** రూ ॥ 95
– తేళ్ల సత్యవతి


## గమనిక

**సమీక్ష కోసం పుస్తకాలు పంపించేవారు రెండు ప్రతులు మా కార్యాలయానికి పంపించగలరు.**


**చిరునామా: సి.పి. బ్రౌన్ అకాడమి 53, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్ – 500 082.**
Phone No. 040-23423188, 23430448-50

# స్వీకారం




## హృదయ జలధి (వచన కవితా సంపుటి)

**- డా॥ తుమ్మనపల్లి లక్ష్మీనారాయణ - రఘువర్మ**

**పేజీలు :** 60, వెల రూ॥ 35.

**ప్రతులకు :** నవోదయ బుక్‌హౌస్, ఆర్యసమాజ్ మందిర్ ఎదురుగా, కాచీగూడ × రోడ్, హైదరాబాద్ - 500027.



## ఎగిరే పావురాలు (నానీలు)

**- సి. కామేశ్వరరావు**

**పేజీలు :** 60, వెల రూ॥ 30.

**ప్రతులకు :** పి. విజయసింహ, ఇంటినెం. 98, డోర్ నెం.1-32-10, ఆదర్శనగర్, పెదవాల్తేర్, విశాఖపట్నం-530017 & సి. కామేశ్వరరావు, కళ్యాణి సదనం, డోర్ నెం. 13-3-23, తిలక్‌నగర్, కాశీబుగ్గ, శ్రీకాకుళం-532 222.




## అడివి పాడింది (చిన్నచిన్న కథల సంపుటి)

**- దీవి సుబ్బారావు**

**పేజీలు :**106, వెల రూ॥ 60.

**ప్రతులకు :** దీవి సుబ్బారావు, ఫ్లాట్ నెం. 143, రోడ్ నెం. 8, వాసవికాలనీ హైదరాబాద్-500 035 (ఫోన్: 040-24035238) & అన్ని ప్రసిద్ధ పుస్తకాల దుకాణాలలో.




## జీవనది (ఖండకావ్య సంపుటి)

**- మల్లవరపు రాజేశ్వరరావు**

**పేజీలు :** 158, వెల : రూ॥ 80.

**ప్రతులకు :** ఎమ్.ప్రభాకరరావు, 6-32, శ్రీనగర్‌కాలనీ, 1లేన్, నార్త్ బైపాస్‌రోడ్, ఒంగోలు-523 002. (ఫోన్ : 08592-221537) ఎన్. విజయభాస్కర్, సర్వోదయకాలనీ, వేటపాలెం-523187, ప్రకాశం జిల్లా. (సెల్ నెం. 9347305437) & అన్ని ప్రసిద్ధమైన పుస్తక దుకాణాలలో.



## నీకూ నాకూ మధ్య ఒక రంగులనది

**(కవితా సంపుటి)**

**- దేవరాజు మహారాజు**

**పేజీలు :** 200, వెల రూ॥ 160.

**ప్రతులకు :** విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్ మరియు వారి అన్ని శాఖలలోనూ, నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్-500 027.

## మార్కెట్ స్మార్ట్ శ్రీమతి




**- అనిశెట్టి రజిత**

**పేజీలు :** 30, వెల రూ॥ 30.

**ప్రతులకు :** అనిశెట్టి రజిత, డోర్ నెం. 3-12-60, కుమారపల్లి, హన్మకొండ (మొబైల్ 9849482462), నవోదయ బుక్‌హౌస్, దిశపుస్తక కేంద్రం, నవయుగ బుక్‌హౌస్, దిశపుస్తక కేంద్రం, నవయుగ బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్, తెలుగు బుక్‌హౌస్, వారి వారి అన్ని శాఖలలోనూ.




## విరిసిన మల్లెలు (మల్లెమాల కథలు-3)

**- డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి**

**పేజీలు :**125, వెల రూ॥ 60.

**ప్రతులకు :** డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి, సింహపురి కాలనీ, రోడ్ నెం.3, కడప -516002 (ఫోన్:08562-244546, 252515), విశాలాంధ్ర పబ్లిషర్స్, హైదరాబాద్. నవోదయ పబ్లిషర్స్, హైదరాబాద్.

## నీడల జాడలు (కథలు)



**- ఐతాచంద్రయ్య**

**పేజీలు :**198, వెల రూ॥ 140, విదేశాల్లో 20;

**ప్రతులకు:** ఐతాచంద్రయ్య, ఇంటి నెం. 4-4-12, షేరెపుర, సిద్ధిపేట్-502103 (ఫోన్ నెం. 9391205299); విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, 4-1-435, బ్యాంక్‌స్ట్రీట్, హైదరాబాద్, సాహిత్య నికేతన్, 3-4-852; బర్కత్‌పుర, హైదరాబాద్-500 001; నవయుగ బుక్‌హౌస్, ఆర్యసమాజ్ మందిర్ ఎదురుగా, కాచిగూడ, హైదరాబాద్-500 096.

## శ్రీవాసవాంబ (పురాణేతిహాసిక నవల)

**- ఐతాచంద్రయ్య**

**పేజీలు :** 254, వెల రూ॥ 200.



**ప్రతులకు:** ఐతాచంద్రయ్య, ఇంటి నెం. 4-4-12, షేరెపుర, సిద్ధిపేట్-502103 (ఫోన్ నెం. 9391205299); విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435, బ్యాంక్‌స్ట్రీట్, హైదరాబాద్, సాహిత్య నికేతన్, 13-4-852; బర్కత్‌పుర, హైదరాబాద్-500001; నవయుగ బుక్‌హౌస్, ఆర్యసమాజ్ మందిర్ ఎదురుగా, కాచిగూడ, హైదరాబాద్-500 096.

# పుంభావ సరస్వతికి సరిజోతలు



వేటూరి వారి సాహిత్యము
అది ఒక ఝరీ ప్రవాహము
అమర సాహితీ సుమసౌరభ సన్నిభము
అమల కవిత్వ తత్వ తంతుర్వము
విమల నాదోంకార సమానీతము
కృతి విధానమున శ్రుతి సమానము

అరుదైన ఆ శైలి హిమశైల శిఖరాల
సురదీర్ఘికా క్రమ జల దూర్మికా కేళి

ఆ కవన మాలికలు నాక వన వాటికలు
ఆ మధుర భావాలు ఆర్ద్రతల జీవాలు
ఆ భావ గమనాలు ఆద్యంత మధురాలు
రంభోర్వశీ నాట్య గ్రంథాల గంధాలు

శ్రీ పార్వతీ దేవి లాస్యాల పలికేటి
మంజీర నాదాల మృదు మధుర వేదాలు

నీలాల గగనాల వెలిగేటి నెలరేని
తుహిన కర నికరాల తోగి వికసించేటి
కలువ గమి గమకాలు
ఉదయించు రవి కిరణ రాగాలతో విచ్చి
బిట్టలరి మురిసేటి తామరస పుష్పాల
తారాడు తమకాలు

శ్రావణమ్మె వరలు గగన వీధుల లోన
జీమూత సంఘాత సారాలు సరసాలు

భక్తి భావ ప్రణవ ప్రౌఢిమల చాటేటి
నవ్యమౌ నమకాలు
అనురాగ యోగాల వివరాల ప్రవచించు
రసరమ్య చమకాలు

ఆద్యంత రహితుడౌ నెలతాల్పు నిద్రలో
కలయైన గిరిపుత్రి తలపైన గంగోత్రి
కలిసి పులకల పేర్మి చాటి చెప్పిన కూర్మి
కొంగు బంగారాలు
విష్ణు పాదము కొలిచి వివిధ లీలల తరచి
మదిని ప్రేమను పరచి కూచి వలపుల తోటి
ఊసులాడగ తోచి విభుని చెవిలో పలుకు
చిలిపి సింగారాలు

సృష్టి జరిపే బ్రహ్మ రాతలో రహస్యం
చేతలో సమస్తం తెలిసి సంతోషాలు
విరిసి తా గీర్వాణి విమల వీణా తంత్రి
మీటే విలాసాలు

తే॥ నన్నపార్యుని కవనాల నయలు కలిగి
నన్నెచోడుని కావ్యాల వన్నె వెలిగి
తిక్కనామాత్యు పద్యాల తీరు తెలిసి
నాటి నాచనసోమన నీటు నెగడి

తే॥ మహిత పోతనామాత్యుని మహిమ మలగి
త్యాగరాజ కృతుల భక్తియోగ మమరి
సరస శ్రీనాథ కవిరాజు వరుస విరిసి
అష్టదిగ్గజాల కృతి విశిష్ట గతుల

ఆ॥ వెలుగుతోడ మలయు వేవేల వేటూరి
పాటలన్న మాట వాస్తవమ్ము
జీవనదుల వంటి భావబంధములను
చాటిచెప్పు కవిదె పాటవమ్ము .....

శ్రీ వేటూరి వేంకట సుందర రామమూర్తి గారూ!
మీ కివే మా వందనాలు
మము వీడని వసివాడని
జ్ఞాపకాల హరిచందనాలు

- కొంపెల్ల వెంకట్రావు
సెల్ నెం.9440604333

## స్వీకారం




### భీమశతకం

- ఆచార్య వి.యల్.యస్. భీమశంకరం

**పేజీలు** :30, వెల రూ॥ 30.

**ప్రతులకు** : వి.యల్.యస్. విజ్ఞాన సారస్వత పీఠం, తార్నాకాహౌస్, 12-13-75 4వవీధి, తార్నాకా, హైదరాబాద్ - 500017 (9849563500) & విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435 బ్యాంక్‌స్ట్రీట్, హైదరాబాద్. నవోదయ బుక్‌హౌస్, ఆర్యసమాజ్ ఎదుటివీధి, కాచిగూడ, హైదరాబాద్-500 027.




### ఆత్మీయ కవితా కదంబం

- ఆచార్య వి.యల్.యస్. భీమశంకరం

**పేజీలు** : 98, వెల రూ॥150.

**ప్రతులకు** : వి.యల్.యస్. విజ్ఞాన సారస్వత పీఠం, తార్నాకాహౌస్, 12-13-75 4వ వీధి, తార్నాకా, హైదరాబాద్-500 017 (9849563500) & విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435 బ్యాంక్‌స్ట్రీట్, హైదరాబాద్. నవోదయ బుక్‌హౌస్, ఆర్యసమాజ్ ఎదుటివీధి, కాచిగూడ, హైదరాబాద్-500 027.

❖ పద్య స్రవంతి

# వానతల్లికి స్వాగతం

**బహుమతి పొందిన పద్యాలు**

### ❖ డా॥ ఎన్. సురేంద్ర (ఎలనాగ)

సెల్ నెం. 9866945424.

స్వాగతమమ్మ పూర్ణ ఫలసాయమొసంగెడి వర్షలక్ష్మి ! నీ
వేగద మాకు దిక్కు, అతివేల నిదాఘ కృశార్తి నుండి మే
మేగతి ఊఅటన్ గొనుట ఈ జగమందున యన్న భీతితోన్
వేగు అభాగ్యులందరికి వేగమె సాంత్వన గూర్పుమా కృపన్

* * *

### ❖ డా॥ అయాచితం నటేశ్వరశర్మ

సెల్ నెం. 9440468557

స్వాగతమమ్మ ! నీ చినుకుజల్లులకెప్పుడు, నీ ముదంబులే
వేగెడి మానవాళికతివేగముగా కుశలంబులౌను, నీ
దాగుడు మూతలీ ధరణి దాహముదీర్పవుగాన, నీ కృపా
భాగము మాకొసంగి నవ పల్లవసంతతి పెంపు నింపుమా!

* * *

### ❖ డా॥ గుమ్మా సాంబశివరావు

సెల్ నెం. 9849265025.

కప్పుల పెళ్లిళ్ల కావిళ్లు మోయుచు
చిన్నారి పిల్లలు చిందులేసె
బొడ్రాయి దగ్గర బోనాలు పెట్టుచు
కొమ్మలు నీరాక కోరుచుండె
అత్యంత దీక్షతో యాగముల్ చేయుచు
నినుcజూడ తపియించె నిగమవిదులు
ఏరువాకను సాగనెప్పుడెప్పుడనుచు
కరములు మోడ్చిరి కర్షకాళి

నీరులేనిజగము నిప్పులగనియయ్యె
నీవు లేక బ్రతుక నేర్వనగునె?
అమ్మ! వానతల్లి! అవనిజనులకెల్ల
సంతసమ్ము గూర్ప సాగిరమ్ము

* * *

### ❖ దుబ్బాకుల కృష్ణస్వామి

సెల్ నెం. 9849377540

సీ॥ నింగిపైనను నీదు నీలిమబ్బుల జూచి
నయనమొప్ప నెమలి నాట్యమాడు
రంగుల హరివిల్లు నింగినేలను తాక
అందాలు వర్ణించ అజుని తరమె?
ఆకాశమందున అలరారు మేఘాలె
అందాలు చిందును అద్భుతముగ
ఉదయ సంధ్యావేళ ముదమొప్పగా రంగు
రంగుల చిత్రాలు వ్రాతు వీవు

* * *

### ❖ వై. మధుసూదన్

సెల్ నెం.9441682894

సీ॥ ఓ తల్లీ మాపైన నొకమారు దయజూపి
కురిసిపోవమ్మ! చినుకుల పడంతి!
వినువీధిపై నుండి వెడలి శీతాంబువుల్
చల్లవే! మాపైన జలదరమణి!
ధరణిపై యుష్ణోగ్రతాపమార్పగ రావె
చల్లని మా వానజల్లులమ్మ!
కర్షకుల్ మదిలోన హర్షముల్ బ్రకటింప
వర్షమై రావమ్మ వానతల్లి!

ఆ॥ నిఖిల జీవతతికి నీవాన చినుకులే
సాకి సంతరించు చన్నుబాలు
నింపుమీ జగతిని నీ కృపామృత వృష్టి
చాలు నదియె మాకు సంతసాలు

* * *

### ❖ దోరవేటి, సెల్ నెం. 9866251679.

ప్రభలు మెరుంగు జోతులయి, భవ్య సుశబ్దపు మేఘ గర్జనల్
శుభములు బల్కుచుండగ నుషోదయముల్, హయముల్యనంగ నా
యిభముల బోలు జీమూతము లెక్కి, వియచ్చరలెల్ల జూడగా
నభమును జీల్చి వచ్చు కరుణామయి! నీకిదె స్వాగతాంజలుల్!

## ❖ డా॥ వీరా సూర్యనారాయణ

ఫోన్ నెం. 040-65947015.

ఉ॥ స్వాగతమమ్మ! రాగమయి! ప్రావృడలక్ష్మి! యిలాతలమ్ములో
వేగమ కాలుమోపి పృథివీజనతా ఘనతాపహారివై
సాగుచు కుంభవృష్టులను సంతస మొప్పగ సంతరించి, బల్
బాగుగ దండి సస్యముల పండగజేయుము నిండు కూర్మితోన్.

ఉ॥ గ్రామములందు కర్షకులు కప్పల దెచ్చి వివాహవేడుకల్
నీమము తోడ నెంతొ రమణీయముగా జరిపించి భక్తితో
క్షామనివారణార్థ మతి గారవ మొప్పగ స్వాగతించి నిన్
గోముగ బిల్చినారు కద! కూరిమి మీఱ వరాల తల్లిగా
ప్రేమనిధానమా! తరలి వేగమ రాగదె! వానతల్లిరో !

* * *

## ❖ ఎరుకలపూడి గోపీనాథరావు

సెల్ నెం. 9848293119

సీ॥ సూర్యార్చనకునేవి శుభ్రతోయార్పణల్?
పద్మాసనకునేది పద్మసరసి?
గరళకంఠునికేది గంగాభిషేకమ్ము?
గరుడవాహనుకేది గంధజలము?
'కమల' భావముదోచు కమలాలయములేవి?
అతిథిదేవునికీయనంబు ఏది?
పాతాళ సలిలముల్ మాతాపమార్పవే?
ఆకాశగంగమమ్మాదుకోదే?

తే॥గీ॥ వెతలు భూలోకమంతటన్ విస్తరించె,
స్వీయనాశమ్ముకున్ నరుల్ సిద్ధమౌచు
విశ్వసంహారకాములై విఱ్ఱవీగె
వేగరావమ్మ వర్షమా! వేగలేము.

* * *

## ❖ కె.వి. శేషకుమార్

చిరునామా : 18-3-56ఎఫ్, శాంతినగర్, ఖాదీకాలనీ, తిరుపతి-517507

అటునిటు నూగువేణియది అచ్చముగా కరిమబ్బుగాగ, పా-
పిటగల బిళ్ళ దండయది వెల్గులు జిందు తటిల్లతైజనన్
దిటవగు అందెసందడులు దిగ్గున మ్రోగెడు మేఘ గర్జనై
ఇటదిగి యాడవే జనుల కింపగు నాట్యము వర్షసుందరీ!

* * *

## ❖ బి.హెచ్. కృష్ణారావు

సెల్ నెం. 9441578290.

తొలకరి జల్లు భూమిపయి త్రుళ్లిన దౌ అమృతంపు ధారలై
నిలువగజూచి కర్షకులు నిండుమనంబున సంతసించగా
పలుగులు పార లన్నిటిని బట్టి పొలమ్ముల సాగు చేయగా
నిలపయి ధాన్యరాశులికనిండు నటంచు మదిందలంచరే !

* * *

## ❖ కోగంటి వీరరాఘవాచార్యులు

సెల్ నెం. 9247837278

సీ॥ తొలిజల్లు భూమిపై చిలకరించినయంత
కుంభినీగంధంబు గుప్పు మనియె;
భూగంధమింపుగాఁబూని కరీంద్రులు
కరములనెత్తి ఘీంకారమిడిరి;
చల్లని చిఱుగాలి కుల్లముల్ రంజిల్ల
జీవరాసియుసుంత సేద దీరె;
చూలింతకొకవింత చోద్యమ్మెసంగగా
ధాత్రిగంధము పీల్చి తనివి నందె;

తే॥గీ॥ ఎండలకు నోళ్ళు తెరచి తానుండి చినుకు
రాల, నొడిసి త్రావ వరాలగుటక
గాగనుతిమె, తటిల్లత కనులలోని
తేలు నవ్వగ భూదేవి తీరు దోప

* * *

## ❖ కలవకొలను సూర్యనారాయణ

చిరునామా : ఫ్లాట్ నెం. 202, మోహన్ రెసిడెన్సీ, 2వ లైను, శ్యామలానగర్, గుంటూరు-6

చిన్నతనంబునన్ జనని స్వీయ తనూభవులన్ ముదంబుతో
మన్ననజేర్చి యంకమున, మాధ్విని మించెడి స్థన్యమిచ్చి, ఆ
కొన్నభుజింపనన్నమిడి, క్రోల జలమ్ములాది కూర్చు టె
ట్లన్న, ధరామ తల్లి కృపామృత వృష్టియె మూలమయ్యెడున్.

●

## రసజ్ఞ హృదయవర్తి-శ్రీ చిలకమర్తి

**జననం : 1867** **మరణం : 1946**

ఎవరు ఏ విషయంపై పద్యాలను చెప్పమన్నను శ్రీ చిలకమర్తి అవలీలగా-అనాయాసంగా-అతిరసభరితంగా, పద్యాలను చెప్పేవారు. అది చెప్పడం కాదు-గుప్పించడమే.

ఒకసారి తమాషాగా, వినోదం కోసం కొందరు మిత్రులు శ్రీ చిలకమర్తి **"పకోడీ"**లపై పద్యాలు చెప్పండి. పద్యానికో పకోడి ఇస్తాం అన్నారట. వెంటనే అప్పటికప్పుడే మన చిలకమర్తి పకోడీలపై-పకోడీల వంటి చక్కని, చిక్కని పద్యాలు చెప్పారట. ఆ పద్యాలలో మచ్చుకు కొన్ని ఉదాహరణలు :

- కోడిని దినుటకు సెలవున్
  వేడిరిమున్ను బ్రాహ్మణుల వేదనతండున్
  కోడి వలదాబదులు "ప
  కోడిం" దినుమనుచు జెప్పె కూర్మిపకోడీ!!

- వనితల పలుకుల యందున
  అనిమిషలోకముననున్న నమృతమటంచున్
  జనుల నుటిగాని లేదట
  కనుగొననీయందమృతు కలదు పకోడీ !!

- ఆ కమ్మదనము నారుచి
  యా కరకరయా ఘుమఘుమయాపోయ కములా
  రాకలు పోకలు వడుపులు
  నీ కేదగునెందు లేదు నిజము పకోడీ !!

- నీ కర కర నాదంబులు
  మాకర్ణామృతములు నీదుమహితా కృతయే
  మా కనుల చందమామగ
  నే కొనియాడెదను సుమ్ము నిన్ను పకోడీ !!

శ్రీ చిలకమర్తిని కదిలిస్తే చాలు గద్యం-పలికిస్తే చాలు పద్యం వచ్చేవట. నవలను రచించటంలో-నాటకానికి కర్తృత్వం- వహించటంలో- ప్రహసనాన్ని కూర్చటంలో సిద్ధహస్తుడైన- శ్రీలక్ష్మీనరసింహం పంతులుగారికి 1943లో కళాప్రపూర్ణ బిరుదాన్నిచ్చి సముచితంగా సత్కరించారు. వీరి, స్వీయచరిత్ర-ఆంధ్రకవుల చరిత్ర-ఆంధ్రదేశచరిత్ర నేడు పరిశోధన గ్రంథాలుగా, చిరస్థాయిగా నిలిచాయనటంలో ఏ మాత్రం అతిశయోక్తిలేదు.

❖ మల్లాది నరసింహమూర్తి
సెల్ నెం. 9533099534.

# చందా కూపన్

**పేరు : శ్రీ/ శ్రీమతి ........................................................................................**

**పత్రిక పంపవలసిన చిరునామా ..........................................................................**

**...............................................................................................................**

**టెలిఫోన్ : (కార్యాలయం) : ............................(ఇల్లు) : ............... ఇ-మెయిల్ : ................................**

**'సాహితీస్రవంతి' పత్రిక గురించి మీకు ఎలా తెలుసు?**

**...............................................................................................................**

**...............................................................................................................**

**...............................................................................................................**

**చందా పంపే విధానం : చెక్/ డిడి/ మనియార్డర్ రూపంలో సి.పి. బ్రౌన్ అకాడమి, హైదరాబాద్ పేరు మీద పంపగలరు.**

**చందా చెల్లించిన వివరాలు : చెక్/ డిడి/ఎం.ఓ. నెం ..........................................................**

**బ్యాంక్/ శాఖ : ...................................................... తేదీ : ..........................................**

**జతపరచడమైనది.**

**(జిరాక్స్ కాపీ వాడవచ్చు)** **(సంతకం)**

## సి.పి. బ్రౌన్ అకాడమి

**53, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్ - 500 082. ఫోన్ : 040-23423188, 23430448-50**
**ఫాక్స్ :23430447. , ఇ-మెయిల్ :info@cpbrownacademy.org వెబ్‌సైట్ : www.cpbrownacademy.org**

# సి.పి.బ్రౌన్ అకాడమి ప్రచురణలు

**బాలశిక్షణ సామగ్రి- I**
**(రోమన్ లిపిలో)**

రోమన్ లిపిలో తెలుగు నేర్చుకొనే సౌకర్యం. ఎన్.ఆర్.ఐ. పిల్లల కోసం, ఇంగ్లీష్ మీడియంలో చదువుకునేవారి కోసం ప్రత్యేక సదుపాయం.

| | | వెల / రూ॥ |
|---|---|---|
| 1. | వర్ణమాల – అక్షరమాల పరిచయం | |
| 2. | వర్ణమాల – అభ్యాసపుస్తకం | |
| 3. | శబ్దమాల – రకరకాల పదముల పట్టిక | |
| 4. | వాక్యనిర్మాణం – వాక్యం రాయడం–వివరణ | |
| 5. | తెలుగులో మాట్లాడుకుందాం–చిన్న చిన్న సంభాషణలు | |
| 6. | వేమన శతకం – తాత్పర్యం | |
| 7. | సుమతీ శతకం – తాత్పర్యం | |
| 8. | సామెతలు | |
| | **సెట్ (8 పుస్తకాలు+సిడి)** | 495 |
| | **విడి పుస్తకం ధర** | 60 |

**జీవిత చరిత్రలు:**

| | | |
|---|---|---|
| 1. | అడుసుమల్లి శ్రీనివాసరావు – డా॥ వెలగా వెంకటప్పయ్య. | 95 |
| 2. | దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ – శ్రీమతి ఇంద్రగంటి జానకీబాల. | 90 |
| 3. | వావిళ్ళ రామస్వామి శాస్త్రి – శ్రీ వజ్ఝల వేంకట సుబ్రహ్మణ్యశర్మ | 90 |
| 4. | పద్మశ్రీ షేక్‌నాజర్ – డా॥ కందిమళ్ల సాంబశివరావు | 90 |
| 5. | గుఱ్ఱం జాషువా – డా॥ కొలకలూరి మధుజ్యోతి | 90 |
| 6. | రాయప్రోలు సుబ్బారావు : ఎమ్. లావణ్య సరస్వతి. | 95 |
| 7. | దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి : డా॥ నిడమర్తి నిర్మలాదేవి. | 95 |
| 8. | కొప్పరపు సోదర కవులు : డా॥ రాపాక ఏకాంబరాచార్యులు | 95 |
| 9. | కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి : తేళ్ల సత్యవతి | 95 |

**ముద్రణలో**

1. వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం–చింతలూరు
2. పాలగుమ్మి విశ్వనాథం

**ప్రబంధ రత్నావళి:**

| | | |
|---|---|---|
| 1. | మనుసంభవం (పరిచయం) (ఆంగ్లం) – ఆచార్య ఎస్.ఎస్. ప్రభాకర రావు. | 120 |
| 2. | ఆముక్త మాల్యద (పరిచయం) – శ్రీ మల్లాది హనుమంతరావు. | 95 |
| 3. | వసుచరిత్రము (పరిచయం) – డా॥ కిళాంబి జ్యోతిర్మయి | 95 |

**ఇతరములు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగు పరిశోధన వ్యాసమంజరి – సం॥ డా॥ వెలుదండ నిత్యానందరావు. | 175 |
| 2. | సి.పి. బ్రౌన్ అకాడమి బహుమతి కథలు – 2008. | 150 |
| 3. | సి.పి. బ్రౌన్ అకాడమి బహుమతి కథలు – 2009 | |

◆ ఈ ప్రచురణలన్నీ ప్రముఖ పుస్తకాల షాపుల్లో దొరుకుతాయి. ఎంఓ/డిడి ద్వారా అకాడమి నుంచి పొందవచ్చు. పోస్టేజి అదనం.

**ప్రతులకు**
**సి.పి. బ్రౌన్ అకాడమి**
**53, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్ – 500 082.**
Phone No. 040-23423188, 23430448-50 email : info@cpbrownacademy.org
URL : www.cpbrownacademy.org

C.P. Brown ACADEMY

పద్యం మీద తెలుగు వారికి గుత్తాధిపత్యం వుంది. ఛందో బందో బస్తుల వల్ల వ్యర్థపదాలుంటాయని కొందరు ఆరోపిస్తారు. కండపుష్టి పద గుంఫనలతో పద్యాలు అల్లడం ఒక ప్రజ్ఞ. ఆప్తత క్లుప్తత గుప్తత సమపాళ్లలో వున్నపుడే కవిత అందగిస్తుంది.

త్యాగరాజులాంటి మహానుభావులు తమ కృతులను రాగరంజితం చేశారు. స్వరబద్ధం చేసి కీర్తనలను నిర్దిష్టమైన బాణీలలో నిక్షిప్తం చేశారు. అలాగే మన పూర్వపండితులు పద్యాలకు శాస్త్రీయ మైన నడకలు నేర్పారు. సందర్భోచితంగా శార్దూల మత్తేభాలను, సీసాలను ఎత్తు గీతులను, కందాలను, మధ్యాక్కరలను, చంపక, ఉత్పలమాలలను అల్లమని సూచించారు. వేమన ఆటవెలదికి అమరత్వం ప్రసాదించాడు. పద్యం తెలుగుజాతి సిరి. దానిని మనం పదిలపరుచుకుందాం.



# పద్య రచన పోటీ

## సమస్యాపూరణం

తెలుగువారి సిరి పద్యం. ఇతిహాస ప్రబంధాలు, కావ్యాలు, శతకాలు చాటువులు యిలా వివిధ ప్రక్రియలను వెయ్యేళ్ళు తెలుగు సాహిత్యాన్ని పద్యం పరిపాలించింది. గడచిన యాభై ఏళ్లలో "కట్టుబాట్లు మాకేల" అంటూ ఫ్రీవెర్స్‌పై కవులు మొగ్గు చూపడం మొదలుపెట్టారు. అయినా పద్యం తెరమరుగు కాలేదు. "జెండాపై కపిరాజు..." యింకా జనం నాల్కలపై నాట్యమాడుతోంది.

తెలుగునాట అందంగా పద్యం రాయగల కవులెందరెందరో ఉన్నా సరైన వేదిక లేదు. పద్యనాటకాల ప్రదర్శనలూ అంతంతమాత్రమే. ఈ పరిస్థితిలో పద్యరచనా ప్రక్రియను ప్రోత్సహించడానికై సి.పి. బ్రౌన్ అకాడమి తెలుగుపద్యానికి పట్టం కట్టాలని సంకల్పించింది. అందుకే 'సాహితీస్రవంతి' ద్వారా పద్యరచన పోటీ నిర్వహిస్తూంది.

ఇప్పటిదాకా తరుణానికి తగిన అంశాల మీద పద్యాలు కోరాం. మీరు అద్భుతంగా ఆయా అంశాలపై చక్కని పద్యాలు అందించి మా ప్రయత్నాన్ని సఫలం చేశారు. ఇప్పుడు చిన్న మార్పు చేస్తున్నాం. మన అవధాన ప్రక్రియలో ఒక అంశం సమస్యాపూరణం. మీ సమర్థత మాకు తెలుసు. ఈ సంచిక నుంచి కొన్ని సమస్యాపూరణలకు మీ పూరింపులని ఆహ్వానిస్తున్నాం. మా ప్రయత్నాన్ని మునుపటి వలెనే ఆదరించండి.

**సమస్య : దున్నకుదూడ పుట్టినది దుగ్ధము పిండగ దుత్తతెమ్మికన్.**

అర్థాంతరీకరణం, పదాంతరి అయినా సరే. మీ చిత్తం. సామాన్య సందర్భానికి ఒకటి, భారతార్థంలో మరొకటి పంపాలని మనవి. పద్యాలు **ఆగస్టు 31, 2010** తేదీలోపులో అందాలి.

**పద్యాలు పంపవలసిన చిరునామా :**

"పద్యరచన పోటీ" సి.పి. బ్రౌన్ అకాడమి, 53, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్-500 082. ఫోన్ : 040-23423188

ఇ-మెయిల్ : **info@cpbrownacademy.org**

వెబ్‌సైట్ : **www.cpbrownacademy.org**

# తెలుగులో పరిశోధన

సి.పి. బ్రౌన్ అకాడమి (హైదరాబాద్) వివిధ విశ్వవిద్యాలయాలలో తెలుగు భాషా సాహిత్య విషయాల్లో 2005-07 & 2008లో పిహెచ్.డి. పట్టాపొందిన పరిశోధన వ్యాసాల సంగ్రహ సంకలన సంచికలను ప్రచురించే ప్రయత్నంలోఉంది. ఈ ప్రయత్నం తెలుగులో పరిశోధన పట్ల ఆసక్తిని కలిగించటానికి, పరిశోధనాంశాల ఎంపికకు సహాయపడుతుందని అకాడమి ఉద్దేశం. ఇప్పటివరకు అందుకున్న 61 (2005-07) పరిశోధన సంగ్రహ వ్యాసాలతో మొదటి సంకలనం ముద్రించబడింది. సంచికలో ప్రచురించబడిన సారాంశాలను అందించిన పరిశోధకులకు రూ. 500 పారితోషికం ఇవ్వబడుతుంది. 2005-07లో పిహెచ్.డి. పొంది మాకు పంపించనివీ, అంతేకాక 2008లో పిహెచ్.డి. పొందిన పరిశోధన వ్యాసాలూ మాకు వెంటనే పంపించగలరు. ప్రచురింపబడిన పరిశోధన సంగ్రహాలలో, పది ఉత్తమ పరిశోధనలను సి.పి. బ్రౌన్ అకాడమి వారు నియమించే నిపుణులసంఘం ఎంపిక చేస్తుంది. ఆయా పరిశోధకుల నుండి ఆ పది పరిశోధన గ్రంథాల (థీసిస్‌ల) పూర్తి పాఠాలను తెప్పించి, వాటిలో ఒక ఉత్తమ పరిశోధన గ్రంథమును నిపుణుల సంఘం ఎంపిక చేస్తుంది. ఎంపికయిన ఉత్తమ పరిశోధన గ్రంథానికి (థీసిస్‌కి) ఒక బంగారు పతకం బహుమతిగా ఇవ్వటంతో పాటు ఆ పరిశోధన గ్రంథాన్ని పుస్తకంగా ముద్రించే ఏర్పాటును కూడా చేస్తుంది.

**పరిశోధన సారాంశాలను పంపించవలసిన చిరునామా**




సి.పి. బ్రౌన్ అకాడమి, 53, నాగార్జున హిల్స్, పంజగుట్ట,
హైదరాబాద్- 500082.
ఫోన్: 040-23423188 Fax : 23430447
ఇ-మెయిల్ : info@cpbrownacademy.org
వెబ్‌సైట్: www.cpbrownacademy.org